

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

నిప్పుల గుండం

వడగాడ్పుల గుప్పిట రాష్ట్రం.. అప్పుడే 44 డిగ్రీలు

రాష్ట్రమంతటా పెరిగిన వడగాలుల తీవ్రత

30 ఏళ్ల సగటుతో పోల్చితే ఎక్కువగా నమోదు

గతంలో వడగాడ్పుల సగటు 6-7 రోజులు

ఈ సీజన్‌లో నెలకు 10-12 రోజులుగా అంచనా

కొత్తగా విపత్తు విశ్లేషణకు ఐఎండీ నిర్ణయం 12

శుక్రవారం | 5-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 351 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి ఉ. 1.30 తదుపరి ద్వాదశి; నక్షత్రం: ధనిష్ఠ సా. 6.08 తదుపరి శతభిషం; వర్జ్యం: రా. 12.35-2.01; దుర్ముహూర్తం: ఉ. 8.38-9.27, మ. 12.43-1.32; అమృతఘడియలు: ఉ. 8.38-10.05; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.11; సూర్యాస్తమయం: 6.26 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





తూర్పు గోదావరి జిల్లా నల్లజర్లలో జరిగిన సభకు హాజరైన జనం

వైసీపీ డీఎన్ఏలోనే

శవ రాజకీయం

ఓటు వేయొద్దని చెల్లెలే చెబుతోంది

188 మంది దళితులను చంపారు

నాలుగున్నరేళ్లలో 6 వేల కేసులు పెట్టారు

నా ఎస్సీలంటూ వారి గొంతుకోస్తున్నాడు

ప్రతి ఇంట్లోనూ, ప్రతి ఊర్లోనూ చర్చ జరగాలి

32 మంది పింఛనుదారులను చంపేశాడు

పోలీసులు కేసులు పెట్టి లోపలేయాలి

వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తా

పండుటాకులకు పెద్ద కొడుకులా ఉంటా

గెలిచిన మొదటి నెల నుంచే 4 వేల పింఛన్

ఫ్యాన్‌ను డస్ట్‌బిన్‌లో పడేయండి

కొవ్వూరు, నల్లజర్ల ప్రజాగళంలో బాబు పిలుపు

జగన్ మళ్లీ అదే మొదలు పెట్టాడు

అందుకే శవాన్ని చూసినా నవ్వుతాడు

అలాంటివారు మనకు కావాలా?

ఎన్నికల్లో వలంటీర్ల జోక్యం వద్దని ఎన్నికల కమిషన్ చెప్పింది. అప్పటి నుంచి జగన్ మళ్లీ శవ రాజకీయం మొదలుపెట్టాడు. ముసలివారిని చంపేయాలని కక్షకట్టాడు. పండుటాకులు వంటి ముసలివారికి పెద్దకొడుకులా ఉంటాను. గెలిచిన వెంటనే నెలకు రూ.4 వేలు పింఛను ఇస్తాను. ఇంటింటికీ పంపిస్తాను.

- చంద్రబాబు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ డీఎన్ఏలోనే శవ రాజకీయం ఉందని, వాళ్ల వారసత్వమే శవ రాజకీయమని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు విమర్శించారు. 2024లో జగన్ మళ్లీ శవ రాజకీయం మొదలు పెట్టాడని, వైసీపీ శవాల కోసం వెతుకుతోందని దుయ్యబట్టారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, నల్లజర్లలో గురువారం నిర్వహించిన ప్రజాగళం సభలో అశేష జనాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 'జగన్‌రెడ్డిది శవరాజకీయం. ఎవరైనా మంచి పనిచేసి నాకు ఓటేయమని అడుగుతారు. కొంతమంది మనుషులను చంపేసి ఎదుటివాళ్ల పైకి నెట్టి ఓటు వేయమని అడుగుతారు. జగన్ తండ్రి హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయాడు. కానీ తన తండ్రిని చంపేశారని జగన్ అన్నాడు. రిలయన్స్ అధినేత చంపేశాడని కూడా అన్నాడు. వాళ్ల షాపులపైన దాడులు కూడా చేశాడు. మళ్లీ అదే రిలయన్స్ అధినేత మనిషికి ఎంపీ సీటు ఇచ్చాడు. 2014లో తండ్రి లేని బిడ్డ అంటూ ఓటు వేయమని అడిగాడు. ఈ రాష్ట్రం కోసం చంద్రబాబు తప్ప ఎవ్వరూ వద్దని నన్ను గెలిపించారు. 2019లో మళ్లీ శవ రాజకీయం పైకి వచ్చింది. ముందు కోడికత్తి డ్రామా, ఆ తరువాత బాబాయిపై గొడ్డలి వేటుపడింది. 'మా నాన్న చనిపోయాడు. ఉన్న ఒక్క బాబాయిని కూడా చంపేశారు. నారాసుర రక్తచరిత్ర' అని

మిగతా 11వ పేజీలో...

అవినాశ్ బెయిల్ రద్దు చేయాల్సిందే

దస్తగిరి పిటిషన్‌కు మద్దతిస్తున్నాం: సీబీఐ

సుప్రీంలో సునీత వ్యాజ్యంలోనూ కౌంటర్ వేశామని వెల్లడి

దస్తగిరి ఫిర్యాదు చేసేవరకు ఏం చేశారు..?

అవినాశ్ బెయిల్ రద్దు చేయాలని సీబీఐ ఎందుకు కోరడం లేదు?

తెలంగాణ హైకోర్టు సూటి ప్రశ్న

మా కంటే ముందే సునీత సుప్రీంకు

అందుకే మేం పిటిషన్ వేయలేదు

బెయిల్ షరతులన్నీ ఉల్లంఘించారు

శివశంకర్‌రెడ్డి కుమారుడు జైలుకెళ్లి దస్తగిరికి బెదిరింపు.. సాక్ష్యాలున్నాయి

కేంద్ర దర్యాప్తు సంస్థ వివరణ

తదుపరి విచారణ 15కి వాయిదా





హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిన్నాన్న, మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో 8వ నిందితుడిగా ఉన్న కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి బెయిల్‌ను రద్దు చేయాలని అప్రూవర్ దస్తగిరి దాఖలు చేసిన పిటిషన్‌కు సీబీఐ సంపూర్ణంగా మద్దతు తెలియజేసింది. దస్తగిరి పిటిషన్‌పై గురువారం తెలంగాణ హైకోర్టులో జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. తొలుత దస్తగిరి తరఫు న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపించారు. గతంలో హైకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చిన సందర్భంగా విధించిన షరతులన్నీ అవినాశ్‌రెడ్డి ఉల్లంఘించారని తెలిపారు. సాక్షులను భయభ్రాంతులకు గురిచేసే విధంగా

మిగతా 12వ పేజీలో...

సీబీఐ కౌంటర్‌లో ఏముందంటే..

దస్తగిరి పిటిషన్‌కు మద్దతు తెలుపుతూ సీబీఐ లిఖితపూర్వకంగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలని కోరింది. వైసీపీ నాయకులు.. దస్తగిరిని, ఆయన భార్యను బెదిరించారని.. ఈ అంశంపై దస్తగిరి మానవహక్కుల కమిషన్ సహా అందరికీ ఫిర్యాదు చేశాడని పేర్కొంది. 'దస్తగిరికి విట్‌నెస్ ప్రొటెక్షన్ స్కీం కింద భద్రత కల్పించాం. కుటుంబ సభ్యులకు సైతం రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. తన తండ్రిపై దాడి జరిగిందని.. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశానని మాకు సమాచారం ఇచ్చాడు. శివశంకర్‌రెడ్డి కుమారుడు చైతన్యరెడ్డి జైలుకు వచ్చి తనను బెదిరించాడని.. రూ.20 కోట్లు ఇస్తామని.. అంగీకరించపోతే కుటుంబంతో సహా అంతం చేస్తామని వార్నింగ్ ఇచ్చారని తెలిపాడు. అవినాశ్‌రెడ్డి.. భాస్కర్‌రెడ్డి తదితరులు చాలా పలుకుబడి ఉన్న వ్యక్తులు. ప్రత్యక్ష సాక్షి అయిన దస్తగిరిని కాపాడుకోవలసిన అవసరం ఉన్న నేపథ్యంలో అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు చేయండి' అని హైకోర్టును కోరింది.

ఈసీ డైరెక్ట్ చార్జ్

ప్రమోటీలకు నో చాన్స్.. ఎన్నికల వేళ సంచలన నిర్ణయం

కొత్త కలెక్టర్లు | కొత్త ఐజీ



బాలాజీ (2015 బ్యాచ్) కలెక్టర్, కృష్ణా | వినోద్‌కుమార్ (2015) కలెక్టర్, అనంతపురం | ప్రవీణ్‌కుమార్ (2006) కలెక్టర్, తిరుపతి | సర్వశ్రేష్ఠ త్రిపాఠి (2006) గుంటూరు రేంజ్ ఐజీ

కొత్త ఎస్పీలు వీరే..

జి.సుమిత్ సునీల్(2015 బ్యాచ్)	ప్రకాశం
గరికిపాటి బిందుమాధవ్(2017)	పల్నాడు
మణికంఠ చందోలు(2018)	చిత్తూరు
అమిత్ బర్దార్(2014 బ్యాచ్)	అనంత
కె.ఆరిఫ్ హఫీజ్(2014 బ్యాచ్)	నెల్లూరు

కొత్త కలెక్టర్లు, ఎస్పీలుగా డైరెక్ట్ రిక్రూటీలే

కృష్ణాకు బాలాజీ, అనంతకు వినోద్‌కుమార్

తిరుపతి కలెక్టర్‌గా ప్రవీణ్‌కుమార్

గుంటూరు రేంజ్ ఐజీగా సర్వశ్రేష్ఠ త్రిపాఠి

ప్రకాశం, పల్నాడు, చిత్తూరు, అనంత, నెల్లూరు జిల్లాలకూ నూతన ఎస్పీలు

నియామకాల్లో నిక్కచ్చిగా వ్యవహరించిన ఈసీ

రాష్ట్ర సర్వీసు అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు

అందుకే వారి నియామకాలకు 'నో'

ఆర్‌ఆర్ జాబితాలే పంపాలని స్పష్టీకరణ

'డైరెక్ట్' అధికారులకే పోస్టింగులు

తక్షణమే బాధ్యతలు చేపట్టాలని ఆదేశం

ఆ వెంటనే సీఎస్ ఉత్తర్వులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర సర్వీసు నుంచి పదోన్నతిపై ఐఏఎస్, ఐపీఎస్ హోదా పొందిన అధికారులు వద్దు.. యూపీఎస్సీ ద్వారా నేరుగా ఎంపికైన అధికారులే కావాలి! కృష్ణా, తిరుపతి, అనంతపురం జిల్లాల కలెక్టర్లు, గుంటూరు రేంజ్ ఐజీ, ఐదు జిల్లాల ఎస్పీల నియామకంలో ఎన్నికల కమిషన్ (ఈసీ) పాటించిన విధానమిది. పాలక పక్షమైన వైసీపీకి అనుకూలంగా పనిచేస్తూ ఇటీవల బదిలీ వేటుకు గురైన కృష్ణా, తిరుపతి, అనంతపురం కలెక్టర్లు రాజాబాబు, లక్ష్మీశ, గౌతమి.. గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు, ఐదు జిల్లాల ఎస్పీలు అన్బురాజన్, పల్లె జాషువా, పరమేశ్వర్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, తిరుమలేశ్వర్‌రెడ్డిల స్థానంలో కొత్త వారి నియామకానికి సిఫారసు చేసింది. వారు గురువారం రాత్రి 8 గంటలకల్లా బాధ్యతలు చేపట్టాలని ఆదేశాలు జారీచేసింది. దీంతో వీరి నియామకంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులిచ్చారు. ఆరోగ్యశ్రీ సీఈవోగా ఉన్న డీకే బాలాజీని కృష్ణా జిల్లా కలెక్టర్‌గా, ఏపీఐఐసీ ఎండీ ఎస్‌హెచ్ ప్రవీణ్‌కుమార్‌ను తిరుపతి కలెక్టర్‌గా, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ వి.వినోద్‌కుమార్‌ను అనంతపురం కలెక్టర్‌గా నియమించారు. మూడు జిల్లాలకు ముగ్గురేసి అధికారులతో మూడు జాబితాలను సీఈవో ముఖేశ్‌కుమార్ మీనా పంపించగా.. పై ముగ్గురిని ఈసీ ఎంపిక చేసింది. వీరు ప్రమోటీలు, స్థానిక అధికారులు కాదు.. యూపీఎస్సీ రెగ్యులర్ రిక్రూటీలే కావడం విశేషం. పైగా ఇతర రాష్ట్రాలకు చెందినవారు. వీరి నియామకంతో, ఖాళీ అయిన

మిగతా 12వ పేజీలో...

చంద్రబాబుపై వైసీపీ తప్పుడు ప్రచారం

సీఈవో మీనాకు వర్ల ఫిర్యాదు.. 48 గంటల్లోగా జవాబివ్వండి

ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, మంత్రి జోగి రమేశ్‌కు ఈసీ నోటీసులు 11



2

కేజ్రీవాల్‌ను సీఎం పదవి నుంచి

తొలగించలేం

అది ఆయన వ్యక్తిగత నిర్ణయం

సీఎం అరెస్టుతో పాలన స్తంభించిందని చెప్పలేం

పిల్ కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు

మా కేసుల వివరాలు ఇప్పించండి!

హైకోర్టును ఆశ్రయించిన అభ్యర్థులు

వివరాలు సమర్పించాలని పోలీసులకు హైకోర్టు ఆదేశం 3

ఊరికొచ్చి ఓటెయ్యండి

హైదరాబాద్‌లో రాష్ట్ర అభ్యర్థుల ప్రచారం

నియోజకవర్గాల వారీగా ఆత్మీయ సమావేశాలు

కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, ఇతర ప్రాంతాల్లో భారీగా ఉన్న ఆంధ్రా ప్రాంత ఓటర్లు

రాష్ట్రంలో ఓటేసేందుకు చాలామంది ఆసక్తి

రవాణా సదుపాయం ఏర్పాటుకు అభ్యర్థులు రెడీ

ఎన్నికల ముందు సొంతూళ్లకు ప్రత్యేక బస్సులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రచారం సరిహద్దులు దాటింది. తెలంగాణలో.. ముఖ్యంగా హైదరాబాద్ మహానగరంలో జోరుగా ప్రచారం సాగుతోంది. అక్కడి పార్లమెంట్ ఎన్నికల సమావేశాలను మించి ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు సంబంధించి వరుస ఆత్మీయ సమావేశాలు జరుగుతున్నాయి. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లితో పాటు ఆంధ్రా ప్రజలు

మిగతా 12వ పేజీలో...

వలంటీర్లు నా సైన్యం

మరోసారి అంగీకరించిన జగన్

తిరిగి అధికారంలోకి రాగానే వారి ఫైల్‌పైనే తొలి సంతకం

విపక్షాలు చెబుతున్నదీ ఇదే కదా అని జనం గుసగుస

జనం లేక నాయుడుపేట సభ వెలవెల



నాయుడుపేట సభలో సీఎం జగన్ మాట్లాడుతుండగా ఖాళీ అయిన సభా ప్రాంగణం 3



ఎన్నికల ప్రచార యాత్రకు సిద్ధమైన కాంగ్రెస్ చీఫ్ షర్మిలను ఆశీర్వదిస్తున్న ఆమె తల్లి విజయలక్ష్మి

న్యాయం కోసం పోరాడుతున్నా

దీవించండి: షర్మిల

నేటి నుంచి పీసీసీ చీఫ్ ప్రచారం 11

వైసీపీకి ఆమంచి రాజీనామా

9న తదుపరి కార్యాచరణ ప్రకటిస్తానని వెల్లడి 11

తిరిగి సొంతగూడు కాంగ్రెస్‌లో చేరే అవకాశం!

ఎల్ఐసీకి 'బుట్టమ్మ' బురిడీ!

రూ.360 కోట్ల రుణం ఎగ్గొట్టిన రేణుక దంపతులు

వారి ఆస్తులు వేలానికి పెట్టిన ఎల్ఐసీ హౌసింగ్

రేణుకమ్మ ఆస్తులు అంతంతేనన్న సీఎం జగన్

వేల కోట్ల ఆస్తులున్నా అప్పుల ఎగవేతపై అనుమానాలు



బుట్టా రేణుక పరిస్థితి ఆర్థికంగా అంతంత మాత్రమే అని చెబుతున్న జగన్ (ఫైల్)

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు అసెంబ్లీ స్థానానికి వైసీపీ తరఫున పోటీ చేస్తున్న బుట్టా రేణుక ఎల్ఐసీ హౌసింగ్‌కు రూ. వందల కోట్లలో టోపీ పెట్టారు. ఈ సంస్థ నుంచి దాదాపు రూ.360 కోట్ల రుణం తీసుకొని తిరిగి చెల్లించలేదు. దీంతో అప్పు కోసం బుట్టా రేణుక దంపతులు తనఖా పెట్టిన ఆస్తులను వచ్చేనెల 6న వేలం వేస్తామంటూ ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ప్రకటించింది. ఈ మేరకు గురువారం ఓ ప్రముఖ దినపత్రికకు చెందిన హైదరాబాద్ ఎడిషన్‌లో ప్రకటన ఇచ్చింది. దీర్ఘకాలంగా బకాయిలు చెల్లించనందునే ఆస్తులు వేలం వేస్తున్నట్లు అందులో స్పష్టం చేసింది. నిజానికి... బుట్టా రేణుక కుటుంబ సభ్యులకు హైదరాబాద్‌లో ఉన్న ఆస్తులతో పోల్చితే ఈ అప్పు ఓ లెక్కలోకి కూడా రాదు. రెండుమూడు ఆస్తులు విక్రయించినా... మొత్తం అప్పు తీరిపోతుంది. బుట్టా దంపతులు దాదాపు రూ.360 కోట్లను రెండు రుణ ఖాతాల ద్వారా తీసుకున్నారు. ఖాతా నం.41190012926 ద్వారా 159,13,29,116.30, ఖాతా నం.41190012927 ద్వారా

మిగతా 12వ పేజీలో...

కేజ్రీవాల్‌ను సీఎం పదవి నుంచి తొలగించలేం

» ఢిల్లీ హైకోర్టు స్పష్టీకరణ.. పిల్ కొట్టివేత



న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ముఖ్యమంత్రి పదవి నుంచి అరవింద్ కేజ్రీవాల్‌ను తొలగించాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్‌ను) విచారణకు స్వీకరించటానికి గురువారం ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. సీఎంగా కొనసాగాలా? వద్దా? అనేది కేజ్రీవాల్ వ్యక్తిగత నిర్ణయమని తెలిపింది. కోర్టు ద్వారా రాష్ట్రపతి పాలన విధించిన దాఖలాలు లేవని, పదవికి కేజ్రీవాల్ రాజీనామా చేయాలా? వద్దా? అన్నది న్యాయపరమైన అంశం కాదని.. ఆయన అరెస్టుతో ప్రభుత్వం స్తంభించిపోయిందని చెప్పలేమని పేర్కొంది. పరిపాలన కొనసాగించడంలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జీ) పూర్తిగా సమర్థుడని, ఆయనకు తమ మార్గదర్శకత్వం అవసరం లేదని వెల్లడించింది. ఈ సమస్యకు పరిష్కారం న్యాయస్థానాల్లో లేదని, ఇతర రాజ్యాంగ సంస్థలు నిర్ణయం తీసుకోవాల్సి ఉందని సూచించింది. ఈ మేరకు హిందూసేన అధ్యక్షుడు విష్ణుగుప్తా దాఖలు చేసిన పిల్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. ఇంతకుముందు కూడా ఇటువంటి పిల్ ఒకటి దాఖలు కాగా.. దానిని కూడా హైకోర్టు విచారణకు తీసుకోలేదు. మార్చి 21న కేజ్రీవాల్ అరెస్టు తర్వాత ఢిల్లీలో పాలన స్తంభించిందని, రాజ్యాంగ ప్రతిష్టంభన ఏర్పడిందని విష్ణుగుప్తా తన పిటిషన్‌లో పేర్కొన్నారు.


మరోవైపు, కేజ్రీవాల్ జైలులో ఉదయం, సాయంత్రం గంటన్నర చొప్పున ధ్యానం, యోగా చేస్తున్నారని అధిక సమయం పుస్తక పఠనంలో గడుపుతున్నారని తిహాడ్ జైలు వర్గాలు తెలిపాయి. రామాయణం, భగవద్గీత, హౌ ప్రైమినిస్టర్స్ డిసైడ్ పుస్తకాలను కేజ్రీవాల్ తెప్పించుకున్న విషయం తెలిసిందే. కాగా, ప్రతి రోజూ నియోజకవర్గాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆప్ ఎమ్మెల్యేలకు కేజ్రీవాల్ సూచించారు. ఈ మేరకు కేజ్రీవాల్ సందేశాన్ని ఆయన భార్య సునీత ఓ వీడియోలో చదివి వినిపించారు.

నా ప్రియుడు మనతోనే ఉంటాడు!

» వివాహేతర బంధం బయటపెట్టిన భర్తకు విచిత్రమైన ప్రతిపాదన చేసిన భార్య

» ఒప్పించేందుకు విద్యుత్తు స్తంభం ఎక్కిన వైనం.. యూపీలో ఘటన

లఖ్‌నవూ, నవంబరు 4: తాను నెరుపుతున్న వివాహేతర సంబంధాన్ని భర్త బట్టబయలు చేసినా ఆ భార్య కంగారుపడలేదు. పైగా ప్రియుడిని విడిచి తాను ఉండలేనని.. అలా అని వైవాహిక బంధాన్నీ తెంచుకోలేనని భర్తకు తేల్చి చెప్పింది. యూపీలోని గోరఖ్‌పూర్ సమీపంలోని పిప్రైచ్ గ్రామంలో బుధవారం జరిగిన ఈ ఘటన స్థానికులను నోరెళ్లబెట్టేలా చేసింది. ఈ గ్రామానికి చెందిన 34 ఏళ్ల మహిళ, రామ్ గోవింద్ భార్యాభర్తలు. వీరికి ముగ్గురు పిల్లలు. రామ్ గోవింద్ కూలీ పనులను వెళుతుంటాడు. అతడి భార్య పొరుగూరుకు చెందిన ఓ వ్యక్తితో ఏడేళ్లుగా వివాహేతర సంబంధం నడుపుతోంది. విషయం తెలిసిన భర్త ఆమెతో గొడవ పడ్డాడు. అదేమీ పట్టించుకోని ఆమె.. ప్రియుడిని విడిచి తాను ఉండలేని భర్తకు తేల్చి చెప్పింది. పైగా ప్రియుడిని ఇంట్లోనే పెట్టుకుందామని.. ఇంటి ఆర్థిక అవసరాలకు అండగా ఉంటాడని నచ్చజెప్పే ప్రయత్నం చేసింది. ఈ ప్రతిపాదన విని చిర్రెత్తిపోయిన భర్త ఆమెను ఇంట్లోంచి వెళ్లగొట్టాడు. ఆమె.. తన మాట నెగ్గించుకోవాలనే పట్టుదలతో సమీపంలోని విద్యుత్తు స్తంభాన్ని ఎక్కింది. రంగంలోకి దిగిన పోలీసులు ఆమెను కిందకు తీసుచొచ్చేందుకు హైరానా పడాల్సి వచ్చింది. ఘటన తాలూకు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.





రాజ్యసభ సభ్యురాలిగా సోనియా ప్రమాణం

ఏపీ నుంచి వైవీ, గొల్ల, మేడా.. తెలంగాణ నుంచి ఒకరు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణతోపాటు వివిధ రాష్ట్రాలకు చెందిన 14 మంది రాజ్యసభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ తన చాంబర్‌లో గురువారం వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ రాజస్థాన్ నుంచి తొలిసారిగా పెద్దల సభకు ఎన్నికైన విషయం తెలిసిందే. ఆమెతోపాటు తెలంగాణ నుంచి వద్దిరాజు రవిచంద్ర(బీఆర్ఎస్), ఏపీ నుంచి వైసీపీ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబురావు, మేడా రఘునాథ్ రెడ్డి, ఒడిశా నుంచి కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్(బీజేపీ), సుభాశిశ్ కుంతియా(బీజేడీ), దేబాశిశ్ సామంతరాయ్(బీజేడీ), కర్ణాటక నుంచి కాంగ్రెస్ అధికార ప్రతినిధి అజయ్ మాకెన్, సయ్యద్ నజీర్ హుస్సేన్, యూపీ నుంచి ఆర్‌పీఎన్ సింగ్(బీజేపీ), పశ్చిమబెంగాల్ నుంచి సామిక్ భట్టాచార్య(బీజేపీ), బిహార్ నుంచి సంజయ్ కుమార్ ఝా(జేడీయూ), మదన్ రాథోర్(బీజేపీ)లు ప్రమాణ స్వీకారం చేశారు.

ఓటరు ఐడీ కార్డు లేకున్నా ఓటు వేయచ్చు: ఈసీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: ఓటరు తన ఓటు హక్కును కోల్పోకూడదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ఎన్నికల అధికారులకు పలు సూచనలు చేసింది. ఓటర్ల జాబితాలోని ఓటరు పేరులో అక్షర దోషాలు ఉన్నాయన్న కారణంగా ఓటును నిరాకరించవద్దని పేర్కొంది. ఓటరు ఐడీ కార్డు ఆధారంగా ఓటు వేయడానికి అనుమతించాలని తెలిపింది. ఓటరుకు, జాబితాలోని ఫొటోకు సంబంధం లేదని భావిస్తే.. ఈసీ గుర్తించిన ఏదో ఒక ఫొటో ఐడీ కార్డును చూపించినట్లయితే ఓటు వేయడానికి అనుమతించాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్‌కు ఢోకా లేదు

ప్రభుత్వ ఉద్యోగులు ఈసారి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే హక్కును కోల్పోతారంటూ వాట్సా‌ప్‌లో జరుగుతున్న ప్రచారాన్ని కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) గురువారం ఖండించింది. ఇటువంటి తప్పుడు వార్తలు నమ్మొద్దని తెలిపింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులంతా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు వేయవచ్చని స్పష్టం చేసింది.

పామును నమ్మొచ్చుగానీ.. బీజేపీని నమ్మొద్దు

» స్థానికులపై విదేశీ ముద్ర వేసేందుకే సీఏఏ: మమత

కూచ్‌బెహార్, ఏప్రిల్ 4: విష సర్పాన్నయినా నమ్మొచ్చు, పెంచుకోవచ్చుగానీ, కాషాయ దళాన్ని(బీజేపీని) ఎంత మాత్రం నమ్మకూడదంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఘాటు విమర్శలు చేశారు. ఆ పార్టీ దేశాన్ని నాశనం చేస్తోందని వ్యాఖ్యానించారు. గురువారం కూచ్‌బెహార్, మాల్‌బజార్‌ల్లో జరిగిన ఎన్నికల బహిరంగ సభల్లో ఆమె ప్రసంగించారు. రక్షణ బలగాలైన బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ దళాలతో పాటు, ఆర్మీ ఆస్త్రులను కూడా తనకు అనుకూలంగా వాడుకుంటోందని ఆరోపించారు. పౌరసత్వ సవరణ చట్టా (సీఏఏ)న్ని వ్యతిరేకించిన మమత.. స్థానికులపై విదేశీయులు అన్న ముద్ర వేయడానికే దీన్ని బీజేపీ తీసుకొచ్చిందని ఆరోపించారు.

అగ్ని-ప్రైమ్ క్షిపణి ప్రయోగం సక్సెస్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: దేశ రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక ముందడుగు పడింది. అణ్వాయుధ సామర్థ్యం కలిగిన కొత్తతరం బాలిస్టిక్ క్షిపణి 'అగ్ని-ప్రైమ్'ను భారత్ విజయవంతంగా పరీక్షించింది. ఒడిసా తీరంలోని అబ్దుల్ కలాం ద్వీపం నుంచి బుధవారం రాత్రి 7 గంటల సమయంలో ఈ ప్రయోగం చేపట్టినట్టు రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

తాగునీటి చెరువులకు సాగర్ నీరు

» 6న ప్రకాశం బ్యారేజీ, 8న సాగర్ నుంచి విడుదల: సీఎస్

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వేసవి తాగునీటి అవసరాల దృష్ట్యా సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను పూర్తిగా నీటితో నింపేందుకు ఈ నెల 6వ తేదీన ప్రకాశం బ్యారేజీ నుంచి ఏలూరు కాలవ, బందరు కాలువ, రైవస్ కాలువల ద్వారా ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాలకు, బకింగ్ హాం కాలువ ద్వారా గుంటూరు, బాపట్ల జిల్లాలకు నీటిని విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి చెప్పారు. అదేవిధంగా నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువ ద్వారా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలకు ఈ నెల 8 నుంచి 18వ తేదీ వరకు 10 రోజులపాటు నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితులు, ఉపాధి హామీ పథకం పనులపై గురువారం అమరావతి సచివాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సీఎస్ సమీక్షించారు. తాగునీటి చెరువులు నింపేందుకు కాలువల ద్వారా విడుదల చేసే నీటిని చేపల, రొయ్యల చెరువులు తదితర తాగునీటేతర అవసరాల కోసం కాలువలపై ఇంజన్లు, మోటార్లు వేసి అక్రమంగా నీటిని మళ్లించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లతోపాటు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

కర్ణాటకలో 98 కోట్ల మద్యం సీజ్

బెంగళూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ కర్ణాటకలో ఎక్సైజ్ శాఖ అధికారులు భారీ స్థాయిలో మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మద్యాన్ని అక్రమంగా నిల్వ చేశారన్న సమాచారం రావడంతో ఎక్సైజ్ అధికారులు ఈ నెల 2న మైసూరు జిల్లా నంజనగూడు తాలూకా తాండ్యా పారిశ్రామికవాడలోని యునైటెడ్ బ్రేవరీస్‌లో తనిఖీలు నిర్వహించారు. అక్కడ నిల్వ చేసిన రూ.98.52 కోట్ల విలువైన మద్యం, బీర్‌ను గుర్తించారు. ఏడు వేల బాక్సుల్లో భద్రపరిచిన వివిధ బ్రాండ్ల మద్యాన్ని సీజ్ చేసినట్లు అధికారులు గురువారం ప్రకటించారు. ఈ వ్యవహారంలో 12 మందిపై కేసు నమోదు చేశారు. ఇదంతా సరిహద్దు రాష్ట్రమైన కేరళకు తరలించేందుకు సిద్ధంగా ఉంచినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటికే 14 వేల కార్టన్ల మద్యం కేరళకు తరలిపోయినట్టు సమాచారం. ఇప్పుడు పట్టుకున్న మద్యంతో పోలిస్తే ఇది రెట్టింపు. అంటే దాని విలువ దాదాపు రూ.200 కోట్లు ఉంటుందని అంచనా.



పులిలా వచ్చి.. భూతంగా మారి

అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియా డబ్బు ఆర్థికవ్యవస్థలోకి రాకుండా ఆపేందుకు 2002లో పీఎంఎల్ఏ

» రాజకీయ ప్రత్యర్థులు, సామాజిక కార్యకర్తలపై.. దుర్వినియోగం

» అత్యంత క్రూరంగా మారిన ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్

(సెంట్రల్ డెస్క్)



తమిళనాడుకు చెందిన కన్నయ్యన్ (72), కృష్ణన్ (66) అనే ఇద్దరు దళిత రైతులకు ఈడీ 'ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్' కింద 2023 జూలైలో నోటీసులు జారీచేసింది. వారి పొలం చుట్టూ వేసిన విద్యుత్ తీగలు తగిలి రెండు ఎద్దులు చనిపోయాయన్నది కేసు! దానికీ ఈడీకీ.. ఎద్దులు చనిపోవడానికి, నగదు అక్రమ చలామణి నిరోధక చట్టానికీ సంబంధం ఏమిటంటారా? వారికి ఈడీ సమన్లు రావడం వెనుక ఇంకో కారణం ఉంది. ఆ రైతులకు, స్థానిక బీజేపీ నాయకుడికి పొలంగట్టు తగాదాలేవో ఉన్నాయి. అదీ విషయం. కానీ, దీనిపై ప్రజాగ్రహం తీవ్రస్థాయిలో వెల్లువెత్తేసరికి ఈడీకి విషయం అర్థమై ఆ నోటీసులను ఉపసంహరించుకుంది. 'ఇసింటా రమ్మంటే.. ఇల్లంతా నాదే' అన్న చందంగా ఒక ఉదాత్తమైన ఉద్దేశంతో రెండు దశాబ్దాల క్రితం చేసిన పీఎంఎల్ఏ చట్టం ఇప్పుడు ఏస్థాయిలో దుర్వినియోగం అవుతోందో చెప్పే చిన్న ఉదాహరణ ఇది. అంతర్జాతీయంగా మాదక ద్రవ్యాల క్రయవిక్రయాల ద్వారా వచ్చిన సొమ్మును డ్రగ్స్ మాఫియా వివిధ మార్గాల ద్వారా పలు దేశాల ఆర్థిక వ్యవస్థలోకి చొప్పించడం వల్ల ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు దెబ్బతినడాన్ని ఐక్యరాజ్యసమితి 1988లో గుర్తించింది. ఇది ఆయా దేశాల సార్వభౌమత్వానికే విఘాతం అని అభిప్రాయపడింది. దీన్ని తీవ్రంగా పరిగణించి ఆ ఏడాది 'యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఎగైనెస్ట్ ఇల్లిసిట్ ట్రాఫిక్ ఇన్ నార్కోటిక్ డ్రగ్స్‌అండ్‌సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్' సమావేశాన్ని ఏర్పాటు చేసింది. దానికి హాజరైన అన్ని దేశాల ప్రతినిధులూ మాదకద్రవ్యాల నేరాలకు సం బంధించిన నగదు అక్రమ చలామణికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. 1989 జూలైలో ప్రపంచంలోనే పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన 7 అతిపెద్ద దేశాలు పారిస్‌లో సమావేశమై ఇదే అంశంపై చర్చించాయి. మనీ లాండరింగ్ సమస్యను సమర్థంగా ఎదుర్కొనేందుకు 'ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఫ్యాట్‌ఎఫ్)'ను ఏర్పాటు చేశాయి. 1990లో ఐరాస.. 'ద పొలిటికల్ డిక్లరేషన్ అండ్ గ్లోబల్ ప్రోగ్రామ్ ఆఫ్ యాక్షన్' పేరుతో ఓ తీర్మానం చేసింది. దీనికింద సభ్యదేశాలన్నీ మాదక ద్రవ్యాల నగదు అక్రమ చలామణిని నిరోధించే చట్టాలు చేయాలని పిలుపునిచ్చింది. 1998లోనూ 'కౌంటరింగ్ వరల్డ్ డ్రగ్ ప్రాబ్లమ్' అనే థీమ్‌తో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఇదే సూచన చేసింది. ఆమేరకే అప్పటి వాజపేయీ సర్కారు నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం చేసింది. 2003లో దానికి రాష్ట్రపతి ఆమోదం లభించినా ఆ చట్టంలో కొన్ని లోపాలుండడంతో తర్వాత వచ్చిన యూపీఏ సర్కారు వాటిని సవరించి 2005నుంచి అమల్లోకి తెచ్చింది.

మరికొన్ని నేరాలూ..

ప్రధానంగా మాదకద్రవ్యాల విక్రేతల పాలిట పులిలా ఏర్పాటైన పీఎంఎల్ఏ చట్టం.. దరిమిలా అధికార పార్టీ రాజకీయ ప్రత్యర్థులు, సామాజిక కార్యకర్తల పాలిట భూతంలా మారిందంటే అతిశయోక్తి కాదు. భారత శిక్షాస్మృతి(ఐపీసీ)లోని కొన్ని నేరాలను, నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్డీపీసీ) యాక్ట్‌లోని కొన్ని నేరాలను కూడా అందులోకి తేవడమే ఇందుకు కారణమని లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ పీడీటీ ఆచారి వంటివారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజ్యాంగంలోని 253వ అధికరణం ప్రకారం కేంద్రం ఈ చట్టం చేసింది. అంతర్జాతీయ ఒడంబడికల అమలుకనుగుణంగా చట్టాలు చేసే వీలు కల్పించే ఆర్టికల్ అది. ఏదైనా అంతర్జాతీయ సంస్థ చేసిన తీర్మానాన్ని/నిర్ణయాన్ని అమలు చేసే క్రమంలో ఈ ఆర్టికల్ కింద చట్టం చేసేటప్పుడు అది ఆ తీర్మానానికి అనుగుణంగా మాత్రమే లోబడి ఉండాలని 253వ అధికరణం చెబుతోంది. అంటే పీఎంఎల్ఏ యాక్ట్ అంతర్జాతీయ డ్రగ్స్, ఇతరత్రా నేరపూరిత లావాదేవీలతో పోగుపడే నల్లధనాన్ని అరికట్టడానికే పరిమితమై ఉండాలి. కాబట్టి.. డ్రగ్ ట్రాఫికింగ్‌కు పాల్పడే కరడుగట్టిన, ప్రమాదకరమైన నేరగాళ్లతో వ్యవహరించాలి. కానీ, ఈ చట్టానికి చేసిన సవరణలతో ఐపీసీ జాబితాలో డబ్బు ప్రమేయం ఉన్న కొన్ని నేరాలు, ప్రత్యేక చట్టాల ద్వారా శిక్షించదగ్గ నేరాలు సైతం దీంట్లోకి చేరాయి. ఉదాహరణకు.. పబ్లిక్ సర్వెంట్స్ అవినీతి కట్టడికి చేసిన 'అవినీతి నిరోధక చట్టం' కిందకు వచ్చే కేసులనూ 2009లో పీఎంఎల్ఏలోని షెడ్యూల్ ఆఫ్ అఫెన్సెస్‌లోకి చేర్చారు (ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టయింది దీని కిందే). ఎవరైనా ఒక పబ్లిక్ సర్వెంట్ అవినీతి కేసులో అరెస్టయితే అందులో డబ్బు ప్రమే యం ఉంది కాబట్టి ఈడీ అందులో వేలు పెడుతుంది. అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియాకు చెందిన నేరగాడితో సమానంగా అతడితో వ్యవహరిస్తుంది. 2019లో ఈ చట్టానికి చేసిన సవరణలతో మనీలాండరింగ్ నేరానికి పాల్పడేవారికి, ఇతర షెడ్యూల్డ్ నేరాలు చేసినవారికి మధ్య గీత దాదాపుగా చెరిగిపోయింది. ఈ చట్టంలో ఉన్న మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే.. సాధారణ నేరాలకు సంబంధించిన కేసుల్లో అరెస్టయితే, నేరం రుజువయ్యే దాకా నిందితులను నిర్దోషులుగానే వ్యవహరిస్తారు. కానీ పీఎంఎల్ఏ అందుకు విరుద్ధం. ఈ చట్టం కింద అరెస్టయ్యేవారు తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకునేదాకా దోషులే అవుతారు. అరెస్టయినవారికి ఈసీఐఆర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్వెస్టిగేషన్ రిపోర్ట్-ఫిర్యాదు) కాపీ కూడా ఇవ్వరు. ఈ చట్టం కింద ఈడీ రాష్ట్రాల అనుమతి అవసరంలేకుండా దేశంలో ఎక్కడైనా దర్యాప్తు చేపట్టవచ్చు. ఇది సమాఖ్య స్ఫూర్తికి భంగం కలిగిస్తోందనే ఆందోళన ఉంది.

చివరాఖరు: అధికార పార్టీ రాజకీయ ప్రత్యర్థుల విషయంలో సుద్దపూసలా, కఠినంగా వ్యవహరించి పీఎంఎల్ఏ కింద కేసులు పెట్టి, బెయిల్ ఇవ్వడానికి వీల్లేదంటూ వాదించే ఈడీ.. మరికొందరి విషయంలో చాలా ఉదారంగా వ్యవహరిస్తోంది. వారు నిజంగానే అంతర్జాతీయ స్థాయిలో నగదు అక్రమ చలామణీకి పాల్పడినా.. విదేశాల్లో పోగేసుకున్న నల్లధనాన్ని తప్పుడు మార్గాల్లో దేశంలోకి తెచ్చి తెల్లధనంగా మార్చుకుంటున్నా వారిపై కేసులు అంగుళం ముందుకు కదలకపోయినా.. ఏళ్లతరబడి వారు బెయిల్‌పైనే తిరుగుతున్నా తనకేమీ పట్టనట్టే వ్యవహరిస్తోంది!

బెయిల్.. దాదాపు అసాధ్యం!

పీఎంఎల్ఏలోని అత్యంత కఠినమైన సెక్షన్ 45. ఈ చట్టం కింద అరెస్టయిన వారికి బెయిల్ దొరకడం అత్యంత కష్టతరం. కొన్ని సందర్భాల్లో దాదాపు అసాధ్యం. పీఎంఎల్ఏ కింద అరెస్టయినవారు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయిస్తే జడ్జి సంతృప్తి చెందిన సందర్భాల్లో మాత్రమే బెయిల్ మంజూరవుతుంది. అందుకే ఈ చట్టం కింద అరెస్టయినవారు బెయిల్ లేకుండా ఏళ్లతరబడి జైళ్లల్లో మగ్గిపోతుంటారు. ఈ సెక్షన్ రాజ్యాంగంలోని 14, 21 అధికరణాలకు విరుద్ధమంటూ 2018లో ఇద్దరు సభ్యుల సుప్రీం ధర్మాసనం తీర్పునిచ్చింది. కానీ పార్లమెంటు కొన్ని సవరణల ద్వారా ఆ సెక్షన్‌ను సజీవంగా ఉంచింది. దాన్ని సవాల్ చేస్తూ దాఖలైన కేసును విచారించిన ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఆ సవరణలను సమర్థిస్తూ 2022లో తీర్పునిచ్చింది. ఈడీ అధికారులు ఈ చట్టం కింద ఎవరినైనా అరెస్ట్ చేస్తే వారికి ఈసీఐఆర్ ఇవ్వాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పింది. ఇది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు విరుద్ధమంటూ ఆ తీర్పుపై వేసిన రివ్యూ పిటిషన్ ప్రస్తుతం సుప్రీంలో పెండింగ్‌లో ఉంది.

యూపీఏ హయాంలో దేశానికి చెడ్డపేరు

» ప్రధాని మోదీ విమర్శ



జాముయి (బిహార్), ఏప్రిల్ 4: పాకిస్థాన్ నుంచి ఎదురయిన ఉగ్రవాద ముప్పును ఎదుర్కోలేక గత యూపీఏ ప్రభుత్వం దేశానికి చెడ్డపేరు తీసుకొచ్చిందని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. ఆ కారణంగా భారతదేశం బలహీనమైనది, పేదది అన్న ముద్రపడిందని వ్యాఖ్యానించారు. గురువారం బిహార్‌లోని జాముయిలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించారు. "అవినీతికి పాల్పడ్డ వారిని జైలుకు పంపించవద్దా? నేను అవినీతిని నిర్మూలించాలని అంటుంటే వారు మాత్రం మోదీని ఓడించాలని పిలుపునిస్తున్నారు" అని వ్యాఖ్యానించారు. ఇది బిహార్‌లో ఎన్డీఏ పక్షాన నిర్వహించిన తొలి ప్రచార సభ కావడంతో ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ కూడా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మొత్తం 40 స్థానాలను గెలుస్తామని, 400 సీట్లను సాధించాలన్న మోదీ లక్ష్యాన్ని నెరవేరుస్తామని చెప్పారు.

ఐయూఎంఎల్ మద్దతు రాహుల్‌కు ఇష్టం లేదు

» స్మృతి ఇరానీ

వయనాడ్, ఏప్రిల్ 4: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేంద్రమంత్రి స్మృతి ఇరానీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేరళలోని వయనాడ్‌లో బీజేపీ అభ్యర్థి సురేంద్రన్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు స్మృతి ఇరానీ పాల్గొన్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) మద్దతు పొందడం రాహుల్ తలవంపుగా భావిస్తున్నారన్నారు. అందుకే ఆయన చేపట్టిన ర్యాలీలో ఆ పార్టీ జెండా ఒక్కటి కూడా కనబడలేదని చెప్పారు.

3,6 తరగతులకు కొత్త పాఠ్య పుస్తకాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: మూడు, ఆరు తరగతులకు కొత్త సిలబస్‌తో పాఠ్యపుస్తకాల విడుదల తేదీలను జాతీయ విద్యా పరిశోధనా, శిక్షణ సంస్థ (ఎన్‌సీఈఆర్టీ) గురువారం ప్రకటించింది. మూడో తరగతి పాఠ్య పుస్తకాలు ఈ నెల చివరి వారంనాటికి, ఆరో తరగతి పుస్తకాలు మే మధ్యకాలంనాటికి అందుబాటులో ఉంటాయని పేర్కొంది. అలాగే 1, 2, 7, 8, 10, 12 తరగతులకు సంబంధించిన 2023-24 ఎడిషన్స్ పాఠ్యపుస్తకాలు దేశవ్యాప్తంగా 1.21 కోట్ల కాపీలు విడుదల చేసినట్టు తెలిపింది.

అమెరికా ఓటర్ల మద్దతు ట్రంప్‌నకే

» 7 కీలక రాష్ట్రాల సర్వేల్లో బైడెన్ కంటే ఆయనే ముందంజ

వాషింగ్టన్, ఏప్రిల్ 4: ఈ ఏడాది చివర్లో జరిగే ఎన్నికల్లో అమెరికా అధ్యక్షుడు, డెమొక్రాటిక్ అభ్యర్థి జో బైడెన్‌కు షాక్ తగిలే అవకాశాలు కనిపిస్తున్నాయి. అమెరికా ఓటర్ల నమ్మకాన్ని ఆయన కోల్పోతున్నట్లు తెలుస్తోంది. తాజాగా నిర్వహించిన ఓ సర్వేలో బైడెన్ తన ప్రత్యర్థి, రిపబ్లిక్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్ కంటే వెనుకంజలో ఉన్నట్లు తేలింది. అమెరికాలోని అత్యంత కీలకమైన ఏడు రాష్ట్రాల్లో నిర్వహించిన ఒపీనియన్ పోల్‌లో ఆరు రాష్ట్రాలలోని ఓటర్లు ట్రంప్‌పై విశ్వాసం వ్యక్తం చేయగా.. కేవలం ఒక రాష్ట్రంలో మాత్రమే బైడెన్‌కు మద్దతుగా నిలిచారు. పెన్సిల్వేనియా, మిచిగాన్, అరిజోనా, జార్జియా, నెవెడ, నార్త్ కరోలినా రాష్ట్రాలలో బైడెన్ కంటే ట్రంప్ 2 నుంచి 8 పాయింట్లతో ముందంజలో ఉన్నారు. ఒక్క విస్కాన్సిన్‌లో మాత్రం బైడెన్ మూడు పాయింట్ల ఆధిక్యంలో ఉన్నారు. ముఖ్యంగా దేశ ఆర్థిక పరిస్థితిపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని, బైడెన్ సామర్థ్యం, విధి నిర్వహణపై కూడా సందేహంతో ఉన్నారని సర్వేలో వెల్లడైంది. కాగా ఈసారి అధ్యక్ష ఎన్నికల్లో బైడెన్, ట్రంప్ మధ్య పోరు హోరాహోరీగా ఉంటుందని 'రియల్ క్లియర్ పాలిటిక్స్' అనే సంస్థ వెల్లడించింది.

నల్లమందు తిని నిద్రపోతున్నావా?

» చైనా ఆక్రమణలపై స్పందించడంలేదేమిటి?

» మోదీపై ఖర్గే ఘాటు వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఘాటుగా విమర్శించారు. దేశం గురించి పట్టించుకోకుండా 35ఏళ్లుగా ఎలాంటి పదవిలోలేని గాంధీ కుటుంబంపై విమర్శలు చేయడానికే పరిమితం కావడం ఏమిటని నిలదీశారు. రాజస్థాన్‌లోని చితోర్‌ఘడ్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఖర్గే ప్రసంగిస్తూ "మోదీ చెప్పుకుంటారు.. 'నాకు 56 ఇంచీల ఛాతీ ఉందని.. ఎవరికీ భయపడనని..' నిజంగా భయపడకపోతే చైనా భారీగా భూభాగాన్ని ఆక్రమిస్తున్నా ఎందుకు విడిచిపెట్టారు? వారు లోపలికి చొచ్చుకు వస్తున్నారు.. మీరేమో నిద్రపోతున్నారు. మీరేమైనా నిద్ర మాత్రలు మింగారా? లేదంటే రాజస్థాన్‌లో పండిన నల్లమందును తీసుకొచ్చి వారేమైనా మీకు తినిపించారా?" అని ప్రశ్నించారు. మోదీని 'అబద్ధాల సర్దార్' అని విమర్శించారు.

ముస్లింలకు విడాకులు మంజూరు అధికారం ఫ్యామిలీ కోర్టుకు ఉంది

» కర్ణాటక హైకోర్టు ధర్మాసనం

బెంగళూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వివాహం రద్దు చేసుకోవాలని పరస్పరం నిర్ణయించుకున్న ముస్లిం దంపతులకు విడాకులు ఇచ్చే అధికారం ఫ్యామిలీ కోర్టుకు ఉందని కర్ణాటక హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. షబనం, పర్వీన్ అహ్మద్ అనే దంపతులు దాఖలు చేసుకున్న పిటిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అనుశివరామన్, జస్టిస్ అనంత రామనాథ హెగ్డేల ధర్మాసనం గురువారం విచారించింది. ముబారత్ ఒప్పందం ప్రకారం దంపతులు వివాహాన్ని రద్దు చేసుకోవాలని భావిస్తే ఫ్యామిలీ కోర్టు విడాకులను మంజూరు చేయవచ్చునని సూచించింది. ఇందుకు సంబంధించి గతంలో ఇచ్చిన కొన్ని తీర్పులను ప్రస్తావించింది.

ఎస్సార్బీసీ భూములు ఇళ్ల స్థలాలకు ఇవ్వడం సరైందే

» అస్వాభావిక కారణాలతో పథకం అమలును అడ్డుకోలేం: హైకోర్టు

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఆర్‌బీసీ) కోసం సేకరించిన భూములను నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద అర్హులైన వారికి ఇళ్ల పట్టాలుగా ఇవ్వాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు సమర్థించింది. అధికారులు జారీచేసిన ప్రొసీడింగ్స్ సరైనవేనని స్పష్టం చేసింది. అస్వాభావిక కారణాలతో పథకం అమలును అడ్డుకోవడానికి వీల్లేదని పేర్కొంది. పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాల్సిన రాజ్యాంగ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందంది. పరిహారం చెల్లించి భూమిని సేకరించిన తర్వాత ఆ భూమిపై ప్రభుత్వానికే పూర్తి హక్కులు ఉంటాయని స్పష్టం చేసింది. పరిహారం పొందినవారు భూమిపై ఎలాంటి యాజమాన్య హక్కులు, ప్రయోజనాలు కోరలేరని పేర్కొంది. ఎస్ఆర్‌బీసీ కోసం సేకరించిన 130.86 ఎకరాల్లో అర్హులైనవారికి ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అధికారులు జారీచేసిన ప్రొసీడింగ్స్ సరైనవేనని ప్రకటించింది. ఎస్ఆర్‌బీసీ కాలువ భూములను నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకానికి ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలు పరిష్కరించింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ తీర్పు ఇచ్చారు. ఉమ్మడి కర్నూలు జిల్లా బనగానపల్లె మండల పరిధిలోని భానుముక్కల, బాతులూరుపాడు, యనకండ్ల, బనగానపల్లె గ్రామాల్లోని పలు సర్వే నంబర్లలో ఎస్ఆర్‌బీసీ కోసం సేకరించిన 130.86 ఎకరాల భూమిలో అర్హులైనవారికి ఇళ్ల పట్టాలివ్వాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వీటిపై వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేసిన న్యాయమూర్తి గురువారం నిర్ణయాన్ని వెల్లడించారు. 'ఎస్ఆర్‌బీసీ నిర్మించిన దగ్గర నుంచి ఇప్పటివరకు గోరకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్‌కు 800 నుంచి 1000 క్యూసెక్కులు మాత్రమే విడుదలైంది. అదికూడా ఆగస్టు-మార్చి నెలల మధ్య మాత్రమే. మిగిలిన సమయంలో కాలువలో నీరుండదు. ఈ సమయంలో తనిఖీలు చేసి కాలువకు మరమ్మతులు చేయవచ్చు. నిర్దిష్ట ప్రయోజనం కోసం సేకరించిన భూములను అందుకోసం ఉపయోగించని పక్షంలో, నిరుపయోగంగా ఉన్న వాటిని వెనక్కి తీసుకొని ఇళ్ల స్థలాల కోసం ఇవ్వాలనేది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం. అస్వాభావిక కారణాలతో పథకం అమలును అడ్డుకోవడానికి వీల్లేదు' అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

20గంటల తర్వాత మృత్యుంజయుడిగా..

» కర్ణాటకలో బోరుబావిలో పడ్డ రెండేళ్ల బాలుడు

» రంగంలోకి ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక దళాలు

» బాలుడు క్షేమం.. మిన్నంటిన సంబరాలు

బెంగళూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు బోరుబావిలో పడిపోయిన రెండేళ్ల బాలుడిని రెస్క్యూ బృందాలు సమర్థంగా కృషి చేసి సురక్షితంగా బయటకు తీశాయి. 20 గంటల పాటు మృత్యువుతో పోరాడిన ఆ చిన్నారి చివరికి క్షేమంగా బయటికి రావడంతో తల్లిదండ్రుల ఆనందానికి హద్దుల్లేవు. ఘటనా స్థలంలో సంబరాలు మిన్నంటాయి. కర్ణాటక రాష్ట్రంలోని విజయపుర జిల్లా, ఇండి తాలూకా లచ్యాణ గ్రామంలో జరిగిన ఈ సంఘటన వివరాలివీ.. గ్రామానికి చెందిన రైతు సతీష్ పొలంలో నిమ్మసాగు చేసేందుకు రెండు బోరుబావులు తవ్వారు. రెండింటిలోనూ నీరు లభించలేదు. వాటిని పూడ్చకుండా అలాగే వదిలేశారు. సతీష్ కుటుంబం పొలంలోనే ఇల్లు నిర్మించుకుని జీవిస్తోంది. సతీష్ కుమారుడు సాత్విక్ బుధవారం సాయంత్రం ఆడుకుంటూ వెళ్లి.. ఒక్కసారిగా బోరుబావిలో పడ్డాడు. బోరుబావిలో నుంచి ఏడుపు విన్న స్థానికులు కొందరు బాలుడి కుటుంబసభ్యులకు తెలిపారు. ఆ తర్వాత గ్రామస్థులంతా అక్కడికి చేరారు. సమాచారం అందుకున్న జిల్లా యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగింది. బోరుబావి 16 అడుగుల లోతులో బాలుడి కాలును కెమెరాల సాయంతో నిపుణులు గుర్తించారు. తల్లకిందులుగా పడినట్లు నిర్ధారించుకున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వైద్య బృందం బాలుడికి పైపుల ద్వారా ఆక్సిజన్ అందే ఏర్పాట్లు చేశారు. ఆ వెంటనే ఎస్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ అధికారులు రెండు ఎక్స్‌కవేటర్లతో బోరుబావికి సమాంతరంగా గొయ్యి తవ్వడం ప్రారంభించారు. బాలుడు ఏడుస్తున్న శబ్దాలను గురువారం ఉదయం గుర్తించిన నిపుణులు, సహాయక చర్యలను వేగవంతం చేశారు. గురువారం మధ్యాహ్నం సుమారు 2.30 గంటల సమయంలో బాలుడిని బోరుబావి నుంచి బయటకు తీశారు. అంబులెన్స్‌లో విజయపుర ఆస్పత్రికి తరలించారు. బాలుడు క్షేమంగా ఉన్నాడని వైద్యులు తెలిపారు. అయితే 20 గంటలకు పైగా బోరుబావిలోనే ఉన్నందున.. ఆహారం లేక నీరసంగా ఉన్నట్లు పేర్కొన్నారు. బాలుడిని సురక్షితంగా బయటకు తీసిన 32 మంది బృందం గల రెస్క్యూ బృందానికి సాత్విక్ కుటుంబీకులు, గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు.



బోరుబావి నుంచి సురక్షితంగా బయటపడ్డ బాలుడు

వలంటీర్లు నా సైన్యం!

- మరోసారి అంగీకరించిన సీఎం జగన్
- విపక్షాలు చెబుతున్నదీ ఇదే కదా అని జనం గుసగుస
- జనం లేక నాయుడుపేట 'సిద్ధం' సభ వెలవెల
- 400 ఆర్టీసీ బస్సులు కేటాయించినా జనం లేక బోసిపోయిన సభా ప్రాంగణం

నాయుడుపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): 'వలంటీర్లు నా సైన్యం' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మరోసారి అంగీకరించారు. తిరిగి అధికారంలోకి రాగానే తొలి సంతకం వలంటీర్ల వ్యవస్థకు సంబంధించిన ఫైలుపైనే పెడతానని నాయుడుపేట బహిరంగ సభ వేదికగా ప్రకటించారు. ఇన్నాళ్లు విపక్షాలు చెబుతున్నది కూడా ఇదేకదా అని ఆ సభలోని జనం గుసగుసలాడుకోవడం కనిపించింది. వలంటీర్లు రాజకీయాల్లో వేలుపెట్టడాన్ని తొలినుంచీ ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. వలంటీర్లను కేవలం ప్రభుత్వ పథకాల అమలు వరకే వినియోగించుకోకుండా వైసీపీ కార్యకర్తల్లా వాడుకోడంపై కోర్టులను ఆశ్రయించాయి. చివరికి ఈసీ ఆదేశాలతో వలంటీర్లను తొలుత ఎన్నికల విధులకు దూరం పెట్టారు. తాజాగా పెన్షన్ల పంపిణీకి కూడా వారిని ఈసీ అనుమతించలేదు. ఈ నేపథ్యంలో జగన్ చేసిన ప్రకటన ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు వాస్తవమేనని తేల్చేశాయి. మరోవైపు ఆర్భాటాలు, అబద్ధాలతో నిండి ఉండే ఆయన ప్రసంగాలు పదేపదే విని.. విని.. విసిగిపోయిన జనాలు, జగన్ రాక ముందే జారుకున్నారు. ఆయన ప్రసంగం ప్రారంభించగానే మిగతా జనాలూ లేచి పోయారు. గ్యాలరీలు ఖాళీగా కనిపించాయి. సభా ప్రాంగణమంతా వెలవెలబోయింది. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేటలో గురువారం సీఎం జగన్ పాల్గొన్న 'మేమంతా సిద్ధం' బహిరంగసభ తీరు ఇదీ. 400 ఆర్టీసీ బస్సులు కేటాయించినా జనసమీకరణ ఆశించిన మేరకు జరగలేదు. ఆయన ప్రసంగంలో అబద్ధాలే ఎక్కువగా వినిపించాయి. 'వలంటీర్లు నా సైన్య'మంటూ కొన్ని నిజాలు కూడా ఆయన ఒప్పేసుకున్నారు. జగన్ సభా వేదికపైకి చేరుకునే సరికి గ్యాలరీలన్నీ ఖాళీగా కనిపించాయి. దీంతో రోడ్లపై ఉన్న జనాన్ని ప్రాంగణంలోకి వెళ్లాలంటూ పోలీసులు బతిమాలడం కనిపించింది. ముందు వరుస గ్యాలరీల్లో పలచగా వున్న జనం కూడా ఆయన ప్రసంగం మొదలుపెట్టిన పది నిమిషాల నుంచే వెనుదిరిగి వెళ్లిపోవడం మొదలైంది. ఇప్పటివరకూ జరిగిన 'మేమంతా సిద్ధం' సభల్లో ఇంత దారుణంగా సభ విఫలం కావడం ఇదే తొలిసారని పార్టీ వర్గాలే చర్చించుకుంటున్నాయి.

రోజంతా జనానికి నరకం

రేణిగుంట మండలం గురవరాజుపల్లిలో బుధవారం రాత్రి బస చేసిన సీఎం జగన్ గురువారం ఉదయం 10 గంటలకు బస్సు యాత్ర ప్రారంభించారు. దాదాపు 53 కిలోమీటర్ల పరిధిలో పలు గ్రామాలగుండా ప్రయాణించి నాయుడుపేటకు సాయంత్రం 5 గంటలకు చేరుకున్నారు. అయితే, పోలీసులు చేపట్టిన అతి చర్యలు రోజంతా ప్రజలకు నరకం చూపించాయి. రేణిగుంటలో జగన్ బస్సు యాత్ర ప్రారంభం కావడానికి గంట, రెండు గంటల ముందే ట్రాఫిక్ ఆపేశారు. చెన్నై, కడప, నెల్లూరు, తిరుపతి మార్గాలు నాలుగూ కీలకం కావడం, గంటకు వేల వాహనాలు ప్రయాణించే ఈ మార్గాల్లో రెండు గంటల పాటు ట్రాఫిక్ ఆపడంతో వేలాది వాహనాలు కిలోమీటర్ల కొద్దీ ఆగిపోయాయి. బస్సు యాత్ర ప్రారంభమైన అరగంట తర్వాత వాహనాల రాకపోకలకు అనుమతించినప్పటికీ ట్రాఫిక్ జామ్ కావడంతో మరో రెండు గంటల పాటు వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. వేసవిలో ఎండ ధాటికి తోడు ఉక్కపోతకు వాహనాల్లోని జనం నరకయాతన అనుభవించారు. తిరుపతి జిల్లాలో మొత్తం 1100 ఆర్టీసీ బస్సులుండగా వాటిలో 400 బస్సులను 'మేమంతా సిద్ధం' సభ కోసం తరలించారు. దీంతో ఆర్టీసీ బస్టాండ్లలో బస్సుల కొరత కొట్టొచ్చినట్టు కనిపించింది. రూట్లపై నడిచిన మిగిలిన బస్సులు కూడా జగన్ బస్సు యాత్ర కారణంగా ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోయి గంటల కొద్దీ ఆలస్యంగా నడిచాయి. దీంతో బస్టాండ్లలో గంటల పాటు ప్రయాణికులు బస్సులకోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది.


నాయుడుపేట సభలో మాట్లాడుతున్న జగన్

డ్రైవర్ల సమస్యలపై స్పందించని జగన్

శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం పొయ్య గ్రామం వద్ద జగన్...లారీ, ఆటో డ్రైవర్లతో ముఖాముఖీ సమావేశమయ్యారు. వారు సమస్యల గురించి చెబితే పట్టించుకోలేదు. అనంతపురం జిల్లా శింగనమలలో టిప్పర్ డ్రైవర్‌కు అసెంబ్లీ టికెట్ ఇచ్చానని, దాన్ని చంద్రబాబు అవహేళన చేశారని ఆరోపించారు. పలువురు డ్రైవర్లు తమ సమస్యల గురించి ప్రస్తావించగా దానిపై ఆయన ఏమాత్రం స్పందించలేదు. చివరగా మాత్రం, సూచనల పెట్టెలు రెండు ఏర్పాటు చేశామని, ఎవరైనా సలహాలు, సూచనలు చేయదలిస్తే స్లిప్పు రాసి ఆ పెట్టెల్లో వేస్తే తాను తర్వాత పరిశీలిస్తానంటూ చెప్పి నిష్క్రమించారు.

సీఎం సహాయ నిధి చెక్కు చెల్లాలంటే 40రోజులు ఆగాలట!

గురవరాజుపల్లి నుంచి బస్సు యాత్ర ప్రారంభించిన జగన్, కొంచెందూరం వెళ్లగానే వెదుళ్ల చెరువు వద్ద తండ్రీ కొడుకులు బస్సును ఆపారు. తన 12 ఏళ్ల కుమార్తె చైత్ర వినికిడి సమస్యతో బాధపడుతుంటే ఆపరేషన్ చేయించామని తండ్రి వివరించాడు. దానికి సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేయగా చెక్కు వచ్చిందని, కానీ చెల్లడం లేదని వాపోయాడు. సీఎం సహాయనిధి నుంచి సాయం అందాలంటే 40 రోజులు ఆగాలి అని సమాధానం ఇచ్చి జగన్ ముందుకు సాగిపోవడంతో వారు తెల్లబోయారు.

పచ్చి అబద్ధాలు

- వృద్ధుల మరణాలకు బాబే కారణమట!
- ఇంటివద్దే పెన్షన్లు ఇచ్చే వీలున్నా ఎండల్లో సచివాలయాల చుట్టూ తిప్పుతోంది జగన్
- బాబు వెయ్యి ఇస్తే తాను 3వేలు చేశారట!
- రూ.200 పెన్షన్‌ను 2000కు పెంచింది బాబు
- మేనిఫెస్టోను వందశాతం అమలుచేశారట
- సీపీఎస్ రద్దు, దశలవారీ మద్యనిషేధంపై మడత

ముఖ్యమంత్రి జగన్ తన ప్రసంగంలో పలు అబద్ధాలు చోటుచేసుకున్నాయి. పెన్షన్లు తీసుకునేందుకు వెళ్లి 31మంది వృద్ధులు చనిపోయారని, వారి మరణానికి చంద్రబాబే కారణమని నాయుడుపేట బహిరంగసభలో జగన్ ఆరోపించారు. సచివాలయాలకు రాలేని వృద్ధులు, వికలాంగులు,అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఇళ్ల వద్దే పెన్షన్లు అందజేసే వీలున్నా ప్రభుత్వం అలా చేయడం లేదు. చంద్రబాబుపై నెపం వేయడానికి పెన్షనర్లను ఇబ్బంది పెడుతూ సభలో మాత్రం చంద్రబాబుపై ఆరోపణలు చేశారు. చంద్రబాబు ప్రభుత్వం పెన్షన్ల కింద రూ. వెయ్యి ఇస్తుంటే తాను అధికారంలోకి రాగానే దశలవారీగా రూ.మూడువేలు చేశానని జగన్ మరో అబద్ధం చెప్పారు. వాస్తవానికి చంద్రబాబు సీఎం అయ్యేనాటికి సామాజిక భద్రతా పెన్షన్ కేవలం రూ.200. దాన్ని చంద్రబాబు తొలుత రూ.వెయ్యి చేసి.. ఆ తర్వాత రూ. 2 వేలకు పెంచారు. అమలు చేసేవి మాత్రమే ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొంటానని, మేనిఫెస్టో హామీలు వందశాతం నెరవేర్చానని మరో అబద్ధపు బాంబు పేల్చారు. నిజానికి జగన్ మేనిఫెస్టోలో చెప్పిన అంశాల్లో నెరవేర్చని హామీలే అధికం. ఉదాహరణకు అధికారంలోకి వచ్చిన వారంరోజులకే సీపీఎస్ రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తానని హామీ ఇచ్చారు. ఐదేళ్లు పూర్తవుతున్నా సీపీఎస్ రద్దు కాలేదు. అధికారంలోకి రాగానే ఏడాదికి కొంత శాతం చొప్పున మద్యం దుకాణాలు రద్దు చేసి చివరి ఏడాది మద్యపాన నిషేధం విధించాకే ఓట్లు అడుగుతానని మేనిఫెస్టోలో చెప్పారు. మద్యపాన నిషేధం విధించకుండానే ఎన్నికల ప్రచారంలోకి దిగారు.

అవనిగడ్డ బరిలో బుద్ధప్రసాద్

- జనసేన అభ్యర్థిగా ప్రకటించిన పవన్
- రైల్వేకోడూరులో భాస్కరరావు బదులు శ్రీధర్
- పాలకొండపై రేపో మాపో నిర్ణయం



అమరావతి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా అవనిగడ్డ అసెంబ్లీ స్థానంలో జనసేన అభ్యర్థిగా మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్‌ను ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఖరారుచేశారు. అవనిగడ్డ, పాలకొండ అభ్యర్థులపై గురువారం ఉదయం ఆయన పార్టీ ముఖ్య నాయకులతో చర్చించారు. తదుపరి బుద్ధప్రసాద్ అభ్యర్థిత్వాన్ని ఆమోదించారు. పాలకొండ అభ్యర్థి పేరును రెండ్రోజుల్లో ప్రకటిస్తామని పార్టీ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. అలాగే రైల్వేకోడూరు (ఎస్సీ) అభ్యర్థిని మార్చింది. మొదట ప్రకటించిన యనమల భాస్కరరావు స్థానంలో అరవ శ్రీధర్‌ను నియమించింది. క్షేత్రస్థాయి నుంచి నివేదికలు, జిల్లా నాయకుల అభిప్రాయాలను పరిశీలించారు. పవన్ పిఠాపురంలో ఉన్న సమయంలో రైల్వేకోడూరు నుంచి జనసేన, టీడీపీ నేతలు వచ్చి అక్కడి పరిస్థితిని వివరించారు. ఈ క్రమంలో శ్రీధర్ పేరును ఖరారు చేశారు.

టీడీపీ జెండాను రెపరెపలాడిద్దాం!

- తెలుగుదేశాన్ని ముందుకు తీసుకెళ్లేది కార్యకర్తలే: నారా భువనేశ్వరి
- కడప, నంద్యాల జిల్లాల్లో 'నిజం గెలవాలి' యాత్ర


చెంద్రాయుడు కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న భువనేశ్వరి

కర్నూలు(ఆంధ్రజ్యోతి), బేతంచెర్ల, ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 4: తెలుగుదేశం పార్టీని ముందుకు తీసుకెళ్లేది కార్యకర్తలేనని ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో అడ్డు వచ్చేవారిని తొక్కుకుంటూ ముందుకు వెళదామని, టీడీపీ జెండాను రెపరెపలాడిద్దామని పిలుపునిచ్చారు. చంద్రబాబు అక్రమ అరెస్టుతో మనస్తాపానికి గురై ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలను పరామర్శించేందుకు ఆమె చేపట్టిన 'నిజం గెలవాలి' యాత్ర గురువారం వైఎస్సార్ కడప, నంద్యాల జిల్లాల్లో కొనసాగింది. కడప నగరం చెమ్మూమియా పేటలో గుండెపోటుతో మృతిచెందిన టీడీపీ కార్యకర్త చెంద్రాయుడు, ప్రొద్దుటూరులోని పెద్దశెట్టిపల్లె 1వ వార్డు సభ్యురాలు కూరపాటి రాధా, నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం హెచ్.కొట్టాల గ్రామంలో టీడీపీ కార్యకర్త పువ్వాడి నాగేశ్వరరావు, ఇదే మండలంలోని గోరుమానుకొండ గ్రామానికి చెందిన తెలుగుబాల తుపాకుల వెంకటేశ్వర్లు, పాణ్యం మండలం భూపనపాడు గ్రామానికి చెందిన బోనిగెని శివరాముడు కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించి ఓదార్చారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులు తీవ్ర ఉద్వేగానికి గురయ్యారు. వారిని భువనేశ్వరి ఓదార్చి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ పార్టీకోసం, మన భవిష్యత్తుకోసం కార్యకర్తలు ముందుకు వచ్చి పోరాడాలన్నారు. చంద్రబాబు ఎప్పుడూ కార్యకర్తల గురించే ఆలోచిస్తారని చెప్పారు. వైసీపీ అరాచకానికి రాష్ట్ర వ్యాప్తంగా 256 మంది కార్యకర్తలు హత్యకు గురయ్యారని, వారి త్యాగాలు మరువలేనివని పేర్కొన్నారు.

పింఛన్ ఆపేయమని ఎవరూ చెప్పలేదు: రఘువీరా

మడకశిర, ఏప్రిల్ 4: రాష్ట్రంలో సామాజిక పింఛన్ల పంపిణీని ఆపేయాలని ఎవరూ చెప్పలేదని, రాజకీయ దురుద్దేశంతోనే రాద్ధాంతం చేస్తున్నారని సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం చందకచర్లలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. పింఛన్లు ఆపి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల జీవితాలతో ఆడుకోవద్దని సూచించారు.

ఎన్నికల ప్రచారంలో కన్నబాబుకు నిరసన సెగ

కాకినాడ రూరల్, ఏప్రిల్ 4: కాకినాడ రూరల్ మండలం నేమాంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు ఎన్నికల ప్రచారం మొదటిరోజే నిరసన సెగ తగిలింది. నేమాంలోని శివాలయంలో గురువారం కన్నబాబు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలో తమ గ్రామంలో ప్రచారం చేయవద్దంటూ మత్స్యకారులు, స్థానికులు నినదిస్తూ ఆందోళన చేశారు. గ్రామంలోని చేపలచెరువులను ఇతరులకు ఇవ్వడాన్ని నిరసిస్తూ కన్నబాబు గోబ్యాక్ అంటూ నినదించారు.

పింఛనుదారు కుమారుడిపై వలంటీర్ దాడి

టెక్కలి, ఏప్రిల్ 4: శ్రీకాకుళం జిల్లా టెక్కలిలోని చాకిపల్లి సచివాలయ పరిధిలో పింఛన్‌దారుడు కుప్పిలి అప్పారావు కుమారుడు సింహాచలంపై వలంటీర్ బొమ్మాళి తిరుపతిరావు దాడిచేశాడు. సింహాచలం బుధవారం సచివాలయం వద్దకు వెళ్లి.. తన తండ్రికి పింఛన్ సొమ్ము ఎప్పుడిస్తారని తిరుపతిరావును అడిగాడు. దీంతో 'ఇక్కడ నీకేమి పనిరా?'.. అంటూ తిరుపతిరావు తనపై దాడి చేయడమే కాకుండా కులం పేరుతో దూషించాడని సింహాచలం ఆరోపించారు. దీనిపై టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు పట్టించుకోకపోవడంతో గురువారం సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేయాలని తహసీల్దార్ మురళీకృష్ణను ఆదేశించారు.

టీడీపీ ర్యాలీలో పాల్గొన్నాడని.. వైసీపీ దాడి


నాగేంద్ర

ధర్మవరం, ఏప్రిల్ 4: శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ ఆధ్వర్యంలో గురువారం టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ర్యాలీ నిర్వహించారు. 27వ వార్డుకు చెందిన టీడీపీ అభిమాని నాగేంద్ర ఈ ర్యాలీలో పాల్గొని తిరిగి వస్తుండగా.. ఆ వార్డు వైసీపీ ఇన్‌చార్జి సరితాల బాషా, రామ్మోహన్‌రెడ్డి, అశోక్ అడ్డుకుని దాడి చేశారు. 'మా ముందే టీడీపీ కండువా వేసుకుని వెళతావా?' అని దుర్భాషలాడుతూ విచక్షణా రహితంగా కొట్టారని బాధితుడు కంటతడి పెట్టుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని, తనపై దాడి చేసినవారి నుంచి ఫిర్యాదు తీసుకున్నారని వాపోయాడు.

పింఛన్ కోసం 8 కి.మీ. నడిచి గిరిజనుడికి అస్వస్థత


సొమ్మసిల్లిపడిపోయిన గుడ్డయ్య

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 4: ఓ గిరిజనుడు పింఛన్ కోసం కొండ దిగి 8 కిలోమీటర్ల దూరం నడిచి సచివాలయానికి వచ్చాడు. తొలిరోజు సిబ్బంది డబ్బుల్లేవని చెప్పడంతో తిరిగి ఇంటికి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం మళ్లీ బయల్దేరాడు. అయితే మార్గమధ్యంలో ఎండకు సొమ్మసిల్లిపడిపోయాడు. విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం చిలకపాడు గ్రామానికి చెందిన జన్ని గుడ్డయ్య బుధవారం పింఛన్ కోసం 8 కి.మీ. దూరంలో ఉన్న అమ్మపాలెం సచివాలయానికి నడిచి వచ్చారు. అక్కడి సిబ్బంది డబ్బులు లేవని చెప్పడంతో నిరాశతో వెనుదిరిగి పోయాడు. తిరిగి గురువారం పింఛన్ తీసుకునేందుకు బయలుదేరి కొండ దిగుతుండగా తీవ్రమైన ఎండ కారణంగా సొమ్మసిల్లి పడిపోయారు. కొద్దిసేపటి తర్వాత ఇదే మార్గంలో వెళ్తున్న జన్ని భీమయ్య కింద పడిపోయిన గుడ్డయ్యను గమనించారు. వెంటనే తన వద్ద ఉన్న మంచినీటిని తాగించి సపర్యలు చేయడంతో గుడ్డయ్య కోలుకున్నాడు. ఆ సమయంలో భీమయ్య రాకుంటే గుడ్డయ్య పరిస్థితి ఎలా ఉండేదోనని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి అప్పారావును వివరణ కోరగా తాము గురువారం దారపర్తి గిరిజన గ్రామాల్లో 130 పింఛన్లు ఇచ్చామని.. శుక్రవారం గూనపాడు, పాత చిలకపాడు ఇస్తామని లబ్ధిదారులకు చెప్పామని తెలిపారు.

టీడీపీలో చేరిన కొవ్వూరు వైసీపీ ఎంపీపీ

కొవ్వూరు, ఏప్రిల్ 4: తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు వైసీపీ ఎంపీపీ కాకర్ల నారాయుడు, వాడపల్లి, దొమ్మేరు ఎంపీటీసీలు ఇంజేటి మౌనిక, వాడవెల్లి సూరిబాబు, వాడపల్లి సర్పంచ్ గెల్లా ప్రసాద్, నారాయుడు అనుచరులు 400 మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

నిబంధనల మేరకే జనసేనకు 'గాజుగ్లాసు'!

- కేంద్ర ఎన్నికల సంఘం తరపున హైకోర్టులో వాదన
- గుర్తు కేటాయింపు వ్యాజ్యంపై ముగిసిన వాదనలు.. తీర్పు రిజర్వ్



అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం గాజుగ్లాసు గుర్తు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై గురువారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఇరువైపుల వాదనలు ముగియడంతో న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ గురువారం ఆదేశాలిచ్చారు. జనసేన పార్టీకి గాజుగ్లాసు గుర్తు కేటాయించడంతో పాటు అందుకు సంబంధించిన రికార్డును కోర్టు ముందు ఉంచేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్(సెక్యులర్) పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజమహేంద్రవరానికి చెందిన మేడా శ్రీనివాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా పిటిషనర్ తరపు న్యాయవాది ఎంవీ రాజారామ్ వాదనలు వినిపించారు. పిటిషనర్ పార్టీ, జనసేన పార్టీ గుర్తింపులేని రిజిస్టర్డ్ పార్టీ నిర్వచనం పరిధిలోకి వస్తాయన్నారు. గాజుగ్లాసు గుర్తు కోసం పిటిషనర్ పార్టీ ఈ ఏడాది డిసెంబరు 20న దరఖాస్తు చేసుకుందన్నారు. అయితే, పిటిషనర్ దరఖాస్తును ఎన్నికల సంఘం పరిగణలోకి తీసుకోలేదన్నారు. డిసెంబరు 12న జనసేన పార్టీ చేసిన దరఖాస్తు నిబంధనలకు అనుగుణంగా లేదన్నారు. ఈసీఐ పనివేళలు ప్రారంభానికి ముందే దరఖాస్తు సమర్పించినందున అది చెల్లుబాటు కాదన్నారు. కానీ, చట్టనిబంధనలకు విరుద్ధంగా కేంద్ర ఎన్నికల సంఘం గాజుగ్లాసు గుర్తును జనసేనకు కేటాయించిందన్నారు. జనసేన తరఫున సీనియర్ న్యాయవాది వేణుగోపాలరావు వాదనలు వినిపిస్తూ... పిటిషనర్ వాదనలో అర్థం లేదన్నారు. అన్ని రికార్డులను జతచేసి గాజుగ్లాసు గుర్తు కోసం జనసేనపార్టీ గత ఏడాది డిసెంబరు 12న దరఖాస్తు చేయగా, ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ విధానంలో కేంద్ర ఎన్నికల సంఘం గాజుగ్లాసు గుర్తును జనసేనకు కేటాయించిందని తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్, న్యాయవాది సత్య శివదర్శన్ వాదనలు వినిపిస్తూ.. చట్ట నిబంధనల మేరకే జనసేనపార్టీకి గాజుగ్లాసు గుర్తు కేటాయించామన్నారు. అసెంబ్లీ కాలపరిమితి ముగియడానికి ఆరునెలల ముందు గుర్తుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుత అసెంబ్లీ కాలపరిమితి ఈ ఏడాది జూన్ 11తో ముగుస్తుందన్నారు. ఈ నేపథ్యంలో గత ఏడాది డిసెంబరు 12న దరఖాస్తులు ఆహ్వానించగా, జనసేన పార్టీ గాజుగ్లాసు గుర్తు కేటాయించాలని అదే రోజు దరఖాస్తు చేసిందన్నారు. పిటిషనర్ డిసెంబరు 20 దరఖాస్తు చేయగా, అదే నెల 26న ఆ దరఖాస్తు ఎన్నికల సంఘానికి అందిందన్నారు. దానికి సంబంధించిన రికార్డులు, ఇతర వివరాలను కోర్టు ముందుంచారు. ఇరువైపుల వాదనలు ముగియడంతో న్యాయమూర్తి తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించారు.


తిరుమల ఆలయం ముందు కుటుంబ సభ్యులతో జస్టిస్ గోపాలకృష్ణారావు

శ్రీవారి సేవలో జస్టిస్ గోపాలకృష్ణారావు

తిరుమల, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాలకృష్ణారావు గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో న్యాయమూర్తి ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు.

నంద్యాల జిల్లాలో రూ.91 లక్షలు సీజ్

- బెంగళూరు నుంచి లారీలో తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు


స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న డోన్ పోలీసులు

బనగానపల్లె, ఏప్రిల్ 4: బెంగళూరు నుంచి లారీలో అక్రమంగా తరలిస్తున్న రూ.91లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు బనగానపల్లె సీఐ సుబ్బారావు తెలిపారు. గురువారం తెల్లవారుజామున డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా బనగానపల్లె మండలంలోని పసుపుల గ్రామ సమీప చెక్‌పోస్టు వద్ద బెంగళూరు నుంచి వస్తున్న లారీలో ఒక బాక్సులో ఉంచిన రూ.91 లక్షలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ సయ్యద్ మహబూబ్‌బాషాను విచారించగా నగదుకు సంబంధించిన ఎలాంటి పత్రాలూ చూపలేదు. దీంతో ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకుని ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు డోన్ డీఎస్పీ శ్రీనివాస రెడ్డి, సీఐ సుబ్బారావులు తెలిపారు.

మా కేసుల వివరాలు అందజేయాలి

- హైకోర్టునాశ్రయించిన పలువురు అభ్యర్థులు
- వివరాలు సమర్పించాలని పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో తమపై నమోదైన కేసుల వివరాలు అందజేసేలా రాష్ట్ర డీజీపీ, జిల్లా ఎస్పీలను ఆదేశించాలని కోరుతూ ఎన్నికల్లో పోటీచేస్తున్న పలువురు అభ్యర్థులు దాఖలు చేసిన వ్యాజ్యాలు గురువారం హైకోర్టు విచారణ జరిపింది. ఈ వ్యవహారం పై పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను ఆదేశిస్తూ విచారణను ఏప్రిల్ 12కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి గురువారం ఆదేశాలిచ్చారు. టీడీపీ సీనియర్ నేత, మాజీమంత్రి అయ్యన్నపాత్రుడు, టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, బొండా ఉమామహేశ్వరరావు, భారత చైతన్య యువజనపార్టీ అధ్యక్షుడు బి. రామచంద్రయాదవ్ హైకోర్టులో వేర్వేరుగా ఈ పిటిషన్లు దాఖలు చేశారు. గురువారం జరిగిన విచారణలో పిటిషనర్ల తరపున న్యాయవాదులు వీవీ సతీష్, పీవీజీ ఉమేశ్‌చంద్ర, తదితరులు వాదనలు వినిపించారు. రానున్న జనరల్ ఎన్నికల్లో పిటిషనర్లు పోటీ చేయబోతున్నారని, వారిపై నమోదైన కేసుల వివరాలు నామినేషన్ పత్రాల్లో ప్రస్తావించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో పిటిషనర్లపై నమోదైన కేసుల వివరాలు అభ్యర్థులకు అందజేసేలా పోలీసులను ఆదేశించాలని కోరారు.

ప్రజాధనాన్ని దోచుకున్న పెద్దిరెడ్డి: కిరణ్



పుంగనూరు, ఏప్రిల్ 4: భూములు లాక్కోవడం, ఇసుక, మద్యం, మైనింగ్ మాఫియా ద్వారా ప్రజాధనాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు, ఎంపీ మిథున్‌రెడ్డి దోచుకున్నారని మాజీ సీఎం, రాజంపేట లోక్‌సభ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో గురువారం టీడీపీ, బీజేపీ, జనసేన నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. నియోజకవర్గంలో పాడి, మామిడి రైతులపై దౌర్జన్యాలు, అరాచకాలు చేసి వారి కడుపు కొట్టిన పెద్దిరెడ్డిని, మిథున్‌రెడ్డిని ఓడించాలని పిలుపునిచ్చారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఇజ్రాయెల్ ఉన్మాదం

యుద్ధానికి కూడా హద్దులుంటాయి, నీతినియమాలుంటాయి. హమాస్‌తో పోరులో ఇజ్రాయెల్ నానావిధ అతిక్రమణలకూ పాల్పడుతోంది, అత్యంత అమానవీయంగా వ్యవహరిస్తోంది. గాజాలో ఆపన్నులకు కాస్తంత సాయాన్ని అందిస్తున్న ఏడుగురు వర్కర్లను ఇజ్రాయెల్ దళాలు కాల్చివేయడం, మిగిలివున్న ఆ ఒక్క ప్రధాన ఆస్పత్రిని కుప్పకూల్చడం, పొరుగుదేశంలోని మరోదేశం కాన్సులేట్ మీద దాడిచేసి కీలకమైన వ్యక్తులను చంపివేయడం వంటి చర్యలు ఇజ్రాయెల్ మిగతాప్రపంచానికి ఎంతమాత్రం జడవడం లేదనడానికి నిదర్శనం. ఈ వరుస సంఘటనలపట్ల ఇజ్రాయెల్ ప్రతిస్పందన చూసినప్పుడు అది శత్రువులకూ, మిత్రులకూ కూడా జవాబుదారీగా ఉండదల్చుకోలేదని అర్థమవుతుంది.

స్వచ్ఛంద సంస్థ 'వరల్డ్ సెంట్రల్ కిచెన్'కు చెందిన ఏడుగురు సహాయకులను సోమవారం ఇజ్రాయెల్ చంపివేయడం పొరపాటున జరిగిందని ఎవరూ అనుకోవడం లేదు. యుద్ధం అన్నాక ఇటువంటివి సహజం అని ఇజ్రాయెల్ అధినేత బెంజమీన్ నెతన్యాహూ ఎంతో తేలికగా ఈ ఘటనను తీసిపారేశారు. కానీ, ఉద్దేశపూర్వకంగానే ఇజ్రాయెల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్) తమ వాహనం మీద దాడిచేశాయని ఈ చారిటీ సంస్థ అధినేత ఆరోపిస్తున్నారు. ఆ వాహనం ఒక సహాయక సంస్థదని తెలియచెప్పే గుర్తులు దాని మీద స్పష్టంగా ఉన్నాయి. పైగా ఐడీఎఫ్‌తో సమన్వయం చేసుకుంటూ ఘర్షణలేని ప్రాంతం గుండా అది ప్రయాణిస్తున్నప్పుడు ఈ దాడి జరిగింది. మూడుసార్లు కాల్పులు జరపడం, కొందరు చనిపోగా, పారిపోతున్న మిగతా సహాయకసిబ్బందిని కూడా వదిలిపెట్టకుండా హతమార్చడం వంటివి గమనించినప్పుడు ఇజ్రాయెల్ దళాలు పొరపాటుపడ్డాయని అనుకోలేం. మరణించినవారిలో బ్రిటన్, అమెరికా పౌరులు ఉన్నందువల్ల కాబోలు, నెతన్యాహూ ఈ ఘటనను అంగీకరించారు కానీ, అది ఉద్దేశపూర్వకమైనది కాదన్నారు.

ఇంతటి ఘోరమైన సంఘటమీద కూడా అమెరికా, బ్రిటన్‌లు తీవ్రంగా స్పందించలేకపోయాయి. జరిగిన దానిమీద లోతైన దర్యాప్తు చేయించమని బ్రిటన్ తిరిగి ఇజ్రాయెల్‌నే అడిగిందంటే అగ్రదేశాలు ఎంతగా సాగిలబడ్డాయో అర్థమవుతుంది. పచ్చి అబద్ధాలు, మోసాలతో యుద్ధాన్ని సాగిస్తున్న ఇజ్రాయెల్ నుంచి నిజాలు బయటకురావని వాటికి మాత్రం తెలియదా? పారదర్శకతకు పాతరేసి, నిర్లక్ష్యంగా, బాధ్యతారాహిత్యంగా ముప్పైమూడువేల మంది పాలస్తీనియన్లను ఊచకోతకోసి, గాజాను నేలమట్టంచేసి, లక్షమందిని నిరాశ్రయులుగా మార్చిన ఇజ్రాయెల్ ఇకమీదట తన తప్పులు బయటకు పొక్కకుండా, క్షేత్రస్థాయి సమాచారాన్ని తెలియనివ్వకుండా మరిన్ని అదనపు జాగ్రత్తలు తీసుకుంటోంది. గాజాలో ఘోరాలను బయటి ప్రపంచానికి తెలియచెబుతున్న అల్ జజీరా చానెల్‌మీద అది ప్రత్యేకంగా కక్షకట్టింది. నచ్చని విదేశీ చానెళ్ళను గెంటివేసే అధికారాలను నెతన్యాహూ తన మంత్రులకు కట్టబెట్టారు. విదేశీ సహాయకులమీద ఉద్దేశపూర్వకంగా జరిపిన ఈ దాడిద్వారా పాలస్తీనియన్లకు అందుతున్న ఆ కాసింత సాయాన్ని కూడా అడ్డుకోవాలని ఇజ్రాయెల్ ఉద్దేశం. హమాస్ అభిమానులతోనూ, ఉగ్రవాదులతోనూ ఐక్యరాజ్యసమితి సహాయక సంస్థ 'యుఎన్ఆర్‌డబ్ల్యుఏ' నిండిపోయిందని ఆరోపిస్తూ, దానికి సరఫరాలు జరగకుండా అడ్డుపడుతూ పాలస్తీనాలో దాని ఉనికే లేకుండా చేయాలన్నది ఇజ్రాయెల్ ఆలోచన. తద్వారా మరిన్ని వేలమంది తమకు తాముగా చనిపోయేట్టు చేస్తున్నది.

ఇక, ఏప్రిల్ ఒకటిన సిరియా రాజధాని డమాస్కస్‌లోని ఇరాన్ కాన్సులేట్ భవనంమీద క్షిపణి దాడిచేసి, రివల్యూషనరీ గార్డ్స్ ఉన్నతస్థాయి కమాండర్లను ఇజ్రాయెల్ చంపివేయడం ప్రమాదకరమైన చర్య. ప్రతీకారం తీర్చుకొని తీరుతానని ఇరాన్ వెంటనే హెచ్చరించింది. ఆ దేశం కానీ, దాని అండదండలతో దాడులు చేస్తున్న హౌతీ, హిజ్‌బుల్లా ఇత్యాది సంస్థలు కానీ తనను ఏమీ చేయలేవని ఇజ్రాయెల్‌కు గట్టినమ్మకం ఉన్నట్టుంది. కానీ, ఇరాన్ అధినేత హెచ్చరికల నేపథ్యంలో ప్రతీకారం ఏదో ఒక స్థాయిలో ఉంటుందన్నది వాస్తవం. ప్రతిదాడులు జరిపే హక్కు తనకు ఉందని భద్రతామండలి సమావేశంలో ఇరాన్ విస్పష్టంగా ప్రకటించింది. హమాస్‌ను సమూలంగా నిర్మూలించేవరకూ యుద్ధం కొనసాగుతుందని చెబుతూ చిత్తంవచ్చినట్టు వ్యవహరిస్తున్న ఇజ్రాయెల్‌ను వెంటనే దారికితెచ్చి కాల్పుల విరమణకు ఒప్పించకపోతే, యుద్ధం విస్తరించి, చర్చలకు కూడా వీల్లేని పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉంది.

మోదీకి ఎమర్జెన్సీ అవసరమే లేదు!



ఇందిరాగాంధీ ఏదో కంగారులో, కొడుకు సంజయ్‌గాంధీ బృహత్ ఆకాంక్షల ప్రోద్బలంతో, దేశంలో అత్యవసరస్థితిని ప్రకటించారు. ఇందిరాగాంధీతో పోలిస్తే మోదీ రాజకీయంగా మరింత తెలివైనవాడు, మరింత నిర్దయగలవాడు. ప్రస్తుతం ఉన్న చట్టాలతోనే ప్రతిపక్షాన్ని భయపెట్టగలిగినప్పుడూ, ఎలా చెప్తే అలా లొంగి నడుచుకునే మీడియా చుట్టూ ఉన్నప్పుడూ ఇక ఎమర్జెన్సీని వాడాల్సిన పనేముంది?



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

ఢిల్లీ రామ్‌లీలా మైదాన్‌లో ప్రతిపక్షాలు జరిపిన 'సేవ్ డెమాక్రసీ' ర్యాలీలో 2024 ఎన్నికలకు ఒక ఎజెండాను నిర్దేశించే లక్ష్యంతో 'బీజేపీ వెర్సస్ డెమాక్రసీ' అనే పెద్ద బ్యానర్‌ను ప్రదర్శించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష నేతలందరూ ఇలా ఏకమయ్యారు. 'నియంతృత్వం నుంచి ప్రజాస్వామ్యాన్ని రక్షించటం' అన్నమాట ఇక్కడ పలుమార్లు వినిపించింది. అచ్చంగా ఇదే నినాదంమీద చారిత్రాత్మక 1977 ఎన్నికల్లో ప్రతిపక్షాలన్నీ ఏకమయ్యాయి. ఇందిరాగాంధీ అంతటి బలమైన శక్తిని ఓడించాయి. కానీ కాస్త లోతుగా పరిశీలిస్తే, 2024కీ 1977కీ చాలా తేడా ఉంది, నరేంద్ర మోదీకీ ఇందిరాగాంధీకీ పోలిక లేదు.

మొదటి విషయమేమిటంటే– ఇరవై ఒక్క నెలల పాటు సాగిన ఎమర్జెన్సీ కాలంలో వందలాది మంది రాజకీయ నేతల, ఉద్యమకారుల అరెస్టుతో, ఇప్పుడు ఇద్దరు ప్రతిపక్ష ముఖ్యమంత్రుల అరెస్టును పోల్చలేం. ప్రతిపక్షాలను అణచివేయటానికి ప్రభుత్వ సంస్థలను ఆయుధాలుగా వాడటమన్నది నాటి పదవీ దుర్వినియోగాన్ని గుర్తుకు తెచ్చినా, దీన్ని ఎమర్జెన్సీ కాలంతో పోల్చటమంటే మరీ దూరం వెళ్ళినట్టే. ప్రభుత్వానికి ఏ మాత్రం పోటీ ఇవ్వలేని బలహీనమైన ప్రతిపక్షమే ఉన్నప్పటికీ, మరీ 'ప్రతిపక్ష రహిత భారతం' అన్న మాట వాడే దశలో ఇంకా లేము. దీనికి మహారాష్ట్రలో ప్రతిపక్షం ఇస్తున్న బలమైన పోటీ ఒక ఉదాహరణ.

రెండో విషయం– అతుకులబొంత లాంటి నేటి ప్రతిపక్ష కూటమి 'ఇండియా'తో పోలిస్తే, 1977ల నాటి ప్రతిపక్షం ఎంతో రాజకీయ అనుభవాన్ని, ప్రతిష్ఠను కలిగి ఉండేది. నాడు సోషలిస్ట్, జనసంఘ్ వంటి విభిన్న శక్తులు తీవ్రమైన కాంగ్రెస్ వ్యతిరేకత పునాదిగా ఏకమై రాత్రికి రాత్రి జనతా పార్టీకి పోత పోశాయి. స్వాతంత్ర్య సమరయోధుడైన జయప్రకాష్ నారాయణ్ ఆ కూటమికి ఒక నైతికమైన వెన్నెముకగా నిలిచారు. మొన్న రామ్‌లీలా మైదాన్‌లో గుమికూడిన వారిలో ఒక్కరైనా జయప్రకాష్ నారాయణ్ లాంటి నీతిబద్ధమైన నాయకత్వాన్ని గుర్తు తేగలరా? మోదీపై వ్యతిరేకత నేటి ప్రతిపక్షాల్ని పైస్థాయిల్లో ఏకం చేస్తున్నప్పటికీ, కింది స్థాయిల్లో వాటి మధ్య ఘర్షణ వాతావరణం ఇంకా సమసిపోలేదు. పంజాబ్‌లో ఆప్ – కాంగ్రెస్ వైరం, బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌తో కాంగ్రెస్ కమ్యూనిస్ట్ పార్టీల వైరం, మరో పక్క కేరళలో కాంగ్రెస్ కమ్యూనిస్ట్ పార్టీల మధ్య వైరం కొనసాగుతూనే ఉంది.

మూడో విషయం– ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడవేయటం అనే అంశంలో ఈ ప్రతిపక్షాలేవీ తక్కువ తినలేదు. నియంతల్లా ప్రవర్తించిన ముఖ్యమంత్రులు ప్రతిపక్షంలో చాలామంది ఉన్నారు. వెస్ట్ బెంగాల్, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర (వికాస్ అగాడీ పాలన)ల్లో భిన్నాభిప్రాయం వెల్లడించిన గొంతులు కఠిన శిక్షలను ఎదుర్కొన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను ఒక ఆయుధంగా వాడుకున్నట్టే ఈ రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక పోలీస్ యంత్రాంగాన్ని వాడుకున్నాయి.

నాలుగో విషయం– ప్రజాస్వామ్య విలువల్ని కాపాడాల్సిన ఆవశ్యకత కాలక్రమేణా ప్రజల దృష్టిలో ఏమంత ప్రాధాన్యత గల విషయం కాకుండా పోయింది. ఇందుకు భిన్నంగా 1977లో ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు సన్నగిల్లడంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం పెల్లుబికింది. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో ఇందిరాగాంధీ ప్రభుత్వం అమలు చేసిన బలవంతపు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు దీనికి కారణమయ్యాయి. ఎమర్జెన్సీ చర్యల ప్రభావం అంతగా పడని దక్షిణాది నుంచి మాత్రం కాంగ్రెస్‌కు మద్దతు లభించింది. పైపెచ్చు ప్రజాస్వామిక విలువలు మనగలిగేందుకు బలమైన చోదక శక్తిగా నిలిచే పట్టణ మధ్యతరగతి వర్గం 1970ల నాటితో పోల్చి చూస్తే ఇప్పుడు ఎంతో భిన్నమైన సామాజిక – ఆర్థిక వర్గంగా మారింది. వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ ఆధారిత ఆర్థిక వ్యవస్థలో పట్టణాల్లో ప్రమాణాలూ, విలువలూ సన్నగిల్లుతాయి. 'నాకు నేను ముఖ్యం' తరహా జీవన శైలికి అలవాటుపడిన పౌరులు రాజకీయ ఉద్యమాలకు దూరం జరుగుతారు. స్వలాభానికి నష్టం వాటిల్లే పరిస్థితి ఉన్నప్పుడు మాత్రమే వారు ఉద్యమాల వైపు అడుగులు వేస్తారు. పేపర్ లీకేజీలకు నిరసనగా రోడ్డెక్కిన యువతను, రైతు చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన రైతాంగాన్నీ ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఇక మిగిలిన ప్రజా బాహుళ్యమంతా ఆన్‌లైన్ ఉద్యమాలకే పరిమితం అవుతుంది. దేశంలో నియంతృత్వం గురించి ధ్రువ్ రాఠీ అనే యూట్యూబర్ చేసిన వీడియోను ఆవేశంగా షేర్ చేయటంతోనే రాజ్యాంగ స్వేచ్ఛలను పరిరక్షించే పోరాటంలో వీరి పాత్ర ముగిసిపోతుంది. 1970ల్లోని పరిస్థితి వేరు. అప్పటికింకా ట్రేడ్ యూనియన్లు, పౌర హక్కుల సంఘాలు, ఆదర్శవాద రాజకీయాలు సజీవంగా ఉన్నాయి. ప్రజాస్వామిక ఆవరణ కోసం పోరాడటం అనేది అప్పటికి ఎంతో ముఖ్యమైన అంశం. ఇప్పుడు పరిస్థితి వేరు. ఇప్పుడు అంతా వాట్సాప్ మెసేజీలకే పరిమితం.

చిత్రమేమిటంటే, పట్టణ మధ్యతరగతి ఆగ్రహావేశాలతో ఉప్పొంగి, రాజకీయ వర్గాల్ని కుదిపివేసిన ఆఖరు ఘట్టంలో కేజ్రీవాల్ కూడా ఉన్నారు. 2011లో కేజ్రీవాల్, ఆయన బృందం కలిసి అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని మొదలు పెట్టిన సందర్భమది. మొత్తం రాజకీయ వర్గమంతటికీ వ్యతిరేకంగా రాజకీయాల్ని శుద్ధి గావించే ఉద్యమంగా అది పేరుమోసింది. 'నేతలందరూ దొంగలే' (సబ్ నేతా చోర్ హై) అన్న నినాదంతో పాలక వర్గాల తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నవారంతా రోడ్ల మీదకొచ్చి ప్రదర్శనలు చేశారు. అప్పటికి కేజ్రీవాల్ వ్యవస్థలను వ్యతిరేకిస్తున్న ఒక బైటి మనిషి. ఆయన ఏ శక్తులపై అప్పుడు దాడి చేశారో అదే శక్తులతో ఇప్పుడు జట్టు కట్టారు. నాడు 'అవినీతి వ్యతిరేక' ఉద్యమానికి నాయకత్వం వహించిన మనిషి కాలచక్రం గిర్రున తిరిగేసరికి నేడు ఢిల్లీ లిక్కర్ పాలసీ మచ్చను చెరిపివేసుకోవటానికి తాను అవినీతి ఆరోపణల్ని ఎక్కుపెట్టినవారితోనే కలిసి ప్రయత్నిస్తున్నాడు. ఇలా స్వీయరక్షణ కోసం ఏర్పాటైన రాజకీయ అమరికకు విశ్వసనీయత ఎలా వస్తుంది, అది ఎన్నాళ్ళని కొనసాగుతుంది?

మరో పరస్పర విరుద్ధమైన విషయం ఏమిటంటే– రాజకీయ నేతలపై తీవ్ర వ్యతిరేకత సృష్టించిన కేజ్రీవాల్ 'అవినీతి వ్యతిరేక ఉద్యమం' నుంచి అతిపెద్ద లబ్ధి పొందింది ఎవరంటే ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. మన్మోహన్ సింగ్ ప్రభుత్వం కుప్పకూలిన శిథిలాల మధ్య నుంచి మోదీ అధికారం వైపు అడుగులు వేశారు. ఆయన ఇందిరాగాంధీ దగ్గర నుంచి కొన్ని కిటుకులు అరువు తెచ్చుకున్నారు. ముఖ్యంగా రాజ్యాంగ వ్యవస్థలపై పూర్తి నియంత్రణ కోసం అన్ని రకాల వ్యవస్థాగతమైన అడ్డంకులను నిర్మూలించటంలో.

ఇందిరాగాంధీతో పోలిస్తే మోదీ రాజకీయంగా మరింత తెలివైనవాడు, మరింత నిర్దయగలవాడు. ఇందిరాగాంధీ ఏదో కంగారులో, కొడుకు సంజయ్‌గాంధీ బృహత్ ఆకాంక్షల ప్రోద్బలంతో, దేశంలో అత్యవసరస్థితిని ప్రకటించారు. కానీ మోదీ రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యానికి తలొగ్గి పని చేస్తున్నానని ప్రకటిస్తూనే దాన్ని ఎన్నికల నియంతృత్వంవైపు, మెజారిటేరియన్ మతస్వామ్యంవైపు ఒక క్రమ పద్ధతిలో ముందుకు నెడుతున్నారు.

ప్రస్తుతం ఉన్న చట్టాలతోనే ప్రతిపక్షాన్ని భయపెట్టగలిగినప్పుడూ, ఎలా చెప్తే అలా లొంగి నడుచుకునే మీడియా చుట్టూ ఉన్నప్పుడూ ఇక ఎమర్జెన్సీని వాడాల్సిన పనేముంది? ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్‌కు బెయిల్ ప్రొవిజన్ సవరణలను పార్లమెంటులో మనీ బిల్లుగా ప్రవేశపెడితే, దానికి అనూహ్యంగా సుప్రీంకోర్ట్ బెంచ్ నుంచి ఆమోదం లభించింది. పదవీ విరమణకు దగ్గర్లో ఉండి ఆ బెంచ్‌కు నేతృత్వం వహించిన జడ్జి ఇప్పుడు లోక్‌పాల్! అవినీతి వ్యతిరేకత ముసుగులో రాజకీయ వైరాల్ని లెక్క తేల్చుకోవటానికి ఇలా ఒక అమానుషమైన చట్టాన్ని వాడుకున్నారు. ఈ క్రమంలో 'జెయిల్ కాదు బెయిల్' అనే ప్రాథమిక సూత్రం మరుగున పడిపోయింది. ప్రతీకార రాజకీయాలు చట్టబద్ధత పొందాయి. అందుకే చెప్పేది– స్వాతంత్ర్యానంతర భారతదేశంలో ఇదివరకెన్నడూలేని ఎన్నికల యంత్రాంగం మద్దతుతో నిలబడిన ఈ రాజకీయ నాయకుడిని ఎదుర్కోవటానికి ప్రతిపక్షాలు చేపడుతున్న 'ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం' లాంటి ప్రదర్శనలు చాలవు, అంతకుమించి కావాలి.

తాజా కలం: ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన ఒక సర్వే ప్రకారం 67శాతం మంది భారతీయులు 'పార్లమెంట్ జోక్యం గానీ కోర్టుల జోక్యం గానీ లేకుండా ఒక బలమైన నాయకుడు నిర్ణయాలు తీసుకోగలిగే వ్యవస్థ దేశానికి అవసరం' అని కోరుకుంటున్నారు. ఇలా కోరుకునేవారి సంఖ్య 2017లో 55శాతం ఉండేది. మరి ఇక ప్రజాస్వామ్యానికి దిక్కేది?

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

వికృతచర్యతో విద్యావ్యవస్థకు పాతర

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో విద్యావ్యవస్థను ప్రభుత్వమే నిర్వీర్యం చేస్తోంది. విద్యారంగం అభివృద్ధి చెందితేనే సామాజిక చైతన్యం వికసిస్తుంది, విలువలు పరిరక్షించబడతాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయి చిన్నారుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. పాఠశాలల విలీనం, బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల రద్దు, మధ్యాహ్న భోజన పథకం అస్తవ్యస్తం, బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు, బోధన, బోధనేతర సిబ్బంది నియామకాల్లో అలసత్వం, మౌలికసౌకర్యాల గురించి పట్టించుకోకపోవడం వంటివి విద్యారంగానికి శాపంగా మారాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదపిల్లలు ఉన్నత చదువులకు వెళ్లేలా చేశాం, ప్రభుత్వబడుల్లో ఆణిముత్యాల్ని తీర్చిదిద్దే విద్యావిధానాన్ని తీసుకొచ్చాం అని చాటుకుంటూనే ఈ ప్రభుత్వం బడులకు తాళాలు వేసి పేదపిల్లల చదువులను చట్టుబండలు చేసింది.

గత ఏడాదితో పోల్చితే ఈ సంవత్సరం విద్యార్థులకు అందించే ట్యాబుల్లో పాలకులు 25,379 ట్యాబులను కోతపెట్టారు. బహిరంగ మార్కెట్లో ఒక్కో ట్యాబ్ ధర రూ.11,200లు మాత్రమే ఉంటే, రూ.15,500లకు కొన్నట్టు లెక్కలు చూపించి గడచిన రెండేళ్లలో రూ.470 కోట్లు కమీషన్లు కొట్టేశారు. నాడు–నేడు పేరుతో, ప్రభుత్వ పాఠశాలలకు రంగులేసే నెపంతో, ఇతర పనులు చేసినట్టు చెప్పి రూ.3వేల కోట్లు దోచుకున్నారు. పాఠశాల ప్రాంగణాల్లో రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి హైకోర్టుతో మొట్టికాయలు వేయించుకున్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కూళ్లు ఏర్పాటుచేసి 2,45,000 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తే, జగన్ సర్కార్ ఏకంగా ఆ పథకాన్నే రద్దు చేయడం తెలివిమాలిన చర్య.



టీచర్ల కొరత, పాఠ్యపుస్తకాల కొరత, బట్టల కొరత, తాగునీటి కొరతలతో విద్యావ్యవస్థను అధఃపాతాళానికి నెట్టేసింది రాష్ట్ర ప్రభుత్వం. గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 1,73,416 మంది విద్యార్థులు మధ్యలోనే చదువు మానేశారు. పెత్తందారీ విధానం రూపుమాపడం అంటే పేదపిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలు మూసి వేయడమా? పేదవిద్యార్థులను ప్రాథమిక విద్యకు దూరం చేయడమే వారిని అభ్యున్నతివైపు నడిపించడమా?

దీనికి తోడు టీచర్ల కొరత, పాఠ్యపుస్తకాల కొరత, బట్టల కొరత, తాగునీటి కొరత.. ఇలా అన్నిరకాల కొరతలతో విద్యావ్యవస్థను అధఃపాతాళానికి నెట్టేసింది. గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 1,73,416 మంది విద్యార్థులు మధ్యలోనే చదువు మానేశారు. పెత్తందారీ విధానం రూపుమాపడం అంటే పేదపిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలు మూసి వేయడమా? ప్రైవేటుబడులతో పోటీపడటం అంటే ప్రాథమిక పాఠశాలలకు తాళాలు వేయడమా? పేదవిద్యార్థులను ప్రాథమిక విద్యకు దూరం చేయడమే వారిని అభ్యున్నతి వైపు నడిపించడమా? దాదాపు 9 వేల ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కొక్క టీచర్ మాత్రమే ఉన్నారు.

ఏ రాష్ట్రంలోనూ లేనన్ని సంక్షేమహాస్టళ్ళు మనరాష్ట్రంలో ఉన్నా వాటిలోని వసతులు పరమ అధ్వానంగా ఉండడంతో విద్యార్థుల శాతం తగ్గిపోతోంది. ప్రభుత్వం ఇచ్చే ఛార్జీలు సరిపోక హాస్టల్ విద్యార్థులు రోడ్డెక్కుతున్నారు. రాష్ట్రంలో 10 లక్షలకు పైగా నిరుద్యోగులు డీఎస్సీ నోటిఫికేషన్ కోసం సంవత్సరాలుగా ఎదురుచూస్తుంటే ఎన్నికలు వస్తున్నాయని ఆగమేఘాల మీద ఉపాధ్యాయ ఎంపిక ప్రక్రియను ప్రకటించి కేవలం 6,100 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేశారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అయిదేళ్లుగా ఒక్క డీఎస్సీ నిర్వహించలేదు.

నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం విద్యారంగంలో 3వ స్థానంలో ఉన్న రాష్ట్రం 19వ స్థానానికి దిగజారిపోయింది. రాష్ట్ర చరిత్రలోనే మొట్టమొదటిసారిగా పదోతరగతి ఫలితాల్లో కేవలం 64.02 శాతం ఉత్తీర్ణత సాధించడం సిగ్గుచేటైన విషయం. చంద్రబాబు తన హయాంలో ప్రతి గ్రామంలో కనీసం ఒక ప్రాథమిక పాఠశాల, ప్రతి మూడు కిలోమీటర్ల పరిధిలో ఒక మాధ్యమిక పాఠశాల, ప్రతి ఐదు కిలోమీటర్ల పరిధిలో ఒక ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయగా ప్రస్తుత సర్కార్ నూతన విద్యావిధానం పేరిట 11వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిందని, 3, 4, 5 తరగతుల విలీనంతో ఒకే ఒక ఉపాధ్యాయుడు ఉండే బడుల సంఖ్య భారీగా పెరిగిందని స్వయంగా కేంద్ర విద్యాశాఖ పార్లమెంట్‌లోనే సమాధానమిచ్చింది. ఆంగ్లంతో పోలిస్తే మాతృభాష తెలుగును చదవడంలో ఏపీ విద్యార్థులు వెనుకబడిపోయారని ప్రముఖ అధ్యయన సంస్థ యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్(అసర్) విడుదల చేసిన వార్షిక విద్యాస్థితి నివేదిక–2022లో ఈ విషయాన్ని వెల్లడించింది.

డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ట్రిపుల్ ఐటీ, ఇతర కోర్సులు పూర్తిచేసిన దాదాపు 2 లక్షల మందికి పైగా విద్యార్థులకు ప్రభుత్వం సర్టిఫికెట్లు ఇవ్వలేదు. దీంతో ఉన్నతవిద్య చదివే అవకాశం కోల్పోయి, ఉద్యోగావకాశాలు కోల్పోయి వేలాదిమంది విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరమైపోయింది. ప్రైవేట్, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ కళాశాలల్లో చదివే పీజీ విద్యార్థులకు 2020–21 విద్యా సంవత్సరం నుంచి జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన నిలిపివేస్తూ జీవోను విడుదల చేశారు. 1.7 లక్షల మంది పీజీ విద్యార్థుల్లో 80 శాతం మందికి ఈ రెండు దీవెనలు రద్దుచేయడం ద్వారా రూ.600 కోట్లు ఆదా చేసుకున్నారు. ఆ చర్యతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేదవిద్యార్థుల ఉన్నత చదువుల కలను చెరిపివేశారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఇలాంటి వికృతచర్యలతో విద్యారంగం ఉనికినే కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. ఏ దేశ విద్యారంగం ప్రగతిపథంలో పయనిస్తుందో ఆ దేశం అభివృద్ధి దిశగా పయనిస్తుందనడంలో సందేహం లేదు. అలాంటి విద్యారంగాన్ని విధ్వంసం చేస్తున్న పాలనకు ప్రజలు ఇప్పటికైనా ముగింపు పలకాలి. టీడీపీ ప్రభుత్వం వచ్చాక విద్యార్థులకు అండగా నిలబడడంతో పాటు విద్యావ్యవస్థను బలోపేతం చేయడానికి అధిక ప్రాధాన్యమిస్తుంది.

■ కంచర్ల శ్రీకాంత్
శాసనమండలి సభ్యులు

భారతరత్నతో గౌరవించాలి

ఒకవైపు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే, మరోవైపు సామాజిక సమానత్వం కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని సమరం సాగించిన రాజకీయ, సామాజిక విప్లవ యోధుడు బాబూ జగ్జీవన్‌రామ్. జాతి జనులను విద్యావంతులుగా, ఆత్మాభిమానులుగా చేయాలన్నదే ఆయన లక్ష్యం. బిహార్‌లోని షాబాద్ జిల్లా, చాంద్వా గ్రామంలో 1908 ఏప్రిల్ 5న శోభిరామ్, బసంతి దేవిలకు జగ్జీవన్‌రామ్ జన్మించాడు. ఆయన చదువుకున్న పాఠశాలలో మొదటిసారిగా అంటరానితనాన్ని అనుభవించాడు. ఆ పాఠశాలలో విద్యార్థుల కోసం మంచినీటి సదుపాయాన్ని కల్పిస్తూ రెండు కడవలపై 'హిందూ పానీ', 'ముస్లిం పానీ' అని రాసి ఉంచేవారు. జగ్జీవన్‌రామ్ హిందూ పానీ కడవలో మంచినీరు తాగారని హిందూ విద్యార్థులు ఆ కుండలోని నీరు తాగేవారు కాదు. ఈ ఉదంతంతో ఆగ్రహించిన ఆయన ఒక రాయి విసిరి ఆ కుండను ముక్కలు చేశాడు. అప్పుడు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు 'హరిజన పానీ' అనే మరో కుండను ఏర్పాటుచేశాడు. జగ్జీవన్‌రామ్ ఆ కుండని కూడా పగులకొట్టాడు. ఇక చేసేదేమీ లేక ఆ పాఠశాల వారు ఒకే కుండను ఏర్పాటుచేశారు. ఈ సంఘటనలో గెలిచినా ఆయన గుండె ఆవేదనతోనూ, కోపంతోనూ నిండిపోయింది. ఆ అనుభవాలే ఆయన దళిత జనుల జాగృతివైపు ముందుకు సాగడానికి ప్రేరణనిచ్చాయి.



విద్యార్థి దశలోనే గాంధీజీ అహింసా మార్గానికి ఆకర్షితుడై 1930లో సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నారు. కేవలం 27 ఏళ్ల వయస్సులోనే శాసనమండలి సభ్యునిగా ఎన్నికయ్యారు. 57 ఏళ్లపాటు పార్లమెంటును ఏలిన మహా అనుభవశీలి ఆయన. వ్యవసాయ, రక్షణ, ఆరోగ్య, రైల్వే శాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా ఆయన సేవలు అందించారు. జగ్జీవన్‌రామ్ తాను చేపట్టిన ప్రతీ బాధ్యతలోనూ తనదైన ముద్రవేసిన కార్యదక్షుడు. బ్రిటీష్ రైల్వే వ్యవస్థను ప్రక్షాళన చేసి భారతీయ ముద్ర వేశారు. 1967–70లో ఆహార, వ్యవసాయ శాఖ మంత్రిగా హరిత మండలాలను అభివృద్ధి చేసి మొదటిసారి భారతదేశం ఆహార స్వయం ప్రతిపత్తి సాధించే విధంగా చేసి, దేశాన్ని కరువు బారి నుంచి కాపాడారు. 1970–74లో రక్షణ శాఖ మంత్రిగా పాకిస్తాన్ నుంచి బంగ్లాదేశ్‌ను విముక్తి చేసి, పాకిస్తాన్ సేనలు బేషరతుగా లొంగిపోయేలా చేశారు.

జగ్జీవన్‌రామ్‌లో ఉన్న తన వారికి చేయాలనే ఆరాటం... పోరాటం ఇప్పుడు ఉన్న దళిత ఎంపీ, ఎమ్మెల్యేలు అలవరుచుకోవాలి. దళితుల హక్కులను రాజ్యాంగంలో అంబేడ్కర్ పొందుపరిస్తే, వాటిని చట్ట రూపంలో అమలుచేయడానికి జగ్జీవన్‌రామ్ చేసిన కృషి ఎప్పటికీ మరిచిపోలేనిది. అవమానాలు, ఆటంకాలను విజయాలుగా మలుచుకున్న నిజమైన దేశ నాయకుడు జగ్జీవన్‌రామ్. అందుకే ఆయన భవిష్యత్తు తరాలకు కూడా ఆదర్శవంతుడు. ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేసిన ఆయన 1986 జూలై 6న కన్నుమూశారు. ఆయన జన్మదినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా సమతా దినోత్సవంగా జరుపుతోంది. దేశం కోసం.. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనడమే కాకుండా, సాంఘిక సమానత్వం కోసం అణగారిన వర్గాల కోసం చివరి శ్వాస వరకూ కృషి చేసిన జగ్జీవన్‌రామ్‌ను భారతరత్నతో గౌరవించాలి.

– సంపత్ గడ్డం

విషమిస్తున్న మన విశ్వగురుత్వం!



■ రాహుల్ కుమార్

అసమానతలపై గత కొన్నేళ్లుగా పికెటీ చేస్తున్న విశ్లేషణతో విభేదించే అర్థికవేత్తలు చాలామందే ఉన్నారు. ఆయన గణాంకాలను మెచ్చుకుని విశ్లేషణను, పరిష్కారాలను వదలివేసే వారూ ఉన్నారు. అలాగే పైవర్గాలపై గణనీయ స్థాయిలో సూపర్ ట్యాక్స్ విధించాలన్న ఆయన ప్రతిపాదనలను అంగీకరించని వారూ ఉన్నారు. కానీ మానవాళి భవిష్యత్తునూ, సుదీర్ఘ మనుగడనూ దృష్టిలో పెట్టుకుని పికెటీ లేవనెత్తిన ప్రశ్నలకు సాధికారికంగా జవాబులిచ్చే వారి సంఖ్య మాత్రం బహు స్వల్పం!



ప్రపంచానికి భారత్ విశ్వగురువుగా మారుతోంది! నమ్మినా నమ్మకపోయినా ఇది నిజం! ఎన్నింటిలో మనకు గురుపీఠం దక్కుతోందంటే టక్కున చెప్పలేం. ఒక విషయంలో మాత్రం అది కఠోర వాస్తవంగా మారింది. విశ్వగురు ప్రచారకర్తలు మాత్రం దీనిపై మౌనం వహిస్తున్నారు. కనీసంగా కూడా ప్రస్తావించటం లేదు. చర్చకూ ఆ విషయాన్ని రానివ్వటం లేదు. ఆదాయం, సంపద అనేవి సమాజ స్థాయిని అంచనా వేయటానికి కొలమానాలు. ఈ రెండూ దండిగా ఉండటం గొప్పే! కాదనలేం! కానీ అవి వివిధ ప్రజల మధ్య ఏ స్థాయిలో పంపకం అవుతున్నాయన్నది అంతకంటే కీలకమైంది. గౌరవప్రద జీవితానికి, మౌలిక అవసరాలు తీర్చుకోటానికి ఆ పంపకం ఎక్కువమందికి తోడ్పడుతుంటే దాన్ని న్యాయబద్ధంగా ఉందని అంటాం. ఈ న్యాయబద్ధతకు మనం ఎంత దూరంలో ఉన్నాం? ప్రభుత్వాల విధానాలు అందుకు తోడ్పతున్నాయా? 1950ల తర్వాత మనతో పాటే అభివృద్ధి దిశగా అడుగులు వేసిన దేశాలతో పోల్చితే మనం ఎక్కడ ఉన్నాం? వీటిని పరిశీలిస్తే విస్తుబోయే నిజాలు కనపడతాయి. ప్రపంచంలోని వివిధ దేశాల ఆర్థిక అసమానతలను ఎంతో లోతుగా విశ్లేషిస్తున్న వారిలో ఫ్రెంచ్ ఆర్థికవేత్త టామస్ పికెటీ ఒకరు. మరో ముగ్గురు ఆర్థికవేత్తలతో కలిసి ఆయన భారత్‌లోని అసమానతలపై ఇటీవల ఒక నివేదికను రూపొందించారు. 1922 నుంచి 2023 వరకూ దేశంలో నెలకొన్న అసమానతలను మన కళ్లముందు ఉంచారు. 'భారత్‌లో ఆదాయం-సంపద అసమానతలు' అన్న పేరుతో రూపొందించిన ఆ నివేదిక పెద్దదేమీ కాదు. అంతా కలిసి 86 పేజీలే ఉంది.

ఆదాయం అంటే అందరికే తెలిసిందే. ఉద్యోగం, వృత్తి, వ్యాపారం చేయటం ద్వారా డబ్బు రూపంలో మనకు లభించేది. సంపద అంటే భూములు, భవనాలు, షేర్లు, బంగారం, మ్యూచువల్ ఫండ్స్ రూపంలో ఉండేది. ఆదాయం, సంపద అనేవి మనుషుల జీవితాలను శాసిస్తాయి. మన సౌకర్యాలను అవే నిర్దేశిస్తాయి. ఈ రెండూ సమాజంలో అన్ని వర్గాల ప్రజలకూ ఒకేలా అందవు. ఇప్పుడే కాదు నాగరికత మొదలైన నాటి నుంచి ఈ పరిస్థితే ఉంది. యుగయుగాల్లో ఉద్యమాలు, పోరాటాలు, ప్రవక్తల బోధనలు, మత సంస్కరణలు ఏదో విధంగా వీటి చుట్టూనే తిరిగాయి. పంపిణీలో సముచిత వాటాల కోసం వివిధ రూపాల్లో చరిత్ర అంతా పెనుగులాటలు జరుగుతూనే ఉన్నాయి. వివిధ వర్గాలకు అందే ఆదాయాన్ని, సంపదని నిర్దేశించటంలో తొలి నుంచీ ప్రభుత్వ వ్యవస్థే (స్టేట్) కీలకపాత్ర పోషిస్తూ వస్తోంది. అందుకే ఈ రెండింటి పంపకాల విషయంలో తీసుకునే చర్యలను, విధానాలను బట్టి ప్రభుత్వ స్వభావాన్ని అంచనా వేయవచ్చు. పికెటీ విశ్లేషణ ప్రకారం భారత్‌లో ప్రస్తుతం బిలియనీర్ రాజ్ నడుస్తోంది. ప్రభుత్వ చర్యలూ విధానాలూ బిలియనీర్ల చేతుల్లో ఆదాయం, సంపద పోగుపడేలా చేస్తున్నాయి.

ఆదాయం, సంపదలను లెక్కించటానికి ప్రధానంగా వయోజనులనే పరిగణనలోకి తీసుకుంటారు. వీరిలో పైమెట్టున ఉన్న ఒక శాతం (టాప్ 1%) జనాభా పరిస్థితినే చూద్దాం. 2022–23 మొత్తం ఆదాయంలో 22.6 శాతం వాటా ఈ వర్గం ప్రజలకు ఉంది. ఇక సంపదలో ఈ వర్గం వాటా 40.1 శాతానికి చేరుకుంది. గతంలో ఎన్నడూ ఒక శాతం ప్రజల చేతుల్లో ఇంతగా ఆదాయ, సంపద కేంద్రీకరణ జరగలేదు. ఈ వైపరీత్యానికి ఇంకో కోణం కూడా ఉంది. అదే మనకు విశ్వగురువు స్థానాన్ని ఖాయం చేస్తోంది. ఒక శాతం జనాభాకు ఆదాయపరంగా భారత్‌లో ఉన్నంత వాటా ఏ దేశంలోనూ లేదు. ఆదాయ అసమానతల్లో కొంతకాలం కిందటి వరకూ దక్షిణాఫ్రికా, బ్రెజిల్, అమెరికాలు అగ్రభాగాన ఉండేవి. వీటిని భారత్ దాటేసింది. బ్రిటిషు వలస పాలన విపరీత ఆదాయ అసమానతకు పెట్టింది పేరు. ఆ పాలనలో సైతం 1922 నాటికి ఒక శాతం ధనికుల వాటా ఆదాయంలో 13 శాతం మాత్రమే ఉండేది. ఈ ఒక శాతం జనాభాని పక్కనబెట్టి.. పైమెట్టులోని మొత్తంగా 10 శాతం (టాప్ 10%) జనాభా ఆదాయ-సంపద లెక్కలు తీసుకున్నా పరిస్థితి ఘోరంగానే కనపడుతుంది. జాతీయ ఆదాయంలో 10 శాతం ప్రజల వాటా 2020 నాటికి 60 శాతానికి చేరింది. ఇక సంపదలోనూ 65 శాతం వాటా వారిదే.

మార్కెట్ అనుకూల ఆర్థిక సంస్కరణలతో వృద్ధిరేటు పెరిగింది. ఆదాయాలూ సంపదలూ పెరిగాయి. తలసరి ఆదాయం, కొనుగోలు శక్తిలో ఎదుగుదల కనపడింది. నాణేనికి ఇది ఒకవైపు చిత్రమే. మరోవైపు చూస్తే సంస్కరణల వల్ల అసమానతలూ విపరీతంగా పెరిగాయి. 1980ల మధ్యకాలం వరకూ ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వ నియంత్రణలు కఠినంగానే ఉండేవి. పన్నుల భారమూ ఆనాడు అధికమే. వీటివల్ల ఇతర ఇబ్బందులు కలిగినా అసమానతలు కొంత అదుపులో ఉండేవి. ఉదాహరణకు 1950ల్లో పైమెట్టున ఉన్న 10 శాతం ధనికుల ఆదాయం 40 శాతం ఉంటే, 1980 నాటికి అది 30 శాతానికి తగ్గింది. ఆ తర్వాత నుంచి పెరగటమే తప్ప తగ్గిన దాఖలాల్లేవు.

పదిశాతం ధనికులకు సంబంధించిన గణాంకాల్లో ఈ విపరీత ధోరణిని చూసిన తర్వాత మిగతా 90 శాతం జనాభా ఆదాయ-సంపదల పరిస్థితి ఏమిటి? అన్న ప్రశ్న తలెత్తకమానదు. 2022–23 నాటి పరిస్థితిని చూస్తే 50 శాతంగా (బాటమ్ 50%) ఉన్న కిందిస్థాయి ప్రజలకు ఆదాయంలో దక్కింది 15 శాతం వాటానే. గతంలో ఎన్నడూ ఇంత ఘోరమైన పరిస్థితి లేదు. 1990ల నాటికి ఈ వర్గానికి 22.6 శాతం వాటా ఉండేది. అంటే ఏడున్నర శాతం వాటా నికరంగా తగ్గిపోయింది. సంపద విషయాన్నే చూద్దాం. 1961–1981 మధ్య సంపదలో ఈ వర్గం వాటా 11.10 శాతం ఉంటే 2020 నాటికి అది 6–7 శాతానికి పడిపోయింది.

ఇక 40 శాతంగా ఉన్న మధ్యతరగతి (మిడిల్ 40%) విషయంలోనూ ఆదాయ వాటా తగ్గుదల స్పష్టంగా కనపడుతుంది. 1990ల నాటికి ఈ వర్గానికి ఉన్న 44.1 శాతం వాటా 2022 నాటికి 27.3 శాతానికి పడిపోయింది. సంపద వాటాలోనూ ఇదే ధోరణి కనపడుతుంది. 1981 నాటికి 40–45 శాతం వాటా ఉంటే 2023 నాటికి అది 29 శాతానికి దిగజారింది.

చైనాను, భారత్‌ను పోల్చిచూడటం ఈ మధ్య చాలా పెరుగుతోంది. సాంకేతిక పరిజ్ఞానంలోనే గాక వస్తూత్పత్తిలో కూడా చైనాని అధిగమించాలన్న తపన కనపడుతోంది. ఇది ఎప్పటికి సాధ్యమో ఇప్పుడే చెప్పలేకపోయినా ఆదాయ అసమానతల్లో మాత్రం మనం చైనాను అధిగమించేశాం. ఒక శాతం ధనికుల ఆదాయం చైనాతో పోల్చితే భారత్‌లో 50 శాతం ఎక్కువ. పైమెట్టున ఉన్న 10 శాతం ధనికులతో పోల్చితే ఆ తేడా 35 శాతం ఉంది. ఇక్కడో మినహాయింపు ఉంది. సంపదలో మాత్రం చైనాలో 2011 నుంచి పదో వంతు జనాభా వాటా భారత్‌ను మించిపోవటం మొదలైంది.

అసమానతల ప్రభావం తెలుసుకోటానికి కొన్ని రంగాలకు సంబంధించిన విశేషాలను కూడా పికెటీ బృందం ప్రస్తావించింది. వాటిల్లో కొన్నింటినైనా చూడాలి. విమాన ప్రయాణాల్లో ఒక శాతం ప్రజల వాటా 46 శాతం ఉంది. మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టే భారతీయుల సంఖ్య 2.6 శాతమే. 44 శాతం డిజిటల్ నగదు లావాదేవీలను 6.5 శాతం మందే చేస్తున్నారు. మూడో వంతు జొమాటో ఆర్డర్లు 5 శాతం మంది నుంచే వస్తున్నాయి.


మోదీ హయాంలోని వృద్ధిరేటుపై వివాదాలు చాలానే ఉన్నాయి. 2014 నుంచే దేశంలో స్వర్ణయుగం ప్రారంభమైందనే ప్రచారం ఊపందుకున్నా పికెటీ బృందం ఇచ్చిన లెక్కలు దానికి పూర్తి భిన్నంగా ఉన్నాయి. 2015లో వాస్తవిక వృద్ధి రేటు 6 శాతం ఉంటే 2016కి వచ్చేటప్పటికి అది 4.7 శాతానికి పడిపోయింది. 2017–18లో అది 4.2 శాతానికి తగ్గింది. కరోనా సంవత్సరంలో 1.6 శాతానికే పరిమితమైంది. 2020లో మైనస్ 9 శాతానికి పడిపోయింది. 2021లో అది 9.1 శాతంగా కనపడినా దాన్ని సాధారణ వృద్ధిరేటుగా పరిగణించలేం. కిందటి ఏడాది మైనస్ వృద్ధిరేటు వల్ల ఆ ఎదుగుదల కనిపించింది. 2022లో పరిస్థితులు కుదురుకున్న తర్వాత వృద్ధిరేటు 4.7 శాతానికే పరిమితమైంది.

2014 తర్వాత బలపడుతున్న మరో పరిణామం గురించి ఇక్కడ చెప్పుకోవాలి. అసమానతలపై పట్టింపు తగ్గిపోవటం మొదలైంది. అంతకుముందులాగా చర్చలు దీనిపై జరగటం లేదు. దీంతో అసమానతలు సృష్టించే దీర్ఘకాలిక సామాజిక, రాజకీయ ప్రభావాల పరిశీలనలు సైతం మందగిస్తున్నాయి. గణాంకాలను లోపభూయిష్టంగా రూపొందించటం, రాజకీయంగా రుచించని గణాంక సమాచారాన్ని జనంలోకి రానీయకుండా చేయటం 2014 తర్వాత బాగా పెరిగిన విషయాన్ని పికెటీ బృందం ప్రస్తావించింది.

విపరీత ఆదాయ-సంపద వ్యత్యాసాలు ప్రభుత్వం, సమాజంపై పైవర్గాలకు అనుచిత ఆధిపత్యాన్ని కలగచేస్తాయి. ఆదాయం-సంపదలో అగ్రభాగాన ఉన్న వర్గం.. ధనబలంతో రాజకీయాలను శాసించటం 1980ల తర్వాత విపరీతంగా పెరిగింది. పైమెట్టున ఉన్న 10 శాతం ప్రజల నుంచి వచ్చే ఎంపీలు, ఎమ్మెల్యేల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రజాప్రతినిధుల ఈ నేపథ్యం ప్రభుత్వ ఆర్థిక విధానాలను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. వీటికి తోడు అసమానతలను ప్రశ్నించే పౌరసమాజ బృందాలను కట్టడి చేయటం బాగా పెరిగింది. ఇవన్నీ కలిసి దేశాన్ని ధనస్వామ్య భారత్‌గా మార్చి వేస్తున్నాయి. విపరీత అసమానతల నుంచి వస్తున్న అసలు ప్రమాదం ఇదే. ఆర్థిక, సామాజిక న్యాయానికి విఘాతంగా పరిణమిస్తున్న వీటిని కట్టడి చేయాల్సిన ప్రభుత్వాలు పూర్తి విరుద్ధబాటలో నడుస్తున్న దృశ్యమే మనముందు మెదలుతోంది. ప్రజలకు ఇచ్చే తాయిలాలు, ఉచితాలు, జనాకర్షణ పథకాలు, నగదు పంపిణీలు.. ఏవీ కూడా ఆదాయ, సంపద అసమానతలపై ప్రభావం చూపలేకపోతున్నాయి.

అసమానతలపై గత కొన్నేళ్లుగా పికెటీ చేస్తున్న విశ్లేషణతో విభేదించే అర్థికవేత్తలు చాలామందే ఉన్నారు. ఆయన గణాంకాలను మెచ్చుకుని విశ్లేషణను, పరిష్కారాలను వదలివేసే వారూ ఉన్నారు. అలాగే పైవర్గాలపై గణనీయ స్థాయిలో సూపర్ ట్యాక్స్ విధించాలన్న ఆయన ప్రతిపాదనలను అంగీకరించని వారూ ఉన్నారు. కానీ మానవాళి భవిష్యత్తునూ, సుదీర్ఘ మనుగడనూ దృష్టిలో పెట్టుకుని పికెటీ లేవనెత్తిన ప్రశ్నలకు సాధికారికంగా జవాబులిచ్చే వారి సంఖ్య మాత్రం బహు స్వల్పం!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)



నడినెత్తిన ఎండ.. నడవలేని పరిస్థితి.. అయినా కాళ్లీడ్చుకుంటూ సచివాలయాలకు వెళ్లిన వృద్ధులు, దివ్యాంగులకు రెండోరోజు గురువారం కూడా పెన్షన్ల పంపిణీలో సచివాలయాల సిబ్బంది చుక్కలు చూపించారు. డబ్బు రాలేదంటూ మధ్యాహ్నం వరకూ అలాగే కూర్చోబెట్టి, సరిగ్గా భోజన సమయంలో క్యూల్లో నిలబెట్టి పండుటాకులను ఇబ్బందులు పెట్టారు. సరైన సౌకర్యాలు లేక, సత్తువ రాక ముదుసలులు నానా అగచాట్లు పడ్డారు.



కంచికచర్ల టౌన్‌లో మండుటెండలో క్యూలో కిక్కిరిసిన వృద్ధులు

ఎండగట్టారు..!

పెన్షన్ల పంపిణీలో వృద్ధులు, దివ్యాంగులకు ఎండదెబ్బ

- రెండోరోజూ బ్యాంకుల నుంచి ఆలస్యంగా వచ్చిన డబ్బు
- మధ్యాహ్నం ఒంటిగంట వరకూ ఎండలోనే వృద్ధులు
- భోజన సమయంలో హడావిడిగా పంపిణీ
- క్యూలో నిలబడే సత్తువ లేక ముదుసలుల నరకయాతన
- బందరు మండలంలో ఇంటి వద్ద 75ఏళ్ల వృద్ధుడు మృతి
- ప్రతిపక్షాల వల్లేనని పేర్ని కిట్టూ వ్యాఖ్యలు.. వివాదం



వీరులపాడు మండలం జుజ్జూరు సచివాలయంలో వృద్ధుల పడిగాపులు



యనమలకుదురు సచివాలయంలో ఎదురుచూపులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/కంచికచర్ల/మచిలీపట్నం) : పెన్షన్ల పంపిణీలో రెండోరోజు గురువారం కూడా రెండు జిల్లాల్లో హైడ్రామా నడిచింది. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా గురువారం మధ్యాహ్నం వరకు బ్యాంకుల నుంచి డబ్బు రాలేదు. దీంతో పంపిణీ ప్రక్రియ మధ్యాహ్నం నుంచే చేపట్టారు. తొలిరోజు రద్దీగా ఉంటుందని పింఛన్లు తీసుకోవటానికి రానివారు గురువారం భారీగా గ్రామ సచివాలయాలకు వచ్చారు. తిరువూరు, మైలవరం, జగ్గయ్యపేట, విజయవాడలోని మూడు నియోజకవర్గాల్లో మధ్యాహ్నం 12-1 గంటల మధ్య పింఛన్ల పంపిణీ చేపట్టారు. నందిగామ నియోజకవర్గంలో 2 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. ఉదయం నుంచి వచ్చిన వృద్ధులు సచివాలయాల్లోనే పడిగాపులు పడ్డారు. టెంట్ల కింద కూర్చున్నారు. గురువారం ఎండ వేడి ఎక్కువగా ఉండటంతో వృద్ధులు అల్లాడిపోయారు. వీరులపాడు మండలం జుజ్జూరులో టెంట్ల కింద వృద్ధులు పడిగాపులు పడ్డారు. మైలవరం, తిరువూరు, గంపలగూడెం, జి.కొండూరు, పెనుగంచిప్రోలులోనూ ఇదే పరిస్థితి కనిపించింది. ఇంటికి వెళ్లిపోదామనుకున్న వృద్ధులను వెళ్లనివ్వలేదు. ఇదిగో డబ్బులు వచ్చేస్తున్నాయంటూ మభ్య పెట్టారు. అప్పటికి వృద్ధులు భోజన సమయం కూడా కావటంతో ఇబ్బందులు పడ్డారు. రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల వృద్ధులను క్యూలో వచ్చి పెన్షన్లు తీసుకోవాలని సూచించారు. సచివాలయాలకు తలుపులు వేసి పోలీసులను కాపలా పెట్టారు. సచివాలయ సిబ్బంది ఫ్యాన్ల కింద కూర్చుని పెన్షన్లు ఇస్తుంటే, బయట వృద్ధులు మాత్రం క్యూలో ఎండలో నిలబడాల్సి వచ్చింది. కంచికచర్ల టౌన్‌లోని సచివాలయంలోనూ ఇదే పరిస్థితి. గురువారం రాత్రి 7 గంటలకు ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా 90 శాతం పెన్షన్లు పూర్తిచేశారు. ఇంకా 40 వేల మంది వృద్ధులకు ఇవ్వాల్సి ఉంది. వీరికి శుక్రవారం అందజేస్తారు.

వృద్ధుడు మృతి.. పేర్ని కిట్టూ రాజకీయం

బందరు మండలం కోన గ్రామానికి చెందిన వెంకట కృష్ణారావు (75) కొద్దిరోజులుగా రుద్రవరంలోని బంధువుల ఇంటి వద్ద ఉంటున్నాడు. నాలుగు రోజులుగా తీవ్ర అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ మంచానికే పరిమితమయ్యాడు. పింఛన్ తీసుకోకుండానే ఆయన గురువారం ఉదయం మరణించాడు. రుద్రవరం వెళ్లిన వైసీపీ అభ్యర్థి పేర్ని కిట్టూ.. ప్రతిపక్ష నాయకుల కారణంగానే పింఛన్లు ఇవ్వడంలో జాప్యం జరిగిందని, అందుకే వెంకట కృష్ణారావు మరణించాడని ఆరోపించడం వివాదాస్పదమైంది.

కృష్ణాజిల్లాలో..

కృష్ణాజిల్లాలో 2,44,262 మంది సామాజిక పింఛన్‌దారులు ఉండగా, గురువారం నాటికి 2,11,394 మందికి అందజేసినట్లు డీఆర్‌డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్ తెలిపారు. 88 శాతం మందికి పింఛన్లు అందజేశామని, ఈ నెల 6 వరకు మిగిలిన వారికి ఇస్తామన్నారు. జిల్లాలో రూ.72.14 కోట్లు అందజేయాల్సి ఉండగా, గురువారం సాయంత్రానికి రూ.68.87 కోట్లు ఇచ్చామని పేర్కొన్నారు. ఈ నెల 6వ తేదీ వరకు పింఛన్లు పంపిణీ చేస్తామని, అయినా ఇంకా మిగిలి ఉంటే, మరికొన్ని రోజులు గడువు పొడిగిస్తామని పేర్కొన్నారు.



సెగభగలు

ఏప్రిల్‌లోనే మే నెలను మించిన ఎండలు

- నగరంలో 40 డిగ్రీలను తాకిన ఉష్ణోగ్రతలు
- ఈవారంలో మరింత పెరిగే అవకాశం

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : మే నెలకు ముందే భానుడు ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఏప్రిల్ రెండో వారంలోనే వరుసగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వాస్తవానికి ఏప్రిల్ మూడో వారం నుంచి ఉష్ణోగ్రతల్లో పెరుగుదల ఉంటుంది. ఈ ఏడాది అది ముందే కనిపించడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం ఒకేలా ఉండగా, మధ్యాహ్నం 12 గంటల నుంచి రహదారులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. వాహనదారులు సైతం రహదారులపై తిరగడానికి వెనుకడుగు వేస్తున్నారు. ఏప్రిల్‌లోనే ఉష్ణోగ్రతలు అల్లాడిస్తుంటే, మేలో పరిస్థితి ఇంకెంత భయంకరంగా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు.

40 డిగ్రీలు దాటి..

మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలను తాకుతున్నాయి. విజయవాడలో గురువారం 40.01 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీనికి ముందు నమోదైన ఉష్ణోగ్రతలు ఈస్థాయిలోనే ఉన్నాయి. ఈ పరిస్థితికి అనేక కారణాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. విజయవాడకు చుట్టుపక్కల రాతి కొండలు ఉండటం, నగరంలో పచ్చదనం లేకపోవడమే అంటున్నారు. ఈ ఉష్ణోగ్రతలు 40 నుంచి 42 డిగ్రీల వరకూ నమోదవుతాయని నిపుణులు చెబుతున్నారు. ఈనెల 5న 42.79, 6న 42.18, 7న 40.69, 8న 40.13, 9న 40.05, 10న 39.95 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు ఫోర్‌కాస్ట్ విడుదల చేశారు. ప్రజలు సాధ్యమైనంత వరకు ఇంటి నుంచి బయటకు రాకుండా ఉండాలని సూచిస్తున్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) : 6-23 (శుక్ర)
సహర్ (ఉదయం) : 4-46 (శని)

వీడిన ఉత్కంఠ

అవనిగడ్డ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థిగా బుద్ధప్రసాద్

- పవన్ కల్యాణ్ ప్రకటనతో మిన్నంటిన సంబరాలు

అవనిగడ్డ, ఏప్రిల్ 4 : అవనిగడ్డ జనసేన పార్టీ అభ్యర్థి ఎవరన్న ఉత్కంఠకు తెరపడింది. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌నే అవనిగడ్డ జనసేన అభ్యర్థిగా ప్రకటిస్తూ అధినేత పవన్ కల్యాణ్ తరపున ఆ పార్టీ రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ గురువారం ప్రకటన విడుదల చేశారు. దీంతో అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు, చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల మండలాల్లోని టీడీపీ, జనసేన శ్రేణులు వీధుల్లోకి వచ్చి బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.



మోపిదేవి ప్రధాన కూడలిలో టపాసులు కాలుస్తున్న జనసైనికులు

45 రోజులుగా..

టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా ఫిబ్రవరి 24న విడుదల చేసిన అభ్యర్థుల తొలి జాబితాలో అవనిగడ్డకు స్థానం లభించలేదు. దీంతో అవనిగడ్డ నుంచి టీడీపీ పోటీ చేస్తుందా? లేక జనసేన పోటీ చేస్తుందా? అనే చర్చ జరిగింది. అనంతరం అవనిగడ్డ సీటును జనసేనకే కేటాయించినట్టుగా పవన్ కల్యాణ్ ప్రకటించారు. దీంతో ఆ పార్టీ అభ్యర్థిగా ఎవరు నిలబడతారోననే చర్చ జరిగింది. జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, ప్రముఖ కాంట్రాక్టర్ విక్కుర్తి శ్రీనివాసరావు, న్యాయవాది మత్తి వెంకటేశ్వరరావు, అక్షయ డెవలపర్స్ అధినేత మాదివాడ వెంకటకృష్ణ, రాష్ట్ర సర్పంచ్‌ల సంక్షేమ సంఘ అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు తదితరుల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. అయితే, ఐవీఆర్ఎస్ సర్వే పోల్ నిర్వహించగా, అందులో విక్కుర్తి శ్రీనివాస్ వైపు ఎక్కువ మంది మొగ్గు చూపారు. దాదాపు విక్కుర్తి శ్రీనివాస్‌కే సీటు ఖరారవుతుందని అందరూ భావించారు. అనూహ్యంగా గత నెల 30వ తేదీన మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌కు జనసేన పార్టీ నుంచి ఆహ్వానం అందింది. ఆ తర్వాత ఆయన పిఠాపురంలో పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. కాగా, టీడీపీ నుంచి వచ్చిన బుద్ధప్రసాద్‌కు సీటు ఇవ్వటానికి వీల్లేదంటూ రెండు రోజుల పాటు జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు మూకుమ్మడి రాజీనామాల హెచ్చరికలు జారీ చేయటంతో ఏం జరుగుతుందోనని అందరూ భావించారు.

- మిగతా 6లో

జోగి.. నానా యాగీ..

- మైలవరంలో సొంత పార్టీ నాయకులపైనే కేసులు
- గతంలో వసంత.. ఇప్పుడు కేశినేని నాని వెంట ఉన్నవారే టార్గెట్
- కొండపల్లిలో కొట్లాట.. సర్ది చెప్పకుండా పోలీసుల వరకూ..
- మనిషి పెనమలూరులో.. మనసు మైలవరంలో..

రోజురోజుకూ రచ్చకెక్కుతున్న వివాదాలు



విజయవాడ/ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 4 : మైలవరం రాజకీయాల్లో మంత్రి జోగి రమేశ్ ప్రమేయం వివాదాస్పదమవుతోంది. సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలను కూడా టార్గెట్ చేసి కేసులతో వేధించే పరిస్థితికి చేరింది. మంత్రి ఏకపక్ష ధోరణితో ఇప్పుడు మైలవరంలో వైసీపీ వర్గాలు రెండుగా విడిపోయాయి. ఎంపీ కేశినేని నానీకి అనుకూలంగా ఉన్నవారిని, గతంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ వెంట ఉన్నవారిని టార్గెట్ చేసి ఆయన వికృత క్రీడ ఆడుతున్నారు. అవకాశం దొరికినప్పుడల్లా తమకు గిట్టనివారిని జోగి అనుచరగణం బూతులు తిట్టడం, వీలైతే దాడికి యత్నించడం చేస్తూ పొమ్మనకుండానే పొగబెడుతోంది.

సొంత పార్టీ వారిపై కేసులు

కొండపల్లికి చెందిన మున్సిపల్ కౌన్సిలర్ మొగిలి దయాసాగర్.. గతంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అనుచరుడిగా ఉండేవారు. వసంత వైసీపీని వీడటంతో ఆయన ఎంపీ కేశినేని నానీకి దగ్గరయ్యారు. ఈ క్రమంలో ఈనెల 1న కొండపల్లిలో వైసీపీ కార్యాలయ ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీల్లో మంత్రి జోగి రమేశ్ ఫొటో వేయలేదు. దీంతో ఆయన అనుచరుడు, వైసీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు వేములకొండ సుబ్బారావు రెచ్చిపోయి కౌన్సిలర్ మొగిలి దయాసాగర్ చొక్కా కాలర్ పట్టుకోవడంతో పక్కనే ఉన్నవారు సుబ్బారావుకు దేహశుద్ధి చేశారు. ఆ గొడవను ఆసరా చేసుకుని సొంత పార్టీకి చెందిన కౌన్సిలర్ దయాసాగర్, ఆయన అనుచరులు కాండ్రకొండ దిలీప్, కందివలస దుర్గారావు, ఆయజ్, శశి, కండెల రాము, కిషోర్ మరికొంతమందిపై సుబ్బారావుతో జోగి కేసు పెట్టించారు. దీంతో ఎస్సై యు.పాపారావు వారిపై గురువారం కేసు నమోదు చేశారు. ఈ పరిణామంతో దయా వర్గంతో పాటు ఆయన సామాజికవర్గం జోగిపై రగిలిపోతోంది. సొంత పార్టీలో జరిగే చిన్నచిన్న ఘర్షణలను సర్ది చెప్పాల్సిన మంత్రి స్థాయి వ్యక్తి.. అయిన వారిపైనే కేసులు పెట్టించడాన్ని వారు జీర్ణించుకోలేక పోతున్నారు. పెనమలూరులో పోటీ చేస్తున్న జోగి మనిషి అక్కడున్నా.. మనసంతా మైలవరంపైనే ఉందని ఆ పార్టీ వ్యక్తులే చెబుతున్నారు. ఈ వ్యవహారాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లాలనే ఆలోచనలో ఆయన వ్యతిరేక వర్గం ఉన్నట్టు సమాచారం.

కృష్ణా కలెక్టర్‌గా డీకే బాలాజీ

కేంద్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు



కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా కలెక్టర్ (జిల్లా ఎన్నికల అధికారి)గా డీకే బాలాజీని నియమిస్తూ కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాష్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 2015 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోగా పనిచేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన పి.రాజాబాబును ఎన్నికల కమిషన్ బదిలీ చేయడంతో బాలాజీ నియామకం జరిగింది. బాలాజీ 2016లో కృష్ణాజిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా పనిచేశారు. 2022లో జిల్లా విభజన జరగ్గా కృష్ణా కలెక్టర్‌గా రంజిత్‌బాషా ఏడాది పాటు పనిచేశారు. 2023, ఏప్రిల్ 15న కలెక్టర్‌గా పి.రాజాబాబు నియమితులయ్యారు. మూడు రోజుల క్రితం ఆయన బదిలీ అయ్యారు. కృష్ణాజిల్లా విభజన జరిగిన మూడో సంవత్సరం ప్రారంభం రోజే జిల్లాకు మూడో కలెక్టర్‌గా డీకే బాలాజీ నియమితులు కావడం గమనార్హం. బెంగళూరుకు చెందిన డీకే బాలాజీ ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ఐఏఎస్‌లో అత్యుత్తమ ర్యాంకు సాధించారు. గతంలో ఈయన కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేశారు.

మరణంలోనూ ఒక్కటిగా..

- లంకపల్లి వద్ద రోడ్డు ప్రమాదం
- భార్యాభర్తలు దుర్మరణం



ఘటనాస్థలిలో దాసరి విజయ్ కుమార్, బేబీ సరోజిని మృతదేహాలు

ఘంటసాల, ఏప్రిల్ 4 : ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఘటనలో భార్యాభర్తలు మృతిచెందిన విషాద సంఘటన గురువారం తెల్లవారుజామున మండల పరిధిలోని లంకపల్లిలోని జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చల్లపల్లి మండలం మాజేరు శివారు పచ్చార్లంకకు చెందిన దాసరి నాగేశ్వరరావు-సరోజిని దంపతులు ద్విచక్ర వాహనంపై గురువారం తెల్లవారుజామున చల్లపల్లిలో జరిగే ఓ కార్యక్రమానికి బయల్దేరారు. ఈ క్రమంలో లంకపల్లి వద్ద ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టడంతో వారిద్దరూ కిందపడిపోయి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. ఇద్దరి మృతదేహాలను అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో పచ్చార్లంక గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కుమారుడు దాసరి విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఘంటసాల ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



హైకోర్టు న్యాయమూర్తులకు అమ్మవారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారులు

దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు

వన్‌టౌన్, ఏప్రిల్ 4 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మను గురువారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సురేష్ రెడ్డి, జస్టిస్ మన్మథరావులు దర్శించుకున్నారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు వేదాశీర్వచనం చేయగా.. ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.



సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో పూజలు చేస్తున్న జనసైనికులు

పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలని పూజలు

మోపిదేవి, ఏప్రిల్ 4 : తీవ్ర జ్వరంతో బాధపడుతున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరోగ్యం త్వరగా కుదుట పడాలని పెదకళ్లేపల్లి గ్రామానికి చెందిన జనసైనికులు మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం సాయంత్రం పార్టీ నాయకులు, కార్యకర్తలు పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకుని ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్ తదితరులు ఉన్నారు.

పార్టీ నిర్ణయం మేరకు పనిచేస్తాం

అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకనుగుణంగా ఆయన సూచించిన అభ్యర్థి విజయానికి కట్టుబడి పని చేస్తామని మండల అధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్ తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో భాగంగా జనసేన పార్టీ తరపున మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించటంపై జనసైనికులు హర్షం వ్యక్తం చేశారు. కూటమి అభ్యర్థి విజయం కోసం కృషి చేస్తామని తెలిపారు.



బార్ కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న హజరత్తయ్య గుప్తా

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

- బార్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రమౌళి, రాజా
- నూతన కార్యవర్గసభ్యుల ప్రమాణ స్వీకారం

విజయవాడ లీగల్, ఏప్రిల్ 4 : బెజవాడ బార్ అసోసియేషన్ 2024-25 నూతన కార్యవర్గసభ్యులతో బార్ అసోసియేషన్ హాలులో గురువారం బార్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా బార్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగల శివరామప్రసాద్ (రాజా) మాట్లాడుతూ, న్యాయవాదుల సమస్యలు పరిష్కరించేందుకు తమ శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. వేసవి దృష్ట్యా ప్రతి కోర్టు హాలు వద్ద కక్షిదారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి చల్లని తాగునీరు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. బార్ ఉపాధ్యక్షుడు జీవీ రామశర్మ, జాయింట్ సెక్రటరీ కలతోటి క్రాంతికుమార్‌లు మాట్లాడుతూ, న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, కక్షిదారుల ద్విచక్రవాహనాలు, కార్లు, కోర్టు ఆవరణలో ఒక క్రమపద్ధతిలో పార్కింగ్ చేసేవిధంగా చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్, చలసాని అజయ్‌కుమార్, మాజీ బార్ అధ్యక్షులు చేకూరి శ్రీపతి, వి.గురునాథం, వెన్నా రమేష్‌చంద్రబాబు, కేబీ సుందర్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు ప్రజాగళం సభా స్థలిని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

పామర్రులో బాబు పర్యటన ఏర్పాట్ల పరిశీలన

పామర్రు/ఉయ్యూరు, ఏప్రిల్ 4 : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఈనెల 7న పామర్రులో నిర్వహించనున్న 'ప్రజాగళం' నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు టీడీపీ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. హెలిప్యాడ్‌కు బందరురోడ్డులోని తాడిశెట్టి సాంబశివరావుకు చెందిన స్థలం ఎంపిక చేశారు. నాలుగు రోడ్ల కూడలి సమీపంలో 'ప్రజాగళం' సభ ఏర్పాట్లను టీడీపీ నేతలు కొనకళ్ల నారాయణ, వర్లకుమార్‌రాజా ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణరాజు, జనసేన పామర్రు ఇన్‌చార్జి తాడిశెట్టి నరేశ్‌లు గురువారం సాయంత్రం పరిశీలించారు. వర్లకుమార్‌రాజా మాట్లాడుతూ, చంద్రబాబు పామర్రు పర్యటనను పార్టీశ్రేణులు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ విభాగం నేత వీరంకి వెంకట గురుమూర్తి, మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సీటు రాకున్నా నియోజకవర్గ ప్రజల వెంటే..

- విక్కుర్తి శ్రీనివాస్ బహిరంగ లేఖ



అవనిగడ్డ, ఏప్రిల్ 4 : 'ఇక్కడే పుట్టి పెరిగి నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలనే ఆశతో వచ్చా.. ఆఖరి నిముషంలో సీటు వేరే వారికి వెళ్లినా నైతికంగా ప్రజల మద్దతు మాత్రం నాకే ఉంది.. నాకు అండగా నిలిచిన జనసేన, టీడీపీ శ్రేణులకు కృతజ్ఞతలు..' అంటూ అవనిగడ్డ నుంచి జనసేన పార్టీ అభ్యర్థిత్వం ఆశించిన విక్కుర్తి శ్రీనివాస్ గురువారం నియోజకవర్గ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. సీటు రాకున్నా ఓ నాయకుడి నిజ రూపాన్ని బయటపెట్టడగలిగామని, ఆరుశాతం ఓట్లు లేవన్న పార్టీలోకి ఆయనను వచ్చేలా చేయగలిగామని.. అదే పెద్ద విజయమని, రాబోయే రోజుల్లో ఎవరికి ఏ సమస్య వచ్చినా ప్రజలకు అండగా ఉంటానని పేర్కొంటూ ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాలను ఆయన లేఖలో ప్రస్తావించారు. ఈ లేఖ ప్రస్తుతం నియోజకవర్గంలో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది.

జనసేన పార్టీ పదవికి రాయపూడి రాజీనామా



అవనిగడ్డ, ఏప్రిల్ 4 : గడిచిన కొద్ది రోజులుగా అవనిగడ్డ నియోజకవర్గ జనసేన పార్టీ అభ్యర్థిత్వంలో చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో జనసేన పార్టీ అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు గురువారం మధ్యాహ్నం తన పదవికి రాజీనామా చేశారు. జనసేన పార్టీలో కష్టపడిన వారికే సీటు ఇవ్వాలని కోరుతూ వచ్చిన రాయపూడి వేణుగోపాలరావు బుద్ధప్రసాద్‌కు జనసేన పార్టీ అభ్యర్థిత్వం ప్రకటించిన కొద్దిసేపటికే రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించి జిల్లా పార్టీ అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ ద్వారా పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు పంపించారు. శుక్రవారం తదుపరి కార్యాచరణ ప్రకటిస్తానని ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణాజిల్లా జనసేన, టీడీపీల సమన్వయ కమిటీ సభ్యులు, సీనియర్ జనసేన నేత చెన్నగిరి సత్యనారాయణ, అవనిగడ్డ పట్టణ ప్రధాన ఏసుబాబులు కూడా తమ పదవులకు రాజీనామా చేసి జిల్లా పార్టీ అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణద్వారా లేఖలు పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు పంపించారు.

రైల్వేలో అనర్హులకు అందలం!

- సమర్థులు ఉన్నా దక్కని గుర్తింపు
- కేసులపై సస్పెండ్ అయిన వారికి ప్రాధాన్యం
- పీసీసీఎం అవార్డుల ఎంపికపై దుమారం

ఆదాయంలో రికార్డులు సృష్టిస్తున్న విజయవాడ రైల్వే డివిజన్.. అందుకు కారణమైన వారిని గుర్తించటంలో పక్షపాత ధోరణి అవలంబిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా పీసీసీఎం అవార్డుల్లో రాజకీయాలు నడిచాయన్న తీవ్ర విమర్శలు వస్తున్నాయి. రైల్వే ప్రతిష్ఠాత్మక అవార్డులను కొందరు తమ స్వార్థం కోసం బోర్డును అప్రతిష్టపాలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైల్వే ప్రతిష్ఠకు భంగం కలిగించే వారికి విజయవాడ స్పోర్ట్స్ స్క్వాడ్ తరపున పీసీసీఎం అవార్డు దక్కగా.. మెరుగైన ప్రతిభ కనబరిచిన వారున్నా గుర్తించకపోవడం గమనార్హం.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)



విజయవాడ స్పోర్ట్స్ స్క్వాడ్‌లో కె.నరేంద్ర (టీటీఐ) అత్యుత్తమ ప్రతిభ చూపి బృంద తనిఖీల్లో మొత్తంగా రూ.40.95 లక్షల ఆదాయాన్ని రైల్వేకు సాధించి పెట్టారు. ఆ తర్వాతి స్థానంలో ఎస్‌కే మస్తానయ్య (టీటీఐ) రూ. 39.41 లక్షల ఆదాయాన్ని సాధించి పెట్టారు. మూడో స్థానంలో డి.వెంకటేశ్వర్లు రూ.38.91 లక్షల ఆదాయాన్ని సాధించారు. వీరిలో కె.నరేంద్రకు న్యాయంగా అవార్డు దక్కాల్సి ఉండగా.. మూడో స్థానంలో ఉన్న డి.వెంకటేశ్వర్లుకు అవార్డుకు ఎంపికచేయడం గమనార్హం. పీసీసీఎం అవార్డుకు ఎంపిక చేసిన వెంకటేశ్వర్లు గతంలో పలుమార్లు సస్పెండ్ అయ్యారు. ఇతర రాష్ట్రాల ప్రయాణికుల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేసిన ఉదంతాలు ఉండగా.. ఇతడిపై ఓ ప్రయాణికుడు బోర్డుకు ఫిర్యాదు చేస్తే విచారణ జరిపించి అతడిపై సస్పెండ్ వేటు వేసింది. గతంలో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో డబ్బులు తీసుకుని రైలు దిగి వెళ్లిపోవడంతో రైలు మూడు గంటల పాటు విజయవాడ స్టేషన్‌లో నిలిచిపోయింది. అప్పట్లో ఇది సంచలనమైంది. ఆ సంఘటనతో అతడు సస్పెండ్ అయినా.. మళ్లీ అదే పోస్టులోకి రావడం గమనార్హం. ప్రయాణికుల నుంచి డబ్బులు వసూలు చేసి మళ్లీ సస్పెండ్ అయ్యాడు. సస్పెండ్ అయిన వ్యక్తి తిరిగి మళ్లీ అదే పోస్టుకు రావటంలో కమర్షియల్ విభాగంలోని అవినీతి కోటరీలే కారణంగా తెలుస్తోంది.

పీసీసీఎం అవార్డులు అంటే..

రైల్వేలో వివిధ స్థాయిల్లో ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగులను ప్రోత్సహించేందుకు వివిధ అవార్డులు జారీ చేస్తుంటారు. రైల్వేబోర్డు అవార్డులు, జోన్ స్థాయిలో జీఎం అవార్డులు ఉంటాయి. ఆ తర్వాత ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పీసీసీఎం) అవార్డులు ఉంటాయి. ఇవి కాకుండా శాఖల వారీగా అవార్డులు జారీ చేస్తుంటారు. పీసీసీఎం అవార్డులు కమర్షియల్ విభాగానికి సంబంధించి ముఖ్యమైనవి. తాజాగా ఈ అవార్డులు విజయవాడ డివిజన్ పరిధిలోని స్క్వాడ్ టీమ్స్‌లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారికి ఇచ్చారు. విజయవాడ డివిజన్ పరిధిలో నెల్లూరు, ఒంగోలు, తుని, రాజమండ్రి, భీమవరం, గుడివాడ, విజయవాడ సెక్షన్లలో స్క్వాడ్ టీమ్‌లు పనిచేస్తుంటాయి. పై సెక్షన్లలో ఒక్క విజయవాడ తప్ప అన్నింట్లో ఒక్కొక్క స్క్వాడ్ టీమ్ పనిచేస్తుంది. విజయవాడ సెక్షన్‌లో మాత్రం సీటీఐ, జనరల్, స్పోర్ట్స్, సీనియర్ డీసీఎం వంటి స్క్వాడ్స్‌తో పాటు మహిళలతో పనిచేసే తేజస్విని, కృష్ణా స్క్వాడ్స్ ఉన్నాయి. విజయవాడ సెక్షన్‌లో స్పోర్ట్స్ స్క్వాడ్‌కు సంబంధించి అవార్డు ఎంపికలో మరక పడింది.

కమర్షియల్ విభాగంలో కోటరీలు

కమర్షియల్ విభాగంలో సీనియర్ డీసీఎంకు తెలియకుండా కొన్ని అవినీతి కోటరీలు పనిచేస్తున్నాయి. వాస్తవాలు ఉన్నతాధికారుల దృష్టికి రాకుండా ఈ కోటరీలు పనిచేస్తున్నాయి. విజయవాడ డివిజన్ రూ.5614.13 కోట్ల ఆదాయం సాధించిందంటే సీనియర్ డీసీఎం ప్రణాళికలు, ఆయన విశేష కృషి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఈ కృషిని బూడిదలో పోసిన పన్నీరులా అవినీతి కోటరీలు తెర వెనుక పాత్ర పోషిస్తున్నాయి. ఈ కోటరీల లీల వల్లనే బెజవాడ రైల్వేలో అవినీతిపరులు రెచ్చిపోతున్నారు. ఈ కోటరీలు జోక్యం చేసుకోని అంశాలు లేవంటే అతిశయోక్తి కాదు. చివరికి అవార్డులను కూడా భ్రష్టు పట్టించే పరిస్థితి ఏర్పడింది.

బాబుతోనే యువతకు ఉపాధి

- ఉద్యోగాల కల్పనే తక్షణ కర్తవ్యం
- కేశినేని శివనాథ్ (చిన్ని)



కేశినేని చిన్ని, కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌ల సమక్షంలో టీడీపీలో చేరిన యువత

విద్యాధరపురం, ఏప్రిల్ 4 : నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రథమ కర్తవ్యంగా చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. గురువారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పార్టీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్, చిన్నిల సమక్షంలో భవానీపురం 45వ డివిజన్ సితార సెంటర్‌కు చెందిన నరేష్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు యువకులు పార్టీలో చేరారు. అనంతరం కేశినేని చిన్ని మాట్లాడుతూ, పశ్చిమ నియోజకవర్గ యువతలో మార్పు మొదలైందన్నారు. చంద్రబాబు, లోకేశ్‌లు యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పనే ధ్యేయంగా కృషి చేస్తారని, ఉద్యోగాలు వచ్చేంతవరకు నిరుద్యోగులకు ప్రతినెల రూ.3వేల భృతి ఇస్తారన్నారు. పట్టాభిరామ్ మాట్లాడుతూ, శివనాథ్ సేవా కార్యక్రమాలకు ఆకర్షితులైన యువత పెద్దఎత్తున పార్టీలోకి వస్తున్నారన్నారు. రాష్ట్రంలో పరిస్థితులు చక్కబడాలంటే చంద్రబాబు నాయుడు సీఎం కావాల్సిన అవశ్యకత ఉందన్నారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, మైనార్టీ నాయకుడు పతావుల్లా, వాణిజ్య విభాగం నాయకుడు సోలంకి రాజు, 45వ డివిజన్ యూత్ లీడర్ నరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమితో జగన్‌కు ఓటమి తప్పదు



పాయకాపురం : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో సీఎం జగన్‌కు ఓటమి తధ్యమని కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. 64వ డివిజన్ కండ్రికలో గురువారం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. రానున్నది చంద్రన్న పాలన అని చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కాగానే 50 ఏళ్ల నిండిన బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రతి ఒక్కరికి నెలకు రూ.4 వేలు పింఛన్ అందజేస్తారని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి తెలుగుదేశం పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, పరుచూరి ప్రసాద్, విజయవాడ పార్లమెంట్ నాయిబ్రాహ్మణ అధ్యక్షుడు సూరవరపు నాగరాజు, పార్లమెంట్ ఎస్సీసెల్ సభ్యుడు వింజరమూరి సతీష్, దాసరి కనకారావు, పలగాని శివ, తదితరులు పాల్గొన్నారు.

బాబుపై భరోసాతోనే భారీగా చేరికలు



వైసీపీ శ్రేణులకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బోడె ప్రసాద్, బాలశౌరి

పెనమలూరు, ఏప్రిల్4 : వైసీపీ రాక్షస పాలనతో విసుగెత్తిపోయిన రాష్ట్ర యువత చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లపై నమ్మకంతో టీడీపీలోకి వలసలు వస్తున్నారని కూటమి అభ్యర్థులు వల్లభనేని బాలశౌరి, బోడె ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం పోరంకి బీజేఆర్‌నగర్ వైసీపీ నేతలు యెడ్లూరి శౌరిబాబు, బండెల్ల చంటి, రవి, పరిమి మోసెయ్య తదితరులు కుటుంబాలతో టీడీపీలో చేరారు. రాష్ట్ర భవిష్యత్తును సర్వ నాశనం చేసిన సైకో జగన్ మనస్తత్వాన్ని అర్థం చేసుకొన్న యువత వచ్చే ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైసీపీ నుంచి ఇరవై కుటుంబాలు టీడీపీలో చేరాయి. బోడెప్రసాద్, అనుమోలు ప్రభాకరరావు, వీరంకి కుటుంబరావులు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



మేము సైతం..

'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ, గడప గడపలో మేము సైతం' కార్యక్రమంలో భాగంగా గురువారం 16వ డివిజన్‌లో పరాసుపేటలో మాజీమంత్రి కొల్లు రవీంద్ర, జనసేన ఇన్‌చార్జి బండిరామకృష్ణ ఇంటింటికీ పర్యటించారు. పరాసుపేటలో టీ దుకాణాల వద్ద సరదాగా కాసేపు టీ అమ్మారు. **మచిలీపట్నం టౌన్**



దొండపాడులో ఎన్నికల ప్రచారంలో వెనిగండ్ల రాము

దొండపాడులో వెనిగండ్ల ప్రచారం

గుడివాడ రూరల్, ఏప్రిల్ 4 : ప్రజా సమస్యలు పట్టని ఎమ్మెల్యే కొడాలి నాని బూతులు తిట్టడమే అలవాటుగా మార్చుకున్నారని గుడివాడ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వెనిగండ్ల రాము అన్నారు. గురువారం దొండపాడులో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమంలో రాము మాట్లాడుతూ, దొండపాడు ప్రధాన రహదారికి ఎమ్మెల్యే కొడాలి నాని కనీసం మరమ్మతులు చేయించలేకపోయాడని విమర్శించారు. ప్రజా సమస్యలపై మాట్లాడితే బూతులు తిట్టడం పరిపాటిగా మారిందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ, స్థానిక నేతలు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ఎదుగుదల చూసి ఓర్వలేకే తప్పుడు కేసులు

- వైసీపీ నేత వెంపటి

గుడివాడ : రాజకీయంగా తన ఎదుగుదలను ఓర్వలేకే తనపై తప్పుడు కేసులను పెట్టినట్టు వైసీపీ నేత వెంపటి సైమన్ అన్నారు. గురువారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, పార్టీలో తన ఎదుగుదల ఓర్వలేక తమ సామాజికవర్గానికి చెందిన వేల్పుల నాగబాబు తనపై ఉద్యోగాల పేరుతో డబ్బులు తీసుకున్నట్టు తప్పుడు కేసు పెట్టారన్నారు. పోలీసులు విచారణ జరిపి నిజాలను బయటపెట్టాలన్నారు. నాగబాబుపై పరువు నష్టం దావా వేస్తామని వెంపటి హెచ్చరించారు.

వలంటీర్లతో రాజకీయాలకు మేం వ్యతిరేకం : నెట్టెం



జగ్గయ్యపేట, ఏప్రిల్ 4 : వలంటీర్ల వ్యవస్థను టీడీపీ వ్యతిరేకించలేదని, వారితో ప్రజా ప్రయోజనాలను పక్కనబెట్టి జగన్ రెడ్డి రాజకీయ ప్రయోజనాలను ఆశించటాన్ని వ్యతిరేకించామని మాజీమంత్రి, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం అన్నారు. గురువారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, జగన్‌రెడ్డికి ప్రజా ప్రయోజనాలు పట్టలేదని, టీడీపీ, ప్రతిపక్షాలు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాకనే ప్రభుత్వానికి ఆదేశాలు ఇచ్చిందన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఇంటింటికి పెన్షన్లను పంపిణీ చేయిస్తామని చెప్పారు. సమావేశంలో టీడీపీ నేతలు గింజుపల్లి రమేష్, షేక్ సయ్యద్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ శవ రాజకీయాలు మానుకోవాలి

- తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత



నాగాయలంక, ఏప్రిల్ 4 : వలంటీర్ వ్యవస్థకు తెలుగుదేశం ప్రభుత్వం వ్యతిరేకం కాదని, రాజకీయాలు చేసే వలంటీర్లకు మాత్రమే టీడీపీ ప్రభుత్వం వ్యతిరేకమని తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత అన్నారు. గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, వలంటీర్లకు రాబోయే ఎన్డీఏ ప్రభుత్వం తగిన న్యాయం చేస్తుందన్నారు. వలంటీర్లను రెచ్చగొట్టడం ద్వారా వైసీపీ నాయకులు రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. పింఛన్ల పంపిణీలో జగన్ ప్రభుత్వం నీచ రాజకీయాలు చేయటం దారుణమన్నారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఉప్పల ప్రసాద్, పెన్షన్ దారులు పాల్గొన్నారు.

శవ రాజకీయాలకు వైసీపీ పేటెంట్ : ఉమా

గొల్లపూడి: శవ రాజకీయాలను వైసీపీ పేటెంట్ హక్కుగా భావిస్తున్నదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గొల్లపూడి పార్టీ కార్యాలయంలో ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ, పింఛన్ మరణాలకు కారణం ముమ్మాటికీ జగన్మోహన్ రెడ్డే అని ఆరోపించారు. వైసీపీ శవ రాజకీయాలకు సీఎస్ జవహర్ రెడ్డి, సెర్ప్ సీఈవో ధనుంజయ్ రెడ్డి, శశిభూషణ్‌లు సహకారం అందించారని మండిపడ్డారు. ఐఏఎస్ చదివింది పండుటాకులపై పగబట్టి వారి చావులు చూసేందుకేనా అని ధ్వజమెత్తారు. ప్రజల సొమ్ము జీతంగా తీసుకుంటున్న సజ్జల రాజకీయాలు ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. వైసీపీ తరపున మాట్లాడాలి అనుకుంటే సలహాదారుని పదవికి రాజీనామా చేసి మాట్లాడాలని డిమాండ్ చేశారు.

వీడిన ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో జ్వరంతో రెండు రోజులుగా హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కల్యాణ్ బుధవారం రాత్రి నుంచి పార్టీ ముఖ్య నేతలతో సమావేశమై కార్యకర్తల అభిప్రాయాలను, స్థానిక గెలుపు అవకాశాలను బేరీజు వేసుకుని గురువారం మధ్యాహ్నం మండలి బుద్ధప్రసాద్ పేరును ఖరారు చేస్తూ ప్రకటన విడుదల చేశారు.

నియోజకవర్గంలో హర్షాతిరేకాలు

బుద్ధప్రసాద్‌ను జనసేన అభ్యర్థిగా ప్రకటించిన వెంటనే అవనిగడ్డ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. అవనిగడ్డలోని బుద్ధప్రసాద్ ఇంటి వద్ద, కార్యాలయం వద్ద టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు టపాసులు కాల్చి సంబరాలు చేయగా, గురువారం సాయంత్రం బుద్ధప్రసాద్ కుమార్ మండలి వెంకట్రామ్, అల్లుడు శీలం అశ్విన్ ఆధ్వర్యంలో అభయాంజనేయస్వామి ఆలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.



పెంజంద్రలో ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు

కోడ్ అమలులో వివక్ష!

పెంజంద్రలో పంచాయతీ అధికారులు పక్షపాతధోరణి వ్యవహరిస్తున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. గ్రామంలో పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఎన్నికల నిబంధనల ప్రకారం క్లాత్‌తో మూసివేశారు. విగ్రహానికి సమీపంలో జగన్మోహనరెడ్డి ఫోటోతో ఉన్న ఫెక్సీని మాత్రం వదిలివేయడంతో అధికారుల పక్షపాత వైఖరిని టీడీపీ నేతలు ఖండిస్తున్నారు. - **గుడ్లవల్లేరు**



ఎన్టీఆర్ విగ్రహానికి సమీపాన ఉన్న వైసీపీ ఫ్లెక్సీ

శ్రీరాంపురం సొసైటీ కార్యదర్శిపై ఫిర్యాదు

రెడ్డిగూడెం, ఏప్రిల్ 4 : శ్రీరాంపురం పీఏసీఎస్‌లో రైతుల కట్టిన బకాయి సొమ్ము రూ.30 లక్షలతో ఉడాయించిన కార్యదర్శి వి.ప్రభుదాసుపై కేడీసీసీ బ్యాంక్ అధికారులు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. రైతులు రుణాలను సకాలంలో చెల్లించగా మార్చి 31న ఆ సొమ్మును బ్యాంకులో జమ చేయకుండా ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసి ప్రభుదాసు పరారయ్యాడని, ఆచూకీ కనిపెట్టి రైతులు సొమ్ము రికవరీ చేయాలని అధికారులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సొసైటీ ప్రత్యేకాధికారి జ్యోతిర్మయి, బ్రాంచ్ మేనేజర్ లక్ష్మీప్రసాద్, సూపర్ వైజర్ నాగేశ్వరరావుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై యు.గోవింద్ తెలిపారు.

రూ. 7.30 లక్షలు స్వాధీనం

జగ్గయ్యపేట రూరల్, ఏప్రిల్ 4: మండలంలోని చిల్లకల్లులో ఎటువంటి రశీదులు లేకుండా తీసుకెళ్తున్న రూ. 7.30 లక్షలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు. గౌరవరం సమీపంలోని పెట్రోల్ బంకు నుంచి నగదును జగ్గయ్యపేటలో బ్యాంకులో జమ చేసేందుకు తీసుకువస్తున్నట్టు తెలిసింది.



పెడనలోని ఇంట్లో వైసీపీకి చెందిన ప్రచారసామగ్రి

వైసీపీ ప్రచార సామగ్రి స్వాధీనం

మచిలీపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పెడన అసెంబ్లీ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి ఉప్పాల రాముకు చెందిన ప్రచార సామగ్రిని, పంపిణీకి సిద్ధంగా ఉంచిన చీరలను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. పెడన నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి పార్టీ కార్యాలయం సమీపంలోని ఒక ఇంటిలో పెద్దఎత్తున ప్రచార సామగ్రి, చీరలను ఉంచారనే సమాచారంతో కలెక్టరేట్‌కు ఫిర్యాదు వెళ్లింది. దీంతో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి.వెంకటరమణ, అధికారులు, పోలీసులను అక్కడకు పంపారు. ఇంటిలో దాచి ఉంచిన చీరలు, పార్టీబ్యానర్‌లు, బ్యాడ్జీలు, ఇతరత్రా సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 57బ్యాగుల్లో ప్రచారసామగ్రి, పార్టీ జెండాలు, ఐదు అట్టపెట్టెల్లో చీరలు, ఉండగా వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారని, వీటి వివరాలను నమోదు చేసి త్రీమెన్ కమిటీలో పెట్టి విచారణ చేయడం జరుగుతుందని నియోజకవర్గ ఆర్వో తెలిపారు. బందరు రూరల్ సీఐ పెడన ఎస్ఐ సూర్యశ్రీనివాస్ నేతృత్వంలో పోలీసులు తనిఖీల్లో పాల్గొన్నారు. పెడనలో వైసీపీకి చెందిన ప్రచారసామగ్రి పెద్దమొత్తంలో అధికారులు స్వాధీనం చేసుకున్నారనే సమాచారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.03

ప్రాంగణ ఎంపికల్లో 10 మందికి ఉద్యోగాలు



లబ్బీపేట, ఏప్రిల్ 4: సిద్ధార్థ మహిళా కళాశాలలో గురువారం కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆక్వాకల్చర్ టెక్నాలజీ ఆధ్వర్యంలో గ్రోవెల్ ఫీడ్స్ సంస్థ ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. ఈ ఎంపికల్లో పదిమంది విద్యార్థినులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ఆక్వా పరిశ్రమలో ఉన్న విభిన్న ఉద్యోగావకాశాలు గురించి వివరించారు. గ్రోవెల్ ఫీడ్స్ సంస్థ హెచ్ఆర్ శ్రీకీర్త్, టెక్నికల్ కో ఆర్డినేటర్స్ రాజేంద్రప్రసాద్, జ్ఞానశ్రీ, కళాశాల డైరెక్టర్ టి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజలను నమ్మించి మోసం చేస్తున్న జగన్

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మాచవరం, ఏప్రిల్ 4 : వైసీపీ అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలు అమలు చేస్తానన్న జగన్ గద్దెనెక్కిన తర్వాత సంక్షేమ పథకాలను అర్హులకు అందజేయకుండా మోసం చేశాడని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ విమర్శించారు. 6వ డివిజన్‌లోని గులాం మొహిద్దీన్ నగర్‌లో గురువారం ఆ పార్టీ నేతలు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయనున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తానన్న జగన్ హామీ ఏమైందని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో



ఓటర్లతో మాట్లాడుతున్న గద్దె రామ్మోహన్

సైకిల్ గురుపై ఓటు వేసి టీడీపీని గెలిపించాలని తద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. డివిజన్ అధ్యక్షుడు పడాల గంగాధర్ పాల్గొన్నారు.

14వ డివిజన్‌లో

పటమట: 14వ డివిజన్‌లో ఎన్ఎస్ఎం స్కూల్ సమీపంలోని ఆయిల్‌మిల్ క్వార్టర్స్ ఏరియాలో జనసేన, బీజేపీ బలపర్చిన టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్(చిన్ని)ల విజయాన్ని కోరుతూ గురువారం రాత్రి జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలపై ఆమె ఇంటింటికీ వెళ్లి వివరించారు. నర్రా కిషోర్, యడ్లపల్లి నాగేశ్వరారవు, సీహెచ్.సాంబయ్య, వి. డాంగేకుమారి పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీ చేరికలు

7వ డివిజన్ శిఖామణి సెంటర్‌కు చెందిన వైసీపీ యువ నాయకుడు కలపాల విక్రమ్ (విక్కి) 50 మందితో కలిసి గురువారం రాత్రి అశోక్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో గద్దె రామ్మోహన్ సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ నాయకుడు బొప్పన భవకుమార్ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కలపాల విక్రమ్ మాట్లాడుతూ తూర్పులో గద్దె గెలుపు ఖాయమని, మెజారిటీ పెంచేందుకు తమ వంతు సహకారం అందచేస్తామన్నారు. పార్టీ నాయకులు గుమ్మడి గురుప్రసాద్, ముమ్మనేని ప్రసాద్, సిద్ధం నాగేంద్రరెడ్డి, పి.గురునాధం, పి.శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

కనకదుర్గా నగర్‌లో గద్దె క్రాంతి ఎన్నికల ప్రచారం

భారతీనగర్: తూర్పునియోజకవర్గ పరిధిలోని 3వ డివిజన్ కనకదుర్గా నగర్‌లో గద్దె క్రాంతి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గద్దె క్రాంతి, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలుచేసే సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి మాట్లాడుతూ అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయకుండా తూర్పు ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన వైసీపీకి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పడానికి ప్రజలు ఎదురు చుస్తూన్నారని అన్నారు. తాడి బాబురావు, బండి కోమలి, గుత్తికొండ మోహనరావు, పేరేపి ఈశ్వర్, అశోక్, మురారి బాలాజీ ప్రసాద్, గుండమాల రాజశేఖర్, పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే చంద్రబాబు లక్ష్యం

కేశినేని వెంకట్

పాయకాపురం, ఏప్రిల్ 4 : రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించడమే టీడీపీ అధినేత నారా చంద్రబాబు లక్ష్యం అని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని చిన్ని తనయుడు కేశినేని వెంకట్ అన్నారు. పాయకాపురం 61వ డివిజన్‌లో టీడీపీ ఎన్నికల ప్రచారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి టీడీపీని గెలిపించాలని అభ్యర్థించారు. రాష్ట్రాన్ని అభివృద్ధిలో నెంబర్ వన్ స్థానంలో నిలుపుతానని హామీ ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ఏపీని నిరుద్యోగులకు నెంబర్ వన్‌గా చేశాడని వివరించారు. టీడీపీ అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు వచ్చే విధంగా చంద్రబాబునాయుడు ప్రణాళిక రూపొందిస్తున్నారని, నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చే వరకు నెలకు నిరుద్యోగ భృతి ద్వారా రూ. 3 వేలు అందిస్తారని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీని గెలిపించాలని కోరారు.



61వ డివిజన్‌లో ఓటర్లతో మాట్లాడుతున్న కేశినేని వెంకట్

కృష్ణలంక: జగన్ ప్రభుత్వంలో మహిళలకు విలువ, గౌరవమే కాకుండా, రక్షణ కూడా లేదని, జగన్ చెల్లెళ్లు ఇద్దరూ న్యాయం కోసం రోడ్డెక్కిన దుస్థితి ప్రస్తుత ప్రభుత్వంలో వుందని కేశినేని శ్రీదేవి, గద్దె అనురాధలు మండి పడ్డారు. కృష్ణలంక 21వ డివిజన్‌లోని మెట్లబజారు, పాత పోలీస్ స్టేషన్‌రోడ్డు, గుంటూరు వారి వీధుల్లో గురువారం ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి, అనురాధలు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే మహిళలు గౌరవంగా, ధైర్యంగా తిరగగలరని వారు తెలిపారు. సైకిల్ గుర్తుపై ఓటేసి రాష్ట్రాభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించడంతో పాటు ఎంపీగా శివనాథ్ (చిన్ని)కు కూడా భారీ మెజారిటీ అందించాలని వారు కోరారు. జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి, టీడీపీ నాయకులు వేములపల్లి రంగారావు, గోరిపర్తి నామేశ్వరరావు, కేశనం భావన్నారాయణ, జనసేన నాయకులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి: సీఐ

వన్‌టౌన్, ఏప్రిల్ 4: రానున్న ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా నిర్భయంగా వినియోగించుకోవాలని గవర్నరుపేట సీఐ డి.వి రమణ సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు గవర్నరుపేట సీఐ డి.వి రమణ, ఎస్ఐ నారాయణమ్మ సిబ్బందితో కలిసి గురువారం హనుమాన్‌పేట ఏరియాలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల నియమ నిబంధనలు అమలులో ఉండడం వలన ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఎలక్షన్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఎన్నికల్లో ప్రజలు పాటించాల్సిన విధివిధానాలను వివరించారు.



మాట్లాడుతున్న సీఐ రమణ

మహిళకు బ్యాగు అప్పగింత

ఆటోలో మరచిపోయిన బ్యాగును కొన్ని గంటలలోనే వెతికి బాధితురాలు సయ్యద్ ఇర్షద్‌కు గురువారం గవర్నరుపేట సీఐ డి.వి రమణ అప్పగించారు. ఆగిరిపల్లికి చెందిన సయ్యద్ ఇర్షద్ బందర్‌రోడ్డులోని ఓ వస్త్రదుకాణంలో వస్త్రాలు కొనుగోలు చేసి చల్లపల్లి బంగ్లా వద్ద హడావుడి ఆటో దిగుతూ వస్త్రాల బ్యాగు మరిచిపోయింది. ఆటో కనిపించకపోవడంతో గవర్నరుపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ డి.వి రమణ వెంటనే స్పందించి ఆయన పర్యవేక్షణలో ఎస్ఐ నారాయణమ్మ తన సిబ్బందితో చల్లపల్లి బంగ్లా వద్దకు వెళ్లి పలువురు ఆటో డ్రైవర్లను వివరాలు అడిగి తెలుసుకుని ఆటోలో మరిచిపోయిన బ్యాగును పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. సీఐ పర్యవేక్షణలో ఆ బ్యాగును ఇర్షద్‌కు అందజేశారు.

పానీపూరి వ్యాపారిపై యువకుడి దాడి

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 4 : అకారణంగా పానీపూరీ వ్యాపారిపై దాడి చేసిన యువకుడిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన గంభీర్ బాలకుమార్ అజిత్‌సింగ్‌నగర్ పీ అండ్ టీ కాలనీలో నివసిస్తూ స్థానికంగా పానీపూరీ బండి నడుపుతున్నాడు. బాలకుమార్ బుధవారం రాత్రి వ్యాపారం ముగించుకుని ఇంటికి వెళ్తుండగా వర్ధన్ అనే యువకుడు తనకు పానీపూరీ కావాలని అడిగాడు. సమయం అయిపోయిందని ఇంటికి వెళ్లిపోతున్నానని చెప్పాడు. దీంతో ఆగ్రహానికి గురైన వర్ధన్ బాలకుమార్‌పై దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శానిటరీ కార్యాలయానికి కూలింగ్ ఫ్రీజర్ అందజేత



అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 4 : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి మంచినీటి కూలింగ్ ఫ్రీజర్ ఎంతగానో ఉపయోగపడుతుందని కళ్లే లలిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కళ్లే నాగేశ్వరరావు అన్నారు. కళ్లే లలిత జ్ఞాపకార్థం డివిజన్ శానిటరీ కార్యాలయానికి గురువారం ఆయన కూలింగ్ ఫ్రీజర్‌ను అందజేశారు. ఇన్‌స్పెక్టర్ పి. రామకృష్ణ, ముష్పూరి హరీష్, సైకం సాయిబాబా, బలుసుపాటి మహేష్, చల్లగాలి అనిల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగం సాధించిన పాఠకుడికి సన్మానం



గవర్నర్‌పేట, ఏప్రిల్ 4: ఎంజీ రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో రిఫరెన్స్ పుస్తకాలు చదువుకుని ఉద్యోగం సాధించిన పాఠకుడు జుజ్జువరపు కిరణ్‌ను గ్రంథాలయ సిబ్బంది గురువారం ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా ఉద్యోగం పొందిన కిరణ్‌ను గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి, సిబ్బంది శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనర్ల మధ్య క్రికెట్ వివాదం

చిట్టినగర్, ఏప్రిల్ 4 : చిట్టినగర్ టేనర్‌పేటలో మైనర్ల మధ్య క్రికెట్ వివాదాన్ని రేపింది. టేనర్‌పేట అడ్డరోడ్డు టీఎం హైస్కూల్ ప్రాంగణంలో గురువారం మధ్యాహ్నం క్రికెట్ ఆడుకుంటున్నారు. స్థానికంగా ఉంటే కొంతమంది యువకులు మద్యం మత్తులో ఇక్కడికి వచ్చారు. క్రికెట్ ఆడుకుంటున్న మైనర్ల మధ్య చిచ్చుపెట్టారు. దీంతో వారు రెండు వర్గాలుగా విడిపోయి గొడవపడ్డారు. కర్రలు, రాళ్లతో ప్రతిదాడులకు సిద్ధమయ్యారు. స్థానికులు దీన్ని గమనించి కొత్తపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. రక్షక్ వాహనంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే సరికి యువకులు, మైనర్లు పరారయ్యారు. దీనిపై ఎలాంటి కేసు నమోదు చేయలేదు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వన్‌టౌన్, ఏప్రిల్ 4: 33/11 కేవీ ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ పార్కు రోడ్డులోని ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు టౌన్ ఈఈ బీవీ సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్కురోడ్డు, కాటూరివారి వీధి, భావన్నారాయణ వీధి, రాంగోపాల్ వీధి, కందులవారి వీధి, పులిపాటి వారి వీధి, జండా వీధి, శివాలయం వీధుల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఇండియా కూటమితోనే అభివృద్ధి సాధ్యం

సీపీఐ పశ్చిమ అభ్యర్థి కోటేశ్వరరావు

భవానీపురం, ఏప్రిల్ 4 : దేశ, రాష్ట్రాభివృద్ధి ఇండియా కూటమితోనే సాధ్యమని సీపీఐ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి జి.కోటేశ్వరరావు అన్నారు. కోటేశ్వరరావు అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ 43వ డివిజన్‌లోని ఊర్మిళానగర్ పోలేరమ్మ గుడి, ప్రజాశక్తి నగర్, నులకపేట, ఏకలవ్యనగర్, హౌసింగ్‌బోర్డు మీదుగా పాత పోలీస్‌స్టేషన్ వరకు గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దోనేపూడి శంకర్ మాట్లాడుతూ కోటేశ్వరరావును గెలిపించాలన్నారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, కార్యదర్శి వర్గ సభ్యురాలు పంచదార్ల దుర్గాంబ, పైడియ్య, రాయప్ప, సాంబశివరావు, భాస్కరరావులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో కోటేశ్వరరావు

వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గ సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు గురువారం వన్‌టౌన్ కాశేశ్వరరావు మార్కెట్, శివాలయం వీధి తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులకు ఎవరికి ఏ సమస్య వచ్చిన చిత్తశుద్ధితో పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నాయకులు ఎన్.వీరభద్రరావు, ఎం.సాంబశివ రావు, కేఆర్ ఆంజనేయులు, పి.దుర్గాంబ, ఓ.భారతి పాల్గొన్నారు.

9న ఆల్ ఎంప్లాయీస్ పెన్షనర్ల ఉగాది వేడుకలు

భవానీపురం, ఏప్రిల్ 4 : హెచ్‌బీ కాలనీలో ఆల్ ఎంప్లాయీస్ పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో 225 మంది సభ్యులతో కూడిన కేంద్ర, రాష్ట్ర పెన్షనర్లు ఆత్మీయంగా ఈ నెల 9న క్రోధి నామ సంవత్సరం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు సూరిశెట్టి వెంకటేశ్వరరావు తెలిపారు. సంఘ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. ఆ రోజు ఉదయం విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు ఆవంచ వేణుగోపాల రాధాకృష్ణమూర్తి పంచాంగ పఠనం, క్యారమ్స్ విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాలి ఆంజనేయులు(రిటైర్డు ఏపీ జెన్‌కో డైరెక్టర్), అబ్బిలి ఆంజనేయులు (రిటైర్డు ఎంపీడీవో), తెలగరెడ్డి సత్యానందం(రిటైర్డు ఇన్‌కమ్‌టాక్స్ జాయింట్ కమిషనర్)లు హాజరవుతారన్నారు. కార్యదర్శి సందక కృష్ణ, యెనిగళ్ల సుబ్బారావు, దేవరకొండ శేషగిరిరావులు పాల్గొన్నారు.



ఉగాది ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

28న లలిత సహస్రనామ మహాపారాయణం

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 4: జయహో భారతీయం, ముమ్మినేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం, లింక్ ఫీల్డ్స్, శ్రీధర్ సీసీఈ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 28న మొగల్రాజపురంలోని సిద్ధార్థ అకాడమీ గ్రౌండ్స్‌లో 9 వేల మందితో లలిత సహస్రనామ మహాపారాయణం నిర్వహిస్తున్నట్లు ఏపీ హైకోర్టు అసిస్టెంట్ రిజిస్ట్రార్ అక్కెన వేణుగోపాలరావు తెలిపారు. లోక కల్యాణం, సమస్త ప్రజానీక సంక్షేమం కోసం ఈ తరహా ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. శ్రీవిద్య ఉపాసకులు యాబలూరి లోక్‌నాథ్‌శర్మ మాట్లాడుతూ లలిత అమ్మవారి ఊరేగింపు 28న సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల నుంచి సాయంత్రం 4.45 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. సిద్ధార్థ అకాడమీ ఉపాధ్యక్షుడు వెల్లంకి నాగభూషణరావు మాట్లాడుతూ 9 వేల మందితో సామూహిక పారాయణం చేయనున్నట్లు పేర్కొన్నారు. కరపత్రం ఆవిష్కరణలో సామవేద పారాయణ మహా పండితులు సుందర రామశర్మ, వెల్లంకి శ్రీ లలిత, జయహో భారతీయం అధ్యక్షులు వల్లీశ్వర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ అగస్త్యన్, సామూహిక పారాయణం ఆహ్వాన కమిటీ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

విద్యాధరపురం, ఏప్రిల్ 4: పేను నివారణ మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ విద్యాధరపురానికి చెందిన ఏడాదిన్నర బాలుడు గురువారం మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం విద్యాధరపురం గుప్తా సెంటర్ నాగుల్‌మీరా దర్గా రోడ్డులో షేక్ బాషా భార్య ఇద్దరు కుమారులతో ఉంటున్నాడు. మార్చి 29న పెద్ద కుమారుడు తలలో పేలు నివారణకు పేను మందు తెచ్చి కొద్దిగా కొబ్బరినూనెలో కలిపి భార్యతో కుమారుడి తలకు రాయించాడు. మిగిలిన మందును గ్లాసులో ఉంచి అటకలో భద్రపరిచాడు. ప్రమాదవశాత్తు ఆ గ్లాసు కిందపడింది. అందులో ఉన్న పేను నివారణ మందును చిన్న కుమారుడు షేక్ ఖాజా తాగాడు. కొద్దిసేపు తరువాత అనారోగ్యానికి గురికాగా తల్లిదండ్రులు అతనిని చికిత్స నిమిత్తం గవర్నమెంట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం బాలుడు మృతి చెందాడు. బాలుడు తండ్రి ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శుక్రవారం • 5 ఏప్రిల్ 2024
cinema@andhrajyothy.com



ఇదొక ఎక్స్‌ట్రార్డినరీ చిత్రం

నవీన్ యెర్నేని

మలయాళంలో ఘనవిజయం అందుకున్న సర్వైవల్ థ్రిల్లర్ 'మంజుమ్మల్ బాయ్స్'. అక్కడ రూ. 200 కోట్ల రూపాయల వసూళ్లు అందుకుంది. ఈ చిత్రం తెలుగు వెర్షన్‌ను మైత్రీ మూవీ మేకర్స్ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. ఈ నెల 6న తెలుగు రాష్ట్రాల్లో విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా దర్శకుడు చిదంబరం మాట్లాడుతూ 'మైత్రీ మూవీ మేకర్స్‌కు నా ధన్యవాదాలు. తెలుగు ప్రేక్షకులు మా 'మంజుమ్మల్ బాయ్స్' చిత్రాన్ని ఆదరించాలి. సరికొత్త వినోదాన్ని పంచే చిత్రమిది' అని అన్నారు నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ 'ఇదొక ఎక్స్‌ట్రార్డినరీ ఫిల్మ్. ఈ మధ్యకాలంలో నేను చూసిన గొప్ప చిత్రం కూడా. తెలుగులోనూ పెద్ద విజయాన్ని సాధిస్తుంది. మన ప్రేక్షకులు తప్పకుండా ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు. యువతను మెప్పించే అన్ని అంశాలూ ఈ చిత్రంలో ఉన్నాయని నటుడు శ్రీనాథ్ భాసి చెప్పారు.

కెరీర్‌లో బిగ్గెస్ట్ యాక్షన్ సీక్వెన్స్



నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న చిత్రం 'తండేల్'. చందు మొండేటి దర్శకత్వంలో గీతా ఆర్ట్స్ బేనర్‌పై బన్నీవాసు నిర్మిస్తున్నారు. నిర్మాత అల్లు అరవింద్ సమర్పిస్తున్నారు. శ్రీకాకుళం సాగరతీరం నేపథ్యంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నాగచైతన్య యాక్షన్ రోల్‌లో అలరించనున్నారు. ఈ చిత్రం తాజా షెడ్యూల్ గురువారం హైదరాబాద్‌లో మొదలైంది. భారీ ఖర్చుతో నిర్మించిన సెట్‌లో పోరాట ఘట్టాలను దర్శకుడు తెరకెక్కిస్తున్నారు. పలువురు ఫైటర్లు పాల్గొంటున్నారు. 'యానిమల్' చిత్రానికి ఫైట్స్ రూపకల్పన చేసిన సుప్రీం సుందర్ సరికొత్తగా పోరాట ఘట్టాలను తీర్చిదిద్దుతున్నారు. యాక్షన్ సీన్లలో నాగచైతన్యను సరికొత్తగా చూపించబోతున్నారు, ఆయన కెరీర్‌లోనే ఇది బిగ్గెస్ట్ యాక్షన్ సీక్వెన్స్ అవుతుందని యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

నేను బతికుండగా అంగీకరించను



అతిలోక సుందరి శ్రీదేవిని ప్రేమించి పెళ్లాడారు బోనీకపూర్. దురదృష్టవశాత్తు శ్రీదేవి 2018లో మరణించారు. పలు సందర్భాల్లో ఆమె జ్ఞాపకాలను గుర్తుచేసుకుని భావోద్వేగానికి లోనవుతుంటారు బోనీకపూర్. ప్రస్తుతం 'మైదాన్' చిత్రం ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న ఆయనను ఓ ఆంగ్ల మీడియా ప్రతినిధి శ్రీదేవి బయోపిక్ ఉంటుందా అని అడగగా, బోనీకపూర్ సమాధానమిచ్చారు. "శ్రీదేవి వ్యక్తిగత స్వేచ్ఛను కోరుకునే వ్యక్తి. బతికున్నంత కాలం ఆమె తన వ్యక్తిగత జీవితంలో జరిగే విషయాలలో ఎంతో గోప్యతను పాటించింది. భర్తగా నేను ఆమె ఆలోచనల్ని గౌరవించాలి. నేను బతికున్నంత వరకూ ఆమె బయోపిక్‌కు అంగీకరించను" అని చెప్పారు.

యువరాణి పాత్రలో...



'నన్ను దోచుకుందువటే' చిత్రంతో తెలుగులో అడుగుపెట్టి కుర్రకారు మది దోచేశారు నభానటేశ్. ఆ తర్వాత వరుస ఆఫర్లతో పలు చిత్రాల్లో నటించిన నభా..ఓ ప్రమాదంలో గాయపడి సినిమాలకు రెండేళ్లు విరామమిచ్చారు. ఇటీవలే కోలుకున్న ఆమె తిరిగి నటించడానికి సిద్ధమయ్యారు. ప్రస్తుతం ఆమె నిఖిల్ సిద్ధార్థ్ పాన్ ఇండియా చిత్రం 'స్వయంభు'లో సెకండ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇందులో నభా ఓ పవర్‌ఫుల్ రోల్‌ను పోషిస్తున్నారు. చిత్రబృందం గురువారం ఆమె పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌ను చూస్తుంటే ఆమె యువరాణి పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. భరత్‌కృష్ణ మాచారి దర్శకత్వం వహిస్తున్నారు. భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది. ఇందులో నిఖిల్ పోరాట యోధుడి పాత్రను పోషిస్తున్నారు. ఈ పాత్ర కోసం ఆయన గుర్రపుస్వారీ, మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకోవడం విశేషం.



నా టాలెంట్ కారణం కాదు

అడుగుపెట్టిన ప్రతి చోటా విజయఢంకా మోగించడం అంత ఈజీ కాదు. కానీ రష్మిక అది సాధ్యమని నిరూపిస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ సినిమాలతో పాటు హిందీలో క్రేజీ ప్రాజెక్ట్స్ కూడా చేస్తూ హిట్లు తన సొంతం చేసుకున్నారు. విక్కీ కౌశల్ సరసన నటిస్తున్న 'ఛావా' అనే హిందీ చిత్రాన్ని పూర్తి చేశారు రష్మిక. 'పుష్ప2' చిత్రీకరణలో పాల్గొంటున్నారు. అలాగే ధనుష్, నాగార్జున నటిస్తున్న చిత్రంలోనూ కథానాయికగా నటిస్తున్నారు. హీరోయిన్ ఓరియంటెడ్ చిత్రం 'గర్ల్‌ఫ్రెండ్'లో నటిస్తున్నారు. నేడు రష్మిక పుట్టినరోజు. కథానాయికగా తన ప్రయాణం గురించి మాట్లాడుతూ 'విభిన్న భాషల్లో కథానాయికగా ప్రేక్షకులను మెప్పించగల అవకాశం దక్కుతుందనీ, కెరీర్ ఆరంభంలో అస్సలు అనుకోలేదు. నా టాలెంట్ దీనికి కారణం అనుకోను. ఎంతో మంది ప్రతిభావంతులు ఉన్నా నాకు మాత్రమే ఇంత గొప్ప ఆదరణ దక్కడానికి అవకాశాలే కారణం. నా కష్టంతో పాటు మంచి పాత్రలు సృష్టించిన రచయితలు, దర్శకుల వల్లే ఇది సాధ్యమైంది' అన్నారు రష్మిక.

కీర్తన ప్రేమకథ



చిమటా రమేశ్‌బాబు స్వీయ దర్శకత్వంలో హీరోగా నటిస్తున్న చిత్రం 'నేను-కీర్తన'. రిషిత, మేఘన హీరోయిన్లు. చిమటా లక్ష్మీకుమారి నిర్మాత. ఇటీవలే చిత్రబృందం ఫస్ట్‌లుక్, టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడుతూ "నేను-కీర్తన' కొత్త తరహా చిత్రం. ఈ ఏడాది బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో దీనికి స్థానం దక్కుతుందని భావిస్తున్నా. కులు, మనాలీలో చిత్రీకరించిన పాటలు, రోప్ ఫైట్స్ ఈ చిత్రానికి ప్రత్యేకాకర్షణ' అని తెలిపారు. 'నేను-కీర్తన' చిత్రం ఘన విజయం సాధించాలని దర్శకుడు వీరశంకర్, యాటా సత్యనారాయణ ఆకాంక్షించారు. సంధ్య, జీవా, జబర్దస్త్ అప్పారావు కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: ఎం. ఎల్ రాజా. సినిమాటోగ్రఫీ: కె. రమణ.

సహజత్వానికి దగ్గరగా సత్య



అమరేశ్, ప్రార్థన సందీప్ జంటగా నటించిన 'రంగోలి' తమిళ చిత్రం 'సత్య' పేరుతో తెలుగులో వస్తోంది. వాలి మోహన్‌దాస్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని శివ మల్లాల తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో టీజర్, పాట విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వాలి మోహన్‌దాస్ మాట్లాడుతూ 'ఇదే నా మొదటి సినిమా. నాకు ఎదురైన సంఘటనల నుంచి పుట్టిన కథతో సినిమా రూపుదిద్దుకుంది' అని తెలిపారు. 'సినిమాలో ఒకరిద్దరు తప్ప మిగిలిన వారంతా కొత్త వారే. ఫ్యామిలీ ఎమోషన్స్ ఉన్నాయి సహజత్వానికి దగ్గరగా సినిమా ఉంటుంది' అని సంభాషణల రచయిత విజయ్‌కుమార్ చెప్పారు. హీరో అమరేశ్ మాట్లాడుతూ 'తమిళంలో ఈ సినిమా మంచి విజయం సాధించింది. తెలుగులో కూడా సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉంది' అన్నారు. 'ఈ సినిమాను చాలా మంది నిర్మాతలు తెలుగులో చేస్తామని అడిగినా నా మీద అభిమానంతో నాకు ఇచ్చిన తమిళ నిర్మాత సతీశ్‌కు కృతజ్ఞతలు. ఎన్నో సినిమాలకు రివ్యూలు రాసిన నేను కచ్చితంగా మీ ముందుకు ఓ మంచి సినిమాతోనే వస్తున్నాను' అని నిర్మాత శివ మల్లాల చెప్పారు. తమిళ నిర్మాత సతీశ్ మాట్లాడుతూ ' విక్రమ్ హీరోగా నటించిన 'నాన్న' సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా హమరేశ్ నటించాడు. నటన అంటే ఎంతో ప్యాషన్ అతనికి. అందుకే అతను హీరోగా 'రంగోలి' చిత్రాన్ని నిర్మించాను, మంచి హిట్ అయింది. తెలుగులో కూడా విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అన్నారు.

శ్రీరంగనీతులు... కొత్తగా..



సుహాస్, కార్తీక్‌రత్నం, రుహానీ శర్మ, విరాజ్ అశ్విన్ ముఖ్య తారలుగా నటించిన 'శ్రీరంగనీతులు' చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. ప్రవీణ్‌కుమార్ దర్శకుడు. వెంకటేశ్వరరావు బల్మూరి నిర్మించిన ఈ చిత్రాన్ని ప్రముఖ పంపిణీదారుడు ధీరజ్ మొగిలినేని విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో ఆసక్తికరమైన కథ, కథనాలు ఉన్నాయి. కొత్తదనంతో పాటు కమర్షియల్ అంశాలతో చిత్రం రూపుదిద్దుకొంది' అని తెలిపారు. ఈ మధ్యకాలంలో ఇలాంటి సినిమా చూడలేదని సెన్సార్ సభ్యులు అభినందించడం ఆనందాన్ని కలిగించిందని దర్శకుడు చెప్పారు.

శివ తత్త్వం కలిగిన క్రోధి నామ సంవత్సరంలో... శుభుడైన శివుణ్ణి దర్శించి, శరణు వేడుకుంటే... ఏడాదంతా శుభమయంగా, మంగళకరంగా ఉంటుంది. క్రోధి నుంచి వసంత నవరాత్రులు ఆరంభమవుతాయి. ఇది శక్తి ఆరాధన. ప్రకృతి (శక్తి), పురుషుల (శివుడు) సమాగమం. వారిని ఆరాధిస్తే శివశక్తుల అండ, అనుగ్రహం మనకు లభిస్తాయి.

మహా శివతత్త్వమే క్రోధి



9న క్రోధి నామ ఉగాది

కాలచక్ర భ్రమణంలో... చాంద్రమానాన్ని అనుసరించి మరో సంవత్సరం ముగియబోతోంది. రెండేళ్ళ క్రితం ప్రపంచాన్ని కరోనా మహమ్మారి కబళించింది. తరువాత శుభకృత్, శోభకృత్ సంవత్సరాలు కొంత ఉపశమనం కలిగించాయి. ఇప్పుడు రాబోయే సంవత్సరం పేరు క్రోధి. గడచిన రెండు సంవత్సరాల పేర్లకు విరుద్ధంగా కనిపించే పేరున్న కొత్త ఏడాది... ప్రజలను మరింత భయభ్రాంతులకు గురిచేస్తుందనే భావన సహజమే. కానీ అది వాస్తవం కాదు. క్రోధి శివస్వరూపం. శివుడు శుభుడు, మంగళకరుడు. శివుని విభూది సర్వసంపత్కరం. ధర్మం కోసం, ధర్మబద్ధంగా... లోకకళ్యాణార్థం అధర్మాన్ని నిర్మూలించే ఈశ్వర తత్త్వం క్రోధి. ఈ తత్త్వం భగవంతుడి కారుణ్యానికి మరొక రూపం... కాబట్టి ఇది ఉపశాంతిని కలిగిస్తుంది. అందుకే ప్రత్యేకమైనది. పండుగ చేసుకోవడానికి ఇంతకన్నా కావలసినది ఏముంది? కాలరూపుడైన శివుణ్ణి ఉగాది ఉషోదయ వేళ భక్తి ప్రపత్తులతో స్వాగతిద్దాం.

బ్రహ్మ సృష్టి ఆరంభించిన రోజు ఇదేనని 'సూర్య సిద్ధాంతం' అనే జ్యోతిష గ్రంథం తెలుపుతోంది. సృష్టి ప్రభవించిన రోజు 'ప్రభవ' అని జ్యోతిష సిద్ధాంత గ్రంథాలు చెబుతున్నాయి. కాలచక్రం అరవై సంవత్సరాలు పరిభ్రమించి... తిరిగి ప్రభవకు చేరుకుంటుంది. ఈ అరవై సంవత్సరాలకు అరవై పేర్లు. ఈ ఏడాది పేరు శివ స్వరూపమైన క్రోధి. సంవత్సర కాలంలో రెండు ఆయనాలు, ఆరు ఋతువులు, పన్నెండు మాసాలు, ఇరవై ఏడు నక్షత్రాలు, రెండు పక్షాలు... ఇలా సూర్య చంద్ర గ్రహాల ప్రమాణాలను అనుసరించి ప్రాచీన జ్యోతిష శాస్త్రవేత్తలు ఒక పద్ధతిని నిర్దేశించారు. చాంద్రమానాన్ని అనుసరించేవారికి ఈ పద్ధతిలో విశిష్టత కనిపిస్తుంది. బ్రహ్మ సృష్టిని ప్రారంభించిన రోజు... ప్రభవ. ఉత్తరాయణం, ఋతువులలో మొదటిది వసంత ఋతువు, చైత్రమాసం తొలిమాసం, పక్షాలలో మొదటిది శుక్ల పక్షం, పాడ్యమి తొలి తిథి. అంటే ఉగాది నాడు అన్నీ సంవత్సరంలో మొదటివే. ఏ నామ సంవత్సర ఉగాది అయినా ఈ పద్ధతిలో మార్పు ఉండదు. ఇదే విజ్ఞానశాస్త్రపరంగా మన పూర్వ ఋషుల ఔన్నత్యం. ఇప్పుడు రాబోతున్న క్రోధి... ప్రభవ నుంచి క్షయ వరకూ వచ్చే అరవై ఉగాదుల్లో ముప్ఫై ఎనిమిదోది.

ఉగాది రాబోయే సంవత్సరానికి పునాది. ఆ సంవత్సరంలో మన ఆశలు, ఆకాంక్షలు సఫలీకృతం కావడానికి విధివిధానాలను పెద్దలు నిర్దేశించారు. అవి అభ్యంగన స్నానం, ఇష్టదేవతారాధనం, దేవీప్రసాదంగా నింబకుసుమ భక్షణం, దేవాలయాల సందర్శనం, పంచాంగశ్రవణం. ఈ అయిదూ తప్పక ఆచరించాలి.

అభ్యంగనస్నానం: బ్రహ్మీ ముహూర్తాన లేచి, కాలకృత్యాల అనంతరం... శరీరానికి నలుగు పెట్టుకొని తలంటు స్నానం చేయాలి. తిలకం పెట్టుకొని, నూతన వస్త్రాలను ధరించాలి. సంకల్పం చెప్పుకొని సూర్యారాధన చేయాలి. పెద్దల ఆశీర్వచనం తీసుకోవాలి. ఇష్ట దేవతను భక్తిశ్రద్ధలతో ఆరాధించాలి.

నింబకుసుమ భక్షణం: ఇదే ఉగాది పచ్చడి. షడ్రుచుల కలబోత. దాన్ని ఎలా చేయాలో శాస్త్రాలే వివరించాయి. వేప పూత, కొత్త బెల్లం, కొత్త చింతపండు, మామిడి ముక్కలు, ఆవునెయ్యి, కారానికి మిరియాల పొడి, ఉప్పు... ఇంకా తేనె, అరటి పండ్ల ముక్కలు కలిపి చేసిన ఉగాది పచ్చడిని దైవానికి నివేదించి... పరగడుపున ప్రసాదంగా స్వీకరించాలి. అందరికీ పంచాలి. ఆయుర్వేద శాస్త్ర రీత్యా ఈ ప్రసాదం శరీరాన్ని రుగ్మతలకు దూరంగా ఉంచుతుంది.

పంచాంగశ్రవణం: ఉగాది నాడు ఆలయాల్లో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఆలయంలో దైవాలను దర్శించి, పూజించిన తరువాత... రాబోయే సంవత్సర ఫలాలను వివరించే పంచాంగాన్ని వినాలి. పంచాంగం అంటే తిథి, వారం, నక్షత్రం, కరణం, యోగం అనే అయిదు అంగాలు కలిగినది. ఏడాది కాలాన్ని ప్రమాణంగా తీసుకొని... ఆ కాలంలో గ్రహాల సంచారం, వాటివల్ల కలిగే శుభాశుభ పరిణామాలు, వివిధ నక్షత్ర జాతకులు పొందే ఫలితాలను అది సవివరంగా చెబుతుంది. ఉపద్రవాలను, అశుభాలను నివారించుకొనే మార్గాన్ని సూచిస్తుంది.

● ఆయపిళ్ళ రాజపాప

సందేశం

ఈద్... ఆధ్యాత్మిక ఆరాధన



ఈద్ (పండుగ) అంటే కరుణామయుడైన అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలియజేయడం. ఆయన ప్రసాదించిన వరాలను గుర్తించడం. ప్రభువు కరుణానుగ్రహాలను తలచుకోవడం, విశ్వాసాన్ని స్థిరపరుచుకోవడం, ధర్మాన్ని బలపరచడం. ఉపవాసాలలో జరిగిన పొరపాట్లకు బదులుగా... పండుగ రోజున నిరుపేదలకు జకాతుల్ ఫిత్రా దానం ఖచ్చితంగా చెల్లించి, పేదల్లో సంతోషాన్ని నింపడం విశ్వాసుల కర్తవ్యం. ఈద్ అనేది అల్లాహ్ తరఫున బహుమతులను అందుకొనే రోజు. నెల రోజులు సాగే ఈద్ ఉపవాస దీక్ష... పవిత్రమైన రంజాన్ నెలవంక కనిపించిన తరువాత ప్రారంభమవుతుంది. ఆ మాసం ముగిశాక... షవ్వాల్ నెలవంక దర్శనమిచ్చిన తరువాత చేసే నమాజ్‌తో ముగుస్తుంది. పరిపూర్ణమైన నమ్మకంతో, పుణ్యఫలాన్ని ఆశించి ఉపవాసాలు పాటించేవారికి... ఈ పండుగ ఒక గొప్ప బహుమానం. దీనికి భిన్నంగా ఉపవాస సమయంలో పాపాలు చేసి, అల్లాహ్ నిర్దేశించిన నియమాలను అతిక్రమించి, ఆయన ఆజ్ఞలను నిర్లక్ష్యం చేసిన వారు తమ తప్పు తెలుసుకొని పశ్చాత్తాపం చెందాల్సిన రోజు కూడా ఇదే.

ఈదుల్ ఫిత్ర్ (రంజాన్) పర్వదినాన చేయవలసిన పనులను పెద్దలు ప్రత్యేకంగా నిర్దేశించారు. అవి: పొద్దున్నే నిద్రలేవాలి. కాలకృత్యాలు తీర్చుకోవాలి. ఫజ్ర్ నమాజ్ కచ్చితంగా చదవాలి. తలంటు స్నానం చేయాలి. ఉన్నవాటిలో మంచి దుస్తులను ధరించాలి. అత్తరులాంటి సుగంధాలు పూసుకోవాలి. కళ్ళలో సుర్మా పెట్టుకోవాలి. ఈద్ నమాజ్‌కు ముందే జకాత్, ఫిత్రా చెల్లించాలి. తీపి పదార్థాన్ని స్వీకరించాలి. ఒకటి, మూడు, అయిదు, ఏడు... ఇలా బేసి సంఖ్యలో ఖర్జూర పండ్లను తినాలి. ఈద్గా మైదానానికి ఒక మార్గంలో వెళ్ళి, వేరే మార్గంలో తిరిగి రావాలి. నమాజ్‌కు వెళ్తున్నప్పుడు తక్బీర్‌ను మెల్లగా చదువుతూ ముందుకు సాగాలి. కాలి నడకన వెళ్ళడం వల్ల మరింత పుణ్యం లభిస్తుంది. పండుగ నమాజ్ తరువాత పరస్పరం సలామ్ చెప్పుకోవాలి. పిల్లలకు 'ఈదీ' (బహుమతులు) ఇవ్వాలి. బంధువుల ఇళ్ళకు వెళ్ళి, వారికి శుభాకాంక్షలు తెలపాలి. ఇరుగుపొరుగువారికి తీపి పదార్థాలను ఇవ్వాలి. సాహిల్ (అడిగేవారు, అర్థించేవారు) ఇంటికి వస్తే... కచ్చితంగా దానం ఇచ్చి పంపాలి. అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకొంటూ... సంతోషంగా గడపాలి. పండుగ నమాజ్‌ను ఇరుకైన జనావాసాలలో కాకుండా... విశాలమైన బహిరంగ ప్రదేశాలలో (ఈద్‌గాహ్) వద్ద నిర్వహించడం ఉత్తమం. దైవ ప్రవక్త మహమ్మద్ సంప్రదాయం కూడా అదే. దగ్గరలో ఈద్‌గాహ్ లేనప్పుడు... స్థానికంగా ఉండే పెద్ద మసీదుల్లో ఈద్ నమాజ్ చేయాలి. ఈద్... ఒక ఆధ్యాత్మిక ఆరాధన. చిత్తశుద్ధితో ఆచరించే ఆ ఆరాధన అల్లాహ్ కటాక్షాన్ని, సర్వ శుభాలను కలుగజేస్తుంది.

● మహమ్మద్ వహీదుద్దీన్

సుభాషితం

సాటిలేని సంపద



విద్యానామ నరస్య రూపమధికం ప్రచ్ఛన్నగుప్తం ధనం
విద్యా భోగకరీ యశస్సుఖకరీ విద్యాగురూణాం గురుః
విద్యా బంధుజనో విదేశగమనే విద్యా పరం లోచనం
విద్యా రాజసుపూజ్యతే నహి ధనం విద్యావిహీనః పశుః...

అంటూ విద్య విలువను, గొప్పతనాన్ని భర్తృహరి తన నీతి శతకంలో వివరించాడు.

దాన్ని ఏనుగు లక్ష్మణకవి...

విద్య నిగూఢగుప్త మగు విత్తము రూపము
పూరుషాళికిన్
విద్య యశస్సు భోగకరి విద్య గురుండు విదేశబంధుడున్
విద్య విశిష్ట దైవతము విద్యకు సాటి ధనంబు లే దిలన్
విద్య నృపాలపూజితము విద్య నెఱుంగనివాడు మర్త్యుడే... అని తెలుగువారికి అందించాడు.

భావం: మనుషులకు విద్యే అందం, అది ఎవరికీ కనిపించని సంపద. చదువు కీర్తిని, సుఖాన్ని, భోగాన్ని కలిగిస్తుంది. విద్య గురువులకు గురువు. ఇతర దేశాలకు వెళ్ళినప్పుడు అక్కడ మనకు అండగా నిలిచే బంధువులాంటిది. అది మనకు మరో కన్ను లాంటిది. విద్యాధనాన్ని మించిన ధనం ఈ ప్రపంచంలో మరేదీ లేదు. సభలలో, సదస్సులలో విద్యకు గౌరవం దక్కుతుంది తప్ప ధనానికి కాదు. అంతటి గొప్పదైన విద్యను పొందని మనిషి పశువుతో సమానం.

దర్మపథం


శూన్యవాదం అంటే...

బౌద్ధ దార్శనిక సిద్ధాంతమైన శూన్యవాదం... ప్రపంచ దార్శనిక చరిత్రలోనే ఒక అద్భుత సిద్ధాంతం అని చెప్పవచ్చు. కానీ చాలామందికి ఈ శూన్యం అంటే ఏమిటో అర్థం కాక... దాన్ని రకరకాలుగా వ్యాఖ్యానించారు. బుద్ధుడు ఆత్మను, పరమాత్మను నిరాకరించాడనీ, అందుకే దాన్ని శూన్యవాదం అంటారని కొందరు అంటే... "ప్రపంచంలో అంతే శూన్యమే, ఏమీ లేదు" అంటూ దీని గురించి మరికొందరు వ్యాఖ్యానించారు. ఇంకొందరు అర్థం లేని మాటలను శూన్యవాదంతో పోలుస్తూ "ఇక నీ శూన్యవాదం ఆపుతావా?" అని కూడా అంటారు. నిజానికి శూన్యవాదం బౌద్ధ దర్శనంలో అద్భుతమైన సిద్ధాంతం. దాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించకుండా ఇలా వ్యాఖ్యానించడం విడ్డూరం. శూన్యం అనాత్మకు పర్యాయపదం కాదు. 'స్వతంత్ర అస్తిత్వం లేనిది' అని అర్థం. వాస్తవానికి శూన్యత అనేది గణితంలో సున్నా లాంటిది. గణితంలో సున్నాకు విలువ లేనట్టే అనిపిస్తుంది. కానీ అదే గణితానికి పునాది. సున్నా ఉంది కాబట్టే మనం పది, ఇరవై, వంద, వెయ్యి, పదివేలు, లక్ష లాంటి వాటిని లెక్కించగలుగుతున్నాం. ఆసక్తికరమైన విషయమేమిటంటే... గణితంలో సున్నా, శూన్యవాద తాత్త్విక సిద్ధాంతం... ఈ రెండూ భారతదేశంలోనే ఉద్భవించాయి.

అదే విధంగా శూన్యత అంటే మనం అనుకుంటున్నట్టు అభావం కాదు. ఇంకా కొంచెం స్పష్టంగా చెప్పాలంటే... ప్రపంచంలోని అన్ని ధర్మాలు (వస్తువులు) అస్తిత్వం కలిగినవి. కానీ ధర్మాలు (వస్తువులు) స్వతంత్రంగా ఉన్నా అస్తిత్వంలో ఉండాలి, లేదా అవి పరస్పర ఆధారితాలై ఉన్నా అస్తిత్వంలో ఉండాలి. విశ్వంలో ఈ రెండు మార్గాలు మాత్రమే ఉన్నాయి. ఒకటి ఆధారిత అస్తిత్వం, రెండోది స్వతంత్రాస్తిత్వం. ఇవికాకుండా మూడో వాదానికి తావులేదు. ఇలా అన్ని ధర్మాలు ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. అంటే ధర్మాలు పరస్పర ఆధారితాలు. మరి వాటికి స్వతంత్రమైన సత్తా ఎలా సాధ్యం? అందుకే దాన్ని 'శూన్యత' అన్నారు. శూన్యత, ప్రతీత్య సముత్పాదం అనే రెండు సిద్ధాంతాలూ ఒకే నాణేనికి చెందిన రెండు వైపుల వంటివి.

నాగార్జునుడి సిద్ధాంతాన్ని అనుసరించి... అస్తి అనేది ఆస్తిక దృష్టి, నాస్తి అనేది నాస్తిక దృష్టి. కాబట్టి పండితులు ఈ రెండు వాదాలనూ ఆశ్రయించరు. ఇక్కడ శాశ్వతవాదం అంటే... లోకాత్మలు శాశ్వతమని నమ్మే దృక్పథం. ఉచ్ఛేద వాదం అంటే లోకాత్మలు అశాశ్వతమైనవని అంగీకరించే దృక్పథం. శాశ్వతవాదం, ఉచ్ఛేదవాదం... ఈ రెండిటి మధ్యా ఉన్న మార్గాన్ని సమర్థించడం వల్ల... ఈ సిద్ధాంతాన్ని 'మధ్యమ ప్రతిపద' అని అంటారు.

తథాగతుడు ఋషి పట్టణంలో పంచవర్గీయ భిక్షువులకు మధ్యమ మార్గాన్ని బోధించి... అద్భుతమైన ధర్మచక్రాన్ని ప్రారంభించాడు. ధర్మచక్రం అంటే... సద్ధర్మాన్ని నలు దిశలా ప్రచారం చేయడం. మన ఆచార్య నాగార్జునుడు ఈ మధ్యమ మార్గంపైనే తన భవ్య తాత్త్విక సౌధాన్ని నిర్మించాడు. నాగార్జునుడి అభిప్రాయంలో... ఒక వస్తువుకు అస్తిత్వం ఉందని నమ్మడం ఒక అంతమైతే... దానికి అస్తిత్వమే లేదని నమ్మడం మరో అంతం. ఈ రెండు అంతాలను శాశ్వతవాదం, ఉచ్ఛేదవాదం అంటారు. బుద్ధుడు ఈ రెండిటినీ కాదని మధ్యమ మార్గాన్ని అవలంబించాడు. అది శూన్యవాదానికి పునాది వంటిది.





ఆచార్య చౌడూరి ఉపేంద్ర రావు
జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం

సహజయోగ

నవ జీవనానికి నాంది

నూతన సంవత్సరానికి మొదటి రోజైన ఉగాదికి చాలా విశిష్టత ఉంది. రాబోతున్నది క్రోధి నామ సంవత్సరం. కొత్త సంవత్సరం మొదలైన తరువాత... శ్రీ ఆదిశక్తి ఆగమన సూచికగా తొమ్మిది రోజులు సంప్రదాయబద్ధంగా సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీ. ఇదే రోజున ఆదిశక్తి సృష్టి కార్యాన్ని మొదలుపెట్టింది. శ్రీ గణేశుణ్ణి సృష్టించింది. కాలమానం మొదలయింది ఈ రోజునే. కాబట్టి సంవత్సరాన్ని ఆ దినం నుంచే లెక్కిస్తాం.



విక్రమాదిత్య మహారాజు చైత్రశుద్ధ పాడ్యమిని సంవత్సరాదిగా వేడుక చేసుకొనేవాడనీ, శాలివాహన రాజులు కూడా అదే రోజును సంవత్సరాదిగా లెక్కించడం ఆరంభించారనీ చెబుతారు. బభ్రువాహన అనే శాలివాహన రాజు చేతిలో విక్రమాదిత్యుడు పరాజయం పొందాడు. వారి విజయోత్సవాలను పురస్కరించుకొని... చైత్ర శుద్ధ పాడ్యమి నాడు శాలివాహన శకం మొదలయింది. శాలివాహన శకం, విక్రమ నామ శకం ఆరంభమైన సంవత్సరాలు వేరు కావచ్చు... కానీ అవి ప్రారంభమైన రోజు మాత్రం ఒక్కటే. శాలివాహనులు కూడా అదే రోజున తమ కొత్త సంవత్సరానికి నాంది పలికారు. అంతటి సుదినం కాబట్టి... మన పంచాంగాలను, ముఖ్యంగా పండుగలను దాని ప్రకారం లెక్కిస్తారు. మన దేశంలో కొన్ని ప్రాంతాలలో చాంద్రమానాన్ని, మరికొన్ని ప్రాంతాల్లో సూర్యమానాన్ని అనుసరిస్తారు. శాలివాహన పంచాంగాన్ని చాంద్రమానం ప్రకారం గుణించారు. చంద్రుడి కళల ఆధారంగా తిథులు ఏర్పడ్డాయి. ఇక శాతవాహన (సత్వాహన) అంటే సప్తవాహికలు (చక్రాలు). మనలోని కుండలినీ శక్తి ప్రయాణించే ఏడు చక్రాలుగా వారు పరిగణించి ఉండవచ్చు.

ఇది రబీ పంటల కోత కాలం. కొత్త పంటల కాలానికి ఆరంభం. ఉదాహరణకు ఉత్తరభారతదేశంలోని మీరట్ ప్రాంతంలో... వ్యవసాయానికీ, పంటలకూ దేవీశక్తి అవసరమైనప్పుడు... ఆమెను శాకంబరీదేవిగా సంభావించి.. ఆమె శక్తిని ఉపయోగించాల్సి వచ్చింది. ఆకుకూరలు, కాయగూరలు, పండ్ల సాగులో మనం శాకంబరీ దేవి శక్తిని వినియోగించుకోవాలి. సహజయోగ సాధన ద్వారా వెలువడే చైతన్య తరంగాల శక్తి సహకారంతో... సహజ కృషి పద్ధతుల ద్వారా వ్యవసాయ దిగుబడిని పెంపొందించే ప్రక్రియను శ్రీమాతాజీ నిర్మలాదేవి అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఈ పండుగను తెలుగువారు, కన్నడిగులు ఉగాదిగాను, మహారాష్ట్రలో గుడిపడ్వాగాను జరుపుకొంటారు. పల్లె సీమల్లో ఉగాదిని ఆనందంగా నిర్వహిస్తారు. వసంతఋతువు ఈ రోజు నుంచే ప్రారంభమవుతుంది. ఈ పండుగకు, ప్రకృతికి అవినాభావ సంబంధం ఉంది. కాబట్టే నూతన జీవితానికి నాందిగా ఉగాదిని పరిగణిస్తారు. ఈ పండుగలో అత్యంత పవిత్రమైన సంప్రదాయం గుడి జెండాను తయారు చేయడం. మహారాష్ట్రుల నిర్వహించే గుడిపడ్వాలో 'గుడి' అనే పదానికి జెండా, శాలువ అనే అర్థాలు ఉన్నాయి. శాలివాహనులు దేవీ భక్తులు. ఆ రోజులలో వారు దేవికి శాలువను బహూకరించేవారట. మన శరీరం మీద ఆచ్ఛాదనకు, వెచ్చదనానికి, వినయానికి సంకేతం శాలువ. శాలివాహనులకు గుర్తుగా కుంభంపై జెండా ఉండేది. విశిష్టమైన ఆకారంలో ఉండే ఆ కుంభం కుండలినికి సంకేతం, ఆధ్యాత్మికతకు చిహ్నం. ఆనాడే వారు కుండలినీ శక్తిని పూజించేవారు. ఆ ప్రాంతంలో ప్రతి ఇంటివారు పసుపు లేదా ఎరుపు రంగు వస్త్రంతో గుడి జెండాను తయారు చేస్తారు. దాన్ని కర్రకు తగిలించి, జెండా పైభాగంలో వెండి లేదా రాగి పాత్రను (కుంభాన్ని) బోర్లిస్తారు. గుడి జెండా చెడుపై విజయాన్ని సూచిస్తుంది. దీన్ని కుటుంబ శ్రేయస్సుకు, అదృష్టానికి చిహ్నంగా భావించి, ఇంటి బయట ఉంచుతారు. ఇలా ఉంచడం వల్ల అది దుష్టశక్తులను దూరంగా ఉంచి, ఇంట్లోకి శుభాలను తెస్తుందని నమ్ముతారు. ప్రపంచవ్యాప్తంగా సహజయోగ సాధకులు మత, ప్రాంత, దేశాలకు అతీతంగా... శాలివాహన పంచాంగం ఆధారంగా... చైత్ర శుద్ధ పాడ్యమి రోజున దేవీ పూజ నిర్వహించి, ఉగాది పండుగను ఘనంగా నిర్వహించుకుంటారు.



డాక్టర్ పి. రాకేష్
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



ప్రతి రుచీ ఒక ప్రతీక

తెలుగు రాష్ట్రాలలో ఉగాది రోజున ముఖ్యమైనది షడ్రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడి. దీనికి ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉంది. ఈ పచ్చడిలో ఒక్కో పదార్థం ఒక్కొక్క భావానికి, అనుభూతికి ప్రతీక. బెల్లం... తీపి అంటే ఆనందానికి ప్రతీక. ఉప్పు... జీవితంలో ఉత్సాహానికి, రుచికి సంకేతం. వేప పువ్వు చేదు... అంటే బాధ కలిగించే అనుభవాలను, చింతపండు (పులుపు)... నేర్పుగా వ్యవహరించడాన్ని సూచిస్తాయి. పచ్చి మామిడి ముక్కలు (వగరు)... కొత్త సవాళ్ళకు సంకేతం. కారం... సహనం కోల్పోయేలా చేసే అనుభూతికి చిహ్నం.

శతాయుష్యం వజ్రదేహం దదాత్యర్థం సుఖానిచ
సర్వారిష్టవినాశంచ నింబకందళ భక్షణమ్

వేపపూతతో కూడిన ఉగాది పచ్చడిని తినడం వల్ల దేహం వజ్రసదృశమై , సర్వారిష్టాలూ తొలగిపోతాయనీ, నూరేళ్ళ సుఖంగా జీవిస్తారనీ ఈ శ్లోకం అంతరార్థం.

ఇక ఉగాది ప్రాశస్త్యాన్ని గురించి చెప్పే మరో శ్లోకం కూడా 'ధర్మసింధు' గ్రంథంలో ఉంది:

అబ్దాదౌ నింబకుసుమం... శర్కరామ్ల ఘృతైర్యుతమ్
భక్షితం పూర్వయామేస్యా... తద్వర్షం సౌఖ్యదాయకమ్

ఉగాదినాడు వేపపూత, పంచదార (బెల్లం), చింతపండు, నెయ్యితో కూడిన పచ్చడిని తింటే... రాబోయే సంవత్సరం అంతా సౌఖ్యంగా సాగిపోతుందని అర్థం.

హరేకృష్ణ

కష్ట సుఖాల్లో సంయమనం
అదే ఉగాది సందేశం

'యుగాది' లేదా 'ఉగాది' అనే పదం... 'యుగ, ఆది' అనే సంస్కృత పదాల కలయిక.. నూతన యుగానికి నాంది అయిన తిథే యుగాది పర్వదినం. 'యుగం' అంటే రెండు లేదా జంట అనే మరొక అర్థం కూడా ఉంది. ఉత్తరాయణ, దక్షిణాయనాలు అనే ఆయన ద్వయం కలిగినది యుగం (సంవత్సరం). ఆ యుగానికి ఆది... యుగాది అయింది. అదే సంవత్సరాది. వివిధ కాలాలకు చెందిన ఋషులు 'యుగం' అనే పదాన్ని పలు విధాలుగా నిర్వచించారు. 'యుగ' అన్న ఒక్క పదమే వివిధ కాల పరిమాణాలను సూచిస్తుంది.

వేదాలను అపహరించిన సోమకుణ్ణి మత్స్యావతారం ధరించి వధించిన విష్ణువు... ఆ వేదాలను బ్రహ్మకు అప్పగించిన శుభ తరుణానికి చిహ్నంగా... ఉగాది ఆచరణలోకి వచ్చిందని పురాణాలు చెబుతున్నాయి. చైత్ర శుక్ల పాడ్యమి అయిన ఉగాది రోజునే సృష్టి జరిగిందని కూడా పేర్కొంటున్నాయి. అందుకనే మనకు చైత్ర మాసంతో... కొత్త ఏడాది ప్రారంభమవుతుంది. ఆ కొత్త ఏడాది తొలి రోజే ఉగాది. జడప్రాయమైన (అచేతనమైన) ఈ జగత్తులో చైతన్యాన్ని రగిలించి, మానవాళిలో నూతన ఆశయాలను అంకురింపజేసే శుభ దినమే ఉగాది. ఉగాది నుంచే తెలుగు సంవత్సరం ప్రారంభమవుతుంది కాబట్టి... ఇది తెలుగువారి మొదటి పండుగ. ఉగాది రోజున కొత్త పనులను ప్రారంభించడం ఆనవాయితీ. ఈ రోజున ప్రాతఃకాలాన లేచి.. ఇళ్ళు, వాకిళ్ళు శుభ్రపరుచుకుంటారు. ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి అలంకరిస్తారు. తలంటి స్నానం చేసి, కొత్త దుస్తులు ధరించి... ఉగాది పచ్చడి సేవనంతో దినచర్య ప్రారంభిస్తారు. తీపి, పులుపు, కారం, ఉప్పు, వగరు, చేదు అనే ఆరు రుచులు కలిసిన ఉగాది పచ్చడి తెలుగువారికే ప్రత్యేకమైనది. ఏడాది పొడుగునా ఎదురయ్యే మంచి చెడులను, కష్ట సుఖాలను సంయమనంతో స్వీకరించాలనే సందేశాన్ని ఉగాది పండుగ, ఉగాది పచ్చడి మనకు తెలియజేస్తాయి.

కలహ, కల్మషాలతో కూడిన కలియుగాన్ని ఒక ఇనుప యుగంగా పూర్వులు వర్ణించారు. అయితే ఈ యుగం ఎన్నో దుఃఖాలకు నిలయమైనప్పటికీ, దీనికి అద్భుతమైన లక్షణం ఒకటి ఉందంటూ... "కలియుగం దోషసాగరమే అయినప్పటికీ... దీనిలో ఉన్న మహా గుణం ఏమిటంటే... కేవలము 'హరే కృష్ణ' మహా మంత్రాన్ని జపించినంత మాత్రాన మానవుడు భవబంధ విముక్తుడై, పరంధామాన్ని చేరుతాడు" అని శ్రీమద్భాగవతం పేర్కొంది. కలియుగ ధర్మం హరినామ సంకీర్తనం. దాన్ని స్థాపించడానికి... అయిదువందల ఏళ్ళ క్రితం... పశ్చిమ బెంగాల్‌లోని నవద్వీప మాయాపూర్ ధామంలో... సాక్షాత్తూ భగవంతుడే శ్రీ చైతన్య మహాప్రభువుగా అవతరించారు. హరినామ సంకీర్తన ఉద్యమానికి నాంది పలికారు.

ఉగాది పర్వదినాన ఆచరించవలసినవి: శ్రీకృష్ణునికి ఉగాది పచ్చడి నివేదించి, దాన్ని ప్రసాదంగా ఇంటిల్లిపాదీ స్వీకరించండి. 'హరే కృష్ణ' మంత్రాన్ని రోజూ జపించడం ప్రారంభించండి. శ్రీకృష్ణ మందిరాన్ని దర్శించి, భగవంతుడి ఆశీస్సులను పొందండి. అన్నదానం, గోసేవ తదితర ధార్మిక కార్యక్రమాలలో పాలుపంచుకోండి.



శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభుజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్, హైదరాబాద్, 9396956984





నేటి మ్యాచ్

హైదరాబాద్ x చెన్నై
రా.7.30 నుంచి



పరుగుల వరద ఖాయమేనా?

కింగ్స్‌ను రైజర్స్ నిలువరించేనా!

హైదరాబాద్: ఐపీఎల్‌లో మరో పసందైన మ్యాచ్‌కు వేళైంది. డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ సొంత మైదానంలో శుక్రవారం తలపడేందుకు సిద్ధమైంది. అయితే టోర్నీలో ఇప్పటి వరకు ఏడు వికెట్లు తీసి జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించిన పేసర్ ముస్తాఫిజుర్ రహ్మాన్ సేవలు లేకపోవడం చెన్నైకి ఒకింత దెబ్బే. ముస్తాఫిజుర్ బంగ్లాదేశ్ వెళ్లడంతో అతడి స్థానంలో శార్దూల్‌ను తీసుకొనే చాన్సుంది. ఎప్పుడు ఎలా ఆడుతుందో తెలియని హైదరాబాద్‌ను ఎదుర్కోవాలంటే సీఎస్‌కే ఆల్‌రౌండ్ నైపుణ్యాలకు పదును పెట్టాల్సి ఉంటుంది. ఆర్సీబీ, గుజరాత్ జట్లను తొలి రెండు మ్యాచ్‌ల్లో మట్టికరిపించిన సీఎస్‌కే.. గత పోరులో ఢిల్లీ చేతిలో కంగుతిన్నది. ఢిల్లీపై మెరుపులు మెరిపించిన ధోనీ బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుగా వచ్చి అలరించాలన్నది ఫ్యాన్స్ కోరిక. మరోవైపు స్వస్థలంలో ఉండే అనుకూలతలను పూర్తిగా వినియోగించుకోవాలని సన్‌రైజర్స్ భావిస్తోంది. ముంబైపై రికార్డు స్కోరు చేయడంతో బ్యాటింగ్ విభాగం రెట్టించిన ఉత్సాహంతో ఉంది. అయితే గత మ్యాచ్‌లో గుజరాత్ చేతిలో ఓటమి..హైదరాబాద్ నిలకడ లేని ఆటకు అద్దం పట్టింది. ఈ స్టేడియంలో ముంబైతో మ్యాచ్‌లో 500కు పైగా పరుగులు నమోదయ్యాయి. దాంతో ఈ మ్యాచ్‌లోనూ పరుగుల వరద పారే చాన్సుంది.

పంజాబ్ బల్లే బల్లే


అశుతోష్ (17 బంతుల్లో 31)
శశాంక్ సింగ్ (29 బంతుల్లో 61 నాటౌట్)


గుజరాత్‌పై ఉత్కంఠ విజయం

ఆదుకున్న శశాంక్, అశుతోష్ ¹గిల్ ఇన్నింగ్స్ వృథా

అహ్మదాబాద్: పంజాబ్ కింగ్స్ రెండు వరుస ఓటముల తర్వాత గెలుపు బాట పట్టింది. భారీ ఛేదనలో వరుస వికెట్లు కోల్పోతున్నా.. ఎవరి అంచనాల్లో లేని శశాంక్ సింగ్ (29 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లతో 61 నాటౌట్), అశుతోష్ శర్మ (17 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 31) కదం తొక్కారు. టైటాన్స్ బౌలర్లపై ఎదురుదాడికి దిగి ఆఖరి ఓవర్‌లో మ్యాచ్‌ను గుజరాత్ నుంచి లాగేశారు. అటు టైటాన్స్ ఫీల్డింగ్ వైఫల్యం కూడా కలిసి వచ్చింది. దీంతో గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో పంజాబ్ 3 వికెట్లతో నెగ్గింది. ఈ సీజన్‌లో ఏ జట్టుకైనా ఇదే అత్యధిక ఛేదన. ముందుగా గుజరాత్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 199 పరుగులు చేసింది. శుభ్‌మన్ గిల్ (48 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లతో 89 నాటౌట్), సాయి సుదర్శన్ (19 బంతుల్లో 6 ఫోర్లతో 33), రాహుల్ తెవాటియా (8 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 23 నాటౌట్) రాణించారు. రబాడకు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో పంజాబ్ 19.5 ఓవర్లలో 7 వికెట్లకు 200 రన్స్ చేసి గెలిచింది. ప్రభ్‌సిమ్రన్ (24 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 35) పర్వాలేదనిపించాడు. నూర్ అహ్మద్‌కు 2 వికెట్లు లభించాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా శశాంక్ నిలిచాడు.

కలిసికట్టుగా..: భారీ ఛేదనను పంజాబ్ ఆత్మవిశ్వాసంతో ఆరంభించింది. వికెట్లు కోల్పోయినా రన్‌రేట్ తగ్గకుండా చూసుకుంది. మధ్య ఓవర్లలో శశాంక్, చివర్లో అశుతోష్ బ్యాటింగ్ తీరు జట్టును కాపాడింది. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ బెయిర్‌స్టో (22) మూడు ఫోర్లతో 13 రన్స్ రాబట్టాడు. మరో ఓపెనర్ ధవన్ (1)ను రెండో ఓవర్‌లోనే పేసర్ ఉమేశ్ బౌల్డ్ చేసినా.. ప్రభ్‌సిమ్రన్ ధాటిని కనబర్చి నాలుగో ఓవర్‌లో 6,4తో ఆకట్టుకున్నాడు. అయితే టీనేజ్ స్పిన్నర్ నూర్ అహ్మద్ తన తొలి ఓవర్‌లోనే బెయిర్‌స్టోను అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 35 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. నూర్ తన తర్వాతి ఓవర్‌లోనే ప్రభ్‌సిమ్రన్‌ను అవుట్ చేయగా.. ఆ వెంటనే సామ్ కర్రాన్ (5)ను అజ్మతుల్లా వెనక్కి పంపాడు. ఈ దశలో శశాంక్ సింగ్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. 11వ ఓవర్‌లో వరుసగా 4,6,4తో 17 రన్స్‌తో స్కోరుబోర్డులో కదలిక తెచ్చాడు. ఇక జితేశ్ శర్మ (16) వరుస రెండు సిక్సర్లతో జోరు చూపినా తర్వాతి బంతికే రషీద్‌కు చిక్కాడు. 18 బంతుల్లో 41 పరుగులు కావాల్సి వేళ ఎవరి అంచనాల్లో లేని అశుతోష్ ఎడాపెడా బౌండరీలతో చెలరేగాడు. అటు 25 బంతుల్లోనే శశాంక్ తొలి ఐపీఎల్ ఫిఫ్టీ సాధించాడు. 19వ ఓవర్‌లో అశుతోష్ రెండు సిక్సర్లతో 18 రన్స్ సాధించి, ఆఖరి ఓవర్‌లో సమీకరణం 7 పరుగులకు తెచ్చాడు. అయితే 20వ ఓవర్ తొలి బంతికే అతడిని పేసర్ నల్కండే అవుట్ చేసినా.. శశాంక్ ఓ ఫోర్‌తో విజయాన్ని తేలిక చేశాడు.

గిల్ అజేయంగా..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ శుభ్‌మన్ గిల్ అజేయ అర్ధసెంచరీతో తుదికంటా నిలిచాడు. మధ్య ఓవర్లలో సాయి సుదర్శన్, చివర్లో తెవాటియా జోరుతో జట్టు భారీ స్కోరు అందుకుంది. తొలి ఓవర్‌లోనే గిల్ సిక్సర్ బాదగా, అటు సాహా ఫోర్లతో ఆకట్టుకున్నాడు. మూడో ఓవర్‌లోనే సాహా (11) వికెట్ కోల్పోయినా అప్పటికే జట్టు స్కోరు 29 పరుగులకు చేరింది. వన్‌డౌన్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ (26) ఉన్న కాసేపు వేగం చూపాడు. నాలుగు ఫోర్లతో ఆకట్టుకున్నా హర్‌ప్రీత్ బ్రార్ బౌన్సర్‌కు వెనుదిరిగాడు. రెండో వికెట్‌కు 40 పరుగులు జత చేరాయి. అయితే సాయి సుదర్శన్ రాకతో స్కోరులో వేగం పెరిగింది. 12వ ఓవర్‌లో అతడి రెండు ఫోర్లు, గిల్ ఓ ఫోర్‌తో 14 పరుగులు వచ్చాయి. చక్కగా కుదురుకున్న ఈ జోడీని పేసర్ హర్షల్ విడదీశాడు. 14వ ఓవర్‌లో సుదర్శన్‌ను అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 53 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తర్వాతి ఓవర్‌లోనే గిల్ ఫోర్‌తో 31 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. 18వ ఓవర్‌లో గిల్ చెలరేగి 6,4 బాదినా విజయ్ శంకర్ (8) వికెట్‌ను రబాడ తీసి నాలుగో వికెట్‌కు 42 పరుగుల భాగస్వామ్యానికి తెర దించాడు. అయితే తెవాటియా వచ్చీ రాగానే బ్యాట్‌కు పనిజెప్పాడు. చివరి రెండు ఓవర్లలో ఓ సిక్సర్, 3 ఫోర్లతో 33 పరుగులందించడంతో స్కోరు 200కి చేరువగా వచ్చింది.


గిల్ (48 బంతుల్లో 89 నాటౌట్)

స్కోరుబోర్డు

గుజరాత్: సాహా (సి) ధవన్ (బి) రబాడ 11, గిల్ (నాటౌట్) 89, విలియమ్సన్ (సి) బెయిర్‌స్టో (బి) బ్రార్ 26, సాయి సుదర్శన్ (సి) జితేశ్ (బి) హర్షల్ 33, విజయ్ శంకర్ (సి) బ్రార్ (బి) రబాడ 8, తెవాటియా (నాటౌట్) 23, ఎక్స్‌ట్రాలు: 9; **మొత్తం: 20 ఓవర్లలో 199/4; వికెట్ల పతనం:** 1-29, 2-69, 3-122, 4-164; **బౌలింగ్:** హర్‌ప్రీత్ బ్రార్ 4-0-33-1, అర్ష్‌దీప్ 4-0-33-0, రబాడ 4-0-44-2, కర్రాన్ 2-0-18-0, హర్షల్ 4-0-44-1, సికందర్ 2-0-22-0.

పంజాబ్: ధవన్ (బి) ఉమేశ్ 1, బెయిర్‌స్టో (బి) నూర్ అహ్మద్ 22, ప్రభ్‌సిమ్రన్ (సి) మోహిత్ (బి) నూర్ 35, కర్రాన్ (సి) విలియమ్సన్ (బి) అజ్మతుల్లా 5, సికందర్ రజా (సి) సాహా (బి) మోహిత్ 15, శశాంక్ సింగ్ (నాటౌట్) 61, జితేశ్ శర్మ (సి) నల్కండే (బి) రషీద్ 16, అశుతోష్ శర్మ (సి) రషీద్ (బి) నాల్కండే 31, హర్‌ప్రీత్ (నాటౌట్) 1, ఎక్స్‌ట్రాలు: 13; **మొత్తం: 19.5 ఓవర్లలో 200/7; వికెట్ల పతనం:** 1-13, 2-48, 3-64, 4-70, 5-111, 6-150, 7-193; **బౌలింగ్:** అజ్మతుల్లా 4-0-41-1, ఉమేశ్ 3-0-35-1, రషీద్ 4-0-40-1, నూర్ అహ్మద్ 4-0-32-2, మోహిత్ 4-0-38-1, నల్కండే 0.5-0-6-1.

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు) 	మోహిత్ శర్మ (గుజరాత్) 
203 పరుగులు	7 వికెట్లు

ఐపీఎల్ వీక్షణలో రికార్డు

న్యూఢిల్లీ: తాజా ఐపీఎల్ సీజన్‌ను క్రికెట్ ప్రేమికులు తెగ ఆదరిస్తున్నారు. తొలి పది మ్యాచ్‌లను టీవీల్లో 30 కోట్ల మంది వీక్షించినట్టు అధికారిక బ్రాడ్‌కాస్టర్ డిస్నీ స్టార్ గ్రూప్ వెల్లడించింది. ఇది ఇప్పటిదాకా జరిగిన అన్ని సీజన్లలోనూ అత్యధికం కావడం విశేషం. అలాగే బార్క్ డేటా ప్రకారం ఓవరాల్‌గా వాచ్ టైమ్ 8028 కోట్ల నిమిషాలు. ఇది గతేడాదికన్నా 20% అధికం. ఐపీఎల్ మ్యాచ్‌లను స్టార్ గ్రూప్ పది భాషల్లో అందిస్తోంది. ఆరంభ మ్యాచ్‌ను కూడా 16.8కోట్ల మంది వీక్షించిన విషయం తెలిసిందే.

పంత్‌కు రూ. 24 లక్షల జరిమానా



విశాఖపట్నం: ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు రెండోసారి ఓవర్ రేట్ నిబంధనను అతిక్రమించడంతో జట్టు కెప్టెన్ రిషభ్ పంత్‌కు రూ. 24 లక్షల భారీ జరిమానా విధించారు. కోల్‌కతాతో బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ బౌలర్లు స్లో ఓవర్ రేట్ తప్పిదానికి పాల్పడ్డారు. దీంతో నిబంధల ప్రకారం రిషభ్‌కు రూ. 24 లక్షలు.. జట్టు సభ్యుల మ్యాచ్‌ల ఫీజులో 25 శాతం కోత విధించినట్టు ఐపీఎల్ గురువారం తెలిపింది. కాగా, ఈ మ్యాచ్‌లో 272 పరుగుల భారీ స్కోరు చేసిన కోల్‌కతా.. 106 రన్స్‌తో ఢిల్లీని ఓడించింది. అయితే, కొండంత స్కోరు కారణంగా క్యాపిటల్స్ ఓటమి ముందుగానే ఖరారైందని టీమిండియా మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ అన్నాడు. కానీ, అర్ధ శతకం చేసిన రిషభ్.. తన వికెట్‌ను పారేసుకోకుండా మరింత సమయం క్రీజులో నిలిచి సెంచరీ చేయాల్సిందని అభిప్రాయపడ్డాడు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
కోల్‌కతా	3	3	0	0	6	2.518
రాజస్థాన్	3	3	0	0	6	1.249
చెన్నై	3	2	1	0	4	0.976
లఖ్‌నవూ	3	2	1	0	4	0.483
పంజాబ్	4	2	2	0	4	-0.220
గుజరాత్	4	2	2	0	4	-0.580
హైదరాబాద్	3	1	2	0	2	0.204
బెంగళూరు	4	1	3	0	2	-0.876
ఢిల్లీ	4	1	3	0	2	-1.347
ముంబై	3	0	3	0	0	-1.423

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

డోపింగ్‌లో భారత్ టాప్

న్యూఢిల్లీ: డోపింగ్‌లో భారత్ మరోసారి అగ్రరాజ్యాలనే అధిగమించింది. అత్యధిక శాతం డోపింగ్ కేసులు పట్టుబడిన జాబితాలో దేశం టాప్‌లో నిలవడం భారత క్రీడారంగానికి ఆందోళన కలిగిస్తోంది. వరల్డ్ డోపింగ్ నిరోధక ఏజెన్సీ (వాడా) తాజాగా విడుదల చేసిన 2022 నివేదిక ప్రకారం జాతీయ డోపింగ్ ఏజెన్సీ (నాడా) పరీక్షించిన 3,865 (మూత్రం, రక్త) నమూనాల్లో 3.2 శాతం.. అంటే 125 శాంపిల్స్‌లో నిషేధిత ఉత్ప్రేరక ఆనవాళ్లు కనుగొన్నట్టు పేర్కొంది. 2.9 శాతంతో దక్షిణాఫ్రికా రెండో స్థానంలో, 1.9 శాతంతో కజకిస్థాన్ మూడో స్థానంలో నిలిచాయి. నార్వే, అమెరికాకు ఆ తర్వాతి స్థానాలు దక్కాయి. ఓవరాల్‌గా శాంపిళ్ల పరీక్షల్లో భారత్ 11వ స్థానంలో నిలిచినా.. కేసుల్లో మాత్రం రష్యా (85), అమెరికా (84), ఇటలీ (73), ఫ్రాన్స్ (72)లను దాటేయడం గమనార్హం. భారత్ కంటే ఎంతో ఎక్కువగా 19,228 శాంపిళ్లను పరీక్షించిన చైనాలో డోపింగ్ శాతం ఎంతో తక్కువగా 0.2గా ఉండడం గమనార్హం.

ఉబెర్ కప్ నుంచి వైదొలగిన సింధు

గాయత్రి, అశ్విని జోడీలు కూడా



న్యూఢిల్లీ: డబుల్ ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు.. ఉబెర్ కప్ జట్టు నుంచి తప్పుకొంది. ఆమెతోపాటు డబుల్స్‌లో గాయత్రి పుల్లెల, అశ్విని పొన్నప్ప జంటలు కూడా టోర్నీకి దూరమయ్యాయి. అయితే, థామస్‌కప్ డిఫెండింగ్ చాంప్ అయిన భారత పురుషుల జట్టు బలమైన బృందంతో బరిలోకి దిగుతోంది. చైనాలోని చెంగ్డూలో ఈనెల 27 నుంచి జరిగే థామస్, ఉబెర్ కప్ కోసం భారత జట్లను గురువారం ప్రకటించారు. గాయం నుంచి కోలుకొని రీఎంట్రీ ఇచ్చిన సింధు ఫామ్ కోసం తంటాలు పడుతోంది. ఈ నేపథ్యంలో కొంత విశ్రాంతితోపాటు రానున్న టోర్నీల్లో మెరుగైన ప్రదర్శనతో పారిస్ టికెట్‌ను ఖరారు చేసుకోవాలనుకొంటోంది. ట్రీసా జాలీ-గాయత్రి, అశ్విని-తనీషా జంటలు కూడా ఇదే ఉద్దేశంతో టోర్నీకి దూరమయ్యాయి.

థామస్ కప్ జట్టు: హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్, శ్రీకాంత్, ప్రియాన్షు రజావత్, కిరణ్ జార్జ్; డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్, అర్జున్-ధ్రువ్, సాయి ప్రతీక్ (బ్యాకప్).

ఉబెర్ కప్: అన్‌మోల్, తన్వీ శర్మ, అస్మిత, ఇస్రానీ; డబుల్స్‌లో శృతి మిశ్రా, ప్రియ కొంజెంగబమ్, సిమ్రన్ సింగ్, రితిక థాకర్.

ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత్ మరింత కిందకు

న్యూఢిల్లీ : ప్రపంచ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) తాజా ర్యాంకింగ్స్‌లో భారత పురుషుల జట్టు నాలుగు స్థానాలు దిగజారింది. దీంతో 121వ ర్యాంక్‌లో నిలిచిన భారత జట్టు.. ఇటీవలి సంవత్సరాల్లో చెత్త స్థానాన్ని చేరినట్టయ్యింది. 2026 ఫిఫా వరల్డ్ కప్ రెండో రౌండ్ క్వాలిఫయర్స్‌లో అఫ్ఘానిస్థాన్ చేతిలో 1-2 ఓటమితో ఓడడం భారత జట్టు ర్యాంకింగ్‌పై బాగా ప్రభావం చూపింది. గతంలో 173వ ర్యాంకుల్లో ఉన్న మనోళ్లు.. మార్చి ర్యాంకుల్లో 117వ స్థానం దక్కించుకున్నారు.

బిజినెస్



బ్లూ స్టార్ నుంచి సరికొత్త శ్రేణి డీప్ ఫ్రీజర్లు

హైదరాబాద్: బ్లూ స్టార్ లిమిటెడ్ మార్కెట్లోకి సరికొత్త శ్రేణి డీప్ ఫ్రీజర్లను విడుదల చేసింది. వివిధ రంగాల వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా 60 నుంచి 600 లీటర్ల సామర్థ్యంతో ఈ డీప్ ఫ్రీజర్లను తీసుకువచ్చినట్లు గురువారం నాడిక్కడ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ బీ త్యాగరాజన్ వెల్లడించారు. డెయిరీ, ఐస్‌క్రీమ్, ఫ్రోజెన్ ఫుడ్, రెస్టారెంట్స్, సూపర్ మార్కెట్స్ సహా ఇతర విభాగాల్లోని కస్టమర్ల అవసరాలను ఈ డీప్ ఫ్రీజర్లు తీరుస్తాయని తెలిపారు. ఈ డీప్ ఫ్రీజర్ల ధర రూ.16,000 నుంచి ప్రారంభమవుతాయన్నారు. మహారాష్ట్రలోని వాడాలో రూ.480 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ప్లాంట్‌లో ఈ డీప్ ఫ్రీజర్లను ఉత్పత్తి చేస్తున్నట్లు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ (కమర్షియల్ రిఫ్రిజిరేషన్ బిజినెస్) ఎం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

రూ.350 కోట్లతో శ్రీసిటీ ప్లాంట్ విస్తరణ

కాగా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీ ప్లాంట్‌ను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.350 కోట్లతో విస్తరించనున్నట్లు ఎండీ త్యాగరాజన్ వెల్లడించారు. శ్రీసిటీ ప్లాంట్‌లో కంపెనీ రూమ్ ఏసీలను తయారు చేస్తోంది. ప్రస్తుతం ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 3 లక్షల యూనిట్లుగా ఉండగా తాజాగా చేపట్టనున్న విస్తరణతో మొత్తం ఉత్పత్తి సామర్థ్యం 6 లక్షల యూనిట్లకు చేరుతుందని తెలిపారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	70,470 ▲	64,600 ▲	85,300 ▲
ముంబై	69,902 ▲	64,030 ▲	79,337 ▲



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

5వ తేదీ

హైదరాబాద్	375	విజయవాడ	403
చిత్తూరు	458	విశాఖపట్నం	415
గోదావరి	403	వరంగల్	377
		దజను గుడ్లు రూ.60	



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	139	గోదావరి	138
వరంగల్	139	విజయవాడ	138
కరీంనగర్	139	గుంటూరు	139
మహబూబ్‌నగర్	139	ఒంగోలు	139
కర్నూలు	139	చిత్తూరు	140
విశాఖపట్నం	124		

క్వాలిటీ కేర్ గ్రూప్ చైర్మన్‌గా డాక్టర్ హరిప్రసాద్



హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి): భారత్, బంగ్లాదేశ్‌ల్లో కేర్ హాస్పిటల్స్, కిమ్స్ హెల్త్, ఎవర్ కేర్ పేరుతో వైద్య సేవలు అందిస్తున్న క్వాలిటీ కేర్ గ్రూప్ చైర్మన్, నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా డాక్టర్ హరిప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్‌గా వరుణ్ ఖన్నా నియమితులయ్యారు. వైద్య సేవల రంగంలో 30 ఏళ్లకు పైగా అపార అనుభవం ఉన్న హరి ప్రసాద్ నేతృత్వంలో గ్రూప్ మరింత బలోపేతం కానుందని క్వాలిటీ కేర్ వెల్లడించింది. హరి ప్రసాద్ ఇటీవలి వరకు అపోలో గ్రూప్ హాస్పిటల్స్ ప్రెసిడెంట్‌గా వ్యవహరించారు. ఈయన హయాంలోనే అపోలో గ్రూప్ హాస్పిటల్స్ పడకల సంఖ్య 1,200 నుంచి 10,000 స్థాయికి చేరుకుంది. అంతేకాకుండా హైదరాబాద్‌లో అపోలో హెల్త్ సిటీ ఏర్పాటు లోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. ఆసియాలో మొదటి ఆపరేషనల్ హెల్త్ సిటీ ఇదే. అలాగే సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్, ఇండియాకు కూడా హరిప్రసాద్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా పని చేశారు. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఎమర్జెన్సీ మెడిసిన్, బ్రిటన్‌కు చెందిన రాయల్ కాలేజ్ ఆఫ్ ఎమర్జెన్సీ మెడిసిన్ హరిప్రసాద్‌ను ఫెలోషిప్‌తో సత్కరించాయి. వీటికి తోడు ఆస్ట్రేలియాకు చెందిన మక్వేరీ యూనివర్సిటీ తన గ్లోబల్ ఎండీ ప్రోగ్రామ్‌కు హరి ప్రసాద్‌ను క్యాంపస్ డీన్‌గా నియమించింది.

ఈ సందర్భంగా హరి ప్రసాద్ మాట్లాడుతూ.. భారత్ సహా దక్షిణాసియాలోని వెనుకబడిన నగరాల్లో నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించే గ్రూప్ బాధ్యతలను తాను స్వీకరించడం చాలా ఆనందంగా ఉందన్నారు. మెరుగైన క్లినికల్ ఫలితాలతో క్వాలిటీ కేర్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడానికి, నాణ్యతను పెంపొందించడానికి క్లినికల్, మేనేజ్‌మెంట్ టీమ్‌తో కలిసి పని చేయడానికి సంతోషిస్తున్నట్లు హరి ప్రసాద్ చెప్పారు. కాగా ఎండీగా నియమితులైన వరుణ్ ఖన్నాకు హెల్త్‌కేర్ రంగంలో 14 ఏళ్లకు పైగా అనుభవం ఉంది.

ఏలియన్స్ డెవలపర్స్ ప్రాజెక్టుల్లో రూ.145 కోట్ల పెట్టుబడులు

నిసస్ ఫైనాన్స్

న్యూఢిల్లీ: హైదరాబాద్ రియల్టీ రంగం ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలనూ ఆకర్షిస్తోంది. హైదరాబాద్‌లో ఏలియన్స్ డెవలపర్స్ అభివృద్ధి చేస్తున్న రెండు రియల్టీ ప్రాజెక్టుల్లో నిసస్ ఫైనాన్స్ రూ.145 కోట్లు పెట్టుబడి పెట్టింది. ఇందులో ఒకటి 272 ఎకరాల్లో అభివృద్ధి చేసే ఏలియన్స్ హబ్ ప్రాజెక్టు. మరొకటి 15 ఎకరాల్లో అభివృద్ధి చేసే ఏలియన్స్ స్పేస్ స్టేషన్ ప్రాజెక్టు అని నిసెస్ ఫైనాన్స్ తెలిపింది. తమ కంపెనీకి చెందిన రియల్ ఎస్టేట్ స్పెషల్ ఆపర్చునిటీస్ ఫండ్-1 (రెసో-1) ద్వారా ఈ పెట్టుబడి పెట్టినట్టు నిసస్ పేర్కొంది.

రికార్డు గరిష్ఠాలకు సూచీలు

ఇంట్రాడేలో 74,500 ఎగువకు సెన్సెక్స్



ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు గురువారం ట్రేడింగ్‌లో సరికొత్త రికార్డు గరిష్ఠాలకు చేరాయి. ఆరంభంలో లాభ, నష్టాల మధ్య తీవ్ర ఊగిసలాటలకు లోనైనప్పటికీ, మధ్యాహ్నం నుంచి ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఆర్థిక సేవల రంగ షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో సూచీలు ఇంట్రాడే కనిష్ఠ స్థాయిల నుంచి భారీగా పుంజుకున్నాయి. సెన్సెక్స్ 350.81 పాయింట్ల లాభంతో 74,227.63 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు స్థాయిని నమోదు చేసింది. కాగా, 74,501.73 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డు నమోదైంది. నిఫ్టీ విషయానికొస్తే, 80 పాయింట్ల పెరుగుదలతో 22,514.65 వద్ద స్థిరపడింది. సూచీకిది కొత్త రికార్డు ముగింపు స్థాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 17 లాభపడ్డాయి.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు 3.06 శాతం లాభంతో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. టైటాన్, టెక్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, టీసీఎస్, మారుతి సుజుకీ షేర్లు 1.89 శాతం వరకు పెరిగాయి. ఎస్‌బీఐ, ఎయిర్‌టెల్ షేర్లు మాత్రం ఒకటిన్నర శాతానికి పైగా నష్టపోయాయి. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 0.59 శాతం పెరగగా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.11 శాతం నష్టపోయింది. రంగాల వారీ సూచీల్లో ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, యుటిలిటీస్, ఆర్థిక సేవలు, బ్యాంకింగ్, టెక్, ఆటో 0.93 శాతం వరకు పెరిగాయి.

- డీమార్ట్ సూపర్ మార్కెట్ల నిర్వహణ సంస్థ అవెన్యూ సూపర్‌మార్ట్ షేరు 4.20 శాతం పెరిగి రూ.4,647.15 వద్దకు చేరుకుంది. ఇంట్రాడేలో దాదాపు 6 శాతం వరకు లాభపడి రూ.4,715 వద్ద సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేసింది. మార్చితో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 20 శాతం వృద్ధి చెందడం ఇందుకు దోహదపడింది.
- కేఈసీ ఇంటర్నేషనల్ షేరు దాదాపు 6 శాతం పెరిగి రూ.769.60 వద్ద ముగిసింది. ఇంట్రాడేలోనైతే 13.51 శాతం వరకు పెరిగింది. కంపెనీ రూ.816 కోట్ల విలువైన ఆర్డర్లు లభించిన నేపథ్యంలో షేర్లు ర్యాలీ తీశాయి.
- డాలర్‌తో రూపాయి మారకం విలువ 14 పైసలు పెరిగి రూ.83.39 వద్ద ముగిసింది. డాలర్ బలహీనపడటంతో పాటు మన ఈక్విటీ మార్కెట్ లాభాల్లో పయనించడం, సానుకూల స్థూల ఆర్థికాంశాలు రూపాయికి అండగా నిలిచాయి.
- సరఫరా కొరత ఆందోళనలతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మళ్లీ ఎగబాకుతున్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ ఫ్యూచర్స్ (జూన్‌లో డెలివరీ) కాంట్రాక్టు రేటు ఒక దశలో 89.35 డాలర్లకు ఎగబాకింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు బ్రెంట్ క్రూడ్ రేటు 16 శాతం పెరిగింది.

పసిడి సరికొత్త రికార్డు

- 70 వేలు దాటిన తులం బంగారం
- 85,000 ఎగువకు కిలో వెండి

హైదరాబాద్: విలువైన లోహాల ధరలు సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయికి పెరిగాయి. హైదరాబాద్‌లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర గురువారం మరో రూ.600 పెరిగి రూ.70,470కి చేరుకుంది. 22 క్యారెట్ల స్వచ్ఛత లోహం కూడా రూ.500 పెరుగుదలతో రూ.64,600 పలికింది. కిలో వెండి సైతం రూ.1,300 ఎగబాకి రూ.85,300గా నమోదైంది. అంతర్జాతీయంగా బంగారం, వెండి ధరలు వేగంగా పెరుగుతుండటమే ఇందుకు ప్రధాన కారణం. ఇంటర్నేషనల్ కమోడిటీ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ తొలిసారిగా 2,300 డాలర్లు దాటింది. సిల్వర్ సైతం 27 డాలర్ల పైన ట్రేడవుతున్నది. అమెరికన్ సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించవచ్చన్న అంచనాలు ఊపందుకోవడం ఇందుకు కారణమైంది. ఫెడరల్ రిజర్వ్ జూన్ సమీక్ష నుంచే రేట్ల కోతను ప్రారంభించవచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. సాధారణంగా ఫెడ్ రేట్లు పెరుగుతున్న సమయంలో అమెరికన్ డాలర్, బాండ్ల రేట్లు పెరుగుతూ పోతే.. బంగారం తగ్గుతూ వస్తుంది. ఫెడ్ రేట్లు తగ్గింపు సమయంలో డాలర్, బాండ్లు బలహీనపడటంతో పాటు బంగారం ధర పుంజుకుంటుంది.

కరెన్సీ డెరివేటివ్స్ నిబంధనల అమలు మే 3కు వాయిదా

ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ కరెన్సీ డెరివేటివ్స్ (ఈటీసీడీ) నిబంధనల అమలును మే 3కు వాయిదా వేస్తున్నట్లు ఆర్‌బీఐ గురువారం ప్రకటించింది. మార్కెట్ వర్గాల నుంచి అందుకున్న సూచనలు, అభిప్రాయాలతో పాటు ఈ మధ్య చోటుచేసుకున్న పరిణామాల ఆధారంగా ఈ నిబంధనల అమలును ఆర్‌బీఐ నెల రోజుల పాటు వాయిదా వేసింది. మార్కెట్లో స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌ను అరికట్టేందుకు ఆర్‌బీఐ కరెన్సీ డెరివేటివ్స్ నిబంధనలను కఠినతరం చేస్తూ జనవరి 5న సర్క్యులర్ జారీ చేసింది. దాని ప్రకారం కొత్త నిబంధనలు ఈ నెల 5 నుంచి అమల్లోకి రావాల్సి ఉంది.

ఇళ్ల అమ్మకాలు అదుర్స్

- మార్చి త్రైమాసికంలో 9 శాతం అప్
- రూ.కోటి పైన ఉండే ఇళ్లకు డిమాండ్
- 43 శాతం పెరిగిన ఆఫీస్ స్పేస్ లీజింగ్
- నైట్ ఫ్రాంక్ ఇండియా



న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్ జోరు కొనసాగుతోంది. ఈ ఏడాది జనవరి-మార్చి మధ్య కాలంలో హైదరాబాద్‌తో సహా దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో 86,345 ఇళ్లు అమ్ముడయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది తొమ్మిది శాతం ఎక్కువని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా తన తాజా నివేదికలో తెలిపింది. ఇదే సమయంలో 162 లక్షల ఎస్ఎఫ్‌టీ ఆఫీస్ స్పేస్ లీజు ఒప్పందాలు నమోదయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 43 శాతం ఎక్కువ. 'నివాస గృహాల అమ్మకాలు, ఆఫీసు లీజుల జోరుతో ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో రియల్ ఎస్టేట్ రంగం అద్భుత పనితీరు కనబరిచింది' అని నైట్ ఫ్రాంక్ ఇండియా సీఎండీ శిశిర్ బైజాల్ తెలిపారు. రూ.కోటి పైన ఉండే ఇళ్లకూ మంచి డిమాండ్ ఉందని బైజాల్ చెప్పారు.

హైదరాబాద్‌లో మరింత పైకి

మార్చి త్రైమాసికం హైదరాబాద్ రియల్టీ మార్కెట్‌కే బాగా కలిసొచ్చింది. గత మూడు నెలల్లో హైదరాబాద్‌లో 9,550 నివాస గృహాలు అమ్ముడయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 15 శాతం ఎక్కువ. కాగా ఈ కాలంలో కొత్త ఇళ్ల ధరలు గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే 13 శాతం పెరిగాయని పేర్కొంది. ఇదే సమయంలో హైదరాబాద్‌లో 30 లక్షల ఆఫీస్ స్పేస్ లీజు ఒప్పందాలు నమోదయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది మూడింతలు ఎక్కువని నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది. దేశంలో మరే నగరంలోనూ ఆఫీసు స్పేస్ లీజులు హైదరాబాద్‌లో పెరిగినంతగా పెరగలేదని కూడా తెలిపింది. హైదరాబాద్‌లో కార్యాలయ స్థలాలను లీజుకు తీసుకోవటంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) కీలకంగా ఉన్నాయని నైట్ ఫ్రాంక్ పేర్కొంది.

సేవల రంగం 14 సంవత్సరాల గరిష్ఠం

న్యూఢిల్లీ: వ్యాపార కార్యకలాపాలు జోరందుకోవడంతో పాటు సేవలకు డిమాండ్ భారీగా పెరగడంతో సేవల రంగం మార్చి నెలలో 13 సంవత్సరాల ఆరు నెలల గరిష్ఠానికి దూసుకుపోయింది. మార్చిలో హెచ్‌ఎస్‌బీసీ సేవల రంగ వ్యాపార కార్యకలాపాల సూచీ 61.2 పాయింట్లుగా నమోదైంది. ఫిబ్రవరిలో ఇది 60.6 పాయింట్లుంది. 14 సంవత్సరాల కాలంలో అంటే 2010 జూన్ తర్వాత నమోదైన గరిష్ఠ వృద్ధి ఇదేనని నెలవారీ సర్వే నివేదికలో పేర్కొన్నారు. మార్చిలో కొత్త ఆర్డర్లు గణనీయంగా పెరిగాయని సర్వేలో పాల్గొన్న కంపెనీలు తెలిపాయి.

జీఈ ఏరోస్పేస్ రూ.240 కోట్ల పెట్టుబడి

పుణె: పుణెలోని తమ తయారీ కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేయడానికి రూ.240 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్టు జీఈ ఏరోస్పేస్ ప్రకటించింది. కొత్త యంత్రసామగ్రి, పరికరాలు, స్పెషలైజ్డ్ పరికరాల కొనుగోలుపై ఈ నిధులు వ్యయం చేయనున్నట్టు తెలిపింది. 2015 సంవత్సరంలో ప్రారంభమైన ఈ కేంద్రంలో వాణిజ్య జెట్ ఇంజన్లకు అవసరం అయిన విడిభాగాలు తయారుచేస్తారు. ఈ ప్లాంట్‌లో తయారుచేసిన విడిభాగాలను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న జీఈ ప్లాంట్లకు సరఫరా చేయనున్నట్టు తెలిపింది.

న్యాయం కోసం పోరాడుతున్నా.. నన్ను దీవించండి: షర్మిల

» నేటి నుంచి పీసీసీ అధ్యక్షురాలి ప్రచారం



అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కడప ఎంపీగా బరిలోకి దిగుతున్న ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి గురువారం ఎక్స్ వేదికగా తాను ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. 'దేవుడి దీవెనలతో, నాన్న ఆశీర్వాదంతో, అమ్మ ప్రేమతో, చిన్నాన్న చివరి కోరిక ప్రకారం ఎన్నికల ప్రచారానికి బయలుదేరుతున్నాను. మీ రాజన్న బిడ్డను దీవించాలని ఆంధ్ర రాష్ట్ర ప్రజలను కోరుకుంటూ ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్నాను. న్యాయం కోసం పోరాడుతున్న ఈ యుద్ధంలో మీ ఆశీస్సులు నాపై ఉంటాయని ఆశిస్తున్నా' అని షర్మిల పేర్కొన్నారు. కాగా, నేటి నుంచి షర్మిల ఎన్నికల ప్రచార బస్సు యాత్రను ప్రారంభించనున్నారు.

చంద్రబాబుపై వైసీపీ తప్పుడు ప్రచారం

» సీఈవో మీనాకు వర్ల రామయ్య ఫిర్యాదు

» 48 గంటల్లోగా సమాధానం చెప్పండి

» ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, జోగి రమేశ్‌కు ఈసీ నోటీసులు

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు పేదల వ్యతిరేకి అంటూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఎన్నికల సంఘాన్ని కోరారు. ప్రతిపక్ష పార్టీలపై వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారానికి సంబంధించిన ఆధారాలను గురువారం సీఈవో ముఖేశ్‌కుమార్ మీనాకు అందజేశారు. "పెనమలూరులో 80ఏళ్ల వృద్ధురాలి మరణానికి ప్రభుత్వమే కారణమైతే.. మంత్రి జోగి రమేశ్ శవ రాజకీయానికి ప్రయత్నించారు. చంద్రబాబు ఇంటి దగ్గర గోల చేయాలని నిర్లజ్జగా శవాన్ని కూడా అడుగుతున్నారు. గుడివాడలో కొడాలి నాని ఎన్నికల కోడ్ ఉల్లంఘించి, పాత తేదీలతో 2వేల ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని ఆర్డీవోకి ఫోన్ చేసి, దబాయించారు. నందిగామలో రాజధాని గురించి ప్రశ్నించిన టీడీపీ సానుభూతిపరుడిని చంపేయమంటూ ఎమ్మెల్యే ప్రేరేపిస్తూ, దాడి చేయించారు. వీటిపై విచారించి, చర్యలు తీసుకోవాలని సీఈవోని వర్ల కోరారు. అనంతరం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వర్ల రామయ్య ఫిర్యాదుపై స్పందించిన ఈసీ.. 48 గంటల్లోగా వివరణ ఇవ్వాలని జోగి రమేశ్‌కు నోటీసులు జారీ చేసింది. నోటీసులకు సమాధానం ఇవ్వకుంటే తదుపరి చర్యలు ఉంటాయన్నారు. అలాగే టీడీపీపై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేశారంటూ వర్ల రామయ్య చేసిన మరో ఫిర్యాదుపైనా స్పందించిన ఈసీ.. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి నోటీసులు ఇచ్చింది.

పింఛను మరణాలకు జగనే బాధ్యుడు

» సకాలంలో డబ్బు పంపి ఉంటే ఇవి జరిగేవి కావు: దేవినేని ఉమ

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ సందర్భంగా చోటు చేసుకొన్న వృద్ధుల మరణాలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డే బాధ్యుడని టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. పింఛన్ల పంపిణీకి అవసరమైన డబ్బును సకాలంలో సచివాలయాలకు పంపి ఉంటే ఈ మరణాలు చోటు చేసుకొనేవి కావని ఆయన పేర్కొన్నారు. గురువారం ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉమ విలేకరులతో మాట్లాడారు. 'మార్చి నెలాఖరులో ఖజానాలో ఉన్న రూ.13 వేల కోట్లను సీఎం తమ పార్టీ వారికి, తనకు దగ్గరగా ఉండే కంట్రాక్టర్లకు విడుదల చేయించారు. ఖజానాలో పైసా కూడా ఉంచలేదు. పింఛన్లకు రూ.2,000 కోట్లు ఉంచినా సరిపోయేది. ఆ పని చేయలేదు. కొత్త అప్పు కోసం రిజర్వు బ్యాంక్ చుట్టూ తిరిగారు. డబ్బులు రాకపోయినా పింఛనుదారులను మాత్రం సచివాలయాలకు రావాలని వలంటీర్లతో ఫోన్లు చేయించారు. వారు ఆశతో గ్రామ, వార్డు సచివాలయాలకు ఎండలో రెండు మూడుసార్లు తిరిగారు. వారిలో నలుగురైదుగురు ఎండ వేడికి తట్టుకోలేక ప్రాణాలు వదిలారు. ఈ పరిస్థితికి జగనే బాధ్యత వహించాలి. కంట్రాక్టర్లకు ఇవ్వకుండా ఆ డబ్బులు పింఛన్లకు కేటాయించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు' అని ఉమ ఆరోపించారు.

వృద్ధుడి మరణంతోనూ వైసీపీ రాజకీయం

» చంద్రబాబు పింఛను ఆపేయించడం వల్లే చనిపోయారని చెప్పాలంటూ కుటుంబీకులకు శిక్షణ

» వైసీపీ నేతల కుట్ర సోషల్ మీడియాలో వైరల్

వెంకటగిరి, ఏప్రిల్ 4: ఒక వృద్ధుడి సాధారణ మరణాన్ని వైసీపీ నాయకులు శవరాజకీయాలకు ఎలా వాడుకోవాలనుకున్నారో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జనం ముక్కున వేలేసుకున్నారు. తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణం బంగారుపేటకు చెందిన బొడిచెర్ల వెంకటయ్య (80) గత మంగళవారం ఉదయం వలంటీరు వద్దకు వెళ్లి పెన్షన్ గురించి అడిగారు. ఇకపై తాము ఇంటికి వచ్చి పెన్షన్ ఇచ్చేది లేదని, సచివాలయానికి వెళ్లి తీసుకోవాలని వలంటీరు సూచించారు. దీంతో వెంకటయ్య సచివాలయానికి వెళ్లగా ఇవాళ పెన్షన్ ఇవ్వడం లేదని, బుధవారం రావాలని సిబ్బంది చెప్పారు.దీంతో నిస్పృహకు లోనైన వెంకటయ్య ఇంటికి చేరుకున్న కాసేపటికే గుండెపోటుకు గురై మరణించాడు. ఈ మృతిని టీడీపీకి అంటగట్టేందుకు వైసీపీ నాయకులు పన్నాగం పన్నారు. ఇద్దరు సాక్షి విలేకరులు, ఒక వలంటీరు, ఒక వైసీపీ నాయకుడు కలిసి వెంకటయ్య ఇంటికి వెళ్లారు.వెంకటయ్య కోడలితో మాట్లాడి మీడియా ముందు ఎలా మాట్లాడాలో ట్రైనింగు ఇచ్చారు. చంద్రబాబు ఫిర్యాదు చేయడం వల్లే పింఛను నిలిపివేయడంతో వెంకటయ్య మృతి చెందాడని చెప్పాలని అలా అయితే సీఎం జగన్ ఆర్థిక సాయం చేస్తారని చెప్పారు. దీంతో వారంతా వారు చెప్పినట్టుగానే మీడియాతో మాట్లాడారు. అయితే తరువాత శిక్షణ ఇచ్చిన ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో జనం ఆశ్చర్యపోయారు.


బొజ్జల సభలో కత్తితో!

» శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి ప్రచారంలో వైసీపీ అభిమాని

» మద్యం మత్తులో సెల్ఫీ కోసం ఎగబడిన వైనం

» బొడ్డులో కత్తి కనిపించడంతో హడలెత్తిన జనం

» నిందితుడు ఆర్టీసీ ఉద్యోగి.. కేసు నమోదు



పోలీసుల అదుపులో మహేష్ కుమార్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి ప్రచార సభలో ఓ వ్యక్తి కత్తితో కనిపించడం కలకలం రేపింది. అతడిని పట్టుకుని శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీసులకు అప్పగించడంతో కేసు నమోదు చేశారు. వివరాలివీ.. చంద్రగిరి మండలం తూర్పుపల్లికి చెందిన తిరువీధుల మహేష్ కుమార్(35) తిరుమల ఆర్టీసీ డిపోలో టైర్ మెకానిక్ ఉద్యోగి. 11 ఏళ్ల క్రితం శ్రీకాళహస్తి పట్టణం బహదూర్ పేట ప్రాంతానికి చెందిన మీనాతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు ఆడపిల్లలు. మద్యానికి బానిస కావడంతో కొద్ది సంవత్సరాలుగా దంపతుల మధ్య విభేదాలు తలెత్తాయి. ఆరు నెలల క్రితం పిల్లలను తీసుకుని భార్య శ్రీకాళహస్తిలోని పుట్టింటికి వచ్చేసింది. బుధవారం బహదూర్‌పేటలో జాతర నేపథ్యంలో మహేష్ కుమార్ అత్తగారింటికి వచ్చాడు. ఈ క్రమంలో శ్రీకాళహస్తి పట్టణంలోని 5వ వార్డు పరిధిలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారం ముగింపు సమయంలో బహదూర్‌పేటలోని కంఠా వీధి కూడలి వద్ద తిరువీధుల మహేష్ కుమార్ మద్యం మత్తులో జనంలోకి చొరబడ్డాడు. సెల్ఫీ కావాలంటూ తూలుతూ బొజ్జల సుధీర్‌రెడ్డి దగ్గరకు వెళ్లాడు. షార్ట్(నిక్కరు) ధరించి మద్యం మత్తులో తూలుతూ ఉండడంతో టీడీపీ నాయకుడు కాసరం రమేష్ అనుమానంతో అతడిని తనిఖీ చేశాడు. బొడ్డులో కత్తి ఉండడంతో అందరూ హడలిపోయారు. టీడీపీ నాయకులు అతడిని పట్టుకుని శ్రీకాళహస్తిలో 2వ పట్టణ పోలీసులకు అప్పగించారు. పోలీసులు అతడిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అయితే అతడి భార్య మీనా ఈ విషయమై స్పందిస్తూ తన భర్త వైసీపీ అభిమాని అని, రాజకీయ కార్యకలాపాల్లో ఎప్పుడూ పాల్గొనలేదని తెలిపారు. ఆయనకు బొజ్జల సుధీర్ రెడ్డిని హత్య చేసే ఉద్దేశం లేదని చెప్పారు.



● వలంటీర్లు ఉండాలి. ప్రజలకు సేవ చేయాలి. వాళ్లకిచ్చేది ప్రభుత్వ ధనం. కానీ వైసీపీకి ఊడిగం చేస్తే ఊరుకోనని చాలా స్పష్టంగా చెప్పాను. వలంటీర్ వ్యవస్థకు నేను వ్యతిరేకం కాదు. వలంటీర్లను తీసేయను. వ్యవస్థను కొనసాగిస్తా. కానీ మీరు రాజకీయ పార్టీకి సపోర్టు చేయవద్దు.

● జగన్‌రెడ్డీ.. గొడ్డలి చూపించి బెదిరిస్తున్నావు. గొడ్డలితో రాజకీయం చేస్తున్నావు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేశావు. అందుకే సవాలు విసురుతున్నాను. నీకు చేతనైతే నీ గుర్తుగా గొడ్డలి పెట్టుకో. ఈ రాష్ట్రాన్ని వల్లకాడు చేయొద్దు. - చంద్రబాబు



కొవ్వూరు చంద్రబాబు సభలో వృద్ధుడి ఆనందోత్సాహం

వైసీపీ డీఎన్ఏలోనే

శవరాజకీయం

● పేదపిల్లలను చదివించిన నేను పెత్తందారా? ఆ స్కీమును రద్దుచేసిన దుర్మార్గుడు జగన్ పెత్తందారా? మీరే ఆలోచించండి. ఆయన కూతుళ్లు మాత్రం లండన్‌లో చదవాలి. పేదల పిల్లల మాత్రం చదవకూడదా?

● జగన్ నా ఎస్సీలంటూనే వాళ్ల గొంతు కోస్తాడు. నాలుగున్నరేళ్లలో దళితులపై 6 వేల కేసులు పెట్టాడు. 188 మందిని దారుణంగా చంపారు. 32 మంది పింఛనుదారులను చంపేశాడు. అవి ప్రభుత్వ హత్యలే. జగన్‌పై పోలీసులు కేసులు పెట్టి లోపల వేయాలి. జగన్‌కు శవ రాజకీయాలు చేయడం అలవాటు. అందుకే శవాన్ని చూసి నవ్వుతాడు. - చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

కూడా జగన్ చెప్పాడు. జగన్మోహన్‌రెడ్డి ఇప్పటికైనా నిజం చెప్పు.. హూ కిల్డ్ బాబాయి?' అని చంద్రబాబు మండిపడ్డారు.

దళితులకు నిలువునా మోసం

"జగన్‌రెడ్డి దళితులను నిలువునా మోసం చేశాడు. జగన్ అహంకారాన్ని దళితులంతా గుర్తుపెట్టుకోవాలి. ఇవాళ దళితులు ప్రశ్నించే పరిస్థితిలో లేరు. ప్రశ్నించిన వాళ్లపై కేసులు పెట్టి, జైలుకు పంపి అంతం చేసే పరిస్థితికి జగన్ వచ్చాడు. ఎవరైనా స్వరం విప్పితే గొంతు నొక్కేస్తున్నాడు. లేకపోతే చంపేస్తున్నాడు. తూర్పుగోదావరి జిల్లాలో డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డోర్ డెలివరీ చేశాడు. ఇటీవల అంబేడ్కర్ విగ్రహానికి అనంతబాబు దండవేస్తుంటే ఊరంతా తిరగబడి తరిమికొట్టేశారు. ఇక అన్ని గ్రామాల్లో ఇదే జరగాలి.

సంపద సృష్టించేందుకే వస్తున్నా

'నేను సంపదను సృష్టించి, పేదలకు పంచడానికి ఒక నిర్దిష్ట ప్రణాళికతో వస్తున్నాను. నేను వచ్చిన 100 రోజుల్లో గంజాయి, జె బ్రాండ్స్, ఇసుక దోచుకోవడం లేకుండా చేస్తాను. ఆడబిడ్డలే నా నమ్మకం. ఆస్తిలో సమాన హక్కు ఇచ్చింది టీడీపీనే. డ్వాక్రా సంఘాలు పెట్టి అభివృద్ధి చేశాను. ఇక సూపర్‌సిక్స్ పథకాలు పెట్టాను. ఏడాదికి 4 లక్షలు చొప్పున 5 ఏళ్లలో 20 లక్షలు ఉద్యోగాలు ఇస్తాం. నెలకు రూ. 3వేలు నిరుద్యోగభృతి ఇస్తాం. పండించిన ప్రతి దాన్యాపు గింజను కొంటాం. అన్నదాత పథకంలో రైతుకు ఏడాదికి రూ.20వేలు ఇస్తాం. రైతుకూలీలకు కార్పొరేషన్ పెట్టి ఆదుకుంటాం. పేదలకు 2 సెంట్ల భూమి ఇచ్చి ఇళ్లు కట్టిస్తాం' అని హామీ ఇచ్చారు.

జగన్‌రెడ్డి అరాచకంపై ప్రతి ఇంట్లో, ప్రతి ఊర్లో చర్చ జరగాలి. దళితులకున్న ఎన్నో పథకాలు రద్దు చేశాడు. అంబేడ్కర్ స్టడీ సర్కిల్ తీసేశాడు. అంబేడ్కర్ పేరుతో విదేశీ విద్య పెడితే దాన్ని రద్దుచేసి జగన్ తన పేరు పెట్టుకుని ఒక్క రూపాయి కూడా ఇవ్వని దళిత ద్రోహి. నేను మళ్లీ హామీ ఇస్తున్నాను. రాగానే సబ్‌ప్లాన్ పెడతాను. 27 పథకాలు పునరుద్ధరిస్తాను. బెస్ట్ ఎవైలబుల్ స్కూల్స్ పెడతాను. బ్యాక్‌లాగ్ పోస్టులు ఇస్తాను. మే 13న పోలింగ్‌కు వెళ్లినప్పుడు ప్రతి దళితుడు ఆత్మపరిశీలన చేసుకోవాలి. అందరూ ఆలోచించండి. నేను చెప్పేది వాస్తవమైతే జగన్‌రెడ్డిని చిత్తుచిత్తుగా ఓడించండి' అని కోరారు.

పూర్వవైభవం తెస్తాం

'రాష్ట్రాన్ని కాపాడడం కోసం, ప్రజలకు న్యాయం చేయడం కోసం తెలుగుదేశం, జనసేన, బీజేపీ కలిసి జట్టుగా వచ్చాం. ఆశీర్వదించండి.. ఆంధ్రప్రదేశ్‌కు పూర్వ వైభవం తీసుకువస్తాం. ప్రజాగళం సభకు వచ్చిన ఆడబిడ్డలు, యువత, తమ్ముళ్ల హుషారు చూస్తుంటే నాకు ఏ మాత్రం అనుమానం లేదు.. గెలుపు మనదే. జగన్మోహన్ రెడ్డి మీటింగ్‌లకు 1500 బస్సులు పెట్టి అద్దె మనుషులను తీసుకువస్తే మీటింగ్ ప్రారంభం కాగానే పారిపోతున్నారు. ఇక్కడ మీ ఉత్సాహం చూస్తుంటే ఎప్పుడెప్పుడు 13 మే వస్తుందా, రెండు బటన్లు నొక్కి వైఎస్ఆర్ కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో కలిపేద్దామా అన్నట్టు ఉంది. జగన్ అహంకారంతో విధ్వంస పాలకుడిగా రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడు. మీ భవిష్యత్‌ను అంధకారం చేశాడు. మీ పిల్లల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేశాడు' అని చంద్రబాబు విమర్శించారు.

కూటమిని గెలిపించండి

'రాష్ట్రం నాశనం అయిపోతోందని, ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని, రాష్ట్రాన్ని కాపాడుకోవాలని మొట్టమొదట ముందుకు వచ్చిన వ్యక్తి పవన్‌కల్యాణ్. పవన్‌కు మన స్ఫూర్తిగా అభినందనలు తెలియజేసుకుంటున్నా. కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీజేపీ. రాష్ట్రాన్ని కాపాడుకోడానికి, ప్రజలను గెలిపించడానికి, న్యాయం చేయడానికి బీజేపీ, టీడీపీ, జనసేన ఒక జట్టుగా వచ్చాం. రాజమహేంద్రవరం పార్లమెంటు బీజేపీ అభ్యర్థిగా పురందేశ్వరి పోటీచేస్తున్నారు. జనసేన నుంచి రాజానగరం, నిడదవోలు నుంచి ఇద్దరు అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. టీడీపీ 5 నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తోంది. అందులో ఒకటి బీజేపీకి ఇచ్చాం. అందరినీ గెలిపించాలి' అని కోరారు.

మొన్న ఈ బుద్ధి ఏమైంది?

'వృద్ధులకు, వితంతువులకు పింఛను ఇచ్చిన పార్టీ తెలుగుదేశమే. మొట్టమొదట రూ.35తో పింఛనుతో మొదలుపెట్టింది ఎన్టీఆర్. 2014లో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పింఛనును రూ.200 నుంచి రూ.2000 చేసిన పార్టీ టీడీపీ. 10 రెట్లు పెంచాం. దుర్మార్గుడు వచ్చి రూ.250 చొప్పున అయిదేళ్లలో ముక్కుతూ మూలుగుతూ ఎట్టకేలకు రూ.1000 పెంచాడు. అన్నా క్యాంటీన్‌ల ద్వారా పేదవారికి రూ.5కే భోజనం పెట్టిన పార్టీ టీడీపీ. ఒక లక్షా 35 వేల మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. వారి ద్వారా ఇంటింటికి వెళ్లి పింఛను పంపిణీ చేస్తే, ఒక్కొక్క ఉద్యోగి 45 మందికి ఇస్తే ఒక్క రోజులో పంపిణీ పూర్తి అవుతుంది. కానీ ఈ దుర్మార్గుడు ఇంటింటికి పంపించకుండా లబ్ధిదారులను సచివాలయాలకు రమ్మన్నాడు. జగన్ ఇవ్వకపోతే నేను రాగానే ఆ నెల నుంచే రూ.4 వేల పింఛను ఇస్తానని చెప్పాను. దాంతో జగన్ భయపడిపోయి నిన్న డబ్బులు రిలీజ్ చేశాడు. ఈరోజుకు 85 శాతం ఇచ్చాడు. మొన్నే ఈ బుద్ధి జ్ఞానం ఏమైంది జగన్‌రెడ్డీ? పింఛన్లు పంపడం ఇంకో రోజు లేటయి ఉంటే శవాలను తీసుకుని నేనే జగన్‌రెడ్డి ఇంట్లో కూర్చునేవాడిని' అని చంద్రబాబు హెచ్చరించారు.

రాష్ట్రాన్ని కాపాడుకుందాం

'స్థానికంగా హోంమంత్రి దళితులపై దాడులు చేయించారు. ఇళ్లస్థలాల భూ సేకరణలో దోపిడీ చేశారు. దొమ్మేరులో దళిత యువకుడు ఆత్మహత్యకు పాల్పడడంతో దళితులు తిరగబడ్డారు. దీంతో హోంమంత్రి గోపాలపురం పారిపోయారు. అందరూ కలిసి పనిచేయండి. రాష్ట్రానికి పూర్వ వైభవం తెద్దాం. ఇది వన్‌సైడ్ విజయం కావాలి' అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

దొంగల నాయకుడు జగన్

'ఇంకా ఉన్నది 39 రోజులే. స్పీడు పెంచాలి. ఫ్యాన్ తుక్కు తుక్కు కావాలి. పనికిరాని ఆ తుక్కును డస్ట్‌బిన్‌లో పడేయాలి. రాష్ట్రంలో దొంగలు పడ్డారు. ఆ దొంగల నాయకుడే జగన్మోహన్‌రెడ్డి. రాష్ట్రంలో హంతకులు, బందిపోట్లు పడ్డారు. ఆ బందిపోట్లకు నాయకత్వం జగన్మోహన్‌రెడ్డిది. అందుకే అతడ్ని సైకో జగన్ అని అంటున్నారు. నా ఎస్సీలంటూ పిలిచే జగన్.. వాళ్లకు ఏం మేలు చేశావని అడుగుతున్నాం. రాష్ట్రంలో ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను నాశనం చేశాడు. ఎస్సీలపై ఎస్సీ అట్రాసిటీ కేసులు పెట్టిన పెద్ద మనిషి ఈ జగన్మోహన్‌రెడ్డి. మే 13వ తేదీన టీడీపీ కూటమికి రెండు బటన్లు నొక్కండి. ఉత్తుత్తి బటన్ నొక్కే వాడిని ఇంటికి పంపేద్దాం. అది మీ భవిష్యత్తుకు నాంది. మీ భవిష్యత్తుకు భరోసా నాదీ' అని భరోసా ఇచ్చారు.

జగన్ అసమర్థతతో పోలవరం నాశనం

'పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి ఒక వరం. ఈ ప్రాజెక్టుతో 2వేల టీఎంసీల నీళ్లు వాడుకొనే అవకాశం ఉంది. అలా వాడుకొంటే ఈ రాష్ట్రంలో కరువనే మాటే ఉండదు. జగన్ డయాఫ్రం వాల్‌ను కొట్టుకుపోయేట్టు చేశాడు. కాఫర్ డ్యామ్‌ను నాశనం చేశాడు. గైడ్‌బండ్‌ని పూర్తిగా నిర్వీర్యం చేశాడు. పోలవరం పూర్తయ్యి నదుల అనుసంధానం జరిగి ఉంటే రాష్ట్రంలో కరువు అనే మాటే ఉండేది కాదు. జగన్ అసమర్థత, వెధవ పనులతో ఆ ప్రాజెక్టు పోయింది' అని చంద్రబాబు విమర్శించారు.

విద్యా కానుక పేరిట..

వందల కోట్ల దోపిడీ!

» విద్యార్థుల సంఖ్య తగ్గుతుంటే.. ఖర్చెందుకు పెరుగుతోంది?

» ప్రభుత్వ స్కూళ్ల నుంచి 5.7 లక్షల మంది ప్రైవేటు బడులకు

» నలుగురికి టోఫెల్ శిక్షణ.. అందరికీ ఇచ్చినట్లు ప్రచారం

» ఇంగ్లీష్ ఎడ్జ్ వెబ్‌సైట్ చూస్తేనే బండారం బట్టబయలు

» పాఠశాలలకు వైసీపీ రంగులకు రూ.1,800 కోట్లు ఖర్చు

» ప్రవీణ్ ప్రకాశ్ వైసీపీ ఏజెంట్.. తన శాఖలోని అవినీతి పట్టదు!


» టీడీపీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ ధ్వజం

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతుంటే.. వారికి ఇచ్చే విద్యా కానుక ఖర్చు ఎందుకు పెరుగుతోందని తెలుగుదేశం పార్టీ ప్రశ్నించింది. విద్యా కానుకల పేరుతో వందల కోట్ల రూపాయలు దోచుకు తింటున్నారని, దాని కోసమే ఖర్చు పెరిగినట్లు లెక్కలు చూపిస్తున్నారని ఆ పార్టీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్ కుమార్ ఆరోపించారు. గురువారం ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. '2021-22 విద్యా సంవత్సరంలో నలభై ఐదు లక్షల మంది విద్యార్థులకు విద్యా కానుకలకు రూ.789 కోట్లు ఖర్చయినట్లు చూపించారు. 2023-24 సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆరు లక్షలు తగ్గింది. అప్పటికి 39 లక్షల మంది మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో మిగిలారు. అయినా ఆ ఏడాది విద్యా కానుకల ఖర్చు మాత్రం రూ.1042 కోట్లకు పెరిగిపోయింది. విద్యార్థుల సంఖ్య తగ్గితే ఖర్చు తగ్గాల్సింది పోయి ఎందుకు పెరిగింది? ఈ పేరుతో రూ.270 కోట్లు అడ్డంగా తినేశారు. 2024-25 విద్యా సంవత్సరానికి మళ్లీ రూ.వెయ్యి కోట్లతో విద్యా కానుకల సరఫరాకు ఆర్డర్లు ఇచ్చేశారు. విద్యార్థులు పెరగలేదు. కానీ, విద్యా కానుకల ఖర్చు మాత్రం పెరుగుతోంది. వచ్చే విద్యా సంవత్సరానికి ఈ కానుకల సరఫరాకు టెండర్లు పిలవలేదు. పాత కంట్రాక్టర్లకే మళ్లీ ఆర్డర్ ఇచ్చేశారు. ఇంత పెద్ద మొత్తంలో ఆర్డర్ ఇచ్చినప్పుడు న్యాయ సమీక్షకు ఎందుకు పోలేదన్న ప్రశ్నలు వచ్చాయి. దానిని తప్పించడానికి పంతొమ్మిది మంది కంట్రాక్టర్లకు రూ.వెయ్యి కోట్ల ఆర్డర్‌ను పంచారు. ఎవరికీ రూ.100 కోట్లు దాటకుండా చూశారు. వంద కోట్లు దాటితేనే న్యాయ సమీక్షకు పంపాలని, లేకపోతే అవసరం లేదంటూ తప్పించుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఈ వ్యవహారాలను బట్టే ఇందులో అవినీతి ఎంత ఉందో తెలిసిపోతోంది' అని ఆయన విమర్శించారు. విద్యా శాఖ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ వైసీపీ ఏజెంట్ మాదిరిగా తయారయ్యారని నీలాయపాలెం ధ్వజమెత్తారు. 'విద్యార్థుల ఇళ్లకు వెళ్లి.. వాళ్ల హోంవర్క్ చేశారో లేదో చూడాలని ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేస్తున్న ఆయన, తన శాఖలో అవినీతి వ్యవహారాలు పట్టించుకోరా?' అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్ రెడ్డి అజ్ఞానానికి విద్యా శాఖ ఒక ప్రయోగశాలగా మారిందని, ఐఏఎస్ అధికారులు కూడా భజన చేయడమే లక్ష్యంగా తిరుగుతున్నారని విమర్శించారు. 'పాఠశాలల్లో మూడో తరగతి నుంచి విద్యార్థులకు టోఫెల్ శిక్షణ ఇస్తామని సీఎం ప్రకటించారు. ఈ శిక్షణ ఎందుకో ఎవరికీ తెలియదు. టీచర్లకు ఈ శిక్షణ ఇచ్చే పనిని ఢిల్లీకి చెందిన ఇంగ్లీష్ ఎడ్జ్ అనే సంస్థకు ఇచ్చారు. ఈ సంస్థలో మొత్తంగా పనిచేస్తున్న వారు కేవలం 34 మంది. వీరు ఈ రాష్ట్రంలో ఎంత మందికి శిక్షణ ఇవ్వగలరు? అందరికీ శిక్షణ ఇచ్చేశామని, విద్యార్థులు అందరూ టోఫెల్ పరీక్ష రాయడానికి సిద్ధంగా ఉన్నారని ప్రకటనలు ఇస్తున్నారు. ఇంగ్లీష్ ఎడ్జ్ సంస్థ వెబ్‌సైట్ చూస్తే అసలు బండారం బయటపడుతోంది. నలుగురికి శిక్షణ ఇచ్చి అందరికీ ఇచ్చినట్లు ప్రచారం చేసుకొంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల ఉద్ధరణకు వందలు, వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని ఉధృతంగా ప్రచారం చేస్తున్నారు. అదే నిజమైతే ఈ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి ఐదు లక్షల డెబ్బై వేల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు ఎందుకు వెళ్లిపోయారు? దీనికి సమాధానం చెప్పే దమ్ము ఈ ప్రభుత్వానికి ఉందా?' అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల కుదింపు, వాటిని దూరానికి తరలించడం, విద్యార్థులపై రకరకాల ప్రయోగాలు చేయడమే విద్యార్థుల సంఖ్య తగ్గడానికి కారణమన్నారు. పాఠశాలలకు వైసీపీ రంగులు వేయడానికి రూ.1,800 కోట్లు ఖర్చు చేశారని, దీనివల్ల విద్యార్థులకు, విద్యా వ్యవస్థకు ఏం ఉపయోగమని ఆయన ప్రశ్నించారు.


వైసీపీకి ఆమంచి రాజీనామా

» ప్రాథమిక సభ్యత్వం వదులుకుంటున్నట్టు లేఖ

» తిరిగి సొంతగూడు కాంగ్రెస్‌లో చేరే అవకాశం!



చీరాల, ఏప్రిల్ 4 : వైసీపీని వీడినవారి జాబితాలో మరో మాజీ ఎమ్మెల్యే చేరారు. బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గానికి చెందిన వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఆ పార్టీకి షాక్ ఇచ్చారు. తాను వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశానని, ఈనెల తొమ్మిదో తేదీన భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని ఆమంచి గురువారం లేఖ విడుదల చేశారు. ఈక్రమంలో ఈనెల 11వ తేదీన ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు సమాచారం. ఆ మేరకు తన ముఖ్య అనుచరులకు చెప్పినట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ నుంచే ఆమంచి రాజకీయ ప్రస్థానం మొదలైంది. ఆ తరువాత ఇండిపెండెంట్‌గా (నవోదయం పార్టీ) చీరాలలో పోటీ చేసి గెలిచి టీడీపీలో చేరారు. 2019 ఎన్నికలకు ముందు వైసీపీలో చేరారు. ఆ ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీచేసి ఓడిపోయారు. ఆ తరువాత వైసీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడం, కొంతకాలం తరువాత తొలగించడం జరిగింది. తాజాగా ఆమంచి, బంధువులకు చెందిన పలు సంస్థల నుంచి సుమారు రూ.నాలుగుకోట్ల బకాయి వసూలుకు విద్యుత్ శాఖ నోటీసులు జారీచేసింది. దీనితోపాటు ఆమంచిపై ఉన్న కేసులకు సంబంధించి కూడా పూర్తి సమాచారం సేకరించడంతోపాటు, వాటిపై ఎలాంటి చర్యలు చేపట్టవచ్చో అనే అంశాన్ని పరిశీలించడానికి అధిష్ఠానం ఒకరిద్దరిని నియమించింది. దీంతో అన్ని కోణాల్లో ఆలోచించి భవిష్యత్ కార్యాచరణకు సంబంధించి ఆమంచి నిర్ణయం తీసుకున్నారని చెబుతున్నారు. అందులోభాగంగా వైసీపీకి రాజీనామా చేసి, సొంతగూటికి చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది.



దేవాలయం వద్ద కూర్చుని వైసీపీ నేతలతో మాట్లాడుతున్న ఆ పార్టీ ఇంచార్జ్ యడం బాలాజీ

టీడీపీలో చేరొద్దని వేడుకోలు.. పట్టించుకోని మార్టూరు నాయకులు

మార్టూరు, ఏప్రిల్ 4: బాపట్ల జిల్లా మార్టూరు కాపు నేతలు.. పర్చూరు వైసీపీ అభ్యర్థి యడం బాలాజీకి షాకిచ్చారు. వైసీపీకి చెందిన కాపు నేతలు టీడీపీలో చేరుతున్నట్లు తెలుసుకున్న బాలాజీ.. గురువారం పడమర బజారున పాండురంగస్వామి దేవాలయంలో వారిని కలిశారు. దాదాపు మూడు గంటలకుపైగా వారితో మాట్లాడారు. పార్టీని వీడవద్దని బతిమలాడారు. వారిని ఆపేందుకు వివిధ పద్ధతుల్లో మాట్లాడినా ఫలితం దక్కలేదు. తామంతా టీడీపీలోకి వెళ్తున్నామని వారు తేల్చి చెప్పారు. చెప్పిన ప్రకారమే టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంప్ కార్యాలయానికి వెళ్లి ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

గవర్నర్ అనుమతి లేకుండానే..

» స్కిల్ కేసులో బాబుపై చార్జిషీటు

» బెజవాడ ఏసీబీ కోర్టులో సీఐడీ దాఖలు

విజయవాడ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం చంద్రబాబుపై సీఐడీ అధికారులు మరో చార్జిషీటు దాఖలు చేశారు. అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 18 ప్రకారం ప్రజాప్రతినిధులపై చార్జిషీటు దాఖలు చేయాలంటే గవర్నర్ అనుమతి తప్పనిసరి. అయినప్పటికీ దీనిని పట్టించుకోకుండా స్కిల్ డెవలప్‌మెంట్ కేసుకు సంబంధించి విజయవాడ ఏసీబీ కోర్టులో గురువారం ఈ చార్జిషీటు వేయడం చర్చనీయాంశమైంది. ఇప్పటికే ఆయనపై ఫైబర్‌నెట్, అసైన్డ్ భూముల కేసులకు సంబంధించి చార్జిషీట్లు దాఖలయ్యాయి. ప్రస్తుతం ఈ రెండూ న్యాయస్థానం పరిశీలనలో ఉన్నాయి. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు సంబంధించి రూ.176.27 కోట్లు దారి మళ్లించారంటూ క్రైం నంబర్ 29/2021తో ఐపీసీ సెక్షన్లు 120(బీ), 166, 167, 418, 420, 465, 468, 471, 477ఏ 409, 201, 109 రెడ్ విత్ 34, 37.. అవినీతి నిరోధక చట్టంలోని 13(2) రెడ్ విత్ 13 (1), (డీ) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇందులో చంద్రబాబు, అచ్చెన్నాయుడు, స్కిల్ కార్పొరేషన్ మాజీ ఉన్నతాధికారులు గంటా సుబ్బారావు, కె.లక్ష్మీనారాయణ, సీమెన్స్, డిజిటెక్, పీవీఎస్పీ/స్కిల్లర్ సంస్థల ప్రతినిధులు సహా 41 మందిని నిందితులుగా చేర్చారు.

రాష్ట్రంలో జంగిల్‌రాజ్

» వచ్చేది బాబు ప్రభుత్వమే: అరుణ్‌సింగ్



అరుణ్‌సింగ్‌తో ఎంపీ అభ్యర్థి వరప్రసాద్, ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాసులు

తిరుపతి, ఏప్రిల్ 4: 'రాష్ట్రంలో ప్రస్తుతం జంగిల్‌రాజ్ సాగుతోంది. ఎన్నికల అనంతరం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడుతుంది' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ అరుణ్‌సింగ్ అన్నారు. బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీల సమావేశం తిరుపతిలో గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన అరుణ్‌సింగ్ మాట్లాడుతూ... 'రాష్ట్రంలో ల్యాండ్, శాండ్, లిక్కర్ మాఫియా యథేచ్ఛగా సాగుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని దివాలా తీయించింది. నిధులన్నీ వైసీపీ నేత జేబుల్లోకి వెళ్లాయి. రాష్ట్ర భవిష్యత్తు కోసం, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిన నిధులనూ స్వప్రయోజనాలకే వాడారు. జగన్ అండ్ కో ఏపీని దోచేశారు. ఎన్నో పథకాలకు కేంద్రం, రాష్ట్రానికి నిధులు అందించింది. ఐతే ఆయా పథకాలకు కనీసం ప్రధాని స్టిక్కర్ కూడా వైసీపీ ప్రభుత్వం ఉంచలేదు. ఏపీకి మంచి భవిష్యత్తు, అభివృద్ధి ఇవ్వాలనే ఆశయంతో బీజేపీ, జనసేన, టీడీపీ ఓ కూటమిగా ఏర్పడ్డాయి. కూటమి ప్రభంజనంలో వైసీపీ చాపచుట్టేయడం ఖాయం' అని అన్నారు. కాగా, సమావేశం జరుగుతుండగా లోపలకు చేరుకున్న మాదిగ మహా జనసంఘ్ నాయకులు తిరుపతి జిల్లాలో రెండు అసెంబ్లీ, తిరుపతి ఎంపీ స్థానాన్ని మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అరుణ్‌సింగ్‌ను కలిసి ఈ విషయం చెప్పేందుకు ఎంఎంజేఎస్ నాయకులు ప్రయత్నించారు. ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని రావడంతో పార్టీ సమావేశంలోకి ఇలా ప్రవేశించడం సరికాదని, సమావేశం ముగిశాక నాయకులను కలవాలని స్థానిక బీజేపీ నాయకులు సూచించారు. ఈ సందర్భంగా ఎంఎంజేఎస్ అధ్యక్షుడు కరాటపు సుధాకర్‌బాబు మాట్లాడుతూ... ఏపీలో మాదిగలకు ఎన్నికల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించపోతే బీజేపీకి వ్యతిరేకంగా పనిచేస్తాం' అని హెచ్చరించారు.

కూటమి అభ్యర్థిగా పోటీయే ఆశయం: రఘురామ

భీమవరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం-బీజేపీ-జనసేన కూటమి అభ్యర్థిగా పోటీ చేయడమే తన ఆశయమని నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. "నేను ఇష్టపడే కేంద్రమా... ప్రజలు కోరుకునే రాష్ట్రమా? ఎక్కడ పోటీ అనేది చూడాల్సి ఉంది. ఎంపీగా పోటీ చేయాలనేది నా ఆశయం. అసెంబ్లీలో స్పీకర్ స్థానంలో ఉండాలంటూ ప్రజలు కోరుకుంటున్నారు. పోటీ చేయడమనేది తేలింది. ఎలా ఉంటుందో చూద్దాం. దేవుడేమి రాశాడో.. నాయకులు ఏమి చేస్తారో. ఏమి జరుగుతుందో చూద్దాం" అని ఎంపీ వ్యాఖ్యానించారు.

అవినాశ్ బెయిల్ రద్దు చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

వ్యవహరించారని.. దస్తగిరి తండ్రిపై తన అనుచరులతో దాడి చేయించాడని పేర్కొన్నారు. అప్రూవర్‌గా మారి వ్యతిరేక సాక్ష్యం చెబితే లేకుండా చేస్తామని బెదిరించారని.. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేస్తే తూతూమంత్రంగా తేలికపాటి సెక్షన్ల కింద కేసు పెట్టారని తెలిపారు. నిందితులకు బెయిల్ రద్దు చేయాలని కోరే హక్కు బాధితులకు ఉంటుందని. అప్రూవర్‌గా మారిన వారు కూడా ఇతర నిందితుల బెయిల్ రద్దు కోరవచ్చని పేర్కొన్నారు. సీబీఐ తరఫున న్యాయవాదులు అనిల్ తన్వర్, జగదీశ్ వాదనలు వినిపిస్తూ.. దస్తగిరి పిటిషన్‌కు మద్దతు తెలుపుతున్నామన్నారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుని.. 'దస్తగిరి ఫిర్యాదు చేసేవరకు ఏం చేశారు..? కేసుకు సంబంధించి ఏం జరుగుతుందో మీకు తెలియదా? అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలని సీబీఐ ఎందుకు కోరడం లేదు' అని వారిని ప్రశ్నించారు. వారు స్పందిస్తూ.. తన కుటుంబ సభ్యులపై దాడి జరిగిందని దస్తగిరి హైకోర్టు చీఫ్ జస్టిస్‌తో పాటు తమకు కూడా ఫిర్యాదు చేశాడని.. దానిని స్థానిక పోలీసులకు పంపామని పేర్కొన్నారు. అలాగే అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు కోరుతూ వివేకా కుమార్తె సునీతారెడ్డి సుప్రీంకోర్టులో తమ కంటే ముందే పిటిషన్ దాఖలు చేశారని.. అందులో తాము కౌంటర్ దాఖలు చేశామని పేర్కొన్నారు. ఇప్పటికే పిటిషన్ ఉన్నందున తాము ప్రత్యేకంగా పిటిషన్ వేయలేదని తెలిపారు. దస్తగిరిని భయభ్రాంతులకు గురిచేయడంతోపాటు ఏ-5 శివశంకర్‌రెడ్డి కొడుకు చైతన్యరెడ్డి నేరుగా జైలుకు వెళ్లి దస్తగిరిని బెదిరించినట్లు సాక్ష్యాలు ఉన్న నేపథ్యంలో అయన బెయిల్ రద్దు చేయాలని కోరారు. అవినాశ్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కిరాయి హంతకుడికి (దస్తగిరి) ఎమ్మెల్యే కంటే ఎక్కువ భద్రత కల్పించారని.. ఆరుగురితో భద్రత ఇవ్వడం ఎక్కడి విడ్డూరమని ప్రశ్నించారు. ఇంత భద్రత ఉండగా మళ్లీ బెదిరించారంటూ హత్యచేసిన వాడే చెప్పడం హాస్యాస్పదమన్నారు. దస్తగిరి వెనుక ఎవరో ఉండి ఆడిస్తున్నారని తెలిపారు. దస్తగిరి అప్రూవర్‌గా మారడానికి ఇంకా ఆమోదం రాలేదని.. బెయిల్ రద్దు కోరే హక్కు అతడికి లేదన్నారు. కోర్టు సమయం ముగియడంతో విచారణను న్యాయమూర్తి ఈ నెల 15వ తేదీకి వాయిదావేశారు. అలాగే ఈ కేసులో నిందితులైన వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి బెయిల్ పిటిషన్లపై విచారణ ఈ నెల 8కి వాయిదా పడింది.

ఈసీ 'డైరెక్ట్' చార్జ్

(మొదటి పేజీ తరువాయి)

ఆరోగ్యశ్రీ సీఈవో, నైపుణ్యాభివృద్ధి, ఏపీఐఐసీ ఎండీల బాధ్యతలు నిర్వహించేందుకు తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని సీఎస్ ఆయా విభాగాల ముఖ్య కార్యదర్శులను ఆదేశించారు. అలాగే సీనియర్ ఐపీఎస్ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని గుంటూరు రేంజ్ ఐజీగా.. జి.సుమిత్ సునీల్-ప్రకాశం ఎస్పీ, గరికిపాటి బిందు మాధవ్-పల్నాడు ఎస్పీ, మణికంఠ చందోలు-చిత్తూరు ఎస్పీ, అమిత్ బర్దార్-అనంతపురం ఎస్పీ, ఆరిఫ్ హఫీజ్‌ను నెల్లూరు ఎస్పీగా నియమించారు.

వేటుపడిన వారిలో ఐదుగురు ప్రమోటీలే..

పాలక పార్టీతో అంటకాగుతున్నారనే ఆరోపణలు ఎదుర్కొన్న ఆరుగురు ఐపీఎస్ అధికారుల్లో అన్బురాజన్ తప్ప మిగతా ఐదుగురు.. పాలరాజు, పల్లె జాషువా, పరమేశ్వర్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, తిరుమలేశ్వర్‌రెడ్డి రాష్ట్ర పోలీసు సర్వీసు నుంచి ఎంపికైన వారే. ఏపీపీఎస్సీ గ్రూప్-1 ద్వారా డీఎస్పీలుగా నియమితులై పదోన్నతిపై ఐపీఎస్‌లయ్యారు. సర్వీసు మొత్తం రాష్ట్రంలోనే పూర్తిచేసుకునే ఈ అధికారులు డిప్యుటేషన్‌పై మరో రాష్ట్రానికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. అందుకే రాష్ట్రాల్లో అధికార పార్టీ నేతలకు వత్తాసు పలుకుతారనే అపవాదు వీరిపై ఉంటుంది. ఇదే భావనతో ఉన్న ఎన్నికల కమిషన్.. రెగ్యులర్ డైరెక్ట్ ఐపీఎస్ రిక్రూటీలను ఐదు జిల్లాల ఎస్పీలుగా ఎంపిక చేసింది. గుంజూరు రేంజ్ ఐజీగా 2006 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సర్వశ్రేష్ఠ త్రిపాఠి నియామకానికి సిఫారసు చేసింది. అంతకుముందు రాష్ట్రప్రభుత్వం పంపిన మూడు పేర్లలో రెగ్యులర్ డైరెక్ట్ రిక్రూటీ (ఆర్‌ఆర్ బ్యాచ్) అధికారులు లేరు. దీంతో ఆర్‌ఆర్ బ్యాచ్ అధికారుల జాబితా పంపాలని ఆదేశిస్తూ ఈసీ వెనక్కి పంపింది. దరిమిలా రాష్ట్రప్రభుత్వం మనీశ్‌కుమార్ సిన్హా, సీహెచ్ శ్రీకాంత్, సర్వశ్రేష్ఠ త్రిపాఠి పేర్లతో జాబితా పంపింది. అనంతపురం, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు ఎస్పీలుగా ఒక ఆర్‌ఆర్ బ్యాచ్, ఇద్దరు ప్రమోటీల పేర్లు.. ప్రకాశం, పల్నాడు జిల్లాలకు ఇద్దరు ఆర్‌ఆర్, ఒక ప్రమోటీ పేర్లు సిఫారసు చేసింది. ఎంపికైన ఆర్‌ఆర్ అధికారుల్లో సమర్థులకే అవకాశం లభించిందని ఐపీఎస్ వర్గాలు భావిస్తున్నాయి.

సమర్థుడు.. బిందుమాధవ్



పల్నాడు ఎస్పీగా నియమితులైన గరికిపాటి బిందుమాధవ్ సమర్థ అధికారిగా పేరు తెచ్చుకున్నారు. గతంలో అక్కడే పనిచేసిన అనుభవంతో పాటు విజయవాడకు చెందిన ఆయనకు ఈ ప్రాంతంపై పూర్తిగా పట్టుంది. పల్నాడులో అరాచకాలు, దాడులు, హింసకు తావివ్వకుండా ప్రశాంత పోలింగ్‌కు కృషిచేస్తారనే వ్యాఖ్యలు ఐపీఎస్ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి.

ముక్కుసూటి.. సునీల్



ప్రకాశం జిల్లా ఎస్పీగా నియమితులైన గరుడ్ సుమిత్ సునీల్ కఠినంగా వ్యవహరించే అధికారి. గతంలో అదే జిల్లాలో ట్రైనీ ఐపీఎస్‌గా మొదటిసారి అడుగు పెట్టిన ఈ మహరాష్ట్రవాసికి ముక్కుసూటిగా వెళ్తారనే పేరుంది.

యువ అధికారి... మణికంఠ



చిత్తూరు ఎస్పీగా నియమించిన మణికంఠ చందోలు 2018 బ్యాచ్‌కు చెందిన అత్యంత యువ ఐపీఎస్ అధికారి. పల్నాడు ప్రాంతంలో జన్మించిన ఈయన ఉత్తరాంధ్ర జిల్లాల్లో పని చేశారు.

గతంలోనూ ఎస్పీ.. బర్దార్



అనంతపురం ఎస్పీగా నియమితులైన అవినాశ్ బర్దార్ గతంలో శ్రీకాకుళం ఎస్పీగా చేశారు. ప్రస్తుతం సీఐడీలో ఉన్న ఈయన.. వైసీపీ ప్రభుత్వ కక్షసాధింపు చర్యల్లో భాగంగా ఒక పత్రికా యజమాని చిట్‌ఫండ్ సంస్థపై నమోదైన కేసులను పర్యవేక్షిస్తున్నారు.

వైఫల్యాల ఆరిఫ్



నెల్లూరు జిల్లా ఎస్పీగా ఈసీ ఎంపిక చేసిన ఆరిఫ్ హఫీజ్ గుంటూరు అర్బన్ ఎస్పీగా ఎక్కువ కాలం పనిచేశారు. సౌమ్యుడిగా పేరున్నా శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించగలరా అనే అనుమానం వ్యక్తం అవుతోంది. ఎందుకంటే.. జడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న మాజీ సీఎం చంద్రబాబు ఇంటిపై దాడి చేస్తున్నానని ఒకరోజు ముందే చెప్పి దండయాత్రకు వెళ్లిన వైసీపీ ఎమ్మెల్యే జోగి రమేశ్‌ను అడ్డుకోలేకపోయారు. సాక్షాత్తూ డీజీపీ ఆఫీసు పక్కనే ఉన్న టీడీపీ ప్రధాన కార్యాలయంపై పట్టపగలు వైసీపీ మూకలు దాడి చేసి విధ్వంసం సృష్టించింది ఆరిఫ్ గుంటూరు ఎస్పీగా ఉన్నప్పుడే.



విజయవాడలోని స్టేట్ గెస్ట్ హౌస్ రోడ్‌లో విద్యార్థులు

వడగాడ్పుల గుప్పిట రాష్ట్రం!

- ఏపీలో పెరిగిన వడగాలుల తీవ్రత
- 30 ఏళ్ల సగటుతో పోల్చితే అధికం

విశాఖపట్నం, అమరావతి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మారుతున్న వాతావరణ పరిస్థితుల ప్రభావంతో దేశంలో అనేక ప్రాంతాలు వడగాడ్పుల గుప్పిట్లో చిక్కుకుంటున్నాయి. మూడు దశాబ్దాల క్రితంతో పోల్చితే ప్రస్తుతం వాటి తీవ్రత కూడా పెరిగింది. ఎల్‌నినో వల్ల ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకూ సగటున నెలకు 10 నుంచి 12 రోజులు వడగాడ్పులు వీస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో వేసవి ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల హెచ్చరికలపై భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఎప్పటికప్పుడు విపత్తుల విశ్లేషణలు విడుదలకు నిర్ణయించింది. గాలుల తీవ్రత, ఉష్ణోగ్రతలు, గాలిలో తేమశాతాన్ని పరిగణనలోకి తీసుకుని వడగాడ్పుల తీవ్రతను లెక్కించి ఆయా ప్రభుత్వాలు, ప్రజలకు హెచ్చరికలు జారీచేయాలని ఐఎండీ నిర్ణయించింది.

ఏపీ, తెలంగాణలోనూ ప్రభావం

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు దేశంలో అనేక ప్రాంతాలు ప్రధానంగా మధ్య భారతంలో మధ్యప్రదేశ్, విదర్భ, మధ్య మహారాష్ట్ర, మరట్వాడ, ఛత్తీస్‌గఢ్, గుజరాత్ తోపాటు మధ్య భారతానికి ఆనుకుని ఉన్న ఏపీ, తెలంగాణ, ఉత్తర కర్ణాటక, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లో వడగాడ్పుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఐఎండీ ఇప్పటికే అంచనా వేసింది. గతంలో వడగాడ్పుల తీవ్రతతో ప్రస్తుతం సంభవించనున్న గాడ్పుల తీవ్రతను పోల్చి చూస్తున్నారు. క్లైమటాలజీ ప్రకారం అప్పటి గణాంకాలు, వాతావరణ పరిస్థితులను విశ్లేషిస్తే... ఏపీలో 1993 నుంచి 2016 వరకూ వేసవి సీజన్‌లో సగటున ఉత్తరాంధ్ర జిల్లాల్లో నాలుగు రోజులు, తూర్పుగోదావరి నుంచి నెల్లూరు వరకు కోస్తాకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో 5-6 రోజులు, కోస్తాకు దూరంగా ఉన్న ఏలూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో ఆరు నుంచి ఏడు రోజులు వడగాడ్పులు వీచేవి. అయితే వాతావరణంలో మార్పుల ప్రభావంతో పగటి ఉష్ణోగ్రతలు పెరగడం, దీనికితోడు ఈ ఏడాది ఎల్‌నినో తీవ్రత కొనసాగుతున్నందున మూడు నెలల సీజన్ (ఏప్రిల్ నుంచి జూన్)లో వడగాడ్పుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఐఎండీ అంచనా వేసింది. ఈ వేసవి సీజన్‌లో వడగాడ్పులు ఉత్తరాంధ్ర, రాయలసీమల్లోని అనేక ప్రాంతాల్లో సగటున 10 నుంచి 12 రోజులు, మిగిలిన ప్రాంతాల్లో ఆరు నుంచి ఎనిమిది రోజుల వరకు వీస్తాయని అంచనావేసింది.

నేడు, రేపు సెగలే...

రాష్ట్రవ్యాప్తంగా ఎండ తీవ్రత, వడగాల్పులు ఇంకాస్త పెరిగాయి. గురువారం నంద్యాల జిల్లా చాగలమర్రిలో 44.1 డిగ్రీలు, కడప జిల్లా చిన్నచెప్పల్లిలో 43.9, కర్నూలు జిల్లా లద్దగిరిలో 43.8, ప్రకాశం జిల్లా దరిమడుగులో 43.8, అనంతపురం జిల్లా తెరన్నపల్లిలో 43.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 21 మండలాల్లో తీవ్రంగా, 97 మండలాల్లో మోస్తరు వడగాల్పులు వీచాయి. శుక్ర, శనివారాల్లో కూడా రాష్ట్రవ్యాప్తంగా కొన్ని మండలాల్లో తీవ్రంగా, అనేక మండలాల్లో మోస్తరు వడగాల్పులు ఉంటాయని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.

ఊరికొచ్చి ఓటెయ్యండి

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నిర్వహిస్తున్న సమావేశాల్లో స్వయంగా అభ్యర్థులు పాల్గొంటున్నారు. నామినేషన్ల దాఖలు అనంతరం ఏపీ ఎన్నికల ప్రచారంలో మరింత బిజీగా ఉంటామని భావిస్తున్న కొందరు అభ్యర్థులు ముందస్తుగా హైదరాబాద్‌లో ఉండే ఓటర్లతో సమావేశమవుతున్నారు. ఓటర్లు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో ఉండే తమ నియోజకవర్గ ఓటర్ల గుర్తింపునకు ఆయా పార్టీల అభ్యర్థులు భారీ కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. పార్టీ నేతల ద్వారా గ్రామాల వారీగా ఇతర ప్రాంతాల్లో ఉండే ఓటర్ల వివరాలు, వారి ఫోన్ నంబర్లు సేకరిస్తున్నారు. హైదరాబాద్‌లో ఉంటున్న కొందరు కూడా తమ నియోజకవర్గానికి చెందిన ఓటర్ల సమాచారం అభ్యర్థులు/వారి అనుచరులకు ఇస్తున్నారు. వారందరితో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ప్రచార కార్యక్రమాల వివరాలు తెలియజేస్తున్నారు. ఆత్మీయ సమావేశం నిర్వహించే తేదీ, వేదిక, తదితర వివరాలు పోస్ట్ చేస్తున్నారు. అందరూ హాజరయ్యేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఎక్కువ మంది ఓటర్లు ఉన్న చోట సమావేశాలు నిర్వహిస్తూ ఇతర ప్రాంతాల్లో ఉన్న వారిని అక్కడికి ఆహ్వానిస్తున్నారు. హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉండే వారికి ఆహ్వానం పంపుతున్నారు. హైదరాబాద్‌లో ఉభయ గోదావరి జిల్లాలు, అనంతపురం, శ్రీకాకుళం, గుంటూరు తదితర ఉమ్మడి జిల్లాల ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ఆయా జిల్లాల్లో అభ్యర్థులు ఇక్కడ సమావేశాల నిర్వహణకు ఆసక్తి చూపుతున్నారు.

ఏపీలో ఓటేసేందుకు సై

హైదరాబాద్‌లో ఉంటున్న కొందరికి ఏపీలో ఓట్లు ఉండగా, మరికొందరికి రెండు రాష్ట్రాల్లో ఓటు హక్కు ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే ఓటున్న వారు అక్కడికి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా.. రెండు చోట్లా ఓటున్న వాళ్లలో మెజార్టీ ప్రజలు ఏపీకి వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయి. ఏపీలో లోక్‌సభ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగుతున్నాయి. దీంతో హైదరాబాద్‌లో ఓటు వేయడం కంటే సొంతూరులో రెండు ఓట్లు వేయవచ్చన్నది వారి అభిప్రాయం. ఆత్మీయ సమావేశాల్లో ఆయా అభ్యర్థులు.. ఓటు హక్కు వినియోగించుకోవాలని, తమ పార్టీని ఆదరించాలని విజ్ఞప్తి చేస్తూ భోజనాలు పెడ్తున్నారు. ఎన్నికలకు రెండు, మూడు రోజుల ముందు నుంచే రవాణా సదుపాయం కల్పిస్తామని చెబుతున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేస్తామని, హైదరాబాద్‌లో ప్రాంతాల వారీగా ఓటర్ల సంఖ్యను బట్టి బస్సులు అందుబాటులో ఉంటాయని, ఆ వాహనం ఇన్‌చార్జ్ వివరాలూ ఇస్తామని సమావేశాల్లో చెబుతున్నారు. రవాణా ఖర్చులతో పాటు ఓటుకింత ఇచ్చేందుకూ కొందరు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. హైదరాబాద్‌లో కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్, ఎల్‌బీనగర్, రాజేంద్రనగర్ నియోజకవర్గాల పరిధిలో ఏపీకి చెందిన ఓటర్లు ఎక్కువగా ఉంటారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ఆత్మీయ సమావేశాలు జరుగుతున్నాయి. కూకట్‌పల్లిలో గురజాల, మాచర్ల, బాపట్ల, పెనుమలూరు, సత్తెనపల్లి తదితర నియోజకవర్గాల సమావేశాలు నిర్వహించారు. ఒక్కో మీటింగ్‌కు 3 నుంచి 5 వేల మంది హాజరవుతున్నారు. ఈ నెల 7వ తేదీన మైలవరం, కొండేపి నియోజకవర్గాల మీటింగ్‌లు జరగనున్నాయి. ఇప్పటి వరకు ఆదివారం సమావేశాలు జరగగా.. ఇకనుంచి శనివారమూ మీటింగ్‌లు నిర్వహించేలా కొందరు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఏపీ భవిష్యత్తు కోసం సొంతూళ్లకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలని, తమను ఆదరించాలని కోరుతున్నారు. హైదరాబాద్‌లో ఏమైనా ఇబ్బందులున్నా పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని భరోసా ఇస్తున్నారు.

ఎల్‌ఐసీకి 'బుట్టమ్మ' బురిడీ!

(మొదటి పేజీ తరువాయి)

రూ.181,16,10,423.80 రేణుక కుటుంబం తీసుకుంది. ఈ మొత్తాన్ని చెల్లించాలంటూ ఎల్‌ఐసీ హౌసింగ్ నుంచి నోటీసులు వచ్చినా బేఖాతరు చేశారు. దీంతో బుట్టా రేణుక, బుట్టా నీలకంఠ శివ తనఖా పెట్టిన మెరిడియన్ ఎడ్యుటెక్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్, మెస్సర్స్ బుట్టా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేటు లిమిటెడ్, మెస్సర్స్ బుట్టా కన్వెన్షన్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్, ఆస్తులను ఈ-వేలం వేస్తున్నట్లుగా ఎల్‌ఐసీ హౌసింగ్ ప్రకటించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామంలోని సర్వే నం.11/4, 11/5లోని ప్లాట్ నం. 4/22, 4/34, 4/35, 4/30, 4/43, 5/12ఏ, 5/15, 5/1, 5/2, 5/3, 5/4, 4/10, 5/11,4/14,4/36,4/37,5/19,5/5, 5/14, 4/264/27,4/24, 3/25,4/33, 4/34 ఆస్తులన్నింటినీ ఈ-వేలం వేస్తామని పేర్కొంది.. ఈ రుణానికి 2019 నవంబరు 18న బుట్టా రేణుక, బీఎస్ నీలకంఠకు డిమాండ్ నోటీసు పంపింది. ఈ ఆస్తుల రిజర్వు ధరను రూ.360 కోట్లుగా ఎల్‌ఐసీ హౌసింగ్ పేర్కొంది. ఈ ఆస్తులన్నింటినీ ఏకమొత్తంలో ఈ-వేలం ద్వారా విక్రయిస్తామని పేర్కొంది. బిడ్‌లో పాల్గొనేందుకు ఐఎండీ ముఖవిలువలో పది శాతం అంటే రూ.36కోట్లు ధరావత్తు కింద చెల్లించాలంది. వచ్చేనెల 4 వరకూ ఇ-బిడ్‌లు స్వీకరించి, 6న ఈ-వేలం వేస్తామని వెల్లడించింది.

బుట్టా కుటుంబ నేపథ్యం ఇదీ...

హైదరాబాద్‌లో సంపన్న కుటుంబాలకు చెందినవారి పిల్లలకు విలాసవంతమైన విద్యాసంస్థగా పేరొందిన మెరిడియన్ విద్యాసంస్థలకు అధినేతగా బుట్టా రేణుక పేరు సుపరిచితమే. వారి కుటుంబానికి పంజాగుట్ట కూడలిలో రూ.వేల కోట్ల విలువైన భవంతులున్నాయి. అయినా కూడా సీఎం జగన్ దృష్టిలో ఆమెకున్న ఆస్తులు అంతంతమాత్రమే. ఇటీవల ఎన్నికల ప్రచారంలో 'బుట్టా రేణుకమ్మ సౌమ్యురాలు, ఆస్తులు అంతంతే' అంటూ ప్రజలకు జగన్ సెలవిచ్చారు. దీంతో.. అందరూ విస్మయం వ్యక్తం చేశారు. ఆ వ్యాఖ్యలు మర్చిపోక ముందే ఇప్పుడు వారి కుటుంబానికి చెందిన 15 ఆస్తులపై ఎల్‌ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ వేలం నోటీసును ప్రకటించింది. మెరిడియన్ విద్యాసంస్థల పేరును కూడా ఇందులో పేర్కొనడంతో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. బుట్టా రేణుక 2014లో కర్నూలు లోక్‌సభ సభ్యురాలిగా వైసీపీ నుంచి గెలిచారు. 2019 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరినా టికెట్ ఇవ్వలేదు.

లక్షలు చెల్లిస్తేనే మెరిడియన్‌లో సీటు


బుట్టా రేణుక నిర్వహిస్తున్న మెరిడియన్ స్కూల్‌లో సీటు పొందాలంటే డొనేషన్లు, ఫీజుల కింద రూ.లక్షలు చెల్లించాలి. సకాలంలో ఫీజులు చెల్లించకపోతే విద్యార్థిని ఇంటికి పంపేస్తారు. రూ.వేల కోట్ల ఆస్తులున్నా ప్రభుత్వ ఆర్థిక సంస్థల నుంచి రూ.వందల కోట్లలో రుణం తీసుకున్న బుట్టా దంపతులు... తీసుకున్న అప్పులను సకాలంలో ఎందుకు చెల్లించలేదన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సంవత్సరాల తరబడి అప్పులు చెల్లించకుండా ఏకమొత్తంలో వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు వెళ్లడం బడా పారిశ్రామికవేత్తలకు అలవాటేనని అంటున్నారు. అదేవిధంగా వేలంలో రిజర్వు ధర తక్కువగా చూపించి, వాటిని చెల్లించేసి రుణ భారాన్ని తగ్గించుకోవడం కూడా మూమూలేనని చెబుతున్నారు.

కీలక సమయంలో పరపతి పాయె

తెలుగు రాష్ట్రాల్లో బుట్టా రేణుక కుటుంబానికి ఆస్తిపరులని పేరుంది. అలాంటిది ఎమ్మిగనూరు సభలో రేణుకకు ఆస్తులు అంతంతేనంటూ సీఎం ప్రకటించడం, అంతలోనే రుణాలను ఎగవేసేవారి జాబితాలో ఎల్‌ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ ప్రకటించడంతో పరిస్థితి తారుమారైంది. దీంతో బుట్టా కుటుంబ పరపతి అమాంతం పడిపోయిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కీలకమైన ఎన్నికల సమయంలో ఎల్‌ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ ఇచ్చిన ప్రకటన బుట్టా కుటుంబానికి వ్యక్తిగతంగా భారీ నష్టాన్ని చేకూర్చిందని వైసీపీ నేతలు అంటున్నారు. ఈ అంశాన్నే ప్రత్యర్థి పార్టీలు ప్రచారాస్త్రంగా ప్రయోగిస్తాయని అంగీకరిస్తున్నారు.

రాజీనామా చేయాల్సిందే!

- వలంటీర్లపై వైసీపీ నేతల నుంచి పెరుగుతున్న తీవ్ర ఒత్తిడి
- గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో 59 మంది మూకుమ్మడి రాజీనామా
- ఇష్టం లేకపోయినా గత్యంతరంలేక తప్పుకొంటున్న వైనం



గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలంలో వలంటీర్లు రాజీనామా చేయాలంటూ వలంటీర్ల గ్రూపులో వచ్చిన మెసేజ్

ప్రత్తిపాడు, ఏప్రిల్ 4: నిన్న మొన్నటి వరకు అధికార వైసీపీకి హీరోలుగా ఉన్న వలంటీర్లను ఇప్పుడు ఆ పార్టీ నేతలే జీరోలు చేస్తున్నారు. తమ రాజకీయ లబ్ధి కోసం వారిని పావులుగా వాడుకుంటూ ఇరకాటంలో పెడుతున్నారు. తెలుగుదేశం పార్టీని బూచిగా చూపిస్తూ వలంటీర్లతో బలవంతంగా రాజీనామాలు చేయించే ప్రయత్నం చేస్తున్నారు. వైసీపీ నాయకుల కనుసన్నల్లో గ్రామాల్లో రాజీనామాల కుతంత్రానికి తెరతీశారు. ఇందుకు వలంటీర్ల గ్రూపుల్లో డైరెక్టుగా మెసేజ్‌లు పెడుతూ వలంటీర్లపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. అంతే కాకుండా పార్టీ అధిష్ఠానం నుంచి ఆదేశాలు వచ్చాయో ఏమో కాని స్థానిక నాయకులు సైతం వలంటీర్లతో రాజీనామాలు చేయించే పనిలో పడ్డారు. 'మళ్లీ మన పార్టీయే వస్తుంది.. అప్పుడు మిమ్మల్నే వలంటీర్లుగా నియమిస్తాం.. ముందు మీరు రాజీనామా చేయండి' అంటూ హుకుం జారీ చేస్తున్నారు. స్థానిక నాయకుల ఒత్తిడి తట్టుకోలేక వలంటీర్లు రాజీనామా దిశగా అడుగులు వేస్తున్నారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండల కేంద్రంలో 65 మంది వలంటీర్లు ఉండగా అందులో 59 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. అదే విధంగా వట్టిచెరుకూరు మండలంలోని గారపాడు, కుర్నూతల గ్రామాల్లో కొందరు వలంటీర్లు రాజీనామా చేశారు. ఇదే రీతిలో అన్ని గ్రామాల్లో వలంటీర్లతో రాజీనామా చేయించే పనిలో వైసీపీ నాయకులు నిమగ్నమై ఉన్నారు. అందులో భాగంగానే పెదనందిపాడు మండలంలో వలంటీర్లకు పెట్టిన మెసేజ్ ఒకటి బయటికొచ్చింది. 'వలంటీర్లందరూ రాజీనామా చేయాలని పార్టీ నాయకులు చెప్పడం జరిగింది. అందరూ రాజీనామా చేసి వాట్సా‌ప్‌లో మీ రాజీనామా లెటర్ పెట్టండి' అంటూ మెసేజ్ పెట్టారు. దీంతో ఏమి చేయాలో అర్థంకాక ఎవరికి చెప్పుకోవాలో తెలియక వైసీపీ పెద్దల దెబ్బకు వలంటీర్లు విలవిల్లాడుతున్నారు.

జగన్ బయటికొస్తే పచ్చని చెట్లు ఫినిష్..!

- బస్సుయాత్ర పేరిట ఎక్కడికి వెళ్తే అక్కడ చెట్లు నరికివేత.. విద్యుత్ లైన్ల తొలగింపు
- ఐదేళ్లుగా అదే తీరు.. ఎన్నికల వేళా కొనసాగింపు
- గతంలో నరికేసినవి మోడుగానే దర్శనం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

అధికారంలో ఉన్న ఐదేళ్లు తన పర్యటనల కోసం చెట్లను అడ్డంగా నరికి వేయించిన సీఎం జగన్.. ఎన్నికల వేళ కూడా అదే ఆనవాయితీని కొనసాగిస్తున్నారు. జగన్ ఎక్కడ పర్యటనకు వెళితే అక్కడ.. చెట్లు నరికివేయడం, విద్యుత్ వైర్లు తొలగించడం పరిపాటిగా మారింది. ముఖ్యమంత్రి ఈనెల 2న అన్నమయ్య జిల్లాలో బస్సుయాత్ర నిర్వహించారు. ఈ యాత్ర కొనసాగిన మార్గంలో అధికారులు భద్రత పేరుతో పలు చోట్ల తక్కువ ఎత్తులో ఉన్నాయనే కారణంతో విద్యుత్ వైర్లను తొలగించారు. దీంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ములకలచెరువులో ఉదయం 7.30గంటల నుంచే విద్యుత్ సరఫరా నిలిపేశారు. సుమారు ఐదు గంటలపాటు కరెంటు సరఫరా తీసేశారు. దీంతో అసలే ఎండలకు అల్లాడుతున్న జనం.. కరెంటు లేకపోవడంతో నరకయాతన అనుభవించారు. బస్సులో నుంచి ముఖ్యమంత్రి కనీసం కిందకు దిగకపోయినా.. బస్సు పైకి ఎక్కి అభివాదం చేయకపోయినా.. అధికారులు మాత్రం కరెంటు సరఫరాను నిలిపివేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.



తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువులో నరికేసిన చెట్లు

కొమ్మలు కొట్టేసి.. విద్యుత్ ఆపేసి...

ఈ నెల 1న శ్రీసత్యసాయి జిల్లాలో 'మేమంతా సిద్ధం' పేరుతో సీఎం జగన్ బస్సుయాత్ర చేపట్టారు. ఈ యాత్రకు అడ్డొస్తాయన్న సాకుతో కదిరి పట్టణ పరిధిలోని కుటాగుళ్ల వద్ద అనంతపురం-చెన్నై రహదారి పక్కనున్న చెట్ల కొమ్మలను అధికారులు కొట్టేశారు. ఈ రహదారిపై భారీ వాహనాలు కూడా వెళ్తాయి. వాటికి అడ్డురాని చెట్టుకొమ్మలు బస్సుయాత్రకు ఎందుకు అడ్డొస్తాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బస్సుయాత్ర కొనసాగిన మార్గంలో పల్లెల్లో కూడా ముందుగానే విద్యుత్ తీగలను తొలగించారు. బస్సుయాత్రకు అడ్డొస్తాయని విద్యుత్ శాఖ అధికారులు ఈ మేరకు చర్యలు చేపట్టారు. రోజంతా విద్యుత్ సరఫరా ఆపేశారు.

ఏడాది దాటినా మొక్కలు నాటలేదు..

జగన్ పర్యటించక ముందు పచ్చని చెట్లతో కళకళలాడిన ప్రాంతాలు ఆయన పర్యటన అనంతరం మోడువారిపోతున్నాయి. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులోని ఆర్టీసీ డిపో, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో పచ్చని చెట్ల కింద ప్రయాణికులు సేదదీరేవారు. గతేడాది మార్చిలో సీఎం జగన్.. నిడదవోలు పర్యటన సందర్భంగా నీడనిచ్చే భారీ వృక్షాలను నరికివేశారు. ఏడాది దాటినా అక్కడ ఎటువంటి మొక్కలు నాటలేదు.



నిడదవోలులో జగన్ పర్యటన సందర్భంగా చెట్టు నరికివేసిన దృశ్యం (ఫైల్)

ఇంకా మోడుగానే దర్శనం..

తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువులోని ఒక ప్రైవేట్ లేఅవుట్‌లో స్థానిక ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సోదరుడు గణేశ్ వివాహ రిసెప్షన్ ఆరు నెలల క్రితం జరిగింది. ఈ కార్యక్రమానికి సీఎం జగన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దీనికోసం హెలీప్యాడ్ ఏర్పాటు చేయగా ఆ సమీపంలో కొన్ని చెట్లను అప్పట్లో నరికివేసారు. వాటిలో కొన్ని చిగురిస్తుండగా మరికొన్ని ఇంకా మోడుగానే దర్శనమిస్తున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.





హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ హరనాథ్ దంపతులు, జస్టిస్ రఘునందన్‌రావుకు అమ్మవారి ప్రసాదం ఇస్తున్న ఆలయాధికారి, దుర్గమ్మ దర్శనానికి వస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి, దగ్గుబాటి దంపతులు



అలరించిన నృత్య ప్రదర్శన

ధర్మపథం వేదికపై గురువారం నగరంలోని భారతీ రాఘవ నృత్య కేంద్రానికి చెందిన డాక్టర్ అపర్ణ ప్రసాద్ శిష్య బృందంచే కూచిపూడి నృత్యప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలో పలు కీర్తనలకు కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు. మొత్తం 21మంది కళాకారులు తమ ప్రతిభను చూపుతూ నృత్య ప్రదర్శన గావించి ఆహుతులను ఆకట్టుకున్నారు.

దుర్గమ్మ సన్నిధికి హైకోర్టు న్యాయమూర్తులు

వన్‌టౌన్, ఏప్రిల్ 4: హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ హరనాథ్ దంపతులు, జస్టిస్ రఘునందన్‌రావు, జస్టిస్ సుబ్బారెడ్డి గురువారం దుర్గగుడిలోని దుర్గమ్మ దర్శనార్థం విచ్చేసారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించగా వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అధికారులు అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు. అలాగే బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, వెంకటేశ్వరరావు దంపతులు అమ్మవారి ఆలయానికి విచ్చేశారు. సాయంత్రం జరిగిన పంచహారతుల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వారితో బీజేపీ నేతలు ఉన్నారు.

జాతీయ ఆర్చరీ టోర్నీ చాంపియన్‌గా యుక్తశ్రీ

విజయవాడ స్పోర్ట్సు, ఏప్రిల్ 4: నగరంలో చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీలో శిక్షణ పొందుతున్న కొండపావులూరి యుక్త శ్రీ 4వ ఎన్టీపీసీ నేషనల్ ఆర్చరీ టోర్నీలో సత్తా చాటి చాంపియన్‌గా నిలిచింది. పశ్చిమ బెంగాల్‌లో గత నెల 28 నుంచి ఈ నెల 5 వరకు జరుగుతున్న ఈ టోర్నీలో రికర్వ్ విభాగంలో సబ్ జూనియర్ బాలికల కేటగిరిలో బరిలో దిగిన యుక్త శ్రీ ఫైనల్స్‌కు చేరి అక్కడ మధ్యప్రదేశ్‌కు చెందిన జాహ్నవి దేశ్‌ముఖ్‌తో తలపడి 5-5 స్కోర్‌తో టై చేసుకుని, అనంతరం టైలో 10-9 తేడాతో ఘన విజయం సాధించి చాంప్‌గా అవతరించిందని అకాడమీ అధ్యక్షుడు, చీఫ్ కోచ్ చెరుకూరి సత్యనారాయణ తెలిపారు. ఇప్పటికే రాయ్‌పూర్‌లో జరిగిన సబ్ జూనియర్ జాతీయ ఆర్చరీలో చాంపియన్‌గా యుక్తశ్రీ నిలిచి ఈ ర్యాంకింగ్ టోర్నీలో సత్తాను చాటిందన్నారు.



ముఖ్య అతిథి నుంచి మెడల్ అందుకుంటున్న యుక్తశ్రీ



రాష్ట్ర కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

మిమ్స్, ఆంధ్రపేపర్స్ కార్మికుల
సమస్యలు పరిష్కరించాలి
- సీపీఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

గవర్నర్‌పేట, ఏప్రిల్ 4: విజయనగరం జిల్లాలోని మిమ్స్ కార్మికులు, రాజమండ్రి ఆంధ్రపేపర్ లిమిటెడ్‌లో జరుగుతున్న కార్మికుల నిరవధిక సమ్మెకు సీపీఎం రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని నిరవధిక సమ్మెలను వెంటనే పరిష్కరించాలని గురువారం ఎంజీ రోడ్డులోని సీపీఎం రాష్ట్ర కార్యాలయం లో జరిగిన ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం తీర్మానించింది. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు హాజరయ్యారు. సమావేశం లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీఐటీయూ నేతల గఫూర్ పాల్గొన్నారు. యాజమాన్యాల మొండివైఖరి వల్లే కార్మికుల నిరవధిక సమ్మెలు కొనసాగుతున్నాయని, యాజమాన్యం తమ సమస్యలు పరిష్కరిస్తేనే సమ్మె విరమిస్తామని పట్టుదలతో ఉన్నారని సమావేశంలో వక్త లు పేర్కొన్నారు. మిమ్మ కార్మికులు 64 రోజులుగా, ఆంధ్రపేపర్ లిమిటెడ్‌లో కార్మికులు 3 రోజులుగా సమ్మె చేస్తున్నారన్నారు. రాష్ట్రప్రభుత్వం చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న యాజమాన్యాలకు కొమ్ము కాయడం దుర్మార్గమని, ఈ వైఖరిని సీపీఎం తీవ్రంగా ఖండిస్తోందని, ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసింది.



క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్‌డీవో

జాతీయ సాఫ్ట్‌బాల్ విజేతలకు అభినందన


విజయవాడ స్పోర్ట్సు, ఏప్రిల్ 4: మహారాష్ట్రలో ఇటీవల జరిగిన 36వ జాతీయ బాలుర సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్స్ టోర్నీలో రాష్ట్రానికి చాంపియన్‌షిప్‌ను అందించడంలో కీలక ప్రాత పోషించిన నగరానికి చెందిన గొల్లపూడి కుష్వంత్ బుడిగి షంతన్‌ను జిల్లా క్రీడాభివృద్ధి అధికా రి ఎస్ఏ. అజీజ్ అభినందించారు. ఐజీఎంసీలో గురువారం జరిగిన అభినందన సభలో జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గమిడి సాంబశివరావు, జిల్లా కోచ్ రాయన్ సురేష్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



తనిఖీల్లో పట్టుబడ్డ నగదు వివరాలు తెలియజేస్తున్న సీఐ

రూ. 5.84 లక్షల నగదు సీజ్

ఉయ్యూరు, ఏప్రిల్ 4: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టుల వద్ద వాహనాలు తనిఖీలు చేసి ఇప్పటివరకు ఐదుగురి నుంచి రూ.5.84 లక్షలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్టు సీఐ హబీబ్‌బాషా తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు చేసిన తనిఖీల్లో ఎలాంటి పత్రాలు, ఆధారాలు లేకుండా నగదు తీసుకువెళుతున్న వారి నుంచి ఆ మొత్తం సీజ్ చేసినట్టు తెలిపారు. ఎస్సై గణేశ్‌కుమార్ పాల్గొన్నారు.



స్నాతకోత్సవాన్ని ప్రారంభిస్తున్న వీఐటీ స్కూల్ ఆఫ్ లా డీన్ బెనర్జీ

భవిష్యత్ తరాలకు మార్పు తెచ్చేలా
నేటి బోధనా విధానం ఉండాలి: బెనర్జీ

గుణదల, ఏప్రిల్ 4: నేటి బోధనా విధానం భవిష్యత్ తరాలకు మార్పు తెచ్చేలా ఉండాలని వీఐటీ ఏపీ వారి స్కూల్ ఆఫ్ లా డీన్ సిహెచ్. బెనర్జీ అన్నారు. నిడమానూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో జరిగిన స్నాతకోత్సవానికి సిహెచ్. బెనర్జీ ముఖ్య అతిథిగా విచ్చేశారు. బాలబాలికలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ బాలబాలికలు చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలన్నారు. తద్వారా ఏ రంగంలోనైనా రాణించగల్గుతారన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని కొత్త తరహా ఆలోచనలతో ముందుకు వెళ్లాలని కోరారు. పోటీతత్వం అలవర్చుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఆటపాటలతో కూడిన విద్యను అలవర్చుకుంటే మంచి ఫలితాలుంటాయన్నారు. సమాజంలోని అంతరాలను తొలగించే వ్యక్తులుగా ఎదగాలన్నారు. అనంతరం పిల్లలు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ప్లస్ టు పూర్తిచేసిన విద్యార్థినీ, విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్స్‌ను పరిమి సునంద చేతులమీదుగా అందజేశారు. పాఠశాల డైరెక్టర్స్ పరిమి పవన్ చందు, కడియాల ప్రవీణ్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ భువనేశ్వర్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ భాటియా, అకడమిక్ డైరెక్టర్ డేవిడ్ రాజు పాల్గొన్నారు.

పశ్చిమలో ప్రతి సమస్యనూ పరిష్కరిస్తా!

అట్టహాసంగా బీజేపీ పశ్చిమ కార్యాలయ ప్రారంభం
- ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన కేశినేని శివనాథ్ (చిన్ని)
- పశ్చిమ ఉమ్మడి అభ్యర్థి సుజనాచౌదరికి చిన్ని, బుద్ధా, మీరా స్వాగతం

వన్‌టౌన్, ఏప్రిల్ 4: పశ్చిమ నియోజకవర్గంలో కేశినేని శివనాథ్ (చిన్ని) గురువారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఇదే సమయంలో బీజేపీ, జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా పశ్చిమ నుంచి పోటీచేస్తున్న సుజనాచౌదరి తన ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. సుజనాచౌదరి, కేశినేని చిన్ని సంయుక్తంగా ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. తొలుత కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి దేవస్థానం పురోహితులు మంగళవాయిద్యాలు, వేదమంత్రాల మధ్య స్వాగతం పలికారు. తరువాత ఇంద్రకీలాద్రికి చేరుకుని కనకదుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భవానీపురం శివాలయం సెంటర్‌లో బీజేపీ పశ్చిమ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల మధ్య పార్టీ కార్యాలయాన్ని సుజనాచౌదరి ప్రారంభించారు. ఆఫీసు రూంను కేశినేని శివనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెనుకబడిన పశ్చిమను సుజనాచౌదరి అభివృద్ధి పథంలో నడిపిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కనకదుర్గ గుడి వద్ద సుజనాచౌదరి, కేశినేని చిన్నిని గజమాలతో బుద్ధా వెంకన్న, నాగుల్‌మీరా ఘనంగా సత్కరించారు. టీడీపీ సీనియర్ నేత ఎంఎస్ బేగ్, సోషల్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని గురునాథం, టీడీపీ నేతలు మీర్జాముజఫర్ బేగ్, సంకే విశ్వనాథ్, అబీర్‌హుస్సేన్, కాకు మల్లిఖార్జునరావు, బొమ్మసాని సుబ్బారావు, మహమ్మద్ అబ్దుల్‌ఖాన్, నరసింహచౌదరి, పరిశపోగు రాజేష్, బీజేపీ జిల్లా నేతలు గన్నవరపు శ్రీనివాసరావు, పొట్టి శ్రీహరి, నాళం ఠాగూర్ పాల్గొన్నారు.



వినాయకుడి చిత్రపటంతో కార్యాలయ ప్రారంభోత్సవానికి వస్తున్న సుజనాచౌదరి చిత్రంలో బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా, ఎంఎస్ బేగ్, దర్గాలో మహాత్ములకు చాదర్‌ను సమర్పించిన సుజనా చౌదరి, జలీల్‌ఖాన్

గాలిబ్ షహీద్ దర్గాలో పశ్చిమ కూటమి అభ్యర్థి సుజనా చౌదరి ప్రార్థనలు

భవానీపురం, ఏప్రిల్ 4 : అల్లా ఆశీస్సులు, ప్రజల దీవెనలతో తాను విజయం సాధిస్తానని, ఆ వెంటనే పశ్చిమలోని సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అసెంబ్లీ అభ్యర్థి వై. సుజనా చౌదరి అన్నారు. 41వ డివిజన్‌లోని హజ్రత్ గాలిబ్ షహీద్ దర్గాను ఆయన గురువారం దర్శించుకున్నారు. మహాత్ములకు చాదర్‌ను సమర్పించి, అక్కడే ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు ప్రత్యేక ప్రార్థనలు చేసి, ముజావర్ల ఆశీస్సులను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల ప్రచారాన్ని అల్లా దయతో దిగ్విజయంగా పూర్తి చేస్తానని, ఈ రోజే నుంచి తన ప్రచారం ప్రారంభించినట్టు తెలిపారు. టీడీపీ-జనసేన నేతలు, కార్యకర్తలతో ముందుకు వెళ్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ మాట్లాడుతూ చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు సుజనా చౌదరి రాష్ట్రాభివృద్ధికి కృషిచేశారని, అదే స్ఫూర్తితోనే పశ్చిమలో స్టేడియంను పూర్తి చేయడంతో పాటు, రూ.40కోట్లతో హజ్‌హౌస్‌ను పూర్తి చేస్తారన్నారు. ముస్లిం మైనార్టీల కు బీజేపీ వ్యతిరేకం అన్నదాన్ని తొలగించి ముస్లిం, మైనార్టీలు, క్రిస్టియన్లు 90శాతం కూటమికి అనుకూలం గా ఓటు మరల్చేలాగా కృషి చేస్తామన్నారు. సుజనా చౌదరితో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల టీడీపీ ఇన్‌చార్జి బుద్దా వెంకన్న, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎస్‌కే నాగూల్ మీరా, పశ్చిమ మైనార్టీ నేత ఎంఎస్.బేగ్, బొమ్మసాని సుబ్బారావు, మాజీ కార్పొరేట ర్లు ఖాదర్ ఖాన్, షేక్ కరీముల్లా, బీజేపీ నేతలు బబ్బూరి శ్రీరామ్, జనసేన నేతలు పాల్గొన్నారు. అనంతరం ఊర్మిళానగర్‌లోని బాలయేసు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేసి, ఫాదర్ల ఆశీర్వచనాలు స్వీకరించారు.



టీడీపీలో చేరిన వైసీపీ నేతలతో యార్లగడ్డ వెంకట్రావు

ఉద్యోగాలకు రాజీనామా చేసి యార్లగడ్డ సమక్షంలో..
టీడీపీలో చేరిన వలంటీర్లు

విజయవాడ రూరల్, ఏప్రిల్ 4: వైసీపీ ప్రభుత్వ ఆరాచకాలు నచ్చక అంబాపురం గ్రామానికి చెందిన ఆరుగురు వలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ మేరకు గన్నవరం నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ఆయన కార్యాలయంలో టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంబాపురం సర్పంచి గండికోట సీతయ్య, మాజీ ఎంపీపీ తోడేటి రూబేన్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వలంటీర్లు వచ్చే ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం చెబుతారన్నారు. జగన్ ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. అటు సంక్షేమం, ఇటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇచ్చే టీడీపీనే ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎవరెన్ని ఇబ్బందులకు గురి చేసినా గన్నవరంలో యార్లగడ్డ విజయానికి కృషి చేస్తామన్నారు.

50 మంది వైసీపీ నేతలు టీడీపీలో చేరిక

అంబాపురం సర్పంచి గండికోట సీతయ్య, మాజీ ఎంపీపీ తోడేటి రూబేను ఆధ్వర్యంలో వైసీపీ గ్రామ సచివాలయ కన్వీనర్ పేట్ల నాగరాజు, గొడ్డళ్ల డీవీ, నక్కబోయిన రాఘవులు, వడ్డేశ్వరపు మరియదాస్, కుందేటి దావిద్, దాసరి కోటేశ్వరరావు, దేవరపల్లి యోహానుతో పాటు 50మంది వైసీపీ నేతలకు యార్లగడ్డ వెంకట్రావు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సంపూర్ణ ఆరోగ్యంతోనే చదువుపై శ్రద్ధ
- విద్యార్థులకు కలెక్టర్ ఐరన్ మాత్రల పంపిణీ

కృష్ణలంక, ఏప్రిల్ 4: విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే విద్యపై శ్రద్ధ చూపగలుగుతారని రక్తహీనత నివారణకు అందించే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను పిల్లలకు క్రమం తప్పకుండా ఉపయోగించేలా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు కోరారు. పటమటలోని కోనేరు బసవ పున్నయ్య జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీకి కలెక్టర్ ఢిల్లీరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతుందన్నారు. విద్యార్థినులకు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు నిర్వహించి అనీమియా శాతాన్ని నమోదు చేసి రక్తహీనతను నివారించేందుకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను పంపిణీ చేస్తున్నామన్నారు. 947 కేంద్రాల్లో 5,23,188 పింక్ కలర్ చిన్న మాత్రలు, 9,24,973 బ్లూ కలర్ పెద్ద మాత్రలు పంపిణీ చేస్తున్నామన్నారు. మధ్యాహ్న భోజనానంతరం ఈ మాత్రలు తీసుకొనేలా ఉపాధ్యాయులు నిశితంగా పరిశీలించాలని ఆదేశాలిచ్చామన్నారు. ఇప్పటి వరకు పంపిణీ చేసిన మాత్రల ఫలితంగా విద్యార్థుల్లో రక్తహీనత శాతం క్రమంగా తగ్గుముఖం పట్టిందన్నారు. పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు ప్రకటించే నేపథ్యంలో మాత్రల వాడకం నిరంతరం జరగాలనే ఉద్దేశంతో ఆరు వారాలకు సరిపడ ఐరన్ అండ్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేసి క్రమం తప్పకుండా వినియోగించేలా చైతన్యవంతులను చేస్తున్నామన్నారు. మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచే పౌష్టికాహారాన్ని అందించి ఆరోగ్యవంతమైన శిశువుల జననానికి చర్యలు తీసుకోవడం, కిశోర బాలికలకు అవసరమైన సంపూర్ణ పౌష్టికాహారాన్ని అందించడం ద్వారా భవిష్యత్‌లో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మింపచేయాలన్నదే లక్ష్యమన్నారు. పంపిణీ చేసిన ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను క్రమం తప్పక వినియోగించి పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యార్థులు మరింత ఆరోగ్యవంతులై విద్య పట్ల శ్రద్ధ చూపేలా తల్లిదండ్రులు కృషి చేయాలని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు, వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని, ఆర్బీఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.మాధవి, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కేవీఎల్ఎన్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రేమ్‌సాగర్, డీపీఎంవో డాక్టర్ నవీన్, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ నిహారిక, డాక్టర్ ఉస్మాన్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు ఐరన్ మాత్రలను అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

రైల్వే కార్మికుల సంతోషమే ఎంప్లాయీస్ సంఘ్ సదుద్దేశం

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 4: రైల్వే కార్మికులు సుఖసంతోషాలతో విధులు నిర్వహించాలన్నదే సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సదుద్దేశమని సంఘ్ సహాయ జోనల్ ప్రధానకార్యదర్శి, సైకాలజిస్ట్, మానసిక శాస్త్రవేత్త సత్యవాణి అన్నారు. రైల్వే ఆడిటోరియంలో సంఘ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వెల్‌బీయింగ్‌లో ఆమె ప్రసంగించారు. రైల్వే కార్మికులు పని ఒత్తిడి, మానసిక ఒత్తిడి నుంచి బయటపడేందుకు గతేడాది న్యూఢిల్లీలో ఇంటర్నేషనల్ ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ సహకారంతో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే మెన్‌లు సంయుక్తంగా వెల్‌బీయింగ్ ప్రోగ్రాం ప్రారంభించారన్నారు. ఎన్ఎఫ్ఐఆర్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్రి రాఘవయ్య ప్రారంభించారన్నారు. పని ఒత్తిడి , మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు ఆమె కార్మికులకు సూచనలు చేశారు. ఇష్టమైన పుస్తకాలు చదవాలని, చిన్నపిల్లలతో కొద్దిసేపు గడపాలని, తోటివారితో నవ్వుతూ మాట్లాడాలని, ఇష్టమైన సంగీతం వినాలని, కుటుంబసభ్యులందరూ ఒకచోట చేరి మాట్లాడుకోవాలని సూచించారు. ధ్యానం చేయాలని విధి నిర్వహణలో పక్కవారికి సాయం చేయాలని సూచించారు. చేస్తున్న పనిని, కుటుంబాన్ని ప్రేమించాలన్నారు. సంఘ్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ యడ్ల నాగేంద్రబాబు, అధ్యక్ష, కార్యదర్శులు ఆమంచి వెంకటేశ్వరరావు, రాఘవేంద్ర, జోనల్ మహిళా కో-ఆర్డినేటర్లు రాధిక, సుప్రియ, శిరోమణి, సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్లు, డేగల శ్రీను, అల్లం రమేష్, డిప్యూటీ డివిజన్ సెక్రటరీ రాజబాబు, బ్రాంచి కార్యదర్శులు కర్నూలు సుకుమార్, మెడికల్ బ్రాంచి కార్యదర్శి శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ విభాగం చైర్మన్ రమణారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసరావు, వెల్‌బీయింగ్ కో-ఆర్డినేటర్, టికెట్ చెకింగ్ కార్యదర్శి బాలాజీ, రాయనపాడు వర్క్‌షాప్ కార్యదర్శి, వెల్‌బీయింగ్ జాతీయ కో-ఆర్డినేటర్ గద్ద సురేష్, స్టేషన్ బ్రాంచ్ కార్యదర్శి దాస్, చైర్మన్ రఘు పాల్గొన్నారు.



దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో జరిగిన వెల్‌బీయింగ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న సైకాలజిస్ట్ సత్యవాణి



టైల్స్ దుకాణంలో జీఎస్టీ అధికారులను నిలదీస్తున్న సీఎం రమేశ్, మాజీ ఎమ్మెల్యే రాజు

టైల్స్ దుకాణంపై ఎస్‌జీఎస్‌టీ దాడులు

- ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీయే చేయించారని ఆరోపణ
- టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల నిరసన
- అధికారులను నిలదీసిన సీఎం రమేశ్

చోడవరం, ఏప్రిల్ 4: అనకాపల్లి జిల్లా చోడవరంలోని గాంధీగ్రామంలో బుచ్చిబాబు అనే వ్యాపారికి చెందిన టైల్స్ దుకాణంపై స్టేట్ జీఎస్టీ అధికారులు గురువారం దాడులు చేశారు. తనపై కక్షతో వైసీపీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ దాడులకు ఉసిగొల్పారని ఆరోపిస్తూ వ్యాపారి బుచ్చిబాబు, ఆయన కుటుంబీకులు ఆందోళనకు దిగారు. దీంతో బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, చోడవరం టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు అక్కడికి చేరుకున్నారు. వైసీపీ నేతల ప్రోద్బలంతో దాడులకు పాల్పడడం ఏమిటని సీఎం రమేశ్ అధికారులను ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా.. నోటీసులు ఇవ్వకుండా, భయభ్రాంతులకు గురిచేయడం, రికార్డులు సీజ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. దీంతో ఎస్‌జీఎస్‌టీ అధికారులు అక్కడి నుంచి నిష్క్రమించారు. కాగా నలుగురు అధికారులతో కూడిన బృందం.. దుకాణంలోని సీసీ కెమెరాలు ఆపివేయించి, సిబ్బంది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఎం రమేశ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ధర్మశ్రీ మాట వినలేదన్న కోపంతో వ్యాపారిపై అధికారులను ఉసిగొల్పడం దారుణమన్నారు. తన మాట వినలేదన్న కక్షతోనే కరణం ధర్మశ్రీ దాడులు చేయించారని టైల్స్ దుకాణం యజమాని బుచ్చిబాబు ఆరోపించారు. తన దుకాణం నుంచి టైల్స్ తీసుకుని డబ్బులు ఇవ్వలేదు సరికదా... లక్షలాది రూపాయలు అడుగుతున్నారని ఆరోపించారు. బుచ్చిబాబు కుమార్తెలు కూడా ధర్మశ్రీపై అవినీతి ఆరోపణలు చేశారు.

జగన్‌ది రాక్షస క్రీడ: పిల్లి మాణిక్యాలరావు

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాజకీయ ప్రయోజనాల కోసం పింఛన్ల పంపిణీలో జాప్యం చేసి, ఆ నెపాన్ని టీడీపీపై నెట్టే కుట్ర చేయడం జగన్‌రెడ్డి దిగజారుడుతనానికి నిదర్శనమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావు మండిపడ్డారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులను మండుటెండలో సచివాలయానికి రప్పించి, రాక్షస క్రీడ ఆడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నాడని ధ్వజమెత్తారు. గురువారం ఆయన టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎండ దెబ్బకు చనిపోయిన వృద్ధురాలితో శవ రాజకీయం చేస్తున్న వైసీపీ నాయకుడు జోగి రమేశ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జగన్ నేర బృందం ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు.

మంగంపేట బెరైటీస్ ప్రాజెక్టు అధికారిపై చర్యలు

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మంగంపేట బెరైటీస్ ప్రాజెక్టుకు సంబంధించిన సర్వీస్ రిజిస్టర్ నిర్వహణలో భారీ అక్రమాలు జరుగుతున్నాయని సీఐటీయూ నేత చంద్రశేఖర్ ఆరోపించారు. ఈమేరకు గనుల శాఖ అధికారులకు ఆయన ఆధారాలతో ఫిర్యాదు చేశారు. బెరైటీస్ ప్రాజెక్టులోని మానవ వనరుల విభాగం (హెచ్‌ఆర్)లోని కీలక అధికారి నారాయణరెడ్డి కేంద్రంగానే అక్రమాలు జరుగుతున్నాయని, తక్షణమే ఆయన్ను తప్పించాలని చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సర్వీసు రిజిస్టర్ నిర్వహణ, మెడికల్ బిల్లుల చెల్లింపు, మహిళా ఉద్యోగినులకు వేధింపులు వంటి అంశాలపై విచారణ చేయించాలని కోరారు. మంగంపేట టెండర్లను లీక్ చేయడంలో అధికారి పాత్ర ఉందన్నారు. కొన్ని ఆధారాలను జత చేశారు. వాటిపై విచారణ చేసిన అధికారులు.. ప్రాథమికంగా అవన్నీ వాస్తవాలని గుర్తించారు. ఈ నేపథ్యంలో నారాయణరెడ్డిని బదిలీ చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. విచారణ జరిపి, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. త్వరలో దీనికి సంబంధించి ఉత్తర్వులు విడుదల చేయనున్నారని తెలిసింది.

వైసీపీ అరాచకాలను అడ్డుకోవాలి

- ఈసీకి బీజేపీ మైనార్టీ సెల్ ఫిర్యాదు

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో గెలిచేందుకు అడ్డదారులు తొక్కుతున్న వైసీపీపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ ఎన్నికల కమిషన్‌ను కోరారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ అధికారులను చెప్పుచేతల్లో పెట్టుకుని అక్రమాలకు తెరతీస్తున్నారని ఈసీకి చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. 'కాకినాడలో చీరలు, డమ్మీ ఈవీఎంలను పట్టుకుని మా పార్టీ శ్రేణులు పోలీసులకు అప్పగిస్తే కేసు నమోదు చేయడంలో తాత్సారం చేస్తున్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టడం లేదా భయభ్రాంతులకు గురి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న వైసీపీని కట్టడి చేయాలి. ఎన్నికలు సజావుగా జరిగే పరిస్థితి రాష్ట్రంలో కనిపించడంలేదు. నిబంధనల కన్నా స్వామి భక్తే ముఖ్యం అనుకునే అధికారులపై చర్యలు తీసుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి' అని బాజి విజ్ఞప్తి చేశారు.

అమేథిలో ప్రియాంక భర్త వాద్రా పోటీ?

న్యూఢిల్లీ/వయనాడ్, ఏప్రిల్ 4: కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా రాజకీయాల్లోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని అమేథి నుంచి బరిలోకి దిగే చాన్స్ ఉందని ఆయన సూచనప్రాయంగా వెల్లడించారు. ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. 'స్మృతీ ఇరానీని గెలిపించి తప్పు చేశామని అమేథి ప్రజలు కలత చెందుతున్నారు. మళ్లీ గాంధీ కుటుంబం నుంచే మరొకరు రావాలని కోరుకుంటున్నారు. అమేథి కోసం గాంధీ కుటుంబం ఎంత కష్టపడిందో అందరికీ తెలుసు. నేను ఎంపీగా పోటీ చేయాలనుకుంటే.. అమేథి నుంచే పోటీ చేస్తే బాగుంటుందని అక్కడి ప్రజలు భావిస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. సుదీర్ఘ కాలం అమేథి నుంచి ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గత ఎన్నికల్లో స్మృతి చేతిలో ఓడిన సంగతి తెలిసిందే.

రాహుల్ ఆస్తులు రూ.20 కోట్లు

కేరళలోని వయనాడ్ నుంచి లోక్‌సభకు పోటీ చేస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన ఆస్తులు విలువను రూ.20 కోట్లుగా పేర్కొన్నారు. నామినేషన్ దాఖలు సమయంలో ఇచ్చిన అఫిడవిట్‌లో వాటి వివరాలను రాహుల్ వెల్లడించారు. తన చరాస్తుల విలువ రూ.9.24 కోట్లుగా, స్థిర ఆస్తులు రూ.8 కోట్లుగా ఆయన పేర్కొన్నారు. తన చేతిలో ప్రస్తుతం రూ.55 వేల నగదు ఉన్నట్లు అఫిడవిట్‌లో వివరించారు.

మాపై ఎందుకీ వివక్ష?

- 5 టీఎంసీలు కోరితే సగమే ఇస్తారా?
- తెలంగాణ అక్రమంగా వాడేసినా.. ఎందుకు అడ్డుకోలేదు?
- కృష్ణా బోర్డుకు ఆంధ్ర లేఖ

అమరావతి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వేసవి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్న తరుణంలో తాగునీటి కోసం తమకు న్యాయంగా విడుదల చేయాల్సిన కృష్ణా జలాల విషయంలో వివక్ష ఎందుకు చూపుతున్నారని కృష్ణా నదీ యాజమాన్య సంస్థ (కేఆర్ఎంబీ)ని ఆంధ్రప్రదేశ్ ప్రశ్నించింది. తమకు రావలసిన 58.90 టీఎంసీలలో ఐదు టీఎంసీలను జూన్ దాకా తాగునీటి అవసరాల కోసం విడుదల చేయాలని అభ్యర్థించామని.. అందుకు అంగీకరించిన బోర్డు.. తాజాగా 2.543 టీఎంసీలు మాత్రమే ఇవ్వాలని నిర్ణయించడం ఏమిటని నిలదీసింది. రాష్ట్ర ఇంజనీర్-ఇన్-చీఫ్ సి.నారాయణరెడ్డి గురువారం కేఆర్ఎంబీకి లేఖ రాశారు. తెలంగాణకు 35 టీఎంసీలను కేటాయిస్తే.. దానిని మించి 8.66 టీఎంసీలు అధికంగా వినియోగించుకుందని ఆయన తెలిపారు. పరిమితిని మించి అక్రమంగా 43.66 టీఎంసీలను కల్వకుర్తి, ఎలిమినేటి మాధవరెడ్డి, నాగార్జున సాగర్ ఎడమ కాలువ నుంచి కృష్ణా జలాలను వాడేసుకుంటున్నా ఎందుకు నిలువరించలేదని ప్రశ్నించారు. ఏపీకి రావలసిన 58.90 టీఎంసీల్లో 42.65 టీఎంసీలను మాత్రమే వినియోగించుకుందని ఈఎన్‌సీ వివరించారు. మరో 5 టీఎంసీలను విడుదల చేయాలని కోరితే అంగీకరించి.. ఇప్పుడు అందులో సగమే ఇవ్వాలని నిర్ణయించడాన్ని ఆక్షేపించారు. తక్షణం ఐదు టీఎంసీలివ్వడంతో పాటు వాటి విడుదలకు సహకరించాల్సిందిగా సాగర్‌పై గస్తీ తిరుగుతున్న కేంద్ర బలగాలకు సూచించాలని బోర్డును కోరారు. ఇందుకోసం కేఆర్ఎంబీ సిబ్బందిని పంపాలని కోరారు.

'సర్దుబాటు'పై కాంగ్రెస్ తాత్సారం

- హస్తం తీరుపై ఎర్ర జెండా తీవ్ర అసహనం
- తమ పార్టీ అభ్యర్థులను ప్రకటించిన షర్మిల
- వామపక్ష స్థానాలపై పెదవి విప్పని పీసీసీ
- ఇలాగైతే కష్టమంటున్న కామ్రేడ్లు
- నిర్ణయించుకున్న స్థానాల్లో ప్రచారానికి శ్రీకారం

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీట్ల సర్దుబాటు వ్యవహారాన్ని తేల్చకుండా కాంగ్రెస్ పార్టీ తాత్సారం చేస్తుండటంపై కామ్రేడ్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని.. తమకు బలమున్న స్థానాల్లో పోటీ చేసేందుకు సీపీఐ, సీపీఎం పార్టీలు సిద్ధమైన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో చెరో 2 పార్లమెంటు, 15 చొప్పున అసెంబ్లీ స్థానాలను కోరుతూ ఈ ఉభయ కమ్యూనిస్టు పార్టీల రాష్ట్ర నేతలు గత నెలలోనే కాంగ్రెస్ పార్టీకి జాబితాలను అందజేశారు. ఈ సీట్ల సర్దుబాటుపై కాంగ్రెస్ పార్టీ నేతలతో ఇప్పటికే మూడు దఫాలు చర్చలు జరిపారు. రాష్ట్రంలో అరకు, కర్నూలు లోక్‌సభ స్థానాలతోపాటు కురుపాం, అరకు, రంపచోడవరం, గాజువాక, గన్నవరం, విజయవాడ సెంట్రల్, మంగళగిరి, నెల్లూరు, కర్నూలు, సంతనూతలపాడు అసెంబ్లీ స్థానాలను తమ పార్టీకి కేటాయించాలని సీపీఎం రాష్ట్ర శాఖ కోరుతోంది. సీపీఐ కూడా గుంటూరుతోపాటు రాయలసీమలో మరో లోక్‌సభ స్థానం, 12 అసెంబ్లీ స్థానాలను కేటాయించాలని కోరుతోంది. గత నెల 28న హైదరాబాద్ లోటస్‌పాండ్‌లో మూడు పార్టీల చర్చల అనంతరం ఏప్రిల్ 1న సీట్ల సర్దుబాటును ఫైనల్ చేసుకుంటామని వామపక్ష నేతలు చెప్పారు. అందుకు భిన్నంగా 2న రాష్ట్రంలో 17 లోక్‌సభ, 114 అసెంబ్లీ స్థానాలకు తమ అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ... పొత్తులో భాగంగా లెఫ్ట్ పార్టీలతో సీట్ల సర్దుబాటు వ్యవహారాన్ని మాత్రం తేల్చలేదు. గుంటూరు లోక్‌సభ స్థానాన్ని సీపీఐకి, అరకు లోక్‌సభ స్థానాన్ని సీపీఎంకు కేటాయించడానికి కాంగ్రెస్ అంగీకరించినట్లు తెలిసింది. అసెంబ్లీ స్థానాలపై త్వరలోనే మరో దఫా చర్చలు జరిపి ఏ పార్టీ, ఏఏ స్థానాల్లో పోటీ చేయాలనేది ఖరారు చేయనున్నట్లు చెబుతున్నారు. అయితే రాష్ట్రంలో అధికార వైసీపీతోపాటు ప్రతిపక్ష టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి కూడా ఇప్పటికే సీట్ల సర్దుబాటు, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలను పూర్తి చేసుకుని ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ నేపథ్యంలో తమ పార్టీలు కూడా ఎన్నికల ప్రక్రియలో ముందుకు వెళ్లకపోతే పార్టీల కేడర్‌ని నిస్తేజం ఆవహిస్తుందని భావిస్తున్న సీపీఐ, సీపీఎం రాష్ట్ర శాఖలు ఈ ఎన్నికల్లో కచ్చితంగా పోటీ చేయాలనుకుంటున్న స్థానాల్లో తమ అభ్యర్థులను ఖరారు చేసుకుని ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయాలని తమ శ్రేణులకు దిశానిర్దేశం చేశాయి. ఈ విషయంలో సీపీఎం ఒక అడుగు ముందే ఉందని చెప్పొచ్చు. అరకు లోక్‌సభ స్థానం నుంచి అప్పలనర్సను తమ అభ్యర్థిగా సీపీఎం ఖరారు చేసింది. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో సీపీఎం అభ్యర్థిగా సీహెచ్ బాబూరావు ఇప్పటికే ప్రచారాన్ని ముమ్మరం చేశారు. గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గంలోనూ సీపీఎం నాయకులు ఎన్నికల ప్రచారాన్ని ఇప్పటికే ప్రారంభించారు. నెల్లూరు, కర్నూలు తదితర జిల్లాల్లో తాము పోటీ చేయాలనుకుంటున్న స్థానాల్లో కూడా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాలని సీపీఎం శ్రేణులకు రాష్ట్ర నాయకత్వం దిశానిర్దేశం చేసింది. ఈ నేపథ్యంలో సీపీఐ రాష్ట్ర నాయకత్వం కూడా తాము పోటీ చేసే స్థానాల్లో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాలని నాయకులు, కార్యకర్తలకు ఆదేశాలు ఇవ్వడంతో విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో సీపీఐ అభ్యర్థి కోటేశ్వరరావు ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మిగిలిన జిల్లాల్లోనూ సీపీఐ ఎన్నికల ప్రచారం ఊపందుకుంటుందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

కొడుక్కి ఎగ్జామ్స్.. బెయిల్ ఇవ్వండి!

- ఈ సమయంలో తన వెంట ఉండాల్సిన అవసరం ఉంది
- మధ్యంతర బెయిల్ కోసం ఈడీ ప్రత్యేకకోర్టులో కవిత విజ్ఞప్తి
- మద్యం కేసులో ఆమెది ముఖ్య పాత్ర
- పలువురు సాక్షులపై ఒత్తిడి తెచ్చారు
- బెయిల్ ఇస్తే దర్యాప్తునకు ఆటంకం: ఈడీ
- తీర్పు రిజర్వు.. 8వ తేదీన వెల్లడి
- రెగ్యులర్ బెయిల్‌పై 20 నుంచి వాదనలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసే అంశంపై తీర్పును ఈడీ ప్రత్యేక కోర్టు రిజర్వ్ చేసింది. కవిత కుమారుడికి త్వరలో పరీక్షలు జరగనున్నాయని, ఈ సమయంలో ఒక తల్లిగా కుమారుడితో ఉండాల్సిన అవసరం ఆమెకు ఉందని కవిత తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదించారు. అయితే, రాజకీయ నేరస్థులకు ఇలాంటి భావోద్వేగపూరిత కారణాలు వర్తించబోవని ఈడీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ఈడీ ప్రత్యేక కోర్టు న్యాయాధికారి కావేరీ బవేజా తీర్పును రిజర్వు చేసి, ఏప్రిల్ 8న వెలువరిస్తామని తెలిపింది. కాగా కవితకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసే విషయంపై ఈ నెల 20 నుంచి వాదనలు వింటామని బవేజా పేర్కొన్నారు.



విచక్షణ మేరకు బెయిలివ్వొచ్చు

కవిత తరఫున వాదించిన అభిషేక్ మను సింఘ్వీ.. ప్రత్యేక కోర్టు తన విచక్షణ ప్రకారం బెయిల్ మంజూరు చేయవచ్చన్నారు. కవిత 16 ఏళ్ల కుమారుడి పరీక్షలు జరుగుతున్నాయని, ఇటువంటప్పుడు అతడికి నైతిక, భావోద్వేగపరమైన తల్లి మద్దతు అవసరమని చెప్పారు. ఇంట్లో తండ్రి, బంధువులు, ఇంకెవరు ఉన్నా తల్లితో సమానం కాదన్నారు. ఒక నెలరోజులు కవితకు బెయిల్ మంజూరు చేస్తే నష్టమేమీ లేదని, ఆమె ఎక్కడికీ వెళ్లరని, ఈడీ కూడా తన దర్యాప్తును కొనసాగించుకోవచ్చని తెలిపారు. కవితను ఇప్పట్లో ఈడీ ప్రశ్నించే అవకాశం కూడా లేదని.. కాబట్టి, ఆమెకు బెయిల్ ఇవ్వాలని అభ్యర్థించారు. ప్రధాని మోదీ కూడా విద్యార్థుల పరీక్షల సన్నద్ధత గురించి పరీక్షా పే చర్చ కార్యక్రమంలో అనేక విషయాలు చెప్పారని సింఘ్వీ గుర్తు చేశారు.

సాక్ష్యాలను ధ్వంసం చేశారు

ఢిల్లీ మద్యం కేసులో కవిత కీలకపాత్ర పోషించినందున, ఈ దశలో ఆమెకు బెయిల్ మంజూరు చేయడం సబబు కాదని ఈడీ తరఫున న్యాయవాది జోహెబ్ హుస్సేన్ వాదించారు. మనీ లాండరింగ్ వంటి అవినీతి కార్యకలాపాలకు పాల్పడిన రాజకీయ నేతలకు.. మహిళలు అన్న మినహాయింపుతో బెయిల్ ఇవ్వొద్దన్నారు. ఈ కేసులో ముడుపులు తరలించడంలో ప్రధాన పాత్ర పోషించిన కవిత.. మద్యం వ్యాపారంలో లబ్ధి కూడా పొందారని, సాక్ష్యాలను ధ్వంసం చేశారని తెలిపారు. నగదు మళ్లించినట్లు రుజువు చేసే బ్యాంకు ఖాతాలు, వాట్సాప్ డాక్యుమెంట్లు తమ వద్ద ఆధారాలుగా ఉన్నాయన్నారు. ఈడీకి తన మొబైల్ ఫోన్లను అందజేసే ముందు వాటిలోని సమాచారాన్ని కవిత తొలగించారని, ఇతర నిందితులు కూడా ఇదే పని చేశారని, మొత్తంగా వందకుపైగా మొబైళ్లలో సమాచారాన్ని తుడిచిపెట్టి, ధ్వంసం చేశారని తెలిపారు. దర్యాప్తులో కీలకమైన సమాచారాన్ని రాబట్టే దశలో ఉన్నామని, కవితకు మధ్యంతర బెయిల్ ఇవ్వటం వల్ల దర్యాప్తునకు ఆటంకం కలుగుతుందన్నారు. కవిత కుమారుడు పరీక్షల కారణంగా ఆందోళనకు గురవుతున్నారని అనడానికి ఎలాంటి సాక్ష్యాలు లేవని, ఒక్క మెడికల్ డాక్యుమెంట్ కూడా ఈ విషయంలో తమకు సమర్పించలేదని తెలిపారు. కవిత కుటుంబసభ్యులు, ఆమె ముగ్గురు సోదరీమణులు.. ఆమె కుమారుడికి అవసరమైన మానసిక మద్దతు ఇవ్వగలరన్నారు.



తాళ్లూరులో లారీని ఢీకొన్న కారు

రక్తమోడిన రహదారులు

- రెండు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి మృతి
- మృతుల్లో తండ్రీకొడుకు, బావబావమరిది.. ఏడుగురికి తీవ్రగాయాలు

పెందుర్తి/గండేపల్లి, ఏప్రిల్ 4: విశాఖ, కాకినాడ జిల్లాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మరణించగా, ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివాహానికి హాజరై వస్తూ తండ్రీకొడుకు, దైవ దర్శనానికి వెళ్లి వస్తూ బావబావమరిది మృతి చెందారు. తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన హనుమంతు ఆనందరావు, హనుమంతు చంద్రశేఖర్, చింతాడ ఇందు, అమ్మయ్యమ్మ, బొడ్డేపల్లి జ్యోతి, మెట్ట లక్ష్మి, వెంకటలక్ష్మి, నాగమణి, నీలవేణి బుధవారం ఉదయం మినీ వ్యాన్‌లో శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం గోగన్నపేట పంచాయతీ రంగానాథపేటలో జరిగిన బంధువుల వివాహానికి వెళ్లారు. బుధవారం రాత్రి వివాహ వేడుక ముగిసిన తరువాత తిరుగు ప్రయాణమయ్యారు. పెందుర్తి బైపాస్ రోడ్డులో సరిపల్లి సమీపంలో అక్కిరెడ్డిపాలెం వద్దకు వచ్చేసరికి వ్యాన్ అదుపుతప్పి రహదారి పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ క్రమంలో వ్యాన్ ముందుభాగం పూర్తిగా నుజ్జయింది. డ్రైవర్ పక్కన కూర్చున్న ఆనందరావు (45), అతని కుమారుడు చంద్రశేఖర్ (17) ఇందు (58) అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవర్ వినయ్‌తో పాటు మిగిలిన వారికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణమని సీఐ రామకృష్ణ తెలిపారు. కాకినాడ జిల్లాలో జరిగిన ప్రమాదంలో ఏలూరు జిల్లా హనుమాన్ జంక్షన్‌కు చెందిన తమ్మన సుబ్బారావు(42), తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా బాలానగర్‌కు చెందిన చేకూరి పల్లయ్యచౌదరి(53) దుర్మరణం పాలయ్యారు. వీరిద్దరూ బావబావమరుదులు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో బంధువుల వివాహానికి హాజరై అనంతరం అన్నవరం దర్శనానికి వెళ్లారు. దైవ దర్శనం చేసుకుని తిరిగి వస్తుండగా గండేపల్లి మండలం తాళ్లూరు దగ్గరకు వచ్చేసరికి వీరు ప్రయాణిస్తున్న కారు రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి అతివేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు సగానికి పైగా లారీ కింద చిక్కుకుపోగా ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. గండేపల్లి ఎస్ఐ రామకృష్ణ ఘటనాస్థలానికి చేరుకుని లారీ కింద చిక్కుకున్న కారును ఎక్స్‌కవేటర్ సాయంతో కారు బయటకు తీశారు.

'ఉక్కు'రిబిక్కిరి!

- అప్పుల ఊబిలో విశాఖ ఉక్కు
- మార్చి నెలాఖరుకు ముడి పదార్థాల బకాయి 4,380 కోట్లు
- విడి పరికరాలు, సరఫరాదారులకు రూ.1,435 కోట్లు
- ఫిబ్రవరి, మార్చి విద్యుత్ బిల్లుల పెండింగ్
- రూ.200 కోట్ల జీఎస్టీ ఎదురుచూపు
- వేతనాలు, పెన్షన్లు వంద కోట్లు..
- ఉద్యోగుల పీఎఫ్ కట్టని వైనం
- రూ.7,400 కోట్లు ఉంటే తప్ప ఊపిరి తీసుకోవడం కష్టం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)




గతమెంతో ఘనకీర్తి కాగా.. ఇప్పుడు విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు అప్పుల ఊబిలో కూరుకుపోతోంది. జిందాల్ సాయంతో ప్లాంటును లాభాల బాటలోకి తెస్తామని ప్రకటించిన సీఎండీ అతుల్ సింగ్.. ఉద్యోగులకు జీతాలివ్వలేక చేతులెత్తేస్తున్నారు. వారి ప్రావిడెంట్ ఫండ్ కూడా కట్టలేక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి. వీటన్నింటి కంటే ముఖ్యమైనది ముడి పదార్థాలు. సరిపడా ముడి పదార్థాలు లేకే బ్లాస్ట్ ఫర్నేస్-3ను గతంలో మూసేశారు. గత డిసెంబరు నెలాఖరున దానిని జిందాల్ సాయంతో వినియోగంలోకి తెచ్చినా ఉత్పత్తి మాత్రం పెరగలేదు. మార్చి నెలాఖరు వరకు ఐరన్‌ఓర్, కోల్, కోక్, డోలమైట్, లైమ్ వంటి ముడి పదార్థాలు సరఫరా చేసిన సంస్థలకు చెల్లించాల్సిన బకాయిలు అక్షరాలా రూ.4,380 కోట్లు. కొత్త ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి త్రైమాసికం ఏప్రిల్ నుంచి జూన్ నెలాఖరు వరకు ప్లాంటును నడపడానికి మరో రూ.3,380 కోట్ల విలువైన ముడి పదార్థాలు అవసరం. ఇక, విడి పరికరాలు, ఇతర కన్స్యూమబుల్ వస్తువులు సరఫరా చేసిన వారికి చెల్లించాల్సిన మొత్తం రూ.1,435 కోట్ల వరకూ ఉంది. మార్చి నెల జీతాలు, పెన్షన్లకు రూ.100 కోట్లు ఇవ్వాలి. ఫిబ్రవరి నెల జీఎస్టీ రూ.200 కోట్లు కట్టాల్సి ఉంది. ఇవన్నీ చూసుకుంటే మొత్తం రూ.7,400 కోట్లు ఉంటే తప్ప ప్లాంటును సక్రమంగా నడపడం కష్టం.

జిందాల్ పేరిట మోసం

బ్లాస్ట్ ఫర్నేస్-3ను నడపడానికి జిందాల్ నుంచి సాయం తీసుకుంటే కష్టాలన్నీ తీరిపోతాయని యాజమాన్యం ముఖ్యంగా సీఎండీ ప్రకటించారు. ప్లాంటును లాభాల బాటలోకి తెస్తామని గర్వంగా చెప్పారు. తాజాగా ముగిసిన మార్చి నెలలో రూ.2,500 కోట్ల విలువైన ఉత్పత్తులు విక్రయించారు. ఆ డబ్బులు ఏమి చేశారో తెలియదు. ఉద్యోగులకు ఇప్పటివరకూ జీతాలు ఇవ్వలేకపోయారు. కోల్‌ను కొనకుండా జిందాల్ నుంచి నాసిరకం కోక్ తీసుకొని, దానికి ఎక్కువ రేటు బిల్లింగ్ చేస్తున్నారని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఐరన్‌ఓర్ ఖరీదు టన్ను రూ.4,500 ఉండగా దానికి బదులుగా టన్ను రూ.12 వేలు విలువ కలిగిన పెల్లెట్లు వాడుతున్నారు. ఈ రెండింటిలో ఏది వాడినా తయారైన స్టీల్‌ను మార్కెట్‌లో టన్ను రూ.50 వేలకు అమ్మాల్సి ఉంది. అటువంటప్పుడు పెల్లెట్లకు ఎందుకు ఎక్కువ నిధులు వెచ్చిస్తున్నారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రైవేటీకరణలో భాగంగా ప్లాంటును కావాలని నష్టాలబాటలోకి తీసుకువెళుతున్నారనే వాదనకు ఇవన్నీ బలం చేకూరుస్తున్నాయి. 2021-22 ఆర్థిక సంవత్సరంలో లాభాలు తెచ్చిన ప్లాంటును 2022-23లో రూ.3వేల కోట్ల నష్టాల్లో చేర్చారు. తాజాగా ముగిసిన ఆర్థిక సంవత్సరంలో మరో రూ.4,500 కోట్ల వరకు నష్టాలు వచ్చాయని సీఐటీయూ నాయకుడు అయోధ్యారామ్ చెబుతున్నారు. ఇలా అన్ని వైపుల నుంచి నష్టాలు పెరిగేలా చేసి ప్లాంటును జిందాల్‌కు అప్పగించాలని కుట్ర చేస్తున్నారని, దీనిని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ అడ్డుకుంటుందని వెల్లడించారు.

ప్రపంచ క్యాన్సర్ రాజధాని భారత్!

- దేశంలో పెరిగిపోతున్న కేసులు.. చిన్న వయసు వారిలోనూ అధికం
- ఆరోగ్యాన్ని హరిస్తున్న మధుమేహం, గుండెజబ్బులు, మానసిక సమస్యలు, స్థూలకాయం
- ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు, నివారణ చర్యలతోనే రక్షణ
- వెల్లడించిన అపోలో 'హెల్త్ ఆఫ్ ది నేషన్' నివేదిక



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్, మధుమేహం, హైపర్ టెన్షన్, హృద్రోగం, మానసిక సమస్యల వంటి అసాంక్రమిక వ్యాధులు దేశంలో ఆందోళనకర స్థాయిలో పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా క్యాన్సర్ కేసుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. ప్రపంచానికి క్యాన్సర్ రాజధానిగా భారత్ తయారైందా అన్న స్థాయిలో పరిస్థితి ఉంది. 'హెల్త్ ఆఫ్ ది నేషన్' (భారత దేశ ఆరోగ్యం) పేరుతో అపోలో హాస్పిటల్స్ గురువారం విడుదల చేసిన నాలుగో వార్షిక నివేదికలో ఈ వివరాలున్నాయి. పలు అసాంక్రమిక వ్యాధులు చిన్న వయసు వారిలో తలెత్తటం ఇటీవలి కాలంలో పెరిగిపోయిందని, దీనిని నివారించటానికి తక్షణం చర్యలు చేపట్టాలని సూచించింది. క్యాన్సర్ విషయంలో కూడా ఇది కనిపిస్తోందని, ఇతర దేశాలతో పోల్చితే భారత్‌లో క్యాన్సర్ బారిన పడుతున్న వారి సగటు వయసు తక్కువగా ఉంటోందని తెలిపింది. రొమ్ము, గర్భాశయం, ఊపిరితిత్తులు, నోటి క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని, అయినప్పటికీ, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవటం భారత్‌లో చాలా తక్కువగా ఉందని ఈ నివేదిక పేర్కొంది. స్థూలకాయం కూడా భారతీయుల్లో పెరిగిపోతోందని, ఇది పలు అసాంక్రమిక వ్యాధులకు కారణమవుతోందని తెలిపింది. మధుమేహం, హైపర్ టెన్షన్‌ల ముప్పును పలువురు భారతీయులు ఎదుర్కొంటున్నారని, యువతలో మానసిక సమస్యలు ముఖ్యంగా కుంగుబాటు (డిప్రెషన్) అధికంగా కనిపిస్తోందని వెల్లడించింది. దీనిపై అపోలో హాస్పిటల్స్ వైస్ చెయిర్‌పర్సన్ డాక్టర్ ప్రీతా రెడ్డి స్పందిస్తూ.. అసాంక్రమిక వ్యాధులను ఎదుర్కోవటానికి తక్షణం సమష్టి కార్యాచరణ అవసరమన్నారు. ఆ సంస్థ ప్రెసిడెంట్, సీఈఓ డాక్టర్ మధు శశిధర్.. వైద్య చికిత్సలకు సంబంధించి మరిన్ని ఆవిష్కరణలు జరగాల్సిన అవసరం ఉందని, వాటిని ప్రజల వద్దకు విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ మేరకు అపోలో 'ప్రో హెల్త్ స్కోర్' పేరుతో దేశంలోనే తొలి డిజిటల్ ఆరోగ్య మదింపు టూల్‌ను విడుదల చేసింది. దీనిద్వారా ఎవరికి వారు తమ ఆరోగ్యంపై ఒక అంచనాకు వచ్చి, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టటానికి అవకాశం లభిస్తుందని అపోలో హాస్పిటల్స్ ఓ ప్రకటనలో వెల్లడించింది. అనారోగ్య ముప్పు దరి చేరకుండా ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు జరిపించుకోవాలని దేశ ప్రజానీకానికి 'హెల్త్ ఆఫ్ ది నేషన్' నివేదిక సూచించింది.

రాక్షస చట్టాల రద్దుకు సీపీఎం పోరాటం

- ఎన్నికల మేనిఫెస్టో విడుదల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: దేశంలో అమలవుతున్న రాక్షస చట్టాలను రద్దు చేసేందుకు పోరాటాలు చేస్తామని సీపీఎం ప్రకటించింది. అమానుషమైన చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా), మనీలాండరింగ్ నిరోధక చట్టం(పీఎల్ఎంఏ), పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)లను రద్దు చేయిస్తామని తెలిపింది. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఆ పార్టీ గురువారం విడుదల చేసిన మేనిఫెస్టోలో ఈ విషయాన్ని పేర్కొంది. బీజేపీని ఓడించి లౌకిక, ప్రజాస్వామ్య శక్తులను గెలిపించాలని కోరింది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ దేశ ప్రజాస్వామ్య, గణతంత్ర, లౌకిక స్వరూపాన్ని కాపాడాలంటే మోదీని, బీజేపీని గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఇది ప్రతి ఒక్క దేశ భక్తుని విధి అని అన్నారు. రాష్ట్రాల రాజ్యాంగ హక్కులు కాపాడుతామని, పంటలకు కనీస మద్దతు ధర కల్పించేందుకు ప్రయత్నిస్తామని, కులాల వారీ జనాభా లెక్కల సేకరణకు మద్దతు ఇస్తామని, జమ్మూ-కశ్మీర్‌లో తక్షణమే ఎన్నికలు జరిగేలా కృషి చేస్తామని వివరించారు. విద్వేష ప్రసంగాలను అరికట్టేందుకు చట్టం తీసుకువచ్చేలా ఉద్యమిస్తామని తెలిపారు. ఉద్యోగాలు కల్పించే చిన్న మధ్యతరహా పరిశ్రమల బలోపేతానికి కృషి చేస్తామని, ఉన్నత విద్యారంగం ప్రయివేటీకరణను అడ్డుకుంటామని చెప్పారు. ముఖ్యమంత్రి సూచించిన ముగ్గురు సభ్యుల ప్యానెల్ నుంచి గవర్నర్‌ను ఎంపిక చేసేలా నిబంధన పొందుపరిచేందుకు పోరాడుతామని తెలిపారు.

కాంగ్రెస్‌లో ఐదు 'పవర్ సెంటర్లు'!

- సోనియా, రాహుల్, ప్రియాంక, ఖర్గే, వేణుగోపాల్
- ఎవరి వర్గం వారిది.. ఎవరి రాజకీయ వారిది..
- కాంగ్రెస్ అధిష్ఠానానికి తీవ్ర అహంకారం
- బహిష్కృత నేత సంజయ్ ఆరోపణలు
- రాజీనామా చేసిన తర్వాత బహిష్కరణా?
- అసలే కష్టాల్లో ఉన్నారు.. ఏ4 కాగితం వృథా చేశారని ఎద్దేవా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి తీవ్ర అహంకారమని ఆ పార్టీ బహిష్కృత నేత సంజయ్ నిరుపమ్ అన్నారు. కాంగ్రెస్‌లో ఐదు అధికార కేంద్రాలు ఉంటాయని.. ఎవరి వర్గం వారికి ఉంటుందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌లో గతంలో ఒకే ఒక్క అధికార కేంద్రం ఉండేదని.. ఇప్పుడు మాత్రం ఐదు ఉన్నాయని చెప్పారు. ఇందులో మొదటిది సోనియా, రెండోది రాహుల్, మూడు ప్రియాంక, నాలుగు మల్లికార్జున ఖర్గే, ఐదు కేసీ వేణుగోపాల్ అని.. ఈ ఐదుగురూ ఎవరికి వారు తమదైన పంథాలో రాజకీయం చేస్తారని ఆరోపించారు. వీరి మధ్య లక్షలాది మంది కార్యకర్తలు నలిగిపోతున్నారన్నారు. క్షేత్రస్థాయితో సంబంధం లేని నాయకులంతా రాహుల్ చుట్టూ చేరారని సంజయ్ పేర్కొన్నారు. "కాంగ్రెస్ ప్రస్తుతం పూర్తిగా చెల్లాచెదురైపోయిన పార్టీ. కాంగ్రెస్ నేతలు గతంలో పార్టీ సిద్ధాంతాలు దశాదిశా లేకుండా ఉన్నాయని ఆరోపించేవారు. ఇప్పుడు మాత్రం పార్టీ అనుసరిస్తున్న విధానాల వల్లే వారంతా చెల్లాచెదురైపోతున్నారు" అని వ్యాఖ్యానించారు. తనను పార్టీ నుంచి బహిష్కరించడంపై స్పందిస్తూ.. మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేనతో కలిసి కాంగ్రెస్ కూటమి కట్టిన తీరు తనకు ఆగ్రహం తెప్పించిందని సంజయ్ చెప్పారు. సేనకు ఎక్కువ సీట్లు అప్పగించేయడం సరికాదన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ బలహీనమవుతుందని, ముంబైలో నెమ్మదిగా భూస్థాపితం అయిపోతుందని చెప్పారు. సేనకు ఎక్కువ సీట్లు ఇవ్వడం సరికాదని చెప్పడాన్ని 'పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు'గా అభివర్ణించి, తనను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారని తెలిపారు. బుధవారమే తన రాజీనామా లేఖను ఖర్గేకు పంపానని సంజయ్ వెల్లడించారు. ఆ లేఖ అందిన తర్వాత కూడా స్పందించకపోతే బాగుండదనే.. తనను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటన విడుదల చేశారని తెలిపారు. మొత్తం మీద వారు ఒక ఏ4 సైజు కాగితాన్ని వృథా చేశారని ఎద్దేవా చేశారు. పార్టీ ఆర్థికంగా చాలా ఇబ్బందుల్లో ఉందని, ఈ పరిస్థితుల్లో స్టేషనరీని, శక్తిని వృథా చేసుకోవద్దని సూచించారు. భవిష్యత్తు కార్యాచరణపై విలేకరులు ప్రశ్నించగా.. "ఏ పార్టీలో చేరతాననేది త్వరలోనే చెబుతా. ఇప్పుడంత తొందరేం లేదు. ఇక దేశంలో ప్రధాని మోదీకి ఇప్పటికీ అత్యధిక ప్రజాదరణ ఉంది. రోజురోజుకూ ఇది పెరుగుతోంది" అని సంజయ్ చెప్పారు.

ఆంధ్రజ్యోతి దిక్సూచి

విజయవాడ ● శుక్రవారం 5 ఏప్రిల్ 2024

diksuchi@andhrajyothy.com



ఎస్ఆర్ఎం వర్సిటీలో ఎంటెక్


ఎస్ఆర్ఎం యూనివర్సిటీ(ఏపీ) ఎంటెక్‌లో చేరేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఎంటెక్‌లో అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ట్యూషన్ ఫీజు నుంచి మినహాయింపు ఇచ్చింది. నెలకు రూ.ఆరు వేలు స్టయిపెండ్‌గా లభిస్తుంది. స్టూడెంట్ రీసెర్చ్ ఇంటర్న్‌షిప్, కోర్సు ప్రాజెక్టులతో కలిపి ఇంటిగ్రేటెడ్ కరికులమ్, సీనియర్ థీసిస్ ప్రాజెక్టుకు అవకాశం ఈ కోర్సులో చేరిన అభ్యర్థులకు ఉంటాయి.

స్పెషలైజేషన్లు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఏఐ అండ్ ఎంఎల్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ) - సీఎస్ఈ/ఐటీ/ఎస్‌డబ్ల్యూఈలో బీఈ/బీటెక్ లేదా ఎమ్మెస్సీ(సీఎస్ఈ/ఐటీ)లేదా ఎంసీఏ ఉత్తీర్ణత.

- ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఎంబెడెడ్ సిస్టమ్స్ అండ్ ఐఓటీ, వీఎల్ఎస్ఐ) - ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో అంటే ఈసీఈ, ఈఈఈ, ఈఐఈలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- మెకానికల్ ఇంజనీరింగ్(థెర్మల్, మెటీరియల్స్ అండ్ మాన్యుఫాక్చరింగ్) - మెకానికల్, మాన్యుఫాక్చరింగ్, మెటలర్జీ, ప్రొడక్షన్ ఇంజనీరింగ్‌లో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణత

వెబ్‌సైట్: admissions.srmap.edu.in/lp/mtech/

ఇంద్రప్రస్థ ఇన్‌స్టిట్యూట్‌లో పీహెచ్‌డీ



ఢిల్లీలోని ఇంద్రప్రస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐఐఐటీడీ)- పీహెచ్‌డీ 2024(మాన్‌సూన్ సెషన్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రెగ్యులర్, స్పాన్సర్డ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. స్పాన్సర్డ్ ప్రోగ్రామ్‌ను వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రత్యేకించారు. వీరు స్పాన్సరింగ్ సర్టిఫికెట్‌ను సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అకడమిక్ మెరిట్, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ (ఎస్ఓపీ) ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌కు మాత్రం పీజీక్యాట్ ఎగ్జామ్ ఉంటుంది.

పరిశోధన విభాగాలు: కంప్యూటేషనల్ బయాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, సోషల్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్(ఫిలాసఫీ, కమ్యూనికేషన్, గవర్నెన్స్, పాలిటిక్స్), హ్యూమన్ సెంటర్డ్ డిజైన్.

అర్హత: అభ్యర్థులు ఎంచుకొన్న విభాగాన్ని అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లతో ఎంఈ/ఎంటెక్/ఎంఫార్మసీ/ఎండిజైన్/ఎంఎస్/ఎమ్మెస్సీ/ఎంసీఏ/ఎంబీబీఎస్/ఎంస్టాట్/ఎంఫిల్/ఎంఏ/ఎంఎస్‌డబ్ల్యూ/ఎంకాం ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 70 శాతం మార్కులతో బీఈ/బీటెక్/బీఫార్మసీ/బీడిజైన్ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సీఎస్ఐఆర్/యూజీసీ/డీఎస్‌టీ/ఇన్‌స్పయిర్/ఐసీఎంఆర్/డీబీటీ/ఎన్‌బీహెచ్‌ఎం ఫెలోషిప్ అర్హత తప్పనిసరి. నిర్దేశించిన విభాగాలకు గేట్/జీప్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

ఫెలోషిప్: రెగ్యులర్ ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులందరికీ సంస్థ ఫెలోషిప్‌లు అందిస్తుంది. కాంప్రహెన్సివ్ ఎగ్జామ్ పూర్తయ్యేవరకు నెలకు రూ.37,000; తరవాత పీహెచ్‌డీ పూర్తయ్యే వరకు నెలకు రూ.42,000 ఇస్తారు. ప్రతినెలా హెచ్ఆర్ఏ చెల్లిస్తారు. ల్యాప్‌టాప్/డెస్క్‌టాప్ కొనుగోలు నిమిత్తం రూ.50,000; కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.20,000 చెల్లిస్తారు. రీసెర్చ్ వర్క్ నిమిత్తం ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లకు హాజరయ్యేందుకుగాను ప్రోగ్రామ్ మొత్తమ్మీద రూ.రెండున్నర లక్షలు ఇస్తారు. మూడు నుంచి ఆర్నెల్లపాటు విదేశాల్లో పరిశోధనలు చేసేందుకు 12000 యూఎస్ డాలర్లు చెల్లిస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.300; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 14
- **అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 22
- **ఈసీఈ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు:** ఏప్రిల్ 25, 26; మే 10
- **సీఎస్ఈ అభ్యర్థులకు పీజీ క్యాట్ ఎగ్జామ్:** ఏప్రిల్ 28
- **సీఎస్ఈ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు:** మే 2, 3
- **మిగిలిన స్పెషలైజేషన్‌లకు రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** మే 1 నుంచి 13 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** మే 25
- **వెబ్‌సైట్:** www.iiitd.ac.in

సీఐఎఫ్ఎన్ఈటీలో ట్రేడ్ కోర్సులు

కేంద్ర ఫిషరీస్ విభాగం ఆధ్వర్యంలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ నాటికల్ అండ్ ఇంజనీరింగ్ ట్రెయినింగ్(సీఐఎఫ్ఎన్ఈటీ)- వెసల్ నావిగేటర్ కోర్సు(వీఎన్‌సీ), మెరైన్ ఫిట్టర్ కోర్సు(ఎంఎఫ్‌సీ)లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇవి ట్రేడ్ కోర్సులు. ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. వీటిలో ఫిషింగ్ వెసల్స్‌పై ప్రాక్టికల్ ట్రెయినింగ్ ఉంటుంది. ఎన్‌సీవీటీ క్రాఫ్ట్స్‌మెన్ ట్రెయినింగ్ స్కీం కింద న్యూఢిల్లీలోని డీజీఈటీ, ఈ కోర్సులను నిర్వహిస్తోంది. ఇవి కొచ్చి, చెన్నై, విశాఖపట్నం క్యాంపస్‌లలో అందుబాటులో ఉన్నాయి. ఒక్కో క్యాంపస్‌లో వీఎన్‌సీ 20, ఎంఎఫ్‌సీ 20 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ స్కోర్, కౌన్సెలింగ్‌ల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.1500ల స్టయిపెండ్ ఇస్తారు. పోస్ట్ ఇన్‌స్టిట్యూషనల్ ట్రెయినింగ్ సమయంలో నెలకు రూ.20,500ల స్టయిపెండ్ ఇస్తారు. యూనిఫాం అలవెన్స్ కింద రూ.2500 చెల్లిస్తారు.



అర్హత: మేథమెటిక్స్, సైన్స్ ప్రధాన సబ్జెక్టులుగా పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 40 శాతం మార్కులు తప్పనిసరి. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 1 నాటికి 15 నుంచి 20 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు నిబంధనల ప్రకారం వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది.

ముఖ్య సమాచారం

- వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని నింపి నిర్దేశిత పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి.
- **జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి, ఇంటర్/పన్నెండో తరగతి మార్కుల పత్రాలు; కుల ధ్రువీకరణ పత్రాలు, ఫీజుకు సంబంధించిన ఈ రిసిప్ట్
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.350; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.175
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 14
- **టెస్ట్ సెంటర్లు:** కొచ్చి, చెన్నై, విశాఖపట్నం, కోల్‌కతా
- **కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూన్ 29
- **ఫలితాలు విడుదల:** జూలై 7
- **కౌన్సెలింగ్:** జూలై 18
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్, సీఐఎఫ్ఎన్ఈటీ, ఫైన్ ఆర్ట్స్ అవెన్యూ, ఫోర్‌షోర్ రోడ్, కొచ్చి-682016
- **వెబ్‌సైట్:** www.cifnet.gov.in

జోధ్‌పూర్ ఎయిమ్స్‌లో ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్

జోధ్‌పూర్‌లోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్- 'పబ్లిక్ హెల్త్ పాలసీ, లీడర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ 2024(జూలై సెషన్)ని నిర్వహిస్తోంది. హెల్త్, సోషల్ సర్వీసెస్, ఎడ్యుకేషన్, క్లినికల్ రీసెర్చ్, మెడిసిన్, ఫార్మాస్యూటికల్ విభాగాలకు సంబంధించిన కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలతోపాటు ప్రైవేటు ఆర్గనైజేషన్లలో కనీసం అయిదేళ్ల అనుభవం ఉన్న వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ఈ ప్రోగ్రామ్‌ని ఉద్దేశించారు. ఇందులో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. మెడికల్ కేటగిరీకి 8, నాన్ మెడికల్ కేటగిరీకి 7, విదేశీ అభ్యర్థుల కేటగిరీకి 5 సీట్లు కేటాయించారు. కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ఇందులో భాగంగా రెండు కాంటాక్ట్ సెషన్స్(సెషన్‌కు మూడు రోజులు); 23 వారాలపాటు వెబ్ బేస్డ్ లెర్నింగ్, ప్రాజెక్టు వర్క్ ఉంటాయి. ప్రోగ్రామ్ మొత్తమ్మీద అభ్యర్థులు ఆన్‌లైన్ మోడ్‌లో 7 క్రెడిట్స్, కాంటాక్ట్ సెషన్స్‌లో 2 క్రెడిట్స్, ప్రాజెక్టు వర్క్‌లో 1 క్రెడిట్ సాధించాల్సి ఉంటుంది. కనీసం 30 గంటల బోధనకు 1 క్రెడిట్ ఇస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్‌లో ఆరు మాడ్యూల్స్ ఉంటాయి. ప్రతి మాడ్యూల్ చివర ఫార్మేటివ్, సమ్మేటివ్ అసెస్‌మెంట్లు పూర్తిచేయాల్సి ఉంటుంది. ఇంట్రడక్షన్ టూ హెల్త్ పాలసీ, హెల్త్ పాలసీ ఫ్రేమ్ వర్క్, స్టాక్ హోల్డర్ అనాలిసిస్ అండ్ పాలసీ ఇంప్లిమెంటేషన్, హెల్త్ ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్‌లకు ఒక్కోదానికి 1.5 క్రెడిట్లు; అసెస్‌మెంట్ అండ్ స్ట్రాటజిక్ ప్లానింగ్‌కు 1 క్రెడిట్; లీడర్‌షిప్ ఇన్ హెల్త్ పాలసీ అండ్ మేనేజ్‌మెంట్‌కు 2 క్రెడిట్లు, అకడమిక్ ప్రాజెక్టుకు 1 క్రెడిట్ కేటాయించారు.

అర్హత: మెడికల్ కేటగిరీకి ఎంబీబీఎస్/బీడీఎస్/ఆయుష్ డిగ్రీలు పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. నాన్ మెడికల్ కేటగిరీకి కనీసం 55 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ(నర్సింగ్/వెటర్నరీ సైన్స్/ఫిజియోథెరపీ/ఆక్యుపేషనల్ థెరపీ/ఇంజనీరింగ్) లేదా ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. పనిచేస్తున్న సంస్థ నుంచి అనుమతి పత్రం, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్‌లను దరఖాస్తుకు జత చేయాలి.

ఎంపిక: అకడమిక్ ప్రతిభ, అనుభవం, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్(ఎస్ఓపీ) ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు పర్సనల్/వెబ్ బేస్డ్ ఇంటర్వ్యూ నిర్వహించి అర్హులకు ప్రవేశాలు కల్పిస్తారు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రూ.25,000; ప్రైవేట్ ఉద్యోగులకు రూ.1,00,000; విదేశీ అభ్యర్థులకు 1500 యూఎస్ డాలర్లు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 30
- **కోర్సు ప్రారంభం:** జూలై 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.aiimsjodhpur.edu.in

ఢిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ - వివిధ ఖాళీలు

ఢిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ సెలెక్షన్ బోర్డ్... వివిధ శాఖలు/విభాగాలు/స్థానిక సంస్థల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు 414

పోస్టుల వివరాలు

1. డ్రైవర్(డ్రగ్స్ కంట్రోల్): **1 పోస్టు**
2. స్టాఫ్ కార్ డ్రైవర్(లా, జస్టిస్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్): **1 పోస్టు**
3. స్టాఫ్ కార్ డ్రైవర్(లోకాయుక్త): **1 పోస్టు**
4. స్టాఫ్ కార్ డ్రైవర్(డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్): **3 పోస్టులు**
5. స్టాఫ్ కార్ డ్రైవర్(జనరల్ అడ్మినిస్ట్రేషన్): **12 పోస్టులు**
6. డ్రైవర్(ఎల్ఎంవీ): **1 పోస్టు**
7. స్టాఫ్ కార్ డ్రైవర్(ఢిల్లీ జైల్స్): **11 పోస్టులు**
8. ల్యాబ్ టెక్నీషియన్(గ్రూప్-3)(కార్డియాలజీ తదితరాలు): **38 పోస్టులు**
9. ల్యాబ్ టెక్నీషియన్(గ్రూప్-4)(బయోకెమిస్ట్రీ తదితరాలు): **6 పోస్టులు**
10. ల్యాబ్ టెక్నీషియన్: **10 పోస్టులు**
11. ల్యాబోరేటరీ టెక్నీషియన్: **1 పోస్టు**
12. ఫార్మసిస్ట్(డిస్పెన్సర్): **110 పోస్టులు**
13. ఫార్మసిస్ట్(అల్లోపతి): **18 పోస్టులు**
14. ఆక్సిలరీ నర్స్/మిడ్ వైఫ్(మున్సిపల్ కార్పొరేషన్): **144 పోస్టులు**
15. ఆక్సిలరీ నర్స్/మిడ్ వైఫ్(మున్సిపల్ కౌన్సిల్): **8 పోస్టులు**
16. డ్రాఫ్ట్స్‌మన్ గ్రేడ్-3(సివిల్): **10 పోస్టులు**
17. స్టోర్ కీపర్: **1 పోస్టు**
18. స్టోర్ సూపర్‌వైజర్: **1 పోస్టు**
19. ఫార్మసిస్ట్(అగ్రి మార్కెటింగ్): **2 పోస్టులు**
20. జూనియర్ ఫార్మసిస్ట్: **3 పోస్టులు**
21. అసిస్టెంట్ శానిటరీ ఇన్‌స్పెక్టర్: **32 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి 10వ తరగతి, 10+2, సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు, ఎక్స్-సర్వీస్‌మన్, మహిళా అభ్యర్థులకు మినహాయింపు ఉంది.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఏప్రిల్ 19

వెబ్‌సైట్: https://dsssb.delhi.gov.in/notifications



గోవా షిప్‌యార్డులో మేనేజర్లు

గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్...కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు 20

1. డిప్యూటీ మేనేజర్ (మెకానికల్): **8 పోస్టులు**
2. డిప్యూటీ మేనేజర్(ఎలక్ట్రికల్): **1 పోస్టు**
3. అసిస్టెంట్ మేనేజర్(మెకానికల్): **6 పోస్టులు**
4. అసిస్టెంట్ మేనేజర్(ఎలక్ట్రికల్): **4 పోస్టులు**
5. అసిస్టెంట్ మేనేజర్(సీఎస్ఆర్): **1 పోస్టు**

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, డిప్లొమా, పీజీ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.

వయోపరిమితి: డిప్యూటీ మేనేజర్ పోస్టులకు 33 సంవత్సరాలు, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు.

పే స్కేల్: డిప్యూటీ మేనేజర్ పోస్టులకు రూ.50,000 నుంచి రూ.1,60,000. అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు రూ.40,000 నుంచి రూ.1,40,000.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఏప్రిల్ 6

వెబ్‌సైట్: https://goashipyard.in/notice-board/careers/

ఎన్‌హెచ్‌పీసీలో అప్రెంటిస్‌లు

సురంగని, చంబా(హిమాచల్‌ప్రదేశ్)లోని నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్...కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు 50

పోస్టు: ట్రేడ్ అప్రెంటిస్

ట్రేడులు: ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్(మోటార్ వెహికిల్), టర్నర్, మెషినిస్ట్, వెల్డర్(గ్యాస్, ఎలక్ట్రిక్), సీఓపీఏ

అర్హత: సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణత

వయోపరిమితి: 18-30 ఏళ్ల మధ్య ఉండాలి.

శిక్షణ వ్యవధి: ఏడాది

ఎంపిక ప్రక్రియ: విద్యార్హత మార్కులు, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా

దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 10

వెబ్‌సైట్: https://www.nhpcindia.com/welcome/job

జాబ్ కార్నర్



రైల్ కోచ్ ఫ్యాక్టరీలో అప్రెంటిస్‌లు

కపుర్తలా(పంజాబ్)లోని రైల్ కోచ్ ఫ్యాక్టరీ(ఆర్‌సీఎఫ్)...కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు 550

ట్రేడులు: ఫిట్టర్, వెల్డర్, మెషినిస్ట్, పెయింటర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ అండ్ రిఫ్రిజిరేటర్ మెకానిక్.

అర్హత: మెట్రిక్యులేషన్, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 మార్చి 31 నాటికి 15 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి

ఎంపిక ప్రక్రియ: అకడమిక్ స్కోర్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 9

వెబ్‌సైట్: https://rcf.indianrailways.gov.in/



తెలివి తక్కువ కాకి


అడవికి దగ్గరలో ఓ ఊరు ఉండేది. ఆ ఊరిలోని ఓ వేప చెట్టులో ఓ కాకి ఉండేది. అది తెలివైనదని అనుకునేది. తన తెలివి ఎవరికీ లేదనుకునేది. ఆ కాకి మిత్రుడు పావురం. ఆ పావురంతో గొప్పలు చెప్పేది. ఒక రోజు పావురం వేరే ప్రాంతంకు వెళ్లి వస్తోంటే.. ఓ డేగ వెంబడించింది. క్షణాల్లో గాల్లో పల్టీలు కొట్టి పావురం తుర్రుమని తప్పించుకుంది. పావురం ప్రతిభను చూసి కాకి కుళ్లి పడింది. ఇలా నేను చేస్తానని పావురంతో అనేది. ఒక రోజు కాకి, పావురం బయటకి వెళ్లాయి. తిరిగి వస్తోంటే విపరీతమైన గాలి. పావురం గాల్లో పల్టీలు కొట్టి వేగంగా దూసుకొచ్చింది. కాకి కూడా అలా చేయాలని ప్రయత్నించింది. అడవిలోని ముళ్లపొదల్లో పడిపోయింది. ప్రాణం ఉన్నందుకు సంతోషపడింది. ఇతరులను అనుకరించొద్దు అని పావురం చెప్పినా కాకి పట్టించుకోలేదు. పైగా గాలి ప్రభావం అని చెప్పింది.

గద్దలు ఆహారాన్ని సంపాదించటంలో ప్రతిభ ఉన్నవి. ఆకాశ మార్గాన అంత ఎత్తులో ఉండి భూమ్మీద ఉండే ఆహారాన్ని ఇట్టే తీసుకెళ్లటం కాకికి విచిత్రం అనిపించింది. భూమ్మీద ఉడుతలు, ఎలుకలు, పాములు, కుందేళ్లు.. లాంటి చిన్న జంతువులు కనిపిస్తే సరి.. క్షణాల్లో గద్ద వచ్చి తన్నుకుని పోయేది. గద్ద వేటాడే పద్ధతి, తన ఆహారం పట్ల శ్రద్ధను కాకి గమనించింది. తనకంటే తక్కువ ప్రతిభగల పావురంతో తాను పోల్చుకోవటం అసహ్యం అనుకుంది.




గద్ద మాదిరే ఆకాశ మార్గాన పయనిస్తూ ఆహారాన్ని తేలికగా పసిగట్టి తన్నుకు పోవాలని కాకి ప్రయత్నించింది. అయితే తన మిత్రుడు పావురం మాత్రం ఈ చర్య మంచిదికాదని చెప్పింది. అయినా కాకి వినే పరిస్థితి లేదు. గాల్లో ఎత్తుకు ఎగిరి కిందకు చూసింది. వేగంగా రావటానికి ప్రయత్నించింది. అయితే పైనుంచి కింద ప్రాణులు కనుక్కోవటం దానికి ఇబ్బంది అనిపించింది. అయితే పావురంతో పాటు ఓ డేగ, నెమలి కాకి దగ్గరకు వచ్చాయి. వాటిని చూసి మీరంతా చూస్తుంటే గాల్లో నుంచి వేగంగా వచ్చి ఉడుతలను తీసుకెళ్తాను. నా ముందు గద్ద దిగదుడుపే అని చెప్పింది. దీంతో కాకి ప్రతిభను చూడటానికి ఉత్సాహపడ్డారు. చూస్తుండగానే కాకి గాల్లోకి ఎగిరింది. పైకి ఎగిరింది. పైనుంచి క్షణాల్లో కిందకి రావాలని రెక్కలాడించింది. వేగం పట్టుతప్పి చెట్ల మధ్య పడి ముక్కు విరగ్గొట్టుకుంది. ప్రాణం మిగిలింది కదా.. అంటూ బాధతో మూల్గింది. నాకు కాలం కలసి రాలేదనే సాకులు చెప్పింది. 'ఇతరులను అనుకరించొద్దు' అంటూ పావురం మంచి చెప్పినా కాకికి ఎక్కలేదు. అదే తెలివి తక్కువతనం.


సరైన నీడ ఏది?




10 తేడాలు గుర్తించండి



జత ఉన్న బొమ్మ ఏది?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 273

3		7						
5	1		3				4	6
9			7			3		2
	4			1				
		1		6		5		
				7			9	
4		2			7			8
7	9				8		3	4
						2		9

సుడోకు - 272 సమాధానం

5	7	6	1	2	9	4	3	8
3	9	1	5	8	4	2	7	6
8	2	4	7	3	6	9	5	1
4	8	7	2	6	1	3	9	5
6	1	3	4	9	5	8	2	7
9	5	2	8	7	3	6	1	4
1	3	5	6	4	2	7	8	9
2	6	8	9	1	7	5	4	3
7	4	9	3	5	8	1	6	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.